www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

వయసు 30.. కేసులు 34

ఒంటరి వృద్ధులే టార్గెట్.. అనపర్తిలో అరెస్టు

తొలుత పనిమనిషిగా దగ్గరై.. అదనుచూసి మొత్తం దోచేసే కిలేడీ'

ఇప్పటికే 16 కేసులు.. 10 సార్లు జైలుకు

బయటికొచ్చాక కూడా 18 దొంగతనాలు

12



కావలి @39 డిగ్రీలు

రాష్ట్రంలో సూర్యుడి భగభగలు

నేడు, రేపు వర్షాలు పడే చాన్స్

2

మంగళవారం | 20-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 126 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: పాడ్యమి రా. 8.33 తదుపరి విదియ; నక్షత్రం: శతభిషం తె. 3.10 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: మ. 12.10-1.36; దుర్ముహూర్తం: ఉ. 8.33-9.23, రా. 10.19-11.03; అమృతఘడియలు: రా. 8.44-10.10; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.02; సూర్యాస్తమయం: 6.33 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వేగం పెంచేద్దాం!

'ఈజ్ ఆఫ్' నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు: సీఎం

విజన్-2047 లక్ష్యంతో ముందుకు

పాతికేళ్లలో 15% వృద్ధిరేటే ధ్యేయం

పీ-4 మోడల్‌తో పేదరిక నిర్మూలన

మౌలిక సదుపాయాలకు పెద్ద పీట

నైపుణ్య గణనకు శ్రీకారం

నాటి నా సంస్కరణలు ఇప్పుడు ఫలితాలిస్తున్నాయ్: చంద్రబాబు

శ్రీసిటీలో 15 పరిశ్రమలు ప్రారంభం

వాటి మొత్తం పెట్టుబడి 1,570 కోట్లు.. 8,480 మందికి ఉద్యోగాలు

మరో 7 ఇండస్ట్రీలకు భూమిపూజ


900 కోట్లు.. 2,740 మందికి ఉపాధి

మరో ఐదింటి స్థాపనకు ఎంవోయూలు

1,213 కోట్లు.. 4,060 ఉద్యోగాలు

ఫొటోగ్రాఫర్స్.. స్టైల్ ప్లీజ్!

ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తనను కలిసేందుకు వచ్చిన ఫొటోగ్రాఫర్ల చేతిలోని కెమెరా తీసుకొని క్లిక్‌మనిపిస్తున్న సీఎం చంద్రబాబు



శాంతిభద్రతల విషయంలో జీరో టాలరెన్స్ మా లక్ష్యం. పరిశ్రమలకు ఇబ్బంది లేకుండా లా అండ్ ఆర్డర్ అమలు చేస్తాం. పారిశ్రామిక అనుకూల వాతావరణం కల్పిస్తాం. డ్రగ్స్‌ను నిర్మూలిస్తాం.

ప్రపంచంలో ప్రతి నలుగురు ఐటీ ఉద్యోగుల్లో ఒకరు భారతీయుడు. ప్రతి నలుగురు భారత ఐటీ ఉద్యోగుల్లో ఒకరు ఏపీ నుంచి ఉండడం మన రాష్ట్ర సామర్థ్యానికి నిదర్శనం.

\- సీఎం చంద్రబాబు

తిరుపతి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా తాను ప్రారంభించిన ఆర్థిక సంస్కరణలు ఇప్పుడు ఫలితాలిస్తున్నాయని చంద్రబాబు అన్నారు. 2014-19లో తాను సీఎంగా ఉన్నప్పుడు నాలుగేళ్లపాటు సులభతర వాణిజ్యం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్-ఈవోడీబీ)లో ఏపీ నంబర్ వన్ స్థానంలో ఉందని గుర్తుచేశారు. అయితే ఇప్పుడు పారిశ్రామిక రంగం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ (శీఘ్ర వాణిజ్యం) వైపు మళ్లాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. సోమవారం తిరుపతి జిల్లా శ్రీసిటీ ప్రత్యేక ఆర్థిక మండలిని ఆయన సందర్శించారు. అక్కడి బిజినెస్ సెంటర్‌లో 15 పరిశ్రమలను ప్రారంభించారు. మరో ఏడు పరిశ్రమల ఏర్పాటుకు

మిగతా 12వ పేజీలో...

కరువు రహిత రాష్ట్రమే లక్ష్యం

రెండేళ్లు వర్షాల్లేకున్నా ఇబ్బంది రాకూడదు

నదుల అనుసంధానంతోనే పరిష్కారం

ప్రాజెక్టులను నిర్వీర్యం చేసిన వైసీపీ

జలాశయాల మరమ్మతులకు రూ.300 కోట్లు అవసరం

సోమశిల ప్రాజెక్టును సందర్శించిన సీఎం చంద్రబాబు

11





సోమవారం శ్రీసిటీలో వివిధ సంస్థల ప్రతినిధులతో సమావేశమైన ముఖ్యమంత్రి చంద్రబాబు

రాష్ట్రంలో ఫాక్స్‌కాన్ మెగా మాన్యుఫ్యాక్చరింగ్ సిటీ!

త్వరలోనే సమగ్ర ప్రణాళికతో వస్తాం

మంత్రి లోకేశ్‌కు సంస్థ ప్రతినిధుల హామీ

జగన్ సర్కారు ఇబ్బందులకు గురిచేసిందని వెల్లడి

రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాలు, సెమీ కండక్టర్ల తయారీ

డిజిటల్ హెల్త్ కాంపోనెంట్స్ ప్లాంట్లు కూడా

ఉద్యోగ కల్పనే లక్ష్యంగా రాయితీలు

త్వరలోనే ఏ రాష్ట్రంలోనూ అనుసరించని ఎలక్ట్రిక్ వెహికల్ పాలసీ తీసుకొస్తాం: లోకేశ్

ఫాక్స్‌కాన్ బృందానికి ఎదురేగి స్వాగతం

2

'సెబ్' రద్దు!

3

విఫల ప్రయోగానికి సర్కారు స్వస్తి

28న కేబినెట్ ఆమోదం.. వెంటనే ఆర్డినెన్స్

అధికారులు, ఉద్యోగులు, కానిస్టేబుళ్లు.. అందరికీ కలిపి ఒకేసారి బదిలీలు

పూర్తిగా పాత స్వరూపంలోకి ఎక్సైజ్ శాఖ

చెక్‌పోస్టులు, స్క్వాడ్లు బలోపేతం

24 గంటలూ పనిచేసేలా సిబ్బంది పెంపు

208 సెబ్ స్టేషన్లు ఇక ఎక్సైజ్ స్టేషన్లు



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న చిన్నారులు అను పరామర్శిస్తున్న హోం మంత్రి అనిత

పాపం పసివాళ్లు!

అనాథాశ్రమంలో ఉసురు తీసిన ఆహారం

ముగ్గురు మృతి.. ఏడుగురి పరిస్థితి విషమం

అందరూ పేదింటి గిరిజన బిడ్డలు! ఎవరికీ పట్టుమని పదేళ్లు కూడా నిండలేదు. ఉచిత భోజనం, వసతి కల్పిస్తామని, చదువు చెప్పిస్తామని పాస్టర్ చెప్పిన మాట విని... తల్లిదండ్రులు వారిని 'అనాథాశ్రమానికి' పంపించారు. ఓ ఫంక్షన్‌కు వెళ్లి అక్కడ మిగిలిపోయిన బిర్యానీ తెచ్చి పెట్టిన నిర్వాహకుడు... వారి ఉసురు తీశాడు. ఆ ఆశ్రమానికి అనుమతుల్లేవు. వసతుల్లేవు. పదేళ్లుగా అక్రమంగా నడుస్తున్నా పట్టించుకున్న వాళ్లూ లేరు!

ఓ ఫంక్షన్‌లో మిగిలిన బిర్యానీ పెట్టిన నిర్వాహకుడు

కొన్ని గంటలకే పిల్లలకు వాంతులు, విరేచనాలు

ఆస్పత్రికి తరలించకుండా ఇళ్లకు పంపిన పాస్టర్

80 మందికిపైగా అస్వస్థత.. 42 మంది ఆస్పత్రిపాలు

అనకాపల్లి జిల్లా కోటవురట్లలో విషాదం

విశాఖపట్నం/కోటవురట్ల/నర్సీపట్నం, ఆగస్టు 19: అభంశుభం ఎరుగని చిన్నారులను కలుషితాహారం కాటేసింది. అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నం గ్రామంలో 'పరిశుద్ధాత్మ అగ్నిస్తుతి ఆరాధన మందిరం' పేరిట నడుపుతున్న అనాథాశ్రమంలో ఘోరం

మిగతా 11వ పేజీలో...

సెప్టెంబరులోనూ బియ్యం మాత్రమే!

రేషన్‌లో కందిపప్పు, పంచదార ఇవ్వాలని కూటమి ప్రభుత్వ నిర్ణయం

అయినా కదలని పౌరసరఫరాల శాఖ

జులైలోనే టెండర్లు పిలిచినా.. ఖరారులో అధికారుల అలసత్వం

వచ్చేనెలలోనూ పప్పు, చక్కెర హుళక్కే



2

సిద్దూకు తాత్కాలిక ఊరట

ఈ నెల 29 వరకు చర్యలు వద్దన్న హైకోర్టు

కర్ణాటక సీఎం రాజీనామాకు బీజేపీ డిమాండ్

విధానసౌధలో గాంధీ విగ్రహం ఎదుట ధర్నా

గవర్నర్ తీరును ఖండిస్తూ కాంగ్రెస్ నిరసనలు

ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ కార్యకర్త మృతి



2

ఆమె డైరీలో చిరిగిన పేజీ

దాన్ని ఫొటో తీశా.. ఏం ఉందో సీబీఐ చెప్పొద్దన్నది

ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై నమ్మకం పోయింది

కోల్‌కతా ఆర్జీ కర్ ఘటనపై హతురాలి తండ్రి

2

యువతి మరణానికి ముందే 25 చోట్ల గాయాలు

నిందితుడు సంజయ్ రాయ్‌కి నేడు లై డిటెక్టర్ టెస్ట్!

సచివాలయ సిబ్బందికి టాయిలెట్ ఫొటోల బాధ్యత

3

పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు

ప్రధానోపాధ్యాయులకు బిగ్ రిలీఫ్



మధుసూదనరెడ్డి అక్రమాలకు

అంతే లేదు!

ఫైబర్‌నెట్ మాజీ ఎండీపై సస్పెన్షన్ వేటు

దర్యాప్తు సీఐడీకి.. సీఎస్ ఉత్తర్వులు.. అమరావతి వీడొద్దని ఆదేశం

పైవేటు వ్యక్తులు, సిబ్బందితో కలిసి తీవ్ర ఆర్థిక అవకతవకలు

సహకరించిన గత, ప్రస్తుత ఉద్యోగులపైనా విచారణ

సస్పెన్షన్‌పై ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

12

మాక్ పోలింగ్ కాదు.. వీవీ ప్యాట్ స్లిప్పులు లెక్కపెట్టాలి

3

హైకోర్టును ఆశ్రయించిన బాలినేని

మాక్ పోలింగ్ నిలిపివేయాలని వినతి

స్టే ఇచ్చేందుకు నిరాకరించిన హైకోర్టు

వివరాలు సమర్పించాలని ఈసీకి ఆదేశం



ఇంధన రంగం.. ఆర్థిక భంగం

విధ్వంసం విలువ 1.77 లక్షల కోట్లు

జగన్ అసమర్థ విధానాలే కారణం.. భారమంతా వినియోగదారులపైనే



నష్టాలపై ఇంధన సంస్థల ఆందోళన

నెలనెలా పెరుగుతున్న వడ్డీల భారం

వాయిదాల చెల్లింపులకూ అప్పులు

కూటమి సర్కారుకు తలనొప్పులు

రాష్ట్ర ఇంధన రంగం ఆర్థికంగా కుదేలైపోయింది. ఐదేళ్ల జగన్ పాలనలో ఏకంగా రూ.1,77,244 కోట్ల అప్పుల్లో కూరుకుపోయింది. పైగా ఈ భారమంతా సాధారణ వినియోగదారులపైనే పడింది. మరోవైపు చేసిన అప్పులకు వాయిదాలు చెల్లించేందుకు మరిన్ని అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సొంతంగా హైడల్ విద్యుత్తు సంస్థలను నిర్వహించిన అనుభవం ఉందంటూ గొప్పలు పోయిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి.. తాను అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఇంధన రంగాన్ని సర్వనాశనం చేశారు. 2019-24 మధ్య జగన్ అనుసరించిన అసమర్థ విధానాల కారణంగా విద్యుత్తు సంస్థలు రూ.1,77,244 కోట్ల అప్పుల్లో కూరుకుపోయినట్టు ఇంధనశాఖ నిర్ధారించింది. ఆదాయ, వ్యయాల

మిగతా 12వ పేజీలో...

13,326 గ్రామ పంచాయతీల్లో ఒకేరోజు గ్రామసభలు

ఉపాధి పనులకు ఆమోదం తీసుకోవాలి.. సిబ్బంది, ప్రజలు భాగస్వాములు కావాలి

దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలి.. పనుల నాణ్యత విషయంలో రాజీపడొద్దు

ఉపాధి సిబ్బంది పనితీరు మార్చుకోవాలి.. ప్రజలను మెప్పించేలా పనులు చేపట్టాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నిర్దేశం

అవినీతి ఏ స్థాయిలో జరిగినా క్షమించేది లేదని హెచ్చరికలు



11

'సెకీ' సౌర విద్యుత్‌పై ట్రాన్స్‌మిషన్ చార్జీల పిడుగు

2

యూనిట్‌కు 80 పైసల చొప్పున

డిస్కంలపై రూ.2,460 కోట్ల భారం

జగన్ హయాం నాటి ఒప్పందం గుట్టు

నాలుగేళ్ల తర్వాత ఇప్పుడు రట్టు

ఒప్పందంపై నాడు గొప్పలు.. నేడు తిప్పలు

మోదీకి రాఖీ కట్టిన చిన్నారులు


మోదీకి రాఖీ కడుతున్న బడి పిల్లలు

న్యూఢిల్లీ, ఆగస్టు 19: ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీలోని వివిధ పాఠశాలల విద్యార్థులతో కలిసి రక్షా బంధన్ వేడుకలు చేసుకున్నారు. సోమవారం ఉదయం కొందరు విద్యార్థులు ఢిల్లీలోని ప్రధాని నివాసానికి వెళ్లి ఆయన చేతికి రాఖీలు కట్టారు. ఆ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈ వీడియోలో విద్యార్థులు కుర్చీలో కూర్చున్న ప్రధాని మోదీకి రాఖీ కడుతుండగా ఆయన వారితో నవ్వుతూ ముచ్చటిస్తూ కనిపించారు. తర్వాత వారితో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. రక్షాబంధన్‌ను పురస్కరించుకుని ప్రధాని మోదీ దేశ ప్రజలకు 'ఎక్స్‌'లో శుభాకాంక్షలు తెలిపారు. దేశ ప్రజలకు సుఖ సంతోషాలు, సౌభాగ్యాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు.

రాహుల్‌కు ప్రియాంక రాఖీ..


రక్షా బంధన్ సందర్భంగా కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వాద్రా తన సోదరుడు రాహుల్ గాంధీతో కలిసి ఉన్న ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. అందులో వారి చిన్ననాటి ఫొటోలు కూడా ఉన్నాయి. 'సోదర సోదరీమణుల మధ్య సంబంధం పూలతోట వంటిది. ప్రేమ, గౌరవం, పరస్పర అవగాహన, వివిధ జ్ఞాపకాలు, ఐక్యత, స్నేహం వంటివి దీనిలో వర్ధిల్లుతాయి' అని ప్రియాంక 'ఎక్స్‌'లో పేర్కొన్నారు. దేశ ప్రజలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు' చెబుతూ ట్వీట్ చేశారు. కాంగ్రెస్ అధినేత మల్లికార్జున ఖర్గే కూడా రక్షా బంధన్ సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

వైద్య కళాశాలల్లో 'పొగాకు విరమణ కేంద్రాలు'

హైదరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలలు తమ బోధనాస్పత్రుల్లో పొగాకు విరమణ కేంద్రాలు (టీసీసీ) ఏర్పాటు చేయాలని జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) ఆదేశించింది. ఈమేరకు సోమవారం ఉత్తర్వులు పంపింది. పొగాకు బారి నుంచి బయటపడాలనుకునే వారికి ఈ కేంద్రాల ద్వారా అవసరమైన అత్యాధునిక వైద్య సేవలు, సదుపాయాలు అందుతాయని, పొగాకు ఆధారిత జబ్బులను తగ్గించడమే లక్ష్యంగా టీసీసీ కేంద్రాలు పనిజేస్తాయని ఎన్ఎంసీ తెలిపింది. ఈ కేంద్రాలను వీలైనంత త్వరగా ఏర్పాటు చేయాలని కోరింది.

లోకం తీరు

ఏపీలో కరువు అనే మాట వినిపించకూడదు: బాబు



'సెకీ' సౌర విద్యుత్‌పై ట్రాన్స్‌మిషన్ చార్జీల పిడుగు

- యూనిట్‌కు 80 పైసలు చొప్పున డిస్కంలపై రూ.2,460 కోట్ల భారం
- జగన్ హయాం నాటి ఒప్పందంలో బయటపడ్డ గుట్టు

అమరావతి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకీ)తో సౌర విద్యుత్ కొనుగోళ్లకు సంబంధించి జగన్ హయాం లో చేసుకున్న ఒప్పందంలోని లోగుట్టు బయటపడింది. సోలార్ పవర్ సూపర్ అంటూ.. నాడు అసెంబ్లీలోను, బయటా గొప్పలు పోయిన వైసీపీ.. డిస్కమ్‌లపై రూ.2,460 కోట్ల భారాన్ని గుట్టుచప్పుడు కాకుండా మోపేసింది. 2021, డిసెంబరు 1న చేసుకున్న 7 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలపై అంతర్రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ చార్జీలు(ఐఎస్‌టీఎస్) పడుతున్నాయని డిస్కమ్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. యూనిట్‌కు 80 పైసల చొప్పున.. 25 ఏళ్లకు రూ.2,460 కోట్ల మేర భారాన్ని మోయాల్సి వస్తుందని చెబుతున్నాయి. వాస్తవానికి 2021, డిసెంబరు 1న సెకీ, రాష్ట్ర డిస్కమ్‌లు, అదానీ సంస్థలు ఒప్పందాలు చేస్తున్నాయి. దీనిపై అప్పట్లో ఇంధన శాఖ కార్యదర్శి నాగులాపల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ.. యూనిట్‌కు రూ.2.49 చొప్పున సెకీతో సోలార్ విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలను చేసుకున్నామని వెల్లడించారు. రాజస్థాన్ నుంచి వస్తున్న విద్యుత్తుకు ట్రాన్స్‌మిషన్ చార్జీలు వర్తించవని కూడా చెప్పారు. అప్పటి సీఎం జగన్ సైతం అసెంబ్లీలో పలుమార్లు ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ యూనిట్ రూ.2.49కే కొనుగోలు చేశామని, ట్రాన్స్‌మిషన్ చార్జీలు లేకుండానే సౌర విద్యుత్తు వస్తుందన్నారు. కానీ.. నిపుణలు మాత్రం ఎప్పటికప్పుడు ట్రాన్స్‌మిషన్ చార్జీలు ఉంటాయని చెబుతూనే వచ్చారు. ఇదే విషయాన్ని సీఎం చంద్రబాబు ఇంధన రంగంపై విడుదల చేసిన శ్వేతపత్రాల సందర్భంగా కూడా వెల్లడించారు. దీంతో మరోసారి ఒప్పందాన్ని సమీక్షించిన డిస్కమ్‌లు ట్రాన్స్‌మిషన్ చార్జీలపై త్రైపాక్షిక ఒప్పందంలో స్పష్టత లేదని గుర్తించాయి. దీంతో.. ఈ నెల 2న కర్నూలులో డిస్కమ్‌లు సమావేశమై ట్రాన్స్‌మిషన్ చార్జీలపై ఆందోళన వ్యక్తం చేశాయి. మరోవైపు ఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి కూడా ఈ అంశంపై చర్చించారు. ఆ వెంటనే ఈ నెల 9న జీఎన్‌ఏ నియంత్రణ మేరకు ట్రాన్స్‌మిషన్ చార్జీలు 100 శాతం వర్తించబోవన్న అభిప్రాయానికి వచ్చారు. అయితే.. ట్రాన్స్‌మిషన్ చార్జీల మినహాయింపుపై సెకీ ఎలాంటి బాధ్యత వహించడం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర గ్రామీణ వ్యవసాయ విద్యుత్తు సరఫరా కంపెనీ బాధ్యత తీసుకుని ట్రాన్స్‌మిషన్ చార్జీలు వర్తించబోవంటూ సర్టిఫికెట్ తీసుకోవాలని ఈఆర్‌సీ సూచించింది. వీటన్నింటినీ పరిశీలిస్తున్న డిస్కంలు యూనిట్‌కు రూ.80 పైసలు చొప్పున ట్రాన్స్‌మిషన్ చార్జీలు చెల్లించాల్సిందేనన్న ఒప్పందం గుట్టును గుర్తించాయి. మొత్తానికి.. ఒప్పందం చేసుకున్న నాలుగేళ్ల తర్వాత ఈ భారం బయటపడడం గమనార్హం.

మండిన ఎండ.. కావలిలో 39 డిగ్రీల ఉష్ణోగ్రత

విశాఖపట్నం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వేసవి మాదిరి వాతావరణం కొనసాగుతోంది. రుతుపవనాలు బలహీనంగా ఉండడంతో ఎండ, ఉక్కపోత పెరిగాయి. సోమవారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. దేశంలోనే అత్యధికంగా కావలిలో 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కాగా రాయలసీమ పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని నుంచి తమిళనాడు మీదుగా కొమరిన్ తీరం వరకు ఉపరితల ద్రోణి విస్తరించింది. ఒక పక్క ఎండలు, ఉక్కపోత, మరోవైపు ఆవర్తనం ప్రభావంతో వాతావరణ అనిశ్చితి నెలకొని పలుచోట్ల సాయంత్రం వర్షం కురిసింది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. మంగళవారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, అనంతపురం జిల్లాల్లో భారీ వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం విపత్తుల నిర్వహణ సంస్థ ఉందని పేర్కొంది.

సెప్టెంబరులోనూ బియ్యమే!

- రేషన్‌లో కందిపప్పు, పంచదార ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయం
- జూలైలోనే టెండర్లు పిలిచినా.. ఖరారులో అధికారుల అలసత్వం

అమరావతి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల రేషన్ సరుకుల్లో కూడా కందిపప్పు, పంచదార ఉండదు. సెప్టెంబరు కోటాలో కూడా కేవలం బియ్యం మాత్రమే సరఫరా చేయనున్నారు. ఆగస్టు నుంచే ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా కార్డుదారులకు ఉచిత బియ్యంతోపాటు రాయితీపై కందిపప్పు, పంచదారను కూడా సరఫరా చేయాలని కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఆదేశించింది. సివిల్ సప్లయిస్ అధికారులు మాత్రం 2 నెలలుగా ఊరిస్తూ.. ఊహించని రీతిలో పేదలకు షాక్ ఇస్తున్నారు. దాంతో రాష్ట్రంలో ప్రభుత్వం మారినా అధికారుల పని తీరులో ఏమాత్రం మార్పు రాలేదని, గత వైసీపీ ప్రభుత్వంలో మాదిరిగానే వ్యవహరిస్తూ పేదలకు తీరని అన్యాయం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటింటికీ రేషన్ సరుకులు అందిస్తామంటూ గొప్పలు చెప్పింది. కానీ ఆ రేషన్ సరుకుల్లో ఒక్కొక్కటిగా కోతలు పెడుతూ చివరికి బియ్యం పంపిణీకే పరిమితమైంది. ఇటీవలే మళ్లీ వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు రాయితీపై కందిపప్పు, పంచదారను పంపిణీ చేయాలని ఆదేశించింది. బహిరంగ మార్కెట్లో కిలో కందిపప్పు రూ.180 దాటిపోగా... పంచదార కిలో దాదాపు రూ.50కు చేరువైంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రేషన్ ద్వారా కిలో కందిపప్పు సబ్సిడీపై రూ.67కి, పంచదార రూ.17కే అందిస్తుందని పేదలైన కార్డుదారులంతా గంపెడాశలు పెట్టుకున్నారు.

న్యాయ సమీక్ష నుంచి అనుమతి వచ్చినా...

ఆగస్టు నుంచి అక్టోబరు వరకు... 3 నెలలకు సరిపోయేలా మొత్తం 22,500 మెట్రిక్ టన్నుల కందిపప్పు, 17,538 మెట్రిక్ టన్నుల పంచదార సేకరణ కోసం పౌరసరఫరాల సంస్థ ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా గత జూలై నెలలో టెండర్లు ఆహ్వానించింది. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో రేషన్ కార్డుదారులు, ఐసీడీఎస్ లబ్ధిదారులకు ప్యాకెట్లలో సరఫరా చేసే కందిపప్పు విలువ సుమారు రూ.394 కోట్లు. అయితే టెండరు విలువ రూ.100 కోట్లు దాటితే చట్ట ప్రకారం న్యాయ సమీక్షకు వెళ్లాల్సి రావడంతో పౌరసరఫరాల శాఖ ఈ టెండరు వివరాలను జ్యుడీషియల్ ప్రివ్యూకు పంపించింది. దీనిపై న్యాయమూర్తి వివరణలు కోరారు. కార్పొరేషన్ సమాధానాలు పంపించేసరికి నెల రోజులు గడిచిపోయాయి. దీంతో ఆగస్టులో కందిపప్పు సరఫరా నిలిచిపోయింది. జ్యుడీషియల్ ప్రివ్యూ నుంచి అనుమతులు లభించిన తర్వాత కూడా టెండర్ల ప్రక్రియను ముందుకు తీసుకువెళ్లకుండా నిలిపివేసింది. ఇక పంచదార టెండర్లను జోన్ల వారీగా ఆహ్వానించడంతో జ్యుడీషియల్ ప్రివ్యూకు వెళ్లాల్సిన అవసరం రాలేదు. కానీ ఈ టెండరులో పాల్గొన్న చక్కెర సరఫరాదారులు ఎక్కువ ధరలు కోట్ చేశారనే కారణంతో అధికారులు ఆ టెండరును రద్దు చేసేశారు. మళ్లీ గత నెలలోనే రెండోసారి టెండర్లు ఆహ్వానించారు. ఈ టెండరులో జోన్ల వారీగా మొత్తం ఆరుగురు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. మిగిలిన జోన్లకు సంబంధించిన టెండర్లు ఖరారైనప్పటికీ.. మొదటి జోన్ (శ్రీకాకుళం, విజయనగరం, ఏఎస్ఆర్ మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలు) టెండర్ల ప్రక్రియ ఇంతవరకు పూర్తికాలేదు. ఈ కారణంగా గత రెండు నెలలుగా రాష్ట్రం మొత్తంగా పంచదార పంపిణీని కూడా నిలిపివేశారు. దీంతో వచ్చేనెల 7న వినాయక చవితి పండగకు పేదల ఇళ్లలో పప్పులు ఉడికే పరిస్థితి లేదు. కనీసం పాయసం తాగుదామన్నా పంచదార కూడా ఇచ్చే పరిస్థితి లేదు.

సిద్దరామయ్యకు ఊరట

29 వరకు చర్యలు వద్దన్న హైకోర్టు.. కర్ణాటక సీఎం రాజీనామాకు బీజేపీ డిమాండ్


కర్ణాటక విధానసౌధ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద బీజేపీ ధర్నా

బెంగళూరు, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): ముడా ఇంటి స్థలాల వివాదంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. సిద్దరామయ్య భార్య పార్వతి పేరిట 14 ప్లాట్ల కేటాయింపుపై గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్‌కు మూడు ఫిర్యాదులు అందడంతో సీఎంను ప్రాసిక్యూట్ చేసేందుకు గవర్నర్ అనుమతించిన విషయం తెలిసిందే. దీనికి వ్యతిరేకంగా సిద్దరామయ్య తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ కర్ణాటక హైకోర్టులో సోమవారం రిట్ పిటిషన్ దాఖలు చేశారు. మంత్రివర్గ నిర్ణయాన్ని తిరస్కరించి, గవర్నర్ ఆదేశాలు ఇవ్వడం సరికాదని మనుసింఘ్వీ వాదించారు. ఇప్పటికే విచారణ పూర్తయిన 12 అంశాలు గవర్నర్ ముందున్నా వాటి ప్రాసిక్యూషన్‌కు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. గవర్నర్ బీఎన్ఎస్ చట్టాన్ని ఉల్లంఘించారని, హడావుడిగా షోకాజ్ నోటీసు ఇచ్చారని వాదించారు. సీఎంపై ఫిర్యాదు చేసిన సామాజిక కార్యకర్త టీజే అబ్రహాంకు గతంలో సుప్రీంకోర్టు జరిమానా విధించిందని గుర్తు చేశారు. సిద్దరామయ్య భార్యకి ఆమె సోదరుడు దానంగా ఇచ్చిన భూమిని 2014లో స్వాధీనం చేసుకున్నారని, ఇందుకు పరిహారంగా 50:50 నిష్పత్తిన ఇంటిస్థలాలు కేటాయించారని తెలిపారు. గవర్నర్ తరఫున తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ గవర్నర్ మంత్రివర్గ సలహా తీసుకోవాల్సిన అవసరంలేదని, మధ్యప్రదేశ్ వివాదంలోనూ ధర్మాసనం ఆవిషయాన్ని ప్రస్తావించిందని తెలిపారు. సీఎం సలహా మేరకే మంత్రుల నియామకం ఉంటుంది గనుక మంత్రివర్గం నిర్ణయం ఆయనకు అనుకూలంగానే ఉంటుందన్నారు. కాగా, ఈనెల 29వరకు గడువుకావాలని సీఎం తరఫు న్యాయవాది కోరగా హైకోర్టు అంగీకరించింది. ప్రజాప్రతినిధుల కోర్టు కూడా ఈనెల 29వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోరాదని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.నాగప్రసన్న ప్రత్యేక ధర్మాసనం ఆదేశించింది. ఫిర్యాదుదారులు ప్రదీప్‌కుమార్ తరఫున ప్రభులింగ నావదగి, స్నేహమయి కృష్ణ తరఫున లక్ష్మీఅయ్యంగార్, అబ్రహాం తరఫున రంగనాథరెడ్డి వాదనలు వినిపించారు.

కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీ నిరసనలు

గవర్నర్ నిర్ణయాన్ని ఖండిస్తూ అన్ని జిల్లా కేంద్రాల్లో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆందోళనలు నిర్వహించింది. సీఎం సొంతనగరం మైసూరులో నిర్వహించిన ఆందోళనలో వేలాది మంది పాల్గొన్నారు. ప్రతిచోటా గవర్నర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీజేపీ నేతలు యడియూరప్ప, విజయేంద్ర, జేడీఎస్‌నేత కుమారస్వామి దిష్టిబొమ్మలను దహనం చేశారు. మరోవైపు సీఎం సిద్దరామయ్య రాజీనామాకు డిమాండ్ చేస్తూ విధానసౌధలోని గాంధీ విగ్రహం వద్ద బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర నేతృత్వంలో ధర్నా నిర్వహించారు. కాగా, గవర్నర్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్‌పార్టీ బీసీ, ఎస్సీ, మైనారిటీ సామాజికవర్గాల కార్యకర్తలు సోమవారం బెంగళూరు ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇందులో కాంగ్రెస్ కార్యకర్త రవిచంద్రన్(61) మాట్లాడుతూనే గుండెపోటుకు గురై కుప్పకూలారు. ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు తెలిపారు. రవిచంద్రన్ మృతి పట్ల సీఎం సిద్దరామయ్య ప్రగాఢ సంతాపం వ్యక్తంచేశారు.

రాజకీయ, న్యాయ పోరాటాలు చేస్తా: సిద్దూ

గవర్నర్ నిర్ణయంపై రాజకీయంగానూ, న్యాయపరంగానూ పోరాటం చేస్తామని సిద్దరామయ్య ప్రకటించారు. సోమవారం బెంగళూరులో ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడుతూ 40 ఏళ్ల తన రాజకీయ జీవితంలో ఒక్క మచ్చ కూడా లేదన్నారు. రాజకీయంగా తనను అంతమొందిస్తే.. కాంగ్రెస్ కూడా అంతమవుతుందని బీజేపీ భావిస్తోందని, అయితే బీజేపీ కుట్రలు సాకారం కాబోవన్నారు.

ఫేక్ ఎన్‌సీసీ శిబిరంలో విద్యార్థినిపై అత్యాచారం

16 మంది బాలికలకు లైంగిక వేధింపులు

కోచ్, ప్రిన్సిపాల్ సహా 11 మంది అరెస్టు

చెన్నై, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ పేరిట ఫేక్ శిబిరం నిర్వహించి ఓ విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడ్డారు. మరో 16 మంది బాలికలను లైంగికంగా వేధించారు. ఈ ఘటనలో ఎన్‌సీసీ కోచ్, పాఠశాల ప్రిన్సిపాల్‌తోపాటు మొత్తం 11 మందిని పోక్సో చట్టం కింద పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. తమిళనాడులోని కృష్ణగిరి జిల్లా బర్గూరులో చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బర్గూరులోని ఒక పాఠశాల ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి 9 వరకు ఎన్‌సీసీ శిబిరం నిర్వహించారు. ఇందులో మొత్తం 41 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో 17 మంది విద్యార్థినులున్నారు. వీరికి పాఠశాల ప్రాంగణంలోనే వసతి కల్పించారు. ఈ నేపథ్యంలో కావేరీపట్టణంకు చెందిన కోచ్ శివరామన్ (30) తనపై లైంగికదాడికి పాల్పడ్డాడంటూ శిబిరంలో పాల్గొన్న 8వ తరగతి విద్యార్థిని పాఠశాల ప్రిన్సిపాల్ సతీశ్ కుమార్‌కు ఫిర్యాదు చేసింది. శిబిరంలో పాల్గొన్న బాలికలందరిపైనా నిర్వాహకులు లైంగిక వేధింపులకు పాల్పడ్డారని పేర్కొంది. అయినా ప్రిన్సిపాల్ ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. బాధిత విద్యార్థిని ఈ నెల 16న అనారోగ్యానికి గురవడంతో తల్లిదండ్రులు ఆమెను కృష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు ఆమెపై అత్యాచారం జరిగినట్లు ధ్రువీకరించారు. విద్యార్థిని ఫిర్యాదుతో బర్గూరు పోలీసులు విచారణ జరిపి కోచ్ శివరామన్, ప్రిన్సిపాల్ సతీశ్ కుమార్ సహా మొత్తం 11 మందిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి వారిని అరెస్టు చేశారు. కోచ్ శివరామన్ నామ్ తమిళర్ పార్టీకి చెందిన నేతగా విచారణలో తేలింది. కాగా ఎన్‌సీసీ శిబిరంలో అత్యాచారం జరిగిందంటూ వార్తలు వెలువడడంతో రక్షణశాఖ స్పందించింది. తాము ఎలాంటి ఎన్‌సీసీ శిబిరం నిర్వహించలేదని పేర్కొంది.

16వ శతాబ్దం నుంచి 'రాఖీ'

- సుధామూర్తి వీడియో.. నెటిజన్ల విమర్శలు

న్యూఢిల్లీ, ఆగస్టు 19: రాజ్యసభ ఎంపీ సుధామూర్తి రాఖీ పండుగ చరిత్రను తెలియజేస్తూ పోస్టు చేసిన ఓ వీడియోపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 16వ శతాబ్దంలో చిత్తోడ్‌గఢ్ రాణి కర్ణావతి ప్రమాదంలో ఉన్నప్పుడు ఆమె మొఘల్ చక్రవర్తి హుమయూన్‌ను సాయం అడుగుతూ ఒక దారాన్ని పంపారని, అప్పటి నుంచి ఈ రాఖీ సాంప్రదాయం మొదలైందని సుధామూర్తి ఆ వీడియోలో పేర్కొన్నారు. '16వ శతాబ్దంలో రాఖీ సంప్రదాయం మొదలైంది. రాణి కర్ణావతి రాజ్యంపై దండయాత్ర జరగడంతో.. ఆమె ఒక చిన్న దారాన్ని మొఘల్ చక్రవర్తి హుమయూన్‌కు పంపిం ది. హుమయూన్ దాని గురించి స్థానికులను అడగ్గా.. ఇది సోదరుడి సాయం కోరుతూ సోదరి నుంచి వచ్చే పిలుపు అని వారు చెప్పారు. దీంతో హుమయూన్ వెంటనే కర్ణావతికి సాయం చేసేందుకు బయల్దేరుతాడు. అప్పటి నుంచి రాఖీ సాంప్రదాయం కొనసాగుతూ వస్తోంది' అని సుధామూర్తి వివరించారు. దీనిపై అనేక మంది సుధామూర్తిని ట్రోల్ చేస్తున్నారు. 'ఇదంతా కల్పితం.. అసత్య ప్రచారం ఆపండి' అని ఒక నెటిజన్ న్నారు. 'మీరు రోజుకు 20 గంటలు చరిత్ర గురించి చదవాలి' అని మరొకరు సలహా ఇచ్చారు.

2015 యెమెన్ యుద్ధం.. సౌదీ రాజు సంతకం ఫోర్జరీ

- వెల్లడించిన సౌదీ మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్

వాషింగ్టన్, ఆగస్టు 19: యెమెన్ యుద్ధం(2015) విషయంలో జారీ అయిన రాజాజ్ఞ(రాయల్ డిక్రీ)పై సౌదీ రాజు అసలు సంతకం చేయలేదని సౌదీ ఇంటెలిజెన్స్ విభాగం మాజీ చీఫ్ అల్ జబ్రీ చెబుతున్నారు. "యెమెన్‌పై యుద్ధ ప్రకటనలో తన తండ్రి సంతకాన్ని సౌదీకి కాబోయే రాజు మహమ్మద్-బిన్-సల్మాన్(ఎంబీఎస్) ఫోర్జరీ చేశారు. అప్పట్లో రాజు మానసిక స్థితి సరిగా లేనందునే ఆయన సంతకాన్ని ఎంబీఎస్ ఫోర్జరీ చేశారు" అని అల్ జబ్రీ వివరించారు.

ఆమె డైరీలో ఓ చిరిగిన పేజీ!

ఆ పేజీని ఫొటో తీసి దగ్గర పెట్టుకున్నా.. ఏం రాసి ఉందనేది సీబీఐ చెప్పొద్దంది

- ఆర్జీ కర్ ఘటనపై హతురాలి తండ్రి

కోల్‌కతా, ఆగస్టు 19: కోల్‌కతా ఆర్జీ కర్ ఆస్పత్రిలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనలో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ఆమెకు డైరీ రాసే అలవాటు ఉందని, హత్యాచార ఘటన తర్వాత ఆ డైరీలో ఓ పేజీ చిరిగి ఉందని హతురాలి తండ్రి మీడియాకు వెల్లడించారు. ఆ చిరిగిన పేజీ తాలూకు ఫొటో తన వద్ద ఉందని చెప్పిన ఆయన, అందులో ఏం రాసి ఉందనే విషయాన్ని మాత్రం వెల్లడించేందుకు నిరాకరించారు. సీబీఐ అధికారుల సూచన మేరకే తాను బహిరంగపర్చడం లేదని చెప్పారు. హత్యాచార ఘటనపై ప్రజల ఆందోళనలను అణచివేసేందుకు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఫలితంగా తమకు సీఎం మమతపై నమ్మకం పోయిందని హతురాలి తండ్రి వ్యాఖ్యానించారు. 'న్యాయం చేయాల్సిన స్థానంలో ఉన్న మమత, తానే న్యాయం కావాలి అంటూ డిమాండ్ చేయడంలో ఔచిత్యం ఏమిటి? బాధిత కుటుంబానికి న్యాయం కోసం ఆమె ఏమీ చేయడం లేదు' అని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా హతురాలికి తల, పెదవులు, చెంపలు, ముక్కు, కుడి దవడ, గదమ, ఎడమ భుజం, ఎడమ మోకాలు, చీలమండతో పాటు అంతర్గత అవయవాల్లో గాయాలైనట్లు.. ఊపిరితిత్తుల్లో రక్తస్రావమైనట్లు, శరీరంలో కొన్నిచోట్ల బ్లడ్ క్లాట్స్‌ను కనుగొన్నట్లు పోస్టుమార్టం రిపోర్టు తేల్చింది. మొత్తంగా హతురాలి శరీరంపై 16 చోట్ల.. అంతర్గతంగా తొమ్మిదిచోట్ల తీవ్ర గాయాలయ్యాయని, అన్ని గాయాలు కూడా ఆమె మరణానికి ముందే సంభవించినవేనని.. గొంతు నులమడంతోనే ఆమె మృతిచెందినట్లు నివేదిక తేల్చింది. మరోవైపు.. హత్యాచార ఘటనలో నిందితుడైన సంజయ్ రాయ్‌కి సీబీఐ మంగళవారం లై డిటెక్టర్ టెస్టు(పాలీగ్రాఫ్) నిర్వహించే అవకాశం ఉంది. హత్యాచార ఘటకు సంబంధించి ఆర్జీ కర్ వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపల్ సంజయ్ ఘోష్‌ను సీబీఐ అధికారులు వరుసగా నాలుగో రోజూ విచారణ చేశారు. ఘటనకు ముందు, తర్వాత ఆయన ఎవరెవరికి ఫోన్ చేశారు? అనేది తెలుసుకున్నారు. వాట్సాప్‌లో చాట్ లిస్టునూ పరిశీలించారు. జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనను నిరసిస్తూ కోల్‌కతా, ఢిల్లీ సహా దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో వైద్య విద్యార్థుల ఆందోళన కొనసాగుతోంది. ఆందోళనలో భాగంగా కోల్‌కతాలో సోమవారం ఎక్కడికక్కడ వైద్యులు మానవ హారంగా ఏర్పడి రహదారులను దిగ్బంధనం చేశారు పోలీసులకు మహిళా వైద్యులు రాఖీలు కట్టారు. హత్యాచార ఘటనలో దోషులకు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ కలకత్తా హైకోర్టు న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. ఢిల్లీలోని నిర్మాణ్ భవన్ ఎదుట వైద్యులు.. నిరసనల్లో భాగంగా రోడ్డు మీదే ఓపీ సర్వీసులు నిర్వహించారు. మరోవైపు.. హత్యాచార ఘటనకు సంబంధించి కోల్‌కతా పోలీస్ కమిషనర్‌ను సీబీఐ విచారణ చేయాలంటూ బహిరంగంగా డిమాండ్ చేసిన టీఎంసీ ఎంపీ సుఖేందు శేఖర్ రేకు పోలీసులు సమన్లు జారీచేశారు. హతురాలికి సంబంధించిన వివరాలను బహిర్గతం చేశారనే ఆరోపణలతో బీజేపీకి చెందిన మాజీ ఎంపీ లాకెట్ చటర్జీకి, మరో ఇద్దరు వైద్యులకు కూడా పోలీసులు సమన్లు జారీ చేశారు. మరోవైపు.. తనకు పోలీసులు సమన్లు జారీ చేయడాన్ని సుఖేందు శేఖర్ హైకోర్టులో సవాలు చేశారు. హతురాలి ఫొటోను సోషల్ మీడియా ద్వారా బహిర్గతం చేస్తూ సీఎం మమతను హెచ్చరిస్తూ కామెంట్ పెట్టిన ఓ వ్యక్తిని కూడా కోల్‌కతా పోలీసులు అరెస్టు చేశారు. హత్యాచార ఘటనలో దోషులను రక్షించేందుకు సంబంధించి సాక్ష్యాలను ధ్వంసం చేశారని.. ఇందుకు బాధ్యత వహిస్తూ సీఎం మమత తన పదవికి రాజీనామా చేయాలంటూ బీజేపీ డిమాండ్ చేసింది. ఇక.. మమత రాజీనామా చేయాలంటూ ఆమె వైపు వేలెత్తి చూపేవారి వేళ్లను విరిచేస్తామంటూ బెంగాల్ క్యాబినెట్ మంత్రి ఉదయన్ గుహ హెచ్చరించారు. దీనికి సంబంధించిన ఓ వీడియో నెట్‌లో చక్కర్లు కొడుతోంది.


అత్యాచార ఘటనను నిరసిస్తూ కోల్‌కతాలో ర్యాలీ నిర్వహిస్తున్న హైకోర్టు న్యాయవాదులు

రాష్ట్రంలో మెగా మాన్యుఫ్యాక్చరింగ్ సిటీ!

- త్వరలోనే సమగ్ర ప్రణాళికతో వస్తాం
- మంత్రి లోకేశ్‌కు ఫాక్స్‌కాన్ హామీ


అమరావతి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెగా మాన్యుఫ్యాక్చరింగ్ సిటీ ఏర్పాటుకు ఫాక్స్‌కాన్ సంస్థ సంసిద్ధత వ్యక్తంచేసింది. త్వరలోనే దీనికి సంబంధించిన సమగ్ర ప్రణాళికతో వస్తామని స్పష్టం చేసింది. గత వైసీపీ ప్రభుత్వం తమ సంస్థ విస్తరణకు ఏమాత్రమూ సహకరించలేదని, పైగా ఇబ్బందులకు గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేసింది. సోమవారమిక్కడ ఉండవల్లి నివాసంలో ఐటీ మంత్రి లోకేశ్‌తో ఫాక్స్‌కాన్ ప్రతినిధుల బృందం సమావేశమైంది. ఇందులో ఫాక్స్‌కాన్ భారత ప్రతినిధి వీ లీ, సంస్థ చైర్మన్ కార్యాలయం డైరెక్టర్ సెంథిల్‌కుమార్, డిప్యూటీ డైరెక్టర్ భరత్ దండి, మేనేజర్ విక్టర్ చెన్, అసోసియేట్ మేనేజర్ హన్నా వాంట్ తదితరులు ఉన్నారు. వీరంతా వస్తున్నారని తెలిసి లోకేశ్ వారికి స్వయంగా ఎదురేగి మరీ స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో రాష్ట్రంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టి ఉద్యోగాలను కల్పించేందుకు ఫాక్స్‌కాన్ ప్రతినిధులు అంగీకరించారు. ప్రభుత్వం తరఫున పూర్తి సహకారాన్ని అందించి, త్వరితగతిన మెగా కంపెనీ కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని వారికి లోకేశ్ హామీ ఇచ్చారు. వీ లీ మాట్లాడుతూ.. పెట్టుబడుల ఆకర్షణకు సీఎం చంద్రబాబు చొరవ ప్రశంసనీయమని తెలిపారు. ఆంధ్రతో తమకు మంచి అనుబంధం ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా తమకు అనేక ప్లాంట్లు ఉన్నాయని. ఇండియాలో భారీ ఎత్తున కార్యకలాపాలను విస్తరించే యోచనలో ఉన్నామని ప్రతినిధుల బృందం వెల్లడించింది. ఎలక్ట్రిక్ వాహనాలు, సెమీ కండక్టర్ తయారీ, డిజిటల్ హెల్త్ మాన్యుఫాక్చరింగ్ కాంపోనెంట్స్ తయారీ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు సుముఖంగా ఉన్నామని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యానికి తమ వంతు సహకారం అందిస్తామని భరోసా ఇచ్చింది. త్వరలోనే రాష్ట్ర అధికారులతో చర్చిస్తామని తెలిపింది.

భారీ లక్ష్యాలు పెట్టుకున్నాం: లోకేశ్

రాష్ట్రంలో పెట్టుబడుల కల్పన, పరిశ్రమల ఏర్పాటు భారీగా ఉండాలని.. ఉపాధి అవకాశాలు పెద్దఎత్తున జరగాలని లక్ష్యాలను నిర్దేశించుకున్నట్లు లోకేశ్ తెలిపారు. ఫాక్స్‌కాన్ కార్యకలాపాలను విస్తరించాలనుకోవడాన్ని స్వాగతిస్తున్నానన్నారు. అయితే ఇందులో కేవలం ఒక ప్లాంటు తమ రాష్ట్రంలో పెట్టాలని తాను కోరుకోవడం లేదని.. దానివల్ల ఉపాధి కల్పన, పెట్టుబడులు తక్కువగా ఉంటాయని చెప్పారు. మెగా మాన్యుఫ్యాక్చరింగ్ సిటీ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఇందుకు ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా రాయితీలు కల్పించే విధానం రూపొందిస్తున్నామని లోకేశ్ అన్నారు. త్వరలోనే ఏ రాష్ట్రంలోనూ అనుసరించని ఎలక్ట్రిక్ వెహికల్ పాలసీని తీసుకురానున్నట్లు తెలిపారు.

జగన్ జమానాలో క్షోభ!

జగన్ హయాంలో రాష్ట్రంలో తన పారిశ్రామిక కార్యకలాపాలను విస్తరించాలని ఫాక్స్‌కాన్ భావించింది. అయితే వైసీపీ సర్కారు సహకరించలేదు. పైగా ఇబ్బందులు సృష్టించింది. అదే సమయంలో అప్పటి తెలంగాణ మంత్రి కేటీఆర్ ఆహ్వానించడంతో ఆ సంస్థ ఆ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమైంది. లోకేశ్‌తో జరిగిన భేటీలో గత ప్రభుత్వ హయాంలో ఇబ్బందులకు గురయ్యామని చెప్పడం.. పారిశ్రామిక దిగ్గజ సంస్థలు కూడా ఎంతగా క్షోభకు గురయ్యాయో తెలియజేస్తోంది.


ఫాక్స్‌కాన్ ప్రతినిధులకు ఎదురెళ్లి స్వాగతం పలుకుతున్న మంత్రి లోకేశ్

నవలా రచయిత, కథకుడు, కవి..

కాశీభట్ల వేణుగోపాల్ కన్నుమూత



- కర్నూలు స్వగృహంలో అనారోగ్యంతో మృతి
- 12కుపైగా నవలలు, 100కుపైగా కథలు, మూడు కథా, కవితా సంపుటాలతో ప్రసిద్ధి
- 1996లో తానా పురస్కారం

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 19: తెలుగు సాహితీ వినీలాకాశంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆధునిక సాహితీదిగ్గజం... కవి, కథకుడు, నవలా రచయిత కాశీభట్ల వేణుగోపాల్(72) సోమవారం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కర్నూలు నగరంలోని రెవెన్యూ కాలనీలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. 1974లో ఆంధ్రపత్రికలో 'రంగనాయకి లేచిపోయింది' అనే కథతో కాశీభట్ల తన సాహితీ ప్రస్థానం ప్రారంభించారు. తర్వాత అనేక కవితలు రాశారు. 'నేను-చీకటి' అనే నవలతో వెలుగులోకి వచ్చారు. ఆయన రచనలు 'ఘోష', 'తపన', 'దిగంతం' 'మంచు-పువ్వు', 'తెరవని తలుపులు', 'అసత్యానికి ఆవల', 'సంగతం' వంటివి విమర్శకుల ప్రశంసలు పొందాయి. వినూత్న కథనాలు, కొత్తదనంతో కనిపించే పాత్రలు, ఆకట్టుకునే రచనా శైలి ఆయన స్వంతం. ఆధునిక తెలుగు సాహిత్యంలో ఆయన రచనలు నవ్య కెరటాల్లా ఉవ్వెత్తున ఎగిశాయి. ఆయన తన కలం ద్వారా మానవ సంబంధాలను, మనుషుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న కోణాలను, మనుషుల మధ్య ఉన్న అంతరాలను సునిశితంగా పరిశీలించి రాసేవారు. సుమారు 12కు పైగా నవలలు, వందకు పైగా కథలు రాశారు.

కర్నూలులోనే చదువు, సాహితీ శోధన...

కాశీభట్ల వేణుగోపాల్ 1952 జనవరి 2న కర్నూలులో జన్మించారు. తండ్రి ఎల్లప్ప శాస్త్రి, తల్లి హనుమాయమ్మలకు ఇద్దరు మగ, నలుగురు ఆడ సంతానం. వారిలో కాశీభట్ల అందరికన్నా చిన్నవారు. అనంతపురం జిల్లా వజ్రకరూరు నుంచి కర్నూలుకు వచ్చి స్థిరపడిన కుటుంబం వారిది. కర్నూలు టీక్యాంపు బాలుర పాఠశాల్లో హైస్కూల్ విద్య, ఉస్మానియా కళాశాలలో కళాశాల విద్య పూర్తి చేశారు. 'మొదట్లో అభ్యుదయ, విప్లవ సాహిత్యాలకు ఆకర్షితుడినైనా... విశ్వసాహిత్యాన్ని చదివే క్రమంలో వాటి నుంచి బయటపడ్డాను' అని ఒక సందర్భంలో ఆయన చెప్పుకొచ్చారు. విస్తృతంగా చదివే అలవాటుతో పాటు కొత్త ప్రదేశాల సందర్శనపై ఆయనకున్న మక్కువతో మూడు సార్లు దేశాటన చేశారు. గాఢమైన అనుభూతుల్ని ఒడిసి పట్టే నైపుణ్యం అబ్బడానికి, తాను రచయితను కావడానికి ఆ పర్యటనలే కారణమని ఆయనే స్వయంగా ప్రకటించారు. ఆజన్మ బ్రహ్మచారిగా ఉండిపోయిన కాశీభట్ల... జీవితాన్వేషణలో వారణాసి, లక్నోలో కొంతకాలం ఉన్నారు. ఆ సమయంలో సంగీత సాధన కూడా చేశారు.

ముగిసిన అంత్యక్రియలు

కాశీభట్ల వేణుగోపాల్ మృతి విషయం తెలుసుకున్న బంధువులు, స్నేహితులు, సాహిత్యాభిమానులు ఆయన స్వగృహానికి వెళ్లి పార్థివ దేహానికి నివాళులర్పించారు. జిల్లా ఒక గొప్ప సాహితీ దిగ్గజాన్ని కోల్పోయిందని శ్రద్ధాంజలి ఘటించారు. సోమవారం సాయంత్రం కాశీభట్ల అంత్యక్రియలు నిర్వహించారు. బంధువులు, స్నేహితులు కదలివచ్చి, చివరిసారిగా ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు.

భిన్నత్వంతో కూడిన రచనలు...

పదునైన భాషతో కూడిన కాశీభట్ల రచనా శైలి అన్ని వర్గాలను ఆకట్టుకునేది. ఆయన రచనల్లోని పాత్రలు ఆధునిక మానవుని అంతరంగంలో కల్లోలాన్ని రేపుతాయి. పెద్దగా ఎవరూ స్పృశించని, సాహసించని స్త్రీ పురుష సంబంధాల్ని, పురుషుడి చీకటి ఆలోచనల్నీ, నిషేధిత సంబంధాలను తెలుగు సాహిత్యంలోకి తెచ్చి తనకంటు ఓ గుర్తింపును తెచ్చుకున్నారు. మూడు కథా సంపుటాలు, మూడు కవిత్వ సంపుటాలు వెలువరించారు. 'ఒక బహుముఖం' అనే కవితా సంపుటికి మంచి ప్రాచుర్యం లభించింది. 1996లో కర్నూలులో 'తానా' సంస్థ నుంచి పురస్కారం అందుకున్నారు. కర్నూలు కథా సమయం, రాయలసీమ ప్రచురణలు తదితర సంస్థలు ప్రచురించిన కథా సంపుటాలకు ఆయన ముందుమాట రాశారు. ఎందరో ఔత్సాహిక కవులు, రచయితలను ఆయన ప్రోత్సహించారు. సినీ నటులు తనికెళ్ల భరణి, దర్శకుడు వంశీ వంటి వారితో సన్నిహితంగా ఉండే ఆయన ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో వేలాది అభిమానులను తన రచనల ద్వారా సంపాదించుకున్నారు. ఆయన చివరిగా రాసిన 'అసత్యానికి ఆవల' నవలతోపాటూ పాత నవలలన్నింటినీ 'అన్వీక్షికి' సంస్థ ఇటీవలే ప్రచురించింది.



ఆలయం వద్ద భక్తుల సందడి.. అరచేతుల్లో స్వామికి సమర్పించే తేళ్లు

వృశ్చికం సమర్పయామి....

- కొండలరాయుడికి తేళ్లతో పూజలు
- కర్నూలు జిల్లా కోడుమూరులో ఆచారం
- ఏటా శ్రావణ మాసంలో భక్తుల సందడి

భగవంతునికి వివిధ రూపాలలో భక్తులు మొక్కులు చెల్లించుకోవడం చూస్తూనే ఉంటాం. అయితే, కర్నూలు జిల్లా కోడుమూరు మండలంలోని ఎత్తయిన కొండపై కొండలరాయుడు రూపంలో కొలువైన వేంకటేశ్వర స్వామి కి భక్తులు చెల్లించే మొక్కు ఆశ్చర్యం గొలుపుతుంది. ప్రతి ఏటా శ్రావణమాసం మూడో సోమవారం నాడు భక్తులు ఇక్కడి స్వామికి తేళ్లను సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. ఏళ్ల తరబడి ఈ ఆనవాయితీ కొనసాగుతోంది. మరి ఈ తేళ్లను ఎక్కడ నుంచి తీసుకువస్తారు అని అనుకుంటున్నారా? ఈ ఆలయం దగ్గర ఏ రాయిని కదిపినా తేళ్లు దర్శమిస్తాయి. వాటిని చేతితో పట్టుకొని స్వామి విగ్రహంపై వదిలేస్తారు. ఇంత చేసినా ఆ తేళ్లు భక్తులను ఏమీ చేయవు. ఇలా తేళ్లతో పూజలు చేయడం వల్ల కోరికలు తీరుతాయని ఇక్కడి భక్తుల నమ్మకం. ఈఏడాది కూడా సోమవారం భక్తులు భారీ ఎత్తున తరలి వచ్చి యథావిధిగా తేళ్లను వదిలి పూజలు చేశారు. -కోడుమూరు

ఏపీ నిట్‌కు మూడు ఐఎస్‌వో సర్టిఫికెట్లు

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 19: పశ్చిమగోదావరి జిల్లాలోని ఏపీ నిట్ మూడు ఐఎస్‌వో సరిఫికెట్లను దక్కించుకుందని నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్ శంకర్ రెడ్డి విలేకరులకు తెలిపారు. ఇటీవల ఐఎస్‌వో ప్రతినిధులు నిట్ విద్యాసంస్థలోని గెస్ట్ హౌస్, భవనాలు, ప్రయోగ శాలలు, యంత్రాల పనితీరు, ఇంజనీరింగ్ విభాగాలు పరిశీలించారన్నారు. 3 కేటగిరీల్లో ఐఎస్‌వో సర్టిఫికెట్లను ప్రకటించారని, వీటిలో ఐఎస్‌వో-9001 క్యాలిటీ మేనేజ్‌మెంట్ సిస్టం, గుడ్ ఆఫ్ అకడమిక్, ఐఎస్‌వో-14001 ఎన్విరాన్మెంటల్ గ్రీన్ ఆడిట్ సర్టిఫికెట్, ఐఎస్‌వో-50001 ఎనర్జీ మేనేజ్‌మెంట్ సర్టిఫికెట్ ఉన్నాయన్నారు. నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ సర్టిఫికెట్లు సాధించడం వెనుక తమ సిబ్బంది కృషి ఎంతో ఉందని, భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించేలా సంస్థను తీర్చిదిద్దుతామన్నారు.

వెంకన్న సన్నిధిలో

టికెట్ల మాయ!

- నకిలీ టిక్కెట్లు సృష్టి...స్కాన్ చేస్తున్నట్లు నాటకం
- భారీగా సొమ్ములు తీసుకుని దర్శనానికి పంపుతున్న వైనం
- ట్రావెల్స్ దళారీలతో కుమ్మక్కైన కాంట్రాక్టు ఉద్యోగి
- గుట్టు రట్టు చేసిన విజిలెన్స్ అధికారులు

తిరుమల, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): నకిలీ టికెట్లతో శ్రీవారి దర్శనానికి అనుమతిస్తున్న అక్రమం ఒకటి టీటీడీలో బయటపడింది. ట్రావెల్స్ దళారీలతో కుమ్మక్కైన ఓ టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి ఈ చర్యకు పాల్పడుతున్నట్టు తేలడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చెన్నైకి చెందిన మోహన్‌రాజు శ్రీవారి దర్శనం కోసం చెన్నైలోని ఎంపైర్ ట్రావెల్స్‌ను సంప్రదించాడు. నాలుగు టికెట్లకు రూ.11,200 అవుతుందని ట్రావెల్స్ నిర్వాహకులు చెప్పడంతో మోహన్‌రాజు 17వ తేదీన గూగుల్‌పే ద్వారా నగదు పంపాడు. దీంతో గతంలో టీటీడీకి సేవలందించిన కేవీఎం అనే సంస్థలో పనిచేసిన కాంట్రాక్ట్ ఉద్యోగి నవీన్‌ను సంప్రతించాలని ట్రావెల్స్ నిర్వాహకులు సూచించారు. నవీన్ ఏపీ టూరిజం పేరిట ఉన్న నాలుగు రూ.300 నకిలీ టికెట్ల జిరాక్స్‌ను మోహన్‌రాజుకు ఇచ్చి, టికెట్లు స్కాన్ కౌంటర్‌లో కౌంటర్ బాయ్‌గా పనిచేసే కాంట్రాక్ట్ ఉద్యోగి రుద్రసాగర్‌కు చూపిస్తే దర్శనానికి అనుమతిస్తారని వివరించాడు. కాగా, ఇలాంటి అక్రమాలపై ఇప్పటికే నిఘా ఉంచిన విజిలెన్స్ వింగ్ అధికారులు తిరుమలలో మోహన్‌రాజును అదుపులోకి తీసుకుని విచారించగా వ్యవహారం వెలుగు చూసింది. నకిలీ టికెట్లు స్కాన్ కాకపోయినప్పటికీ స్కాన్ చేసినట్టు నటిస్తూ దర్శనానికి రుద్రసాగర్ అనుమతిస్తున్నట్టు తేలింది. 17వ తేదీన 35మందిని, 18వ తేదీన 18మందిని ఇలాగే అనుమతించినట్టు విచారణలో వెలుగు చూసింది. అమృత్‌యాదవ్ అనే మరో మాజీ కాంట్రాక్ట్ ఉద్యోగితో కలిసి కొద్ది నెలలుగా ఈ అక్రమానికి పాల్పడినట్టు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. మోహన్‌రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నివేదిక తయారు చేసి తిరుమల టూటౌన్ పోలీసులకు కేసును అప్పగించారు. నవీన్, రుద్రరాజుతో పాటు ట్రావెల్స్‌కు సంబంధించిన ఏజెంట్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీటీడీ ఫైళ్ల దగ్ధంపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది

- ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

తిరుమల, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో జరిగిన ఫైళ్ల దగ్ధంపై ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. తిరుమల శ్రీవారిని సోమవారం ఆయన దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత తొలిసారి తిరుమలకు వచ్చానన్నారు. ఆదివారం రూ.300 దర్శనం కోటాలో సామాన్య భక్తులతో కలిసి దర్శనానికి వెళ్లానన్నారు. టీటీడీలో ప్రక్షాళన చాలా స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు. కొంతమంది సామాన్య భక్తులతో మాట్లాడితే చిన్నపిల్లలకు పాలు ఇవ్వడంతోపాటు సకాలంలో అన్నప్రసాదాలు అందిస్తున్నారని చెప్పడం చాలా సంతోషంగా ఉందన్నారు. గతంలో వీటిని నిలిపివేయడంతో భక్తులు చాలా ఇబ్బంది పడ్డారన్నారు. చంద్రబాబు ప్రభుత్వం టీటీడీకి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. తిరుమలలో అన్నీ ఆగమశాస్త్రం ప్రకారమే జరుగుతుండడం కనిపిస్తోందన్నారు.

'సెబ్' రద్దు!

విఫల ప్రయోగానికి సర్కారు స్వస్తి.. 28న కేబినెట్ భేటీలో ఆమోదం

- ఆ వెంటనే ఆర్డినెన్స్ జారీ
- అధికారులు, ఉద్యోగులు, కానిస్టేబుళ్లు.. అందరికీ కలిపి ఒకేసారి బదిలీలు
- పూర్తిగా పాత స్వరూపంలోకి ఎక్సైజ్ శాఖ
- ప్రతి జిల్లాకో డిప్యూటీ, అసిస్టెంట్ కమిషనర్
- అనకాపల్లి, తూర్పులకు ప్రత్యేక ఏసీలు
- చెక్‌పోస్టులు, స్క్వాడ్లు బలోపేతం
- 24 గంటలూ పనిచేసేలా సిబ్బంది పెంపు
- 208 సెబ్ స్టేషన్లు ఇక ఎక్సైజ్ స్టేషన్లు
- ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా డీఐజీ లేదా ఐజీ

అమరావతి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్ తన మానస పుత్రికగా చెప్పుకొన్న స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) కాలగర్భంలో కలిసిపోనుంది. ఎలాంటి ఉపయోగమూ లేని ఈ వ్యవస్థను రద్దుచేయాలని టీడీపీ కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెలాఖరులోపే ఈ వ్యవస్థను ఎత్తేసి, ఎక్సైజ్ శాఖకు సంపూర్ణంగా పూర్వరూపం తీసుకురానుంది. ఇందుకోసం తాజాగా ఎక్సైజ్ శాఖ తయారుచేసిన ప్రతిపాదనలను సాధారణ పరిపాలన, న్యాయ శాఖల పరిశీలనకు పంపుతున్నారు. అవి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగానే.. ఈ నెల 28న జరిగే కేబినెట్ సమావేశంలో సెబ్ రద్దుకు ఆమోదం తెలుపుతారు. ఆ వెంటనే ఎక్సైజ్ చట్టంలో సవరణలతో ఆర్డినెన్స్ జారీచేసి సెబ్‌ను పూర్తిగా రద్దు చేస్తారు. అనంతరం ఎక్సైజ్, సెబ్‌లలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు, కానిస్టేబుళ్లకు కలిపి ఒకేసారి బదిలీలు చేపడతారు. సెప్టెంబరు 5 నుంచి 15లోగా బదిలీలు పూర్తికావాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. ఈలోగా వ్యవస్థ మొత్తాన్ని పునర్వ్యవస్థీకరించనుంది. ఎక్సైజ్, సెబ్ రెండు వేర్వేరు విభాగాల్లో ఉన్నందున అధికారులకు జీరో సర్వీసు ప్రామాణికంగా బదిలీలు చేసే అవకాశం ఉంది. కానిస్టేబుళ్లు స్టేషన్లలోనే ఉన్నందున వారికి కొంత సర్వీసును ఆధారంగా తీసుకుని బదిలీలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఎన్‌ఫోర్స్‌మెంట్ బలోపేతం..

ఎక్సైజ్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ కీలకంగా ఉంటుంది. రాష్ట్ర, జిల్లా, ఎక్సైజ్ సూపరింటెండెంట్ స్థాయుల్లో ప్రత్యేక స్క్వాడ్‌లు ఉంటాయి. వాటిని మరింత బలోపేతం చేసేలా ఎక్సైజ్ శాఖ ప్రణాళికలు రూపొందించింది. శాఖ పునర్వ్యవస్థీకరణ కోసం నియమించిన కమిటీ ఇచ్చిన నివేదికను ఆమోదించింది. దాని ప్రకారం ఉమ్మడి జిల్లాల తరహాలో ఎక్సైజ్ పాలన ఉంటుంది. ప్రతి జిల్లాకు డిప్యూటీ కమిషనర్ అధిపతిగా ఉంటారు. మద్యం నేరాలకు ఒక అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ) ఉంటారు. గంజాయి, నాటుసారా ఎక్కువగా ఉండే అనకాపల్లి, తూర్పుగోదావరి జిల్లాలకు అదనంగా చెరో అసిస్టెంట్ కమిషనర్‌ను నియమించాలని నిర్ణయించారు. అలాగే కొత్త జిల్లాల వారీగా జిల్లాకో ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఈఎస్) ఉంటారు. మార్కాపురం, రంపచోడవరం, పలాస, గూడూరుల్లో ఈఎస్ టాస్క్‌ఫోర్స్ బృందాలు అదనంగా ఏర్పాటుచేస్తారు. అసిస్టెంట్ కమిషనర్ నేతృత్వంలోని స్క్వాడ్లలో కూడా సిబ్బందిని పెంచుతున్నారు. 29 చెక్‌పోస్టుల్లో ఇకపై సిబ్బంది 24 గంటలూ పనిచేసేలా కేటాయింపులు పెంచుతారు. మొబైల్ తనిఖీ బృందాలను కూడా పెంచనున్నారు. డీఐజీ లేదా ఐజీ స్థాయి అధికారిని ఎక్సైజ్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా నియమిస్తారు. రాష్ట్రంలోని 208 సెబ్ స్టేషన్లను ఎక్సైజ్ స్టేషన్లుగా మారుస్తారు.

పునర్వ్యవస్థీకరణ తర్వాత ఇలా..

సెబ్‌ను రద్దుచేసి ఎక్సైజ్‌ను పాత విధానంలోకి తీసుకొస్తే ప్రధాన కార్యాలయంలో ఒక అదనపు కమిషనర్, ముగ్గురు జాయింట్ కమిషనర్లు ఉంటారు. మొత్తంగా 67 మంది ఇక్కడ ఉంటారు. బేవరేజెస్ కార్పొరేషన్‌లో 36 మంది, డిస్టిలరీ విభాగంలో 302 మంది, జిల్లాల్లో 96 మంది, ఎక్సైజ్ స్టేషన్లలో 3,333 మంది, అసిస్టెంట్ కమిషనర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాల్లో 295 మంది, ఈఎస్ టాస్క్‌ఫోర్స్ బృందాల్లో 334 మంది, చెక్‌పోస్టుల్లో 313 మంది, మద్యం డిపోల్లో 138 మంది చొప్పున సిబ్బంది ఉంటారు.

అక్రమాలకు ఆసరాగా సెబ్..

జగన్ ప్రభుత్వం మద్యంలో దోపిడీకే సెబ్‌ను సృష్టించిందనే ఆరోపణలున్నాయి. 2020 మేలో దీనిని ఏర్పాటు చేశారు. సాధారణ పరిపాలన విభాగం (జీఏడీ) పరిధిలో ఉంటూ పోలీసులు బాస్‌లుగా ఉండే విధానం తెచ్చారు. జిల్లాల్లో అదనపు ఎస్పీలు సెబ్‌కు బాస్‌లుగా వ్యవహరిస్తున్నారు. ఇందుకోసం ఎక్సైజ్ శాఖను రెండు ముక్కలు చేసి 30 శాతం సిబ్బందినే ఎక్సైజ్‌లో ఉంచారు. మిగిలిన 70 శాతం మందిని సెబ్‌కు కేటాయించారు. మద్యంతో పాటు ఇసుక, గుట్కా, గ్యాంబ్లింగ్ అంటూ అనేక బాధ్యతలు అప్పగించారు. కానీ మద్యం మినహా ఇతరత్రా నేరాలపై ఎఫ్ఐఆర్ నమోదుచేసే అధికారం సెబ్‌కు ఇవ్వలేదు. ఫలితంగా కొత్త వ్యవస్థను సృష్టించాక అక్రమాలు తగ్గుతాయనుకుంటే భారీగా పెరిగాయి. 2019-24 మధ్య కాలంలో గంజాయి కేసులు 27 శాతం అదనంగా పెరిగాయి. ఎన్‌డీపీఎల్ అక్రమాలు 66 శాతం పెరిగాయి. మద్యం సంబంధిత నేరాలు 64 శాతం, అరెస్టులు 161 శాతానికి చేరుకున్నాయి. 2017లో రాష్ట్రంలో దాదాపుగా అన్ని జిల్లాలను నాటుసారా రహిత జిల్లాలుగా ప్రకటిస్తే.. వైసీపీ హయాంలో మళ్లీ తెరపైకి వచ్చింది. ఎక్సైజ్ శాఖను అడ్డగోలుగా విడగొట్టడంతోనే ఈ విధంగా నేరాలు పెరిగిపోయాయని ప్రభుత్వం గుర్తించింది. అందుకే సెబ్ అనే విఫల ప్రయోగాన్ని పూర్తిగా ఎత్తివేయాలని నిర్ణయించింది.

ఇల్లు అద్దెకిస్తే.. నన్నే బయటకు గెంటేశారు

- మచిలీపట్టణానికి చెందిన మహిళ ఆవేదన
- పవన్ నివాసం వద్ద జనవాణిలో ఫిర్యాదు



కాకినాడ జిల్లా చేబ్రోలులో పవన్ నివాసం వద్ద జనవాణిలో ఫిర్యాదు చేసిన మచిలీపట్టణానికి చెందిన కేదారేశ్వరి

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 19: ఇల్లు అద్దెకు ఇస్తే తననే ఇంటి నుంచి గెంటివేశారని మచిలీపట్టణంలోని నిజాంపేటకు చెందిన కేదారేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసం వద్ద నిర్వహిస్తున్న జనవాణి కార్యక్రమంలో సోమవారం ఆమె తన ఆవేదనను వెలిబుచ్చారు. నాలుగేళ్ల కిందట తన ఇంటిని అద్దెకు ఇచ్చానని, అయితే వైసీపీ నేతల అండతో తననే ఇంటి నుంచి గెంటేసి ఆక్రమించుకున్నారని చెప్పారు. తనకు తిండి కూడా లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుస్టేషన్లు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెప్పారు. న్యాయం చేయమని అడిగితే పోలీసులు, అధికారులు తన మానసిక స్థితి సరిగా లేదని ముద్రవేశారని వాపోయారు. తనకు పవన్‌కల్యాణ్ న్యాయం చేయాలని కోరారు. ఆమె వినతిని స్వీకరించిన జనవాణి సిబ్బంది పవన్ దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

మెరిట్‌ను కాదని వైసీపీ వాళ్లకే ఉద్యోగాలు

- సమస్యలపై వినతులు ఇచ్చిన బాధితులు
- 'వారధి'కి విశేష స్పందన: సాధినేని యామినీశర్మ

విజయవాడ వన్‌టౌన్, ఆగస్టు 19: ప్రజల సమస్యల పరిష్కారానికి బీజేపీ నిర్వహిస్తున్న వారధి కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాధినేని యామినీశర్మ చెప్పారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం సమన్వయకర్త కిలారు దిలీప్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్ర శివనారాయణ, మాజీమంత్రి శనక్కాయల అరుణ తదితరులతో కలిసి ఆమె ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా యామినీశర్మ మాట్లాడుతూ కడప జిల్లాకు చెందిన బాధితులు కొందరు పశుసంవర్థక శాఖలో మెరిట్‌లో పరీక్ష రాసినప్పటికీ ఉద్యోగాలు ఇవ్వకుండా వైసీపీ కార్యకర్తలకు ఇచ్చారని, తమకు న్యాయం చేయాలని కోరారని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు శ్రేష్ఠ పథకం ద్వారా ఫీజు రీయింబర్స్‌మెంట్ అందటం లేదని కొందరు విద్యార్థులు చెప్పారు. విశాఖపట్నంలో అనుమతులు లేకుండా అడ్మిషన్లు తీసుకుని చివరకు సుజనా కాలేజి ఆఫ్ ఫార్మసీని మూసివేశారని, నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలంటూ ఫిర్యాదు వచ్చిందన్నారు. భూముల కబ్జా, గత ప్రభుత్వ దోపిడీ, బిల్లుల పెండింగ్ వంటి అంశాలపై ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు.

దువ్వాడ వాదనలో వాస్తవం లేదు

- ఆయన భార్య, కుమార్తెకు 41(ఏ) నోటీసులిచ్చాం
- కేసు నమోదు చేసి ఐదు రోజులే అయ్యింది
- హైకోర్టుకు నివేదించిన పోలీసులు
- కౌంటర్ వేయాలని పోలీసులకు ధర్మాసనం ఆదేశం
- విచారణ నాలుగు వారాలకు వాయిదా

అమరావతి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): తన భార్య వాణి, కుమార్తె హైందవిపై ఫిర్యాదు చేసినప్పటికీ టెక్కలి పోలీస్ స్టేషన్ సీఐ, ఎస్ఐ ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని, వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకొనేలా ఎస్పీని ఆదేశించాలని కోరుతూ వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ దువ్వాడ శ్రీనివాస్ సతీమణి, కుమార్తె పదేపదే ఆయన ఇంటిపై దాడి చేస్తూనే ఉన్నారన్నారు. ఆయన ఫిర్యాదుపై అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని పేర్కొన్నారు. పోలీసుల తరఫున ప్రభుత్వ న్యాయవాది కేఎం కృష్ణారెడ్డి వాదనలు వినిపిస్తూ పిటిషనర్ వాదనలలో వాస్తవం లేదన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని తెలిపారు. వాణి, హైందవికి పోలీసులు సీఆర్పీసీ సెక్షన్ 41(ఏ) కింద నోటీసులు ఇచ్చారని చెప్పారు. కేసు నమోదు చేసి ఐదు రోజులే గడిచిందన్నారు. ఫిర్యాదుదారుడిపై ఆయన సతీమణి కూడా కేసు పెట్టారని తెలిపారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి పోలీసులపై వచ్చిన ఆరోపణలపై కౌంటర్ వేయాలని అధికారులను ఆదేశించారు. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేశారు.

ఎడారిన అడుగిడిన కొద్ది రోజులకే

కోనసీమ యువకుడి బలవన్మరణం

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి): ఉపాధికోసం దేశాన్నివీడి ఎడారికి వచ్చిన కొద్దిరోజులకే ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కోనసీమ అంబేడ్కర్ జిల్లా మామిడికుదురు మండలం పెదపట్నం లంక గ్రామానికి చెందిన నాగులపల్లి వీరవెంకట దుర్గ నాగసాయి(22) 20 రోజుల క్రితం ఒక పెట్రోలు బంకులో పని చేయడానికి బహ్రెయిన్‌కు వచ్చాడు. ఉద్యోగం సాఫీగా కొనసాగుతుండగా శనివారం రాత్రి తన గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. మృతుని కుటుంబానికి బహ్రెయిన్ లోని తెలుగు కళా సమితి అండగా నిలిచి అధికార ప్రక్రియ పూర్తి చేయడానికి సహకరిస్తోంది. సమితి పక్షాన నోముల మురళి, జగదీశ్ స్థానిక అధికారులతో సంప్రతింపులు జరుపుతున్నారు.

21న రంగా వర్సిటీలో మాన్యువల్ కౌన్సెలింగ్

అమరావతి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): గుంటూరు సమీపం లాంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఎన్నారై కోటా కింద బీఎస్సీ అగ్రికల్చర్, ఇతర కోర్సులకు ఈనెల21న మాన్యువల్ కౌన్సెలింగ్ జరుగుతుందని రిజిస్ట్రార్ రామచంద్రరావు తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం రైతు కోటా కింద బీటెక్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ బీటెక్ ఫుడ్ టెక్నాలజీ కోర్సులకు మాన్యువల్ కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు. కాగా చిరుధాన్యాలు, సేంద్రియ ఎరువులు, వర్మికంపోస్టు తయారీ వంటి అంశాలపై ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులకు సెప్టెంబరు 3లోగా పేర్లు నమోదు చేసుకోవాలని రిజిస్ట్రార్ తెలిపారు.

మాక్‌పోలింగ్ కాదు..

వీవీ ప్యాట్ స్లిప్పులు లెక్కించాలి

- హైకోర్టును ఆశ్రయించిన బాలినేని
- మాక్ పోలింగ్ నిలిపివేయాలని వినతి
- స్టే ఇచ్చేందుకు నిరాకరించిన హైకోర్టు
- వివరాలు సమర్పించాలని ఈసీకి ఆదేశం
- విచారణ నేటికి వాయిదా
- మాక్ పోలింగ్ ప్రక్రియను బహిష్కరించిన వైసీపీ



మాక్‌పోలింగ్‌ను బాయ్‌కాట్ చేసి వెళ్లిపోతున్న బాలినేని వర్గీయులు

అమరావతి/ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి హైకోర్టులో చుక్కెదురు అయ్యింది. తాము కోరినట్లుగా ఈవీఎం, వీవీప్యాట్ల తనిఖీ, పరిశీలనకు బదులుగా మాక్ పోలింగ్ మాత్రమే నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన వ్యాజ్యంలో మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. సోమవారం చేపట్టిన మాక్ పోలింగ్‌ను ఆపాలన్న బాలినేని తరఫు న్యాయవాది అభ్యర్థనను తోసిపుచ్చింది. ఈ వ్యవహారంపై వివరాలు సమర్పించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశిస్తూ విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ అంశంపై బాలినేని తరఫున న్యాయవాది వివేకానంద వాదనలు వినిపించారు. "ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయి రెండు, మూడు స్థానాల్లో ఉన్న అభ్యర్థులకు ఓట్ల లెక్కింపు విషయంలో ఏమైనా అభ్యంతరం ఉంటే... ఈవీఎం, వీవీ ప్యాట్ల తనిఖీ, పరిశీలనకు వెసులుబాటు కల్పిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. కానీ... ఎన్నికల కమిషన్ ఇందుకు భిన్నంగా ఉత్తర్వులు ఇచ్చింది. పిటిషనర్ అభ్యంతరం లేవనెత్తిన పోలింగ్ స్టేషన్లలో వినియోగించిన ఈవీఎంలకు మాక్ పోలింగ్ నిర్వహించాలని తెలిపింది. ఈ ఉత్తర్వుల మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం, జిల్లా ఎన్నికల అధికారి(కలెక్టర్) సోమవారం మాక్ పోలింగ్ నిర్వహిస్తున్నారు. దీనిని నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వండి" అని కోరారు. ఈ దశలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ... ఈసీఐ ఉత్తర్వులు సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధంగా ఉంటే సర్వోన్నత న్యాయస్థానాన్నే ఆశ్రయించవచ్చుకదా అని పిటిషనర్‌ను ప్రశ్నించారు. సుప్రీంకోర్టుకు వెళ్లేందుకు అభ్యంతరం లేదని, ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేయాలని బాలినేని తరఫు న్యాయవాది కోరారు. ఈసీ వివరాలు సమర్పించిన అనంతరం ఈ విషయం పై నిర్ణయం తీసుకుంటామని ప్రకటిస్తూ న్యాయమూర్తి విచారణను మంగళవారానికి వాయిదా వేశారు.

'మాక్ పోలింగ్' బహిష్కరణ

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఒంగోలులోని 12 పోలింగ్ కేంద్రాల పరిధిలో పోలింగ్ రోజున వాడిన ఈవీఎంలతో మాక్‌పోలింగ్ నిర్వహించేందుకు కలెక్టర్ తమీమ్ అన్సారీయా ఏర్పాట్లు చేశారు. పర్యవేక్షణ అధికారిగా నియమితులైన వెలిగొండ ప్రాజెక్టు భూసేకరణ స్పెషల్ కలెక్టర్ ఝాన్సీలక్ష్మి ఆధ్వర్యంలో ఈ ప్రక్రియను ప్రారంభించారు. వైసీపీ, టీడీపీ అభ్యర్థుల తరపు ప్రతినిధులు, ఈవీఎం కంపెనీ ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. సీసీ కెమెరా నిఘాలో ప్రక్రియను చేపట్టారు. అయితే... తాము కోరింది వేరు, అధికారులు చేస్తున్నది వేరని వైసీపీ ప్రతినిధులు అభ్యంతరం లేవనెత్తారు. మాక్ పోలింగ్‌కు తాము అంగీకరించేది లేదని, ఈవీఎంలలో డేటాను అలాగే ఉంచి, వీవీ ప్యాట్ స్లిప్‌లు మొత్తం లెక్కించాలని వైసీపీ నేతలు పట్టుబట్టారు. అయితే దీనిపై కలెక్టర్ స్పందిస్తూ... రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మాక్ పోలింగ్ మాత్రమే చేపడతామని తేల్చిచెప్పారు. కానీ... సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అన్ని ఓట్లు లెక్కించాలని వైసీపీ వారు డిమాండ్ చేశారు. అయితే ఎన్నికల నిబంధనల మేరకు... ఈవీఎంలు సక్రమంగా పని చేస్తున్నాయని రుజువు చేసేందుకు 'మాక్ పోలింగ్' మాత్రమే నిర్వహిస్తామని అధికారులు స్పష్టం చేశారు. దీంతో వైసీపీ ప్రతినిధులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అధికారులు కూడా ఈ ప్రక్రియను నిలిపివేశారు. అనంతరం ఈవీఎంలు, వీవీప్యాట్‌లకు సీల్ వేసి, యథావిధిగా భద్రపరిచారు. ఒంగోలు నియోజకవర్గంలోని కొన్ని పోలింగ్ కేంద్రాల ఓట్ల రీవెరిఫికేషన్‌పై వైసీపీ అభ్యర్థి డిమాండ్లను కేంద్ర ఎన్నికల కమిషన్‌కు తెలియజేస్తామని కలెక్టర్ తెలిపారు.

సచివాలయ సిబ్బందికి

టాయిలెట్ ఫొటోల బాధ్యత

- పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు
- ప్రధానోపాధ్యాయులకు బిగ్ రిలీఫ్

అమరావతి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్ల పరిశుభ్రతకు సంబంధించి ఫొటోలు తీసి, యాప్‌లో అప్‌లోడ్ చేసే బాధ్యతలను విద్యాశాఖ గ్రామ, వార్డు సచివాలయాలకు అప్పగించింది. ఆయా సచివాలయాల్లోని ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్, వార్డు ఎడ్యుకేషన్ కార్యదర్శి ప్రతి సోమ, గురువారాల్లో పాఠశాలలను సందర్శించి మరుగుదొడ్ల ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేసింది. దీనికిగాను పాఠశాల విద్యాశాఖ రూపొందించిన ఐఎంఎంఎస్ యాప్‌లో లాగిన్ అయ్యేందుకు వారికి అవకాశం కల్పించింది. అలాగే బుధ, గురువారాల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఛైర్మన్, సభ్యులు కూడా ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలని సూచించింది. ఈ మేరకు సమగ్రశిక్ష ఎస్పీడీ, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ఇన్‌చార్జ్ డైరెక్టర్ బి. శ్రీనివాసరావు ఆదేశాలు జారీచేశారు. మరుగుదొడ్ల ఫొటోలను అప్‌లోడ్ చేసే బాధ్యతను గత జగన్ ప్రభుత్వం ఆయా పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులకు(హెచ్.ఎం) అప్పగించిన విషయం తెలిసిందే. అయితే, తాము చదువు చెప్పేందుకు వచ్చామని, మరుగుదొడ్ల ఫొటోలు తీసేందుకు కాదని హెచ్.ఎంలు గగ్గోలు పెట్టారు. అయినప్పటికీ జగన్ సర్కారు వారి గోడును పెడచెవిన పెట్టి బలవంతంగానే మరుగుదొడ్ల ఫొటోలు తీయించింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మళ్లీ సఖ్యత!

వైవిధ్యంలోనూ, ప్రజాస్వామ్యంలోనూ భారతదేశం చాలాదేశాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నదని, మాల్దీవులు సైతం ఎంతో స్ఫూర్తిపొందుతున్నదని ఆ దేశ విదేశాంగమంత్రి చేసిన వ్యాఖ్య, ఇరుదేశాల సంబంధాల్లో వస్తున్న మార్పుకు నిదర్శనం. భారతదేశంతో సాన్నిహిత్యాన్ని, సత్సంబంధాలను తమ అధ్యక్షుడు బలంగా కోరుకుంటున్నారని ఆయన స్పష్టంచేశాడు. ఇదంతా ఇటీవల మన విదేశాంగమంత్రి ఆ దేశంలో పర్యటించివచ్చిన ప్రభావం. బంగ్లాదేశ్‌లో మనకు జరిగిన నష్టం మాల్దీవుల్లో భర్తీ అయిందని కొందరి విశ్లేషణ.

షేక్ హసీనా కంటే, ఆమె పార్టీకంటే తామే భారతదేశంతో అధికంగా సత్సంబంధాలు కోరుకుంటున్నామని బీఎన్పీ నాయకుడు ఒకరు ఈ మధ్యన వ్యాఖ్యానించారు. అక్కడ ఎన్నికలు జరిగి ఆ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ వ్యాఖ్యల్లో నిజాయితీ ఎంతో తెలుస్తుంది. కానీ, ముజబూర్ రహ్మాన్ కుమార్తె అధికారంలో ఉన్నంత కాలం భారతదేశం సరిహద్దుల వరకూ ప్రశాంతంగా ఉన్నమాట నిజం. దానికి ముందు బీఎన్పీ–జమాత్ కూటమి అధికారంలో ఉండగా ఉగ్రవాదుల చొరబాట్లు, దాడులు, అక్రమరవాణాలు, ఈశాన్యంలో తిరుగుబాటుదారులకు సహకారం ఇత్యాది బాధలు అనేకం భారత్ అనుభవించింది. ఇప్పుడు హసీనా నిష్క్రమణతో, చుట్టుపక్కల దేశాలన్నీ వరుసపెట్టి మనకు దూరమవుతున్నాయన్న ఆందోళన అధికమవుతున్న తరుణంలో మాల్దీవుల నుంచి ఈ సానుకూల వైఖరి మనలను ఉక్కిరిబిక్కిరిచేస్తోంది.

మాల్దీవుల అధ్యక్షపదవికి మహ్మద్ మొయిజ్జు పోటీపడిందే భారతవ్యతిరేక ప్రచారంతో. ఇతరత్రా కారణాలతో కూడా అక్కడి ప్రజలు ఆయనకు ఓటువేసి వుండవచ్చును కానీ, ఎన్నికల ప్రచారంలో చెప్పినదానికి అనుగుణంగా భారత దేశ సైనికులను తనదేశంనుంచి పంపించివేయడానికి ఆయన గట్టిగా పట్టుబట్టాడు. మొదట్లో కాస్తంత బెట్టుచేసినా, భారతదేశం కూడా అందుకు అంగీకరించింది. మాల్దీవులకు బహూకరించిన హెలికాప్టర్లు, రక్షణ సామగ్రి నిర్వహణ, శిక్షణ నిమిత్తం భారత సైనికులు అక్కడ ఉన్నారన్నది మన వాదన. ప్రకృతి విపత్తుల్లో కూడా మన సైనికులు ఆ దేశానికి సహకరిస్తున్నారు. కానీ, తన దేశంలో మన సైనికుల ఉనికిని మొయిజ్జు అంగీకరించలేదు. చివరకు ఆ తొంభై మంది 'సైనికుల' స్థానంలోకి మన 'సాంకేతికనిపుణులు' వెళ్ళడంతో సమస్య పరిష్కారమైపోయింది. ఈ సైనికుల ఉపసంహరణతో పాటు, లక్షద్వీప్ వ్యవహారం కూడా రెండు దేశాల మధ్యా అగాధాన్ని పెంచింది. ప్రధాని మోదీ లక్షద్వీప్ వెళ్ళి, పర్యాటక స్థలంగా అది అద్భుతమైనదంటూ కొన్ని చిత్రాలను ప్రచారంలోకి పెట్టడం, బీజేపీ అభిమానులు, నాయకులు కొందరు దానిని అందిపుచ్చుకొని మాల్దీవులను పర్యాటకంలో దెబ్బతీయాలంటూ వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. ఇందుకు ప్రతిగా ఆ దేశంనుంచి హద్దులు దాటి మాట్లాడిన కొందరు మంత్రులను మొయిజ్జు వెంటనే తొలగించారు. ఆయనను అభిశంసించడానికి అక్కడి విపక్షాలు చేసిన ప్రయత్నాలు సైతం ఫలించలేదు.

ఇంతటి తీవ్ర పరిణామాల నేపథ్యంలో ఇప్పుడు బంధాలు తిరిగి అతుక్కోవడం కచ్చితంగా సంతోషించాల్సిన విషయమే. జయశంకర్ తన పర్యటనలో మాల్దీవుల్లో భారతదేశం ఇప్పటికే నిర్వహిస్తున్న ప్రాజెక్టుల స్థితిగతులను సమీక్షించారు, 28దీవులకు మంచినీరు సరఫరా చేసే మరో వెయ్యికోట్ల రూపాయల ప్రాజెక్టులను ఆరంభించారు. ఇందుకు మొయిజ్జు కృతజ్ఞతలు తెలియచేశారు, రెండుదేశాల మధ్యా సహకారం హెచ్చుతోందన్నారు. ఇటీవల తనదేశ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంలోనూ ఆయన భారతదేశం మాల్దీవులను రుణాల చెల్లింపుల భారంనుంచి కాపాడిందనీ, మాల్దీవుల ఆర్థికస్వావలంబనను పరిరక్షించిందనీ ప్రశంసలు కురిపించారు. భారత్‌తో స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం కుదర్చుకుంటానని కూడా ప్రకటించారు. మాల్దీవులకు ప్రకటించిన రుణాలు, ప్రాజెక్టులు ఇత్యాది అంశాల్లో భారతదేశం ఏ మాత్రం తన వైఖరిని మార్చుకోకుండా నిజానికి మరిన్ని అధిక కేటాయింపులతో గత కొద్దినెలలుగా వ్యవహరిస్తూ వచ్చింది. మొయిజ్జు వైఖరితో నిమిత్తం లేకుండా అక్కడి ప్రజల మనసులు గెలుచుకోవడానికి ఇది ఉపకరిస్తుంది. భారతదేశాన్ని దూరం చేసుకుంటే తమ పర్యాటకరంగం తీవ్రంగా నష్టపోతుందని ఆ దేశానికి తెలిసి వచ్చింది. తీవ్ర ఆర్థికసంక్షోభంలో ఉన్న మాల్దీవులకు ప్రకృతి విపత్తులతో పాటు అన్ని ఆపదల్లోనూ భారత్‌మీదే ఆధారపడాలని తెలియనిదేమీ కాదు.

నాకిది.. నీకది మన రక్తంలోనే ఉందా?

రాజకీయ నాయకత్వం, వ్యాపారవర్గం, ఉద్యోగస్వామ్యం (బ్యురాక్రసి), ఆశ్రిత పక్షపాతం... వీటి లోతుల్లోకి వెళ్లకుండా మన ఆర్థిక వ్యవస్థను అర్థం చేసుకోవటం కష్టం. ఆశ్రిత పక్షపాతం ఒక్కో దేశంలో ఒక్కో మోతాదులో ఉండొచ్చు. అసలెక్కడా లేకపోవటం అనేది చాలా అరుదు. మన దేశంలో దాని మోతాదు మించిపోయి ఎన్నో విపరిణామాలకు దారితీస్తోంది. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) చైర్‌పర్సన్ మాధవి బుచ్‌పై ప్రముఖ పెట్టుబడుల వ్యవహారాల పరిశోధనా సంస్థ హిండెన్‌బర్గ్ ఇటీవల చేసిన ఆరోపణలతో వ్యాపార రంగం, ప్రభుత్వాల మధ్య నెలకొన్న ఆశ్రిత పక్షపాత ధోరణులపై మళ్లీ చర్చ మొదలైంది. వీటి వల్ల కొందరు వ్యాపారవేత్తలకు అనుచిత లాభాలు కలగటం నిజం. ఇందుకోసం పెద్దగా శోధించాల్సిన అవసరం లేదు. దాదాపుగా అన్ని రంగాల్లో పక్షపాతాన్ని చూడటం సగటు భారతీయుడికి నిత్యానుభవమే. కులం, మతం, ప్రాంతం, బంధుత్వాల ఆధారంగా పక్షపాత ప్రదర్శనను గమనించని వ్యక్తిని కనిపెట్టటం మన సమాజంలో కష్టసాధ్యమైన పనిగా భావించొచ్చు! వ్యక్తి గుణగణాల కంటే కుల, మత, ప్రాంత, వర్గ అభిమానాలకు ప్రాధాన్యం ఇవ్వటమనేది అనేక కారణాల వల్ల మనలో పాతుకుపోయింది. అవునన్నా కాదన్నా మనం గొప్పగా భావించే హిందూ సామాజిక వ్యవస్థలోనే దీనికి పునాదులు ఉన్నాయి. కులాల ఒడిలో పెరిగి, బలపడి, చైతన్యాన్ని పొందిన సగటు మనిషి ఆలోచన నిరంతరం 'మనవాళ్లను' గుర్తించటం వైపు మొగ్గుతూనే ఉంటుంది. ఆ 'మనవాళ్ల'తో తాదాత్మ్యం కోసం తహతహలాడుతూనే ఉంటుంది. చిన్నాచితకా ప్రయోజనాల కోసం ప్రదర్శితమయ్యే ఈ తరహా కుల, తెగ పక్షపాతప్రీతితో జరిగే నష్టాలకు ఒక పరిమితి ఉంటుంది. కానీ సమాజ వనరులు, ప్రభుత్వాలపై ఆధిపత్యం చలాయించే వర్గాలు ప్రదర్శించే పక్షపాతంతో కలిగే విపరిణామాలు అసాధారణంగా ఉంటాయి. ఆర్థిక వ్యవస్థనూ, సంపద పంపిణీని ఎన్నో విధాలుగా అవి ప్రభావితం చేస్తాయి. అందుకే వ్యాపార, రాజకీయ, ఉన్నత ఉద్యోగ వర్గాల మధ్య జరిగే నాకిది.. నీకది (క్విడ్‌ప్రొక్వో) వ్యవహారాల గురించి చాలా విశ్లేషణలు వస్తున్నాయి. దానికి తోడు ఆర్థిక విధానాల రూపకల్పనలో పెరిగిపోతున్న వ్యాపార వర్గాల పాత్రపై లోతైన పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. అలాగే రాజకీయాల్లో వేగంగా పెరుగుతున్న ఆ వర్గాల ప్రమేయంపైనా చాలా అధ్యయనాలూ సాగుతున్నాయి. టొరంటొ విశ్వవిద్యాలయం, క్లైమాంట్ మకెన కళాశాలలో రాజకీయాలను బోధించే కాంత మురళి, అసీమా సిన్హాలు ఈ రెండు అంశాలపై ఇటీవల చాలా విషయాలను వెలుగులోకి తెచ్చారు.

ప్రభుత్వం–వ్యాపార వర్గం మధ్య నెలకొన్న అనుచిత సంబంధాలను అర్థం చేసుకోటానికి మనం 1950ల నుంచి పరిశీలన మొదలుపెట్టాలి. 1980ల వరకూ పరిశ్రమ–వ్యాపారానికి సంబంధించి ప్రభుత్వ జోక్యం విపరీతంగా ఉండేది. ప్రైవేటు రంగంపై లెక్కలేనన్ని నియంత్రణలు కొనసాగేవి. నచ్చిన రంగంలో పెట్టుబడులు పెట్టే స్వేచ్ఛ ఉండేది కాదు. ఒక వేళ అనుమతి ఇచ్చినా ఎంత ఉత్పత్తి చేయాలో ప్రభుత్వమే నిర్దేశించేది. డిమాండును బట్టి ఉత్పత్తి పెంచుకునే వెసులుబాటు లేదు. కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకునే అవకాశమూ దొరికేది కాదు. అన్నిటికి ప్రభుత్వ అనుమతులు తీసుకోవాల్సిందే. దీన్నే లైసెన్స్–పర్మిట్–కోటా రాజ్‌గా ఈసడించుకునేవారు. కావాల్సిన యంత్రాలనూ, వస్తువులనూ స్వయంగా ఉత్పత్తి చేసుకోవాలనే ఆలోచనలతో ఆ తరహా ఆర్థిక విధానాలకు రూపకల్పన చేశారు. వలసపాలన కింద నలిగిపోయిన అనుభవంతో సొంతకాళ్లపై నిలబడాలన్న అప్పటి సంకల్పాన్ని తప్పుపట్టలేం. సంకల్పం ఎలా



పోటీతో కూడిన వ్యాపారాభివృద్ధి కోసం ప్రభుత్వ ఆర్థిక విధానాలను పారదర్శకంగా ప్రభావితం చేయటం ఒక పద్ధతి. దీనికి భిన్నంగా రాజకీయ పార్టీలకు గోప్యంగా భారీగా నిధులు సమకూర్చటం, వ్యాపారవర్గానికి చెందిన వారే నేరుగా చట్టసభల్లోకి అడుగుపెట్టటం ఎన్నో వైపరీత్యాలకు దారితీస్తోంది. 17వ లోక్‌సభ (2019–2024)లో 154 మంది వ్యాపార నేపథ్యం నుంచే వచ్చారు. అంటే 28.4 శాతం మంది అన్నమాట! 1991–96 నాటి పరిస్థితితో (14.2శాతం) పోల్చితే ప్రాతినిధ్యం 100 శాతం పెరిగింది. ఈ ప్రాతినిధ్యం ఇలా పెరుగుతూ పోతే రూపంలో మాత్రమే ప్రజాస్వామ్యం మిగిలి సారంలో ధనస్వామ్యం అధికారం చలాయిస్తుంది! దాని ఛాయలు ఇప్పటికే స్పష్టంగా కనపడుతున్నాయి!

ఉన్నా ఫలితాలు మాత్రం అనుకున్న విధంగా రాలేదు. అనేక పరిశ్రమల స్థాపనలో ప్రభుత్వానికే పెద్దపీట వేశారు. కొన్ని రంగాల్లో ప్రైవేటు రంగానికి కనీస ప్రవేశం కూడా ఇవ్వలేదు. విదేశాల సాయంతో కొన్ని పరిశ్రమలు, సంస్థలను ఏర్పాటుచేసినా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అవకాశం ఉండేది కాదు.



■ రాహుల్ కుమార్

ప్రైవేటు రంగం చొరవను కట్టడి చేయటం వల్లే 1950–80ల మధ్య ఆర్థికప్రగతి అంతంత మాత్రంగా ఉందని చెప్పటానికి బోలెడు అధ్యయనాలు ఉన్నాయి. ఆగ్నేయాసియా దేశాలతో పోల్చితే భారత్ మందగమనానికి దీన్నే ప్రధాన కారణంగా చెప్పేవారు. ఆ కాలంలో మన ఆర్థిక వృద్ధి సగటున మూడు శాతానికి అటు ఇటుగా ఉండేది. ఇక్కడో విషయాన్ని స్పష్టంగా చెప్పుకోవాలి. అదుపులేని లాభాపేక్ష చరిత్రలో చాలా అనర్థాలకు కారణమైంది. అయితే అది నాణేనికి ఒకవైపు చిత్రమే. లాభాలను గరిష్ఠంగా పొందే లక్ష్యంలో భాగంగా ఎన్నో కొత్త ఆవిష్కరణలూ జరిగాయి. కొత్త సాంకేతికతలూ అందుబాటులోకి వచ్చాయి. కాలక్రమేణా జనజీవితాన్నీ మెరుగుపరచాయి. నాణేనికది రెండో చిత్రం! జనహిత దృష్టితో కొన్ని సాంకేతిక ఆవిష్కరణలూ వచ్చాయి. కానీ వాటి సంఖ్య పరిమితం. సోషలిస్టు విప్లవాలకు నెలవైన రష్యా, చైనాల్లో ఒక దశ దాటిన తర్వాత అవి కనీస స్థాయికి పడిపోయాయి. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పాశ్చాత్య దేశాల పరుగును రష్యా, చైనాలు అందుకోలేకపోయాయి. ప్రయోగశీలతకు ప్రాణమైన చొరవ, స్వేచ్ఛలు కనుమరుగయ్యాయి. దీన్ని దృష్టిలో ఉంచుకునే కొత్త ఆవిష్కరణలకూ సాంకేతిక అభివృద్ధికీ నిత్యం దోహదం చేసే క్యాపిటలిజానికి ప్రత్యామ్నాయం లేదనే వాదనలు 1990ల తర్వాత బాగా ఎక్కువయ్యాయి.

ఇందిరాగాంధీ తొలిసారి ప్రధానిగా ఉన్న కాలంలో (1967–77) ప్రైవేటురంగంపై ఆంక్షలను మరింతగా పెంచారు. బ్యాంకులను జాతీయం చేశారు. వ్యాపార గుత్తాధిపత్యాన్ని నియంత్రిస్తూ చట్టం తెచ్చారు. గరీబీహటావో లాంటి జనాకర్షణ మంత్రాలను పఠించారు. సోషలిజంవైపు మొగ్గుతున్నట్టుగా ప్రవర్తించారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ మొత్తాన్ని తన చుట్టూ తిప్పుకొని విపరీత కేంద్రీకరణతో అంతా ఢిల్లీవైపు చూసే విధంగా రాజకీయాలను మార్చివేశారు. లైసెన్స్–పర్మిట్–కోటా రాజ్‌తో ప్రతి కీలక అనుమతికి సూట్‌కేసులతో డబ్బులు పెట్టుకుని ఢిల్లీ చుట్టూ చక్కర్లుకొట్టే సంస్కృతి పెరిగేటట్లు చేశారు. బడా లావాదేవీల విషయంలో అలా ఆనాడు క్విడ్‌ప్రొక్వో దేశంలో బలంగా వేళ్లానుకుంది. అయినా విధానాలను పూర్తిగా ప్రభావితం చేసే స్థాయికి వ్యాపారవర్గం చేరుకోలేదు. ఉన్న విధానాల పరిధిలోనే క్విడ్‌ప్రొక్వోతో కొన్ని వర్గాలు బాగానే బలపడ్డాయి. బయటి కంపెనీలతో పోటీపడే పరిస్థితి లేదు. రాజకీయ పరపతిగల వ్యాపారులు తాము నిలదొక్కుకున్న రంగంలోకి ఇతరుల నుంచి పోటీ రాకుండా చేసుకోగలిగారు. అంటే క్విడ్‌ప్రొక్వో వల్ల ప్రైవేటు చొరవను కట్టడి చేశారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానానికి అడ్డుకట్టను వేయగలిగారు! మరోవైపు పరిమిత పోటీతో లాభాలకూ ఇబ్బంది ఉండేది కాదు.

ఆశించిన స్థాయిలో జరగని అభివృద్ధి, అంతంతమాత్రంగా ప్రభుత్వరంగ సంస్థల తీరు, విపరీతంగా పెరిగిన జనాభా, నిరుద్యోగ సమస్య, అన్ని స్థాయిల్లో విస్తరించిన అవినీతితో 1970ల నాటికి పరిస్థితి విషమించింది. అసంతృప్తులు, ఆందోళనలు చుట్టుముట్టటంతో అధికారాన్ని కాపాడుకోటానికి ఇందిరాగాంధీ ఎమర్జన్సీని విధించారు. చివరికి 1977 ఎన్నికల్లో ఘోరంగా ఓటమి పాలయ్యారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన (1980) తర్వాత ప్రైవేటు రంగానికి సడలింపులు ఇవ్వటం మొదలుపెట్టారు. కొంత మెరుగుదల కనిపించినా 1990 నాటికి విదేశీద్రవ్య నిల్వలు అడుగంటాయి. మొదటి గల్ఫ్ యుద్ధం, సోవియట్ రష్యా పతనం, మండల్ కమిషన్ సిఫార్సులు– వాటికి పోటీగా బీజేపీ చేపట్టిన రామాలయ రాజకీయాలు, రాజీవ్‌గాంధీ హత్య తదితర పరిణామాలతో కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన పరిస్థితులు తలెత్తాయి. దీంతో 1991లో పెద్ద ఎత్తున ఆర్థిక సంస్కరణలకు పూనుకొన్నారు. వీటితో పెట్టుబడిదారులకు కావాల్సినంత స్వేచ్ఛ వచ్చింది. లైసెన్స్–పర్మిట్–కోటారాజ్ నాటి ఆంక్షలు తొలగిపోయాయి. విదేశీ పెట్టుబడులకు తలుపులు తెరచుకున్నాయి. వృద్ధిరేటు బాగా పెరిగింది. చాలా సౌకర్యాలు, వస్తువులు అందుబాటులోకి వచ్చాయి. మరో వంక వ్యాపారవర్గ జోక్యమూ విధానాల్లో ఎక్కువైపోయింది. స్వదేశీ–విదేశీ పెట్టుబడులను ఆకర్షించటానికి రాష్ట్రాల మధ్య పోటీ పెరిగింది. అధికార కమిటీల్లో వ్యాపారవర్గానికి చోటు లభించింది. విధానాల వల్ల లబ్ధి పొందే పరిస్థితి నుంచి విధానాల రూపకల్పనలో ప్రధాన పాత్ర పోషించే స్థాయికి వ్యాపారవర్గం ఎదగటాన్ని మన ఆర్థిక చరిత్రలో కీలక పరిణామంగా కాంత మురళి వర్ణించారు. ఇదంతా పైకి చాలా ప్రగతిశీలకంగానే కనిపిస్తుంది. క్విడ్‌ప్రొక్వో దగ్గరకు వచ్చేసరికి అసలు సంగతులు బయటపడతాయి. పారదర్శక విధానాలు అమలై అది పూర్తిగా అంతరిస్తే బొగ్గు, స్పెక్ట్రమ్, స్టాక్‌మార్కెట్ కుంభకోణాల ఆరోపణలు తలెత్తేవి కావు. అలాగే భూములు, గనుల కేటాయింపులో, భారీ ప్రాజెక్టుల కాంట్రాక్టులను ఇవ్వటంలో, ప్రభుత్వరంగం బ్యాంకులు పెద్ద ఎత్తున మంజూరు చేసే రుణాల్లో ఆశ్రితపక్షపాతాన్ని చూపిస్తున్నారనే విమర్శలూ వచ్చేవి కావు.

పోటీతో కూడిన వ్యాపారాభివృద్ధి కోసం ప్రభుత్వ ఆర్థిక విధానాలను పారదర్శకంగా ప్రభావితం చేయటం ఒక పద్ధతి. ఇది అభివృద్ధి చెందిన దేశాల్లోనూ ఉంది. దీనికి భిన్నంగా రాజకీయ పార్టీలకు గోప్యంగా భారీగా నిధులు సమకూర్చటం, వ్యాపారవర్గానికి చెందినవారే నేరుగా చట్టసభల్లోకి అడుగుపెట్టటం ఎన్నో వైపరీత్యాలకు దారితీస్తోంది. ఎన్నికల్లో భారీగా డబ్బును వెదజల్లే పరిస్థితి ఇందులో ప్రధానమైంది. సామాన్యులకు చట్టసభల్లో చోటులేకుండా పోతోంది. వారి కోసం విధానాల రూపకల్పనా క్షీణించిపోతోంది. అభివృద్ధి ఫలాలను అధికులకు చేర్చే విధానాలు వెనుకంజ పడుతున్నాయి.

చట్టసభలకు వ్యాపారవర్గాలు ఎన్నికవ్వటం ఎలా పెరుగుతుందో చెప్పటానికి అసీమా సిన్హా 2019 లోక్‌ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థుల నేపథ్యాన్ని విశ్లేషించారు. మొత్తం 542 సభ్యుల్లో 154 మంది వ్యాపార నేపథ్యం నుంచే వచ్చారు. అంటే 28.4 శాతం మంది అన్న మాట! 1991–96 నాటి పరిస్థితితో (14.2శాతం) పోల్చితే ప్రాతినిధ్యం 100 శాతం పెరిగింది. ఈ ప్రాతినిధ్యం ఇలా పెరుగుతూ పోతే రూపంలో మాత్రమే ప్రజాస్వామ్యం మిగిలి సారంలో ధనస్వామ్యం అధికారం చలాయిస్తుంది! దాని ఛాయలు ఇప్పటికే స్పష్టంగా కనపడుతున్నాయి! ఆదాయ, సంపద పరమైన అసమానతల్లో భారత్ ప్రపంచ రికార్డును స్థాపించటమే ఇందుకు నిదర్శనం.

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)

వివాహవైభోగం... పేదవాడితో పరిహాసం!

ముంబైలో అత్యంత సంపన్నుల ఇంట వేలాదికోట్ల ఖర్చుతో ఇటీవల జరిగిన వివాహ వేడుకలు అందరినీ అబ్బురపరిచాయి. రాజభోగాన్ని మించిన అట్టహాసాన్ని ప్రదర్శించిన వివాహమది. పత్రికలు ఈ ధనవైభోగాన్ని చిత్రిస్తూ వార్తలను గుప్పించాయి. కొందరు ఈ వివాహ విలాసాన్ని విమర్శించారు. కొన్ని పత్రికలు దానిని వికృతమైన వేడుక (Grotesque) అని వ్యాఖ్యానించాయి. ఒక విధంగా ఈ ప్రదర్శన దేశంలోని పేదవాడిని పరిహసించింది.

ఆ సందర్భంగా ప్రఖ్యాత ఉర్దూ కవి సాహిర్ లుధియాన్వి 'తాజ్‌మహల్' గురించి వ్యాఖ్యానించిన పంక్తులు గుర్తుకొచ్చాయి. "ఏక్ షెహన్షానే అపనే బేగంకె లియే తాజ్‌మల్ బనాకర్ గరీబోంకా మజాక్ ఉడాయా" (ఒక మహారాజు తన భార్యకై తాజ్‌మహల్ నిర్మించి పేదవాళ్లను పరిహసించాడు.)

సాధారణంగా ఈ దేశంలో ఎవరైనా అప్పోసొప్పో చేసి తమ పిల్లల వివాహాలను వేడుకగానే చేయాలనుకుంటారు. సంపన్నుల గురించి చెప్పనక్కరలేదు. నయా సంపన్నులు (న్యూ రిచ్) మరీ ఎగబడి 'వల్గర్'గానే ఇలాంటి వివాహ తతంగాల్ని ప్రదర్శిస్తూ ఉంటారు. ఢిల్లీలో ఇలాంటి అత్యంత ఆడంబరంగా జరిగిన కొన్ని వివాహాలను చూసిన తర్వాత ఆనాటి అమెరికన్ రాయబారి చెస్టర్ బేల్స్ బాహాటంగానే ఇలా వ్యాఖ్యానించాడు. "ఇండియాలోని వివాహాల ఆడంబరాలను, దుబారా ఖర్చులను గమనిస్తే ఆశ్చర్యమేస్తున్నది. మా



అమెరికాలోని కోటీశ్వరులు కూడా ఇంత ఆడంబరంగా, విచ్చలవిడిగా ఖర్చు చేస్తూ పెళ్లిళ్లు చేయరు."

ఈ దేశంలోని మతాలు–కులాల పరంగా జరిగే వివాహ వేడుకల్లో ధనికులు సహజంగానే ఆడంబరంగా, సామాజికంగా తమ ఔన్నత్యాన్ని చాటుకుంటారు. ఈ ఆనవాయితీ క్రమంగా మధ్యతరగతి కుటుంబాలకి కూడా పాకిపోయింది. పెళ్లి అనేది జీవితంలో ఒకసారి చేసుకుంటాం కాబట్టి వీలైనంత ఖర్చుపెట్టి ఆనందిస్తున్నామని సమర్థించుకుంటారు. కొన్ని కుటుంబాల వాళ్లు అప్పులపాలై నానా ఇబ్బందీ పడుతుంటారు.

సామాజికంగా జరిగే వివాహాలన్నీ ఎలాంటి తంతు లేకుండా, నిరాడంబరంగా జరుపుకోవాలనే ఒకనాటి ఆదర్శం కనుమరుగైపోయింది. చివరికి గ్రామీణ స్థాయిలో కూడా అన్ని కులాలవాళ్లు ఆడంబరంగా వివాహాలు చేస్తున్నారు. మన సామాజిక వ్యవస్థలు క్రమంగా వినియోగదారుల అలవాట్లకు లోనై ఇలాంటి ఆడంబరాలను ప్రోత్సహిస్తున్నాయి. బాగా డబ్బున్నవాడే గొప్పవాడు అనే మానసికతను పెంచి పోషిస్తున్నాయి. మరీ ముఖ్యంగా హిందూ సమాజంలో కుల ఆచారాలు–పరంపర పేరిట జనన–మరణాలు, నామకరణాలు–నిశ్చితార్థాలు–వివాహాల కార్యక్రమాలకు విపరీతంగా ఖర్చు పెడుతున్నారు.

ప్రస్తుతం మధ్యతరగతి యువతీ యువకుల్లో కొంత సంపాదన పెరిగి ఆడంబరాలకు ఎగబడుతున్నారు. వివాహానికి ముందు మెహందీ, సంగీత్ వేడుకలతో పాటు ప్రీ వెడ్డింగ్ ఫోటో షూట్ అనే క్రేజ్ విస్తరించింది. ఒకరిని చూసి ఒకరు ఈ క్రేజ్‌తో ఆడంబరంగా పెళ్లిళ్లు చేసుకుంటూ లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు.

'వాడుకో–పారెయ్' అనే వస్తు వినిమయ సంస్కృతికి లోనవుతున్న మన భారతీయ సమాజం, ఈ రోజు ధనిక పెట్టుబడిదారుల అదుపాజ్ఞలలో ఊపిరి పీలుస్తున్నది. పౌరాణిక గాథలు, మతప్రవచనాలు వ్యక్తి స్వార్థాన్ని పెంచుతున్నాయే తప్ప మానవీయ సంబంధాలను పెంచడం లేదు. సాంప్రదాయాలు, తరతరాల మూఢాచారాలను అతి తెలివిగా శబ్దాడంబరంతో సమర్థిస్తున్న ప్రవచనకర్తలను పాదాభివందనాలు చేస్తూ గౌరవిస్తున్నారు.


సామాజికంగా దనస్వామ్యపు వికృత సంస్కృతిని, భూస్వామ్య ఫ్యూడల్ మానసికతను తిరస్కరిస్తే తప్ప మనమంతా ఆశించే కులరహిత–సెక్యులర్ మానవీయ వ్యవస్థ నిర్మాణం కాదు. అలా కాని పక్షంలో నైరాశ్యం మనలను ఇలా ప్రశ్నించవచ్చు. "లోకపు అంగడిలో ఏ విలువా లేని విప్రలంభ గీతం నుంచి నీ పేరు చెరిగిపోయిందా ఇక నీ పాదరేణువు నువ్వే, పురుగు నుంచి కూడా పరారయ్యే పరీక్షిత్తు నువ్వే, సుసంపన్న విపణివీధిలో దివాళాకోరు నువ్వే" (కె. శ్రీనివాస్–'మరొక్కమారు' కాలమ్ నుంచి).

– నిఖిలేశ్వర్

'నటనాధురీణ' సోమేశ్వరరావు

అది 1966వ సంవత్సరం అంతర్రాష్ట్ర నాటకోత్సవాలు ఢిల్లీలో జరుగుతున్నాయి. 'మృచ్ఛకటిక' నాటకం ప్రదర్శించారు. అదేరోజు రాత్రి ఆనాటి రాష్ట్రపతి డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ సమక్షంలో రాష్ట్రపతి భవన్‌లో ఆ నాటకాన్ని ప్రదర్శించే అవకాశం లభించింది. ఆ ప్రదర్శనకు ఆయన ముగ్ధులై గ్రీన్ రూమ్‌కు వచ్చి కళాకారులను అభినందించారు. అయితే– ప్రత్యేకించి చెప్పుకోదగ్గ విశేషమేమిటంటే "శకారా! మీరు బాగా చేసారు" అని పాత్రధారి 'శకార' పాత్రలో ప్రదర్శించిన ఆంగికాభినయాన్ని అనుకరిస్తూ అభినందించారు. డా. రాధాకృష్ణన్‌ని అంతగా ఆకట్టుకొని ప్రత్యేక అభినందనలందుకున్న ఆ 'శకార' పాత్రధారే, 'నవరసనటనాధురీణ' దుగ్గిరాల సోమేశ్వరరావు.

డెబ్భై వసంతాల నాటకానుభవంతో, నటుడుగా, దర్శకుడుగా, రచయితగా, కవిగా బహుముఖ ప్రజ్ఞతో పరిమళాలు వెదజల్లిన దుగ్గిరాల సోమేశ్వరరావు 1932 అక్టోబరు 7వ తేదీన గౌరీపతి శాస్త్రి, సత్యవతి దంపతులకు జన్మించారు. విద్యాభ్యాసం స్వగ్రామం నందమూరు, నిడదవోలు, కాకినాడలో సాగింది. చిననాటి నుండే నాటకాల పట్ల ఆకర్షితులై నందమూరులోను, ఆ చుట్టుప్రక్కల గ్రామాలలోను వేసే పద్య నాటకాలు తరచూ చూస్తుండేవారు. క్రమేపీ తాను కూడా నటించాలనే కోరిక కలిగింది. అప్పట్లో ఆయన శాస్త్రీయంగా నేర్చుకోకపోయినా, శ్రుత పాండిత్యంతో రాగయుక్తంగా, భావయుక్తంగా పద్యాలు పాడేవారు. ఇదే వారి నట జీవితానికి పునాదిరాయి వేసింది. 1947లో పదిహేను సంవత్సరాల ప్రాయంలో 'చింతామణి' నాటకం ద్వారా రంగస్థలంపై అడుగిడారు. చింతామణి తల్లి 'శ్రీహరి' పాత్ర ధరించి ప్రశంసలందుకున్నారు.



1954–57 మధ్యకాలంలో ఉద్యోగరీత్యా విశాఖపట్నంలో ఉన్నప్పుడు ప్రముఖ నటుడు, దర్శకుడు, ప్రయోక్త గణపతి అచ్యుత రామరాజు, ప్రముఖ నాటక రచయిత రాచకొండ విశ్వనాథశాస్త్రి, మహానటుడు చాగంటి సన్యాసిరాజుల పరిచయభాగ్యం సోమేశ్వరరావుకి లభించింది. వారి ఆధ్వర్యంలో నడచిన 'విశాఖ నాటక కళామండలి' నెలవారీ నాటక ప్రదర్శనలలో 'దుగ్గిరాల' ప్రధాన పాత్రలు ధరించే అవకాశం కలిగింది. రాచకొండ విశ్వనాథశాస్త్రి 'తిరస్కృతి'లో చంద్రశేఖర్, 'నిజం'లో రౌడీ సుందరం పాత్రలలో నటుడుగా తన ఉనికిని చాటుకోవడమే గాక, అనేక పరిషత్తులలో బహుమతులతో పాటు, ప్రేక్షకుల ప్రశంసలందుకున్నారు.

1960లో కర్నూలు నుంచి హైదరాబాదుకు బదిలీ అయిన వీరికి... పద్మభూషణ్ ఎ.ఆర్. కృష్ణ, జె.ఎల్. నరసింహారావు, పోతుకూచి సాంబశివరావు, అబ్బూరి రామకృష్ణారావు, గరిమెళ్ల రామ్మూర్తి, డా. చాట్ల శ్రీరాములు తదితర రంగస్థల దిగ్గంతుల సాహచర్యం లభించింది. ఫలితంగా ఎన్నో నాటకాల్లో ప్రధాన భూమికలు పోషించి అగ్రశ్రేణి నటుల జాబితాలో చోటుచేసుకున్నారు.

ప్రతిభావంతుడైన నటుడిగా ముద్ర వేసుకున్న ఆయన దర్శకత్వం వైపు కూడా మొగ్గు చూపి, ఉత్తమ దర్శకుడుగా విరాజిల్లారు. ఇదేమిటి, పుట్ట, వీలునామా, కాకి ఎంగిలి, క్రాస్ రోడ్స్, సాగరమథనం, ఎయిర్ ఇండియా, శ్రీనాథుడు, నిజం, కబీరుదాసు మొదలగు నాటిక, నాటకాలను తన దర్శకత్వ సొగసులతో–సొబగులతో కమనీయంగా ప్రదర్శింపజేసారు. ఏడు దశాబ్దాలు ఉత్తమ నటుడుగా, ఉత్తమ దర్శకుడుగా, నిర్విరామ నాటకరంగ కృషీవలుడుగా పేరెన్నికగన్న సోమేశ్వరరావు అందుకున్న పురస్కారాలు, సత్కారాలు ఎన్నో.

ఉత్తమ నటుడుగా, దర్శకుడుగానే కాక చక్కని కవిగా కూడా లబ్ధప్రతిష్ఠులయ్యారు దుగ్గిరాల. 1998లో తన సతీమణి 'రూపవతి' ఎడబాటుతో వీరి ఎద తల్లడిల్లింది. ఆ ఆవేదనలో, ఆమె జ్ఞాపకాలతో 'స్మృతిపథంలో రూప' అనే పేరుతో 27 ఉత్పలమాలలు రాశారు. 2007లో జరిగిన తన 'అమృతోత్సవం' నుంచి, ప్రతి ఏడాది తన పుట్టినరోజునాడు అక్టోబర్ 7న ఒక నాటిక ప్రదర్శన ఏర్పాటు చేసి, 'దుగ్గిరాల ఆత్మీయ రంగస్థల పురస్కారం' పేరిట ఇద్దరు రంగస్థల ప్రముఖులను నగదు, శాలువ, సన్మానపత్రంతో సత్కరించే సత్సంప్రదాయాన్ని ప్రారంభించారు. భావితరానికి ఆదర్శప్రాయంగా, స్ఫూర్తిదాయకంగా సాహితీ, సాంస్కృతిక జీవితయాత్ర సాగించి తన జీవితానికి ఒక సార్థకతను చేకూర్చుకొని దుగ్గిరాల సోమేశ్వరరావు ఆగస్టు ఐదున కన్ను మూశారు.

– వి.ఎస్. రాఘవాచారి
కళాదీపిక, తిరుపతి

సులభ వ్యాపార విధానాలకు కార్మికులే సమిధలు!

సులభ వ్యాపార విధాన భావనకు పురుడు పోసి, పెంచి పోషించినది ప్రపంచ బ్యాంక్. మొదటగా 2002లో 'వ్యాపారం చేయడం' నివేదిక ద్వారా ఈ విధానాలకు పునాది వేసింది. వ్యాపార ప్రారంభం, నిర్మాణాల అనుమతులూ, విద్యుత్ లభ్యతా, ఋణ పరపతీ, పన్నులూ తదితర వర్తక విధానాలు సులువుగా, ప్రోత్సాహకంగా ఉన్నాయా లేదా అన్నవి సులభ వ్యాపారానికి ముఖ్యం. వివిధ దేశాలు వాటి సులభ వ్యాపార విధానాలకు రూపమిచ్చాయి. ప్రపంచ బ్యాంకు వాటిని బేరీజు వేసి ఒక సులభ వ్యాపార సూచీలోకి కుదించి ఏటా దేశాల శ్రేణిని ప్రకటిస్తూ వచ్చింది.

మెరుగైన సూచీతో పెట్టుబడులకు అనువుగా ఉండేందుకు భారత్ లాంటి దేశాలు పర్యావరణ, భద్రతా చట్టాలను కూడా సులభ వ్యాపార విధానాల పరిధిలోకి తెచ్చాయి. సులభ వ్యాపార విధానాన్ని అమలు చేస్తున్న తెలుగు రాష్ట్రాలలో తరచూ పారిశ్రామిక ప్రమాదాలు జరిగి, ఏటా వందల ప్రాణాలు పోతున్నాయి. వాటిని అరికట్టడానికి నిజాయితీగా జరుగుతున్న ప్రయత్నాలు శూన్యం. ప్రమాదం జరగగానే హడావుడి. అంతే. తరువాత షరా మామూలే.

సులభ వ్యాపార విధానాలని సమర్థవంతంగా అమలుపరుస్తున్న సింగపూర్, జర్మనీ, స్వీడన్ లలో, ప్రతి లక్షమంది కార్మికులకీ పారిశ్రామిక ప్రమాద మరణాలు సగటున ఒకటి కంటే తక్కువ. అవి రమారమి జపాన్‌లో 2, తెలంగాణలో 6 (ఒక పత్రికలో వార్త ఆధారంగా కట్టిన లెక్క). నిజానికి తెలంగాణలో మరణాలు కొన్ని రెట్లు ఉండే అవకాశం వుంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఒ) ప్రపంచ దేశాల పనిలో ప్రమాద గణాంకాలు సేకరించి నివేదికలు విడుదల చేస్తుంది. ఆ నివేదికలలో భారత గణాంకాలు లేవు. భారత్ పనిలో భద్రత విషయంలో 52 అంతర్జాతీయ ఒడంబడికలపై సంతకం చేయలేదు.

పైగా బలహీనమైన, అసమగ్రమైన పర్యావరణ చట్టాలను ఇంకా బలహీనపరచి దానిని సులభ వ్యాపారానికి ప్రోత్సాహకంగా భావిస్తున్నారు. కోవిడ్ కాలంలో రెడ్ కాటగిరీ మందుల పరిశ్రమలనూ, తరువాత ఇథనాల్ ఇంధన పరిశ్రమలనూ పర్యావరణంపై స్వల్ప ప్రభావం చూపే పరిశ్రమల కేటగిరీలోకి మార్చారు. వాటికి పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక సమర్పించి ప్రజాభిప్రాయ సేకరణ చేయవలసిన నిబంధనను తొలగించారు. తెలుగు రాష్ట్రాలలో మార్చిన నిబంధన పరిధిలో వందల సంఖ్యలో మందుల పరిశ్రమలకు అనుమతులిచ్చారు. కంపెనీలు నిర్మాణం చేపట్టినపుడు ప్రజలు తిరగబడ్డారు. గట్టుప్పల్‌లో ప్రజలు ఉద్యమించి వ్యతిరేకించిన కంపెనీ ప్రజాభిప్రాయ సేకరణ జరపలేకపోయింది. అదే పరిశ్రమ నూతన విధానంలో అనుమతి తెచ్చుకుని నిర్మాణం చేయడానికి ఉపక్రమించగానే ప్రజలు మళ్ళీ తిరగబడ్డారు. అలాగే మునుగోడు, తురకల ఖానాపూర్, ఇంకా ఎన్నో గ్రామాలలోనూ అడ్డ తోవలో ఇచ్చిన అనుమతులను ప్రజలు తిరస్కరించారు. ఇథనాల్ పరిశ్రమలకు నీటి వనరులు భారీగా కావాలి. నిజంగా ఎంత నీరు వాడుతున్నారన్న అధ్యయనం లేదు. ఆంధ్రాలోని ఒక ఇథనాల్ కంపెనీ నీటి వనరులు చాలక విస్తరణను తెలంగాణకు మార్చుకుంది. తెలంగాణలో ఒక కంపెనీ అనుమతి కంటే దాదాపు మూడు రెట్లు నీరు వాడినట్లు ప్రజల ఫిర్యాదులతో బయటపడింది.

తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు సింగపూర్‌ని ఆదర్శంగా ప్రకటిస్తుంటాయి. కాని అక్కడి పాలనా ప్రమాణాలను పట్టించుకోవు. అక్కడ పనిలో భద్రత పాటించని బాధ్యులైన వారికి జైలు శిక్షలు వేస్తారు. ఒక రవాణా కంపెనీ డైరెక్టర్ శిక్షణ లేకుండా ఎక్స్‌కవేటర్ వాడి ఒక కార్మికుడి మరణానికి కారణమైనందున అతనికి 5 నెలల 2 వారాల జైలు శిక్ష వేశారు. నవంబర్ 2014లో, హ్యూస్టన్ నగర పరిసరాల్లోని లాపోర్ట్‌లో మిథైల్ మెర్కాప్టాన్ అనే అత్యంత విషపూరితమైన, మండే వాయువును

మన దేశంలో సులభ వ్యాపార సంస్కరణల కోసం నియంత్రణ సంస్థలను దిష్టిబొమ్మలుగా మార్చారు. అవి ప్రజల సొమ్ముతో నడుస్తున్నా ప్రజల కోసం పనిచేయవు. పర్యావరణ, ప్రజారోగ్య, కార్మికుల ఆరోగ్య ప్రాణ రక్షణలకు గాక వ్యాపార ప్రయోజనాలు కాపాడటమే లక్ష్యంగా అవి పని చేస్తాయి. వాటిని అలా మార్చేశారు.



సుమారు 24,000 పౌండ్లు గాలిలోకి విడుదల చేసింది డ్యూపాంట్ సంస్థ. అది నలుగురు కార్మికులను చంపడంతో పాటు, ఇతర డ్యూపాంట్ ఉద్యోగులనూ గాయపరిచింది. ఇంకా చుట్టుపక్కల ప్రాంతాలకూ విస్తరించడంతో మరికొంతమంది ప్రజలు గాయపడ్డారు. డ్యూపాంట్ నేరాన్ని అంగీకరించడంతో మొత్తంగా కోటీ, 90 లక్షల డాలర్ల జరిమానా విధించి దానిలోని 40 లక్షల డాలర్లతో ఆ ప్రాంతాన్ని జరిగిన పర్యావరణ హాని నుండి పునరుద్ధరించాలని కోర్టు ఆదేశించింది. ఆస్ట్రేలియాలో 2023లో పనిలో భద్రతా ఆరోగ్యం చట్టాన్ని కార్మికుల మరణాలను హత్యా నేరంగా పరిగణించి 20 సంవత్సరాల వరకూ జైలు శిక్ష, కోటీ 80 లక్షల డాలర్ల వరకూ జరిమానా విధించేలా సవరించారు.

మన దేశంలో సులభ వ్యాపార సంస్కరణల కోసం నియంత్రణ సంస్థలను దిష్టి బొమ్మలుగా మార్చారు. అవి ప్రజల సొమ్ముతో నడుస్తున్నా ప్రజల కోసం పనిచేయవు. పర్యావరణ, ప్రజారోగ్య, కార్మికుల ఆరోగ్య ప్రాణ రక్షణలకు గాక వ్యాపార ప్రయోజనాలు కాపాడటమే లక్ష్యంగా పని చేస్తాయి. అలా వాటిని మార్చారు. వృత్తిపరమైన సవాళ్ళను ఎదుర్కొని వాటికి పరిష్కారాలు కనుగొనే అవసరం, సంస్కృతీ ఆ సంస్థలలో లేక ఉద్యోగ ధర్మానికి తగ్గ నైపుణ్యం ఎదగడం లేదు. ఉదాహరణకి పర్యావరణ మంత్రిత్వ శాఖా, కాలుష్యనియంత్రణ మండలీ జవాబు దారీ లేని నిపుణుల కమిటీల పేరుతో అనుమతి నిర్ణయాలు తీసుకుంటాయి. ఆ కమిటీలకు స్వతంత్ర ప్రతిపత్తి లేదు. కమిటీలలో నిజమైన నిపుణులూ అరుదు.

ఇక ఫాక్టరీ విభాగాన్ని చూస్తే, ప్రధానంగా ప్రమాదాలు రసాయన కంపెనీలలో జరుగుతున్నా సంబంధిత నైపుణ్యమున్న అధికారులు కరవయ్యారు. ప్రమాద నివారణ చర్యలు కనపడవు. ప్రమాదం జరిగిన తరువాత ప్రజలకు వివరించడం చేయరు. పత్రికలలో ఊహాగానాలు వస్తుంటాయి. సరైన ప్రమాద దర్యాప్తు సామర్థ్యం లేదు. అదే ప్రమాదాలు మళ్ళీ మళ్ళీ జరుగుతున్నాయి. జులై 2020లో విశాఖ సాల్వెంట్స్‌లో జరిగిన ప్రమాదమే సాహితి ఫార్మాలో జూన్ 2023లో జరిగింది. ఏలూరు జిల్లా అక్కిరెడ్డి గూడెంలో జరిగిన పోరస్ లాబ్స్ పేలుడు ప్రమాదంలో పదిమంది చనిపోయారు. దర్యాప్తులో జాతీయ హరిత ట్రిబ్యునల్‌కి తప్పుడు కారణాలు చూపారు. ఆ రియాక్టర్‌లో రసాయన చర్య జరిగేటప్పుడు ఉత్పన్నమయ్యే ఉష్ణాన్ని తొలగించడానికి చల్లబరచే వ్యవస్థ లేదు. అది సరి చేయకుండా అశాస్త్రీయ పద్ధతులలో ఉత్పత్తి కొనసాగిస్తున్నారు. భద్రత పట్ల కంపెనీల అలక్ష్యానికి నియంత్రణ సంస్థల నిర్వహణా లోపాలు తోడై సహేతుక మార్పులు జరగడమే లేదు. అదే తప్పు ఎస్‌బి ఆర్గానిక్స్, చందాపూర్‌లో జరిగింది. చల్లబరిచే వ్యవస్థ లేక ఉష్ణోగ్రత పెరిగి రియాక్టర్ పేలిపోయింది. ఆరుగురు చనిపోయారు. పంతొమ్మిదిమంది గాయపడ్డారు. ఏళ్లుగా ఫాక్టరీ అధికారులూ, కాలుష్య నియంత్రణ అధికారులూ చేసిన తనిఖీలలో ఆ తప్పులు గుర్తించలేదు. పైగా ఆ ప్రాంత ఫాక్టరీ అధికారి కంపెనీలను వెనకేసుకొస్తూ రియాక్టర్ లాటి కీలక పరికరాలపై ఎట్టి పరిస్థితులలోనూ శిక్షణ లేని కార్మికులను కంపెనీలు పెట్టవని పత్రికలకు సెలవిచ్చారు. ఈ ప్రమాదంపై విచారణ చేసిన మాకు ఆ కంపెనీలో జరుగుతున్న ఉత్పత్తిపై కనీస అవగాహన గల ఉద్యోగి కనపడలేదు.

భారత రాజ్యాంగం ప్రకారం జీవించే హక్కు అనేది ప్రాథమిక హక్కు. పొట్టకూటి కోసం ప్రమాదకర రసాయన కంపెనీలలో కార్మికులూ, ఉద్యోగులూ ప్రాణాలు కోల్పోతున్నారు. సులభ వ్యాపార విధానాలు కార్మికుల జీవించే హక్కుని పణంగా పెడుతున్నాయి. దీనికి వ్యతిరేకంగా కార్మిక సంఘాలూ, విద్యావంతులూ ప్రజలలో పర్యావరణ పరిరక్షణ, పనిలో భద్రతకు సంబంధించిన స్పృహని పెంచడానికి కృషి చెయ్యాలి.

● డాక్టర్ కలపాల బాబూరావు





• రక్షగా..

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనను ఖండిస్తూ జీజీహెచ్‌లోని జూనియర్ డాక్టర్లు వినూత్నంగా నిరసన తెలిపారు. సోమవారం రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని జీజీహెచ్‌లో నిరసన చేపట్టిన వారికి రాఖీలు కట్టారు.



• వినూత్నంగా..

నేషనల్ స్పేస్ డే వేడుకలు సోమవారం తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఘనంగా జరిగాయి. పలువురు విద్యార్థులు రూపొందించిన రాకెట్లు వారిలోని సృజనకు దర్పణం పట్టాయి.



• కొత్తగా..

గుణదలలోని ఈఎస్ఐ ఆసుపత్రి నూతన ప్రాంగణం సోమవారం ప్రారంభమైంది. రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రారంభించారు. తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి నూతన ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశీలించారు.

బుడమేరులో బడా అక్రమాలు

నాయకులు, రియల్టర్ల ధనదాహానికి బుడమేరు బలైపోతోంది. గతంలో చినుకుపడితే బెజవాడ నగరంపైకి ఉరకలెత్తి బెంబేలెత్తించిన బుడమేరు నేడు కబ్జాదారుల ధాటికి భయంతో కుచించుకుపోతోంది. ఈ కబ్జాపర్వాన్ని అరికట్టకపోతే చిన్నపాటి చినుకుకే బెజవాడ ముంపుబారిన పడి అల్లాడే పరిస్థితి ఎదురవుతుందని నీటిపారుదల నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా రూ.60 కోట్ల విలువైన సుమారు 2 ఎకరాల బుడమేరు కబ్జాదారుల చేతిలో చిక్కి, విక్రయానికి సిద్ధమవుతోంది.

నానాటికీ బుడమేరును మింగేస్తున్న కబ్జారాయుళ్లు

- తాజాగా ప్రధాన రహదారి వెంబడి కాల్వపై కన్ను
- రాత్రివేళ చెట్లు నరికి, మట్టి, రాళ్లు పోసి పూడ్చివేత
- రెండు ఎకరాల మేర ఆక్రమించేందుకు ప్రయత్నాలు
- విలువ రూ.60 కోట్ల పైనే..!



బుడమేరును మూసేస్తూ సాగుతున్న ఆక్రమణ

(విజయవాడ-ఆంధ్రజ్యోతి/పాయకాపురం) : అయోధ్యనగర్ నుంచి అజిత్‌సింగ్‌నగర్‌కు వెళ్లే మార్గంలో నూజివీడు ప్రధాన రహదారి వెంబడి ఉన్న బుడమేరును మింగేసేందుకు ఆక్రమణదారులు బరితెగించారు. పొట్టకూటి కోసం చిన్న బడ్డీకొట్టు పెట్టుకుంటున్నట్టుగా పైకి చూపిస్తూ ఆ వెనుక బుడమేరును అంచెలంచెలుగా మింగేస్తున్నారు. నిన్న మొన్నటి వరకూ బుడమేరు వెంబడి సాగిన ఆక్రమణలు.. ఇప్పుడు ఏకంగా బుడమేరులోనే జరిగిపోతున్నాయి. బుడమేటి ప్రవాహంలో మట్టిని, చెత్తను పోసి కబ్జా చేసేస్తున్నారు. అటు అయోధ్యనగర్ నుంచి న్యూరాజరాజేశ్వరిపేట వెళ్లే మార్గంతో పాటు, ఇటు బుడమేరు వంతెన వైపునకు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఉన్న బుడమేరులో సుమారు రెండు ఎకరాలకు పైగా కబ్జా చేసేందుకు ఆక్రమణదారులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ రోడ్ల వెంబడి ఉన్న బడ్డీకొట్లు, పూల నర్సరీల వెనుక నుంచి రాత్రివేళల్లో రాళ్లు, మట్టి, చెత్తను పోసి బుడమేరును పూడ్చేస్తున్నారు. న్యూరాజరాజేశ్వరీపేట మీదుగా దేవీనగర్ మధ్యకట్ట వైపునకు ప్రవహించే బుడమేరు కాల్వ అయోధ్యనగర్‌లో రాఘవేంద్ర థియేటర్ వద్దకు వచ్చేసరికి నూజివీడు ప్రధాన రహదారి వరకూ విస్తరించి ఉంటుంది. ఈ రోడ్డు వెంబడి కొంతమంది చిరు వ్యాపారులు ఆదివారం పూట చేపలు, రొయ్యలు అమ్ముకుంటారు. దీనిని అదునుగా చేసుకుని కొంతమంది ఆక్రమణదారులు గతంలో ఇక్కడ చిన్నచిన్న బడ్డీకొట్లను ఏర్పాటుచేసి క్రమేపీ బుడమేరును పూడ్చేసి రేకుల షెడ్లను ఏర్పాటు చేసేసుకున్నారు. అంతటితో ఆగని కొంతమంది ఆక్రమణదారులు ఏకంగా బుడమేరు నైసర్గిక స్వరూపాన్నే మార్చేసి కబ్జా చేసేందుకు సిద్ధమయ్యారు. ప్రవహిస్తున్న బుడమేరును రాఘవేంద్ర థియేటర్ వైపునకు రాకుండా చెత్తాచెదారాలతో నింపేసి ఆక్రమించుకునేందుకు ప్రణాళికలు రూపొందించారు.

కబ్జా విలువ రూ.60 కోట్లు

అయోధ్యనగర్ నుంచి బుడమేరు వంతెన వైపునకు ఉన్న రహదారి వెంబడి గజం విలువ రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకూ ఉంది. ఎకరా రూ.30 కోట్లపైమాటే. ఇప్పుడు ఆక్రమణదారులు కబ్జా చేసేందుకు యత్నిస్తున్న బుడమేరు ప్రాంతం సుమారు రెండు ఎకరాల వరకూ ఉంటుంది. అంటే దీని విలువ రూ.60 కోట్లు పైచిలుకే.

ఇరిగేషన్ శాఖ ఏ'మాయే'?

గత వైసీపీ ప్రభుత్వంలో బుడమేరు ఆక్రమణకు ఇరిగేషన్ విభాగంలోని కొంతమంది అధికారులు సహకరించారనే ఆరోపణలు ఉన్నాయి. వీరి అండతోనే ఇప్పుడు ఆక్రమణదారులు ప్రధాన రహదారి వెంబడి బుడమేరును మింగేసేందుకు బరితెగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిత్యం వేలసంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారి వెంబడి బుడమేరు ఇంతగా ఆక్రమణకు గురవుతున్నా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడమేంటనే సందేహాలు వస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు స్పందించి బుడమేరులో ఆక్రమణలను నివారించి, బుడమేరు రక్షణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



చెట్లు నరికి, రాళ్లు పోసి ఆక్రమణ



బుడమేరులో అక్రమార్కులు ఏర్పాటుచేసిన పాయ

అధికారులు దృష్టిపెట్టాలి

మైలవరంలో ప్రారంభమయ్యే బుడమేరు 37 కిలోమీటర్ల మేర ప్రవహించి వెంట్రప్రగడ వద్ద కొల్లేరు సరస్సులో కలుస్తుంది. నగరంలో సుమారు 11 కిలోమీటర్ల మేర ఈ కాల్వ వెళ్తోంది. ఈ కాల్వను 'సారో ఆఫ్ విజయవాడ' అని పిలుస్తారు. ప్రస్తుతం ఈ కాల్వ కబ్జాలకు గురవుతోంది. ఎక్కడికక్కడ పక్కా నిర్మాణాలు చేస్తుండటంతో మున్ముందు నగరానికి ముంపు ముప్పు పొంచి ఉందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణం ఈ కబ్జాకాండపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

జిల్లాలో టీచర్ల సర్దుబాటు ప్రక్రియ దాదాపు నిలిచిపోయింది. ఈ విషయంపై విద్యాశాఖ ఉన్నతాధికారులు రోజుకో రకంగా ఉత్తర్వులు జారీ చేయడంతో తప్పులతడకగా ఉన్న జాబితాల ఆధారంగా తాము కౌన్సెలింగ్‌లో పాల్గొనబోమని టీచర్లు భీష్మించారు. ఉపాధ్యాయ సంఘాల నాయకుల సూచనతో కౌన్సెలింగ్‌కు హాజరుకావడం లేదని లేఖలు ఇచ్చి పక్కకు తప్పుకొన్నారు. దీంతో జిల్లాలో సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్‌జీటీ) సర్దుబాటు కౌన్సెలింగ్ నిలిచిపోగా, కొద్దిమంది స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించిన కౌన్సెలింగ్‌ను మాత్రం సోమవారం మమ.. అనిపించారు.

సర్దుబాటుకు బ్రేక్



కౌన్సెలింగ్‌ను బహిష్కరించిన ఉపాధ్యాయులు

- విద్యాశాఖ ఉత్తర్వుల్లో గందరగోళమే కారణం
- కౌన్సెలింగ్‌కు వచ్చేది లేదని భీష్మించిన టీచర్లు
- నిబంధనల మేరకే చేయాలన్న డీఈవో
- జిల్లాలో మిగులుగా ఉన్నవారు 654 మంది
- 545 మందిని సర్దుబాటు చేసే అవకాశం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో టీచర్ల సర్దుబాటు ప్రక్రియకు సంబంధించి ఇటీవల ఉపాధ్యాయ సంఘాల నాయకులతో విద్యాశాఖ ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. ఆ సమయంలో టీచర్ల పుట్టిన తేదీని ప్రామాణికంగా తీసుకుని సర్దుబాటు చేసేందుకు అంగీకరించారు. కాగా, ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో సర్దుబాటు విధివిధానాలతో కూడిన ఉత్తర్వులను విడుదల చేశారు. అలాగే, సోమవారం ఉదయం 10 గంటలకు విడుదల చేసిన ఉత్తర్వుల్లో డీఎస్సీ ర్యాంకును బట్టి సర్దుబాటు చేస్తామని స్పష్టం చేశారు. దీంతో ఈ వ్యవహారంలో గందరగోళం ఏర్పడింది. పుట్టిన తేదీని బట్టి సీనియారిటీని గుర్తించాలని టీచర్లు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎంఈవోలు, డీవైఈవోలతో చర్చలు జరిపారు. కానీ, విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాలను పూర్తిగా చదివి, అందుకు అనుగుణంగానే టీచర్ల సర్దుబాటు ప్రక్రియను చేపట్టాలని డీఈవో తాహెరాసుల్తానా ఎంఈవోలు, డీవైఈవోలకు టెలీకాన్ఫరెన్స్ ద్వారా సూచించారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులతో వాగ్వాదాలకు దిగకుండా నిబంధనల ప్రకారమే చేయాలన్నారు. ఇదిలా ఉండగానే, సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు సర్దుబాటు ప్రక్రియ ప్రారంభమవుతుందని, అది కూడా ఆన్‌లైన్‌లో ఉంటుందని, తమ చేతుల్లో ఏమీ లేదని, జాబితాల్లో పేర్లు ఉన్న టీచర్లంతా కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఎంఈవోలు, డీవైఈవోలు తేల్చిచెప్పారు.

నిబంధనలు మార్చాలని లేఖలు ఇచ్చి..

ఇటీవల ప్యాప్టో నాయకులతో విద్యాశాఖ ఉన్నతాధికారులు నిర్వహించిన సమావేశంలో టీచర్ల పుట్టిన తేదీ ఆధారంగా సర్దుబాటు ప్రక్రియను చేపడతామని హామీ ఇచ్చారని, అదే పద్ధతిలో సర్దుబాటు చేయాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. అయితే, ఎంఈవోలు, డీవైఈవోలు ఇందుకు అంగీకరించలేదు. దీంతో ఇతర జిల్లాల్లో ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటున్నారనే అంశంపై జిల్లాకు చెందిన ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆరా తీశారు. శ్రీకాకుళం జిల్లాలో కౌన్సెలింగ్‌ను బహిష్కరించారని తెలుసుకున్నారు. మన జిల్లాలోనూ అదే బాట పట్టారు. కృత్తివెన్ను, మొవ్వ, ఘంటసాల, పామర్రు తదితర మండలాల్లోని టీచర్లు లేఖలు ఇచ్చి కౌన్సెలింగ్ నుంచి వెనక్కి వచ్చేశారు. అలాగే, పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను ఆగస్టు 16 నాటికి పరిగణనలోకి తీసుకుంటామని గతంలో హామీ ఇచ్చారని, సోమవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో మాత్రం ఆగస్టు 9 వరకేనని పేర్కొన్నారని, కౌన్సెలింగ్‌ను బహిష్కరించడానికి ఇది కూడా ఒక కారణమని ఎంఈవోలు, డీవైఈవోలకు ఇచ్చిన లేఖల్లో ఉపాధ్యాయ సంఘాల నాయకులు పేర్కొన్నారు.

జిల్లాలో 654 మంది టీచర్లు మిగులుబాటు

జిల్లాలో వివిధ సబ్జెక్టులకు సంబంధించి స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జీటీలు) కలిపి 654 మంది మిగులుబాటుగా ఉన్నారని పాఠశాల విద్యా కమిషనర్ కార్యాలయం విడుదల చేసిన జాబితాల్లో చూపినట్లు డీఈవో కార్యాలయ అధికారులు తెలిపారు. 654 మంది టీచర్లలో 545 మందిని సర్దుబాటు చేసేందుకు అవకాశం ఉందని, తొలుత మండల స్థాయిలో, అనంతరం డివిజన్ స్థాయిలో చేయాల్సి ఉందన్నారు. మండల స్థాయిలో రెండు రోజుల పాటు, డివిజన్ స్థాయిలో ఒకరోజు ఈ ప్రక్రియ జరుగుతుందని డీఈవో కార్యాలయ అధికారులు చెబుతున్నారు. ఇంకా మిగులుబాటుగా ఉన్న టీచర్లను ఎలా సర్దుతారనే అంశంపై డీఈవో ద్వారా ఆర్జేడీకి వివరాలు పంపుతామని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎస్‌జీటీలకు సంబంధించిన సర్దుబాటు ప్రక్రియ నిలిచిపోగా, ఉన్నత పాఠశాలల్లో ఖాళీలను బట్టి డీవైఈవోలు కొంతమంది స్కూల్ అసిస్టెంట్లను సోమవారం సర్దుబాటు చేశారని, మిగిలిన వారి విషయంపై విద్యాశాఖ ఉన్నతాధికారుల సూచనల మేరకు నడుచుకుంటామని పేర్కొంటున్నారు.

కిడ్నీ వ్యాధితో మరొకరు మృతి

ఒక్కరోజులో రెండో మరణం

- ఎ.కొండూరు తండాలో భయాందోళన



జరబల దుర్గ (ఫైల్)

ఎ.కొండూరు, ఆగస్టు 19 : ఎ.కొండూరు మండలంలోని గిరిజన తండాలో కిడ్నీ వ్యాధి భయాందోళన కలిగిస్తోంది. చైతన్యనగర్ తండాకు చెందిన పగడమ్మ ఆదివారం మృతిచెందగా, చీమలపాడు శివారు పెద్దతండాకు చెందిన జరబల దుర్గ (60) సోమవారం మృతిచెందింది. ఒక్కరోజు వ్యవధిలో రెండు మరణాలు సంభవించడంతో గిరిజనులు భయాందోళన చెందుతున్నారు. దుర్గ కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. సిరం క్రియాటిన్ శాతం పెరగడంతో విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఇటీవల క్రియాటిన్ శాతం పెరగడంతో వైద్యులు డయాలసిస్ చేయించుకోవాలని సూచించారు. భయంతో ఆమె చేయించుకోలేదు. ఒక్కసారిగా వ్యాధి తీవ్రత పెరిగి సోమవారం ఇంటి వద్ద మృతిచెందింది. మృతురాలి బంధువులను సీపీఎం నేతలు ఆనందరావు, వెంకటేశ్వరరావు పరామర్శించి.. ఎక్స్‌గ్రేషియా, మట్టి ఖర్చులకు డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పిడుగుపాటుకు ఇద్దరు మృతి

జిల్లాలో వేర్వేరు చోట్ల ఘటనలు

వీరులపాడు/పెనుగొలను(గంపలగూడెం), ఆగస్టు 19 : జిల్లాలో పిడుగు పడి వేర్వేరు చోట్ల ఇద్దరు మృతిచెందారు. వీరులపాడు మండలం దొడ్డదేవరపాడు గ్రామానికి చెందిన చింతరాల వెంకట రమణ (17) సోమవారం పొలం పనుల నిమిత్తం వరినాట్లు వేయడానికి వెళ్లాడు. వర్షంతో పాటు పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. చేతికందిన కుమారుడు మృతి చెందడంతో ఆ తల్లిదండ్రులు గుండెలవిసేలా ఏడ్చారు. అలాగే, పిడుగుపడి గంపలగూడెం మండలం పెనుగొలను గ్రామానికి చెందిన బొలగాని వెంకటేశ్వరరావు (26) మృతిచెందాడు. కౌలుకు తీసుకున్న పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా, ఆకస్మికంగా వర్షం కురిసింది. దీంతో వెంకటేశ్వరరావు పక్కనే ఉన్న చెట్టు కిందకు వెళ్లి నిలబడ్డాడు. ఉరుములు మెరుపులకు వెంకటేశ్వరరావు నిలబడిన చెట్టుపై పిడుగు పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని టీడీపీ నాయకులు నాగళ్ల మురళి, నంబూరి శ్రీనివాసరావు సందర్శించి నివాళులర్పించారు.

పని దొంగలు

రైల్వే స్క్వాడ్స్ విభాగాల్లో ఇష్టానుసారంగా విధులు

- పనిచేయని సూపర్‌వైజర్లు, సీటీఐ జనరల్
- స్టేషన్ దాటి బయటకు కదిలితే ఒట్టు
- ఎస్ఆర్‌లో పనిష్మెంట్లు ఉన్నవారికే అందలం
- చాలాకాలంగా ఇక్కడే.. సిబ్బందిపై వేధింపులు



రైల్వేలో పనిదొంగలు ఎక్కువయ్యారు. ముఖ్యంగా స్క్వాడ్ సెక్షన్లలో కొందరు ఉద్యోగులు ఇష్టానుసారంగా పనిచేస్తున్నారు. ఏళ్ల తరబడి ఒకేచోట పాతుకుపోవటం వల్ల ఎవరికి తోచినట్టుగా వారు విధులు నిర్వహిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ డివిజన్ పరిధిలో స్క్వాడ్‌లన్నింటికీ ఇన్‌చార్జిగా సీటీఐ జనరల్ ఉంటారు. డివిజన్ పరిధిలో తుని, రాజమండ్రి, భీమవరం, గుడివాడ, విజయవాడ-సీనియర్ డీసీఎం, జనరల్ స్క్వాడ్, స్పోర్ట్స్ స్క్వాడ్, సీటీఐ స్క్వాడ్, తేజస్విని స్క్వాడ్ (మహిళలు), కృష్ణా స్క్వాడ్ (మహిళలు), నెల్లూరు, ఒంగోలు స్క్వాడ్‌లు ఉన్నాయి. నిర్దేశించిన సెక్షన్లలో ఇవి పనిచేస్తుంటాయి. వీటన్నింటికీ ఇన్‌చార్జిగా ఉన్న సీటీఐ జనరల్ రోజూ స్క్వాడ్‌తో కలిసి తనిఖీలు నిర్వహించాలి. కానీ, విజయవాడ స్టేషన్ దాటి ఆయన బయటకు రారు. ఈ సీటీఐ జనరల్ దాదాపు ఎనిమిదేళ్ల నుంచి ఇక్కడే పనిచేస్తున్నారు. క్షేత్రస్థాయిలో తన బాధ్యతలను నిర్వహించటానికి ఇష్టపడని ఈయన్ను ఉన్నతాధికారులు ఎందుకు కొనసాగిస్తున్నారో అర్థంకాని పరిస్థితి.

ఏళ్ల తరబడి పాతుకుపోయి..

సాధారణంగా సీటీఐ జనరల్ ఒకేచోట నాలుగేళ్లకు మించి పనిచేయటానికి వీల్లేదు. కానీ, ఎనిమిదేళ్లుగా సీటీఐ జనరల్ ఒకే స్థానంలో ఎలా పనిచేస్తారన్నదే ప్రశ్న. దీని వెనుక పెద్దల హస్తం ఉందని తెలుస్తోంది. హెడ్డాఫీసులో కొందరు అధికారులు ఈయన్ను కదిలించడానికి ఇష్టపడట్లేదు. తమకు కోరినవన్నీ సమకూర్చుతాడన్న ఉద్దేశంతో అధికారులు కొందరు ఈ సీటీఐ జనరల్‌ను కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈయన పరిధిలో దాదాపు 2 వేల మందికి పైగా టీఐలు ఉంటారు. తనకేమి కావాలో టీఐలకు చెప్పి చేయించుకుంటాడన్న ఆరోపణలు ఉన్నాయి. మాంసం, చేపలు, రొయ్యలు, పీతలు, మందు, విందు.. ఇలా ఏది పడితే అది టీఐలు తమ అధికారికి సమర్పించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే, రైల్వేస్టేషన్ల పరిధిలో అనధికారిక హ్యాకర్లు కార్యకలాపాలు సాగిస్తున్నారు. గుర్తింపు కార్డులు లేనివారు కళ్ల ముందే కనిపిస్తున్నా చర్యలు తీసుకోని పరిస్థితి ఏర్పడింది. కేటరింగ్ ఇన్‌స్పెక్టర్‌ను వెంటబెట్టుకుని స్టాల్స్‌లో తనిఖీలు చేయాల్సి ఉన్నా సక్రమంగా చేయట్లేదు. అలాగే, సదరు సీటీఐ జనరల్ చాలాకాలంగా టీఏలు పెట్టుకోవటం లేదని సమాచారం. తనిఖీల్లో భాగంగా తిరగకపోవడం వల్లే టీఏలు పెట్టుకోవట్లేదని తెలుస్తోంది. డివిజన్ పరిధిలో 2 వేల మంది టీసీలు ఉన్నారు. వీరిలో 15 శాతం మందికి స్క్వాడ్స్ టీముల్లో విధులు కేటాయించాల్సి ఉంటుంది. కానీ, చాలావరకు పాత ముఖాలే కనిపిస్తున్నాయి. కొత్త ముఖాలు తక్కువగా ఉన్నాయి.

సూపర్‌వైజర్ల స్టైలే వేరు..!

స్క్వాడ్స్ సూపర్‌వైజర్ల పరిస్థితి కూడా అంతే. వీరు కూడా చాలాకాలంగా ఒకే స్క్వాడ్స్‌లో పనిచేస్తున్నారు. ఓ మహిళా సూపర్‌వైజర్ చాలాకాలంగా ఒక స్క్వాడ్‌లోనే ఉన్నారు. ఆమె రైల్వే పార్శిల్ కార్యాలయం వద్ద మాత్రమే కూర్చుని కనిపిస్తారు. రైలెక్కరు.. ఎక్కడికీ వెళ్లరు. దాదాపు 20 ఏళ్లుగా సూపర్‌వైజర్‌గా పనిచేస్తుండగా, కిందిస్థాయి సిబ్బందిని విపరీతంగా వేధిస్తుంటారు. ఫిర్యాదులు వచ్చినా ఎలాంటి చర్యలూ ఉండవు. మరో సూపర్‌వైజర్ పరిస్థితి దారుణంగా ఉంటుంది. ఈయన ఎక్కడ పనిచేస్తాడో ఎవరికీ తెలియదు. ఎక్కడికీ కదలకపోయినా టీఏలు మాత్రం రాసుకుంటారు. ఈ ఇద్దరి సర్వీసు రికార్డుల్లో ఎన్నో రాంగ్ రిమార్కులు ఉన్నాయి. మరెన్నో పనిష్మెంట్లు ఉన్నాయి. ఏటీసీడీలు కూడా పెద్దగా రాని వీరు సూపర్‌వైజర్లుగా సుదీర్ఘకాలం ఎలా పనిచేస్తున్నారో, పోస్టింగ్‌లు ఎలా ఇస్తున్నారో అర్థంకాని పరిస్థితి. ఇక రైల్వేస్టేషన్‌లో గేట్ల దగ్గర పనిచేయాల్సిన ఓ సూపర్‌వైజర్ అక్కడ డ్యూటీలు చేయట్లేదు. దీంతో గేట్ల వద్ద తనిఖీలే లేకుండాపోయాయి.



ఫైళ్లు భద్రం

- దగ్ధం చేసినా.. మాయం చేసినా క్రిమినల్ కేసులు
- కార్యాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి
- రాత్రుళ్లు వాచ్‌మెన్‌లను కాపలా పెట్టండి
- అధికారులకు కలెక్టర్ సృజన సూచన

6లో..



ఫైళ్లు భద్రం

నూతన ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్లు దగ్ధం అవుతున్న నేపథ్యంలో ఫైళ్ల భద్రతపై ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. వీటిపై ప్రభుత్వం విచారణకు ఆదేశిస్తున్న నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లాలో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండటానికి సోమవారం కలెక్టర్ సృజన ప్రభుత్వ శాఖల అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్ల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వాటిని దగ్ధం చేసినా, పాడుచేసినా.. ఆయా అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

- దగ్ధం చేసినా.. మాయం చేసినా క్రిమినల్ కేసులు
- ఉద్యోగుల బదిలీల్లో మార్గదర్శకాలు పాటించాలి
- కార్యాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి
- రాత్రుళ్లు వాచ్‌మెన్‌లను కాపలా పెట్టండి
- అధికారులకు ఎన్టీఆర్ జల్లా కలెక్టర్ సృజన సూచన
- ప్రజాసమస్యల పరిష్కార వేదికలో 99 అర్జీలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ సృజన కలెక్టర్ కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమం ముందు జిల్లా ప్రభుత్వ శాఖల అధికారులతో ఫైళ్ల దగ్ధంపై ఆమె మాట్లాడారు. ఇటీవల మదనపల్లి, తిరుపతి, పోలవరం తదితర ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్ల దగ్ధం ఘటనలు దృష్టిలో పెట్టుకుని జిల్లా అధికారులు మరింత అప్రమత్తతతో వ్యవహరించాలని చెప్పారు. కార్యాలయానికి సంబంధించిన ఫైళ్లు దగ్ధం చేయడం, చించడం, కనుమరుగు చేయడం వంటి ఘటనలు జరిగినట్టు తన దృష్టికి వస్తే ఆ శాఖల అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు శాఖా పరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి కార్యాలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రాత్రి గస్తీకి వాచ్‌మెన్‌ను నియమించుకోవాలని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైర్ సేఫ్టీ, విద్యుత్ సరఫరా పరికరాలపై ఆడిటింగ్ నిర్వహించి అధికారుల నుంచి ధ్రువీకరణ పత్రాలు పొందాలన్నారు.

● బదిలీ మార్గదర్శకాలు తప్పక పాటించాలి

ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల గడువు ముగిసే వరకు నిరీక్షించకుండా ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు సమర్పించి ఆమోదం పొందాలని, బదిలీలకు జారీ చేసిన ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని అన్నారు. గ్రీవెన్స్ రీ ఓపెన్‌కు ఆస్కారం లేకుండా అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ సృజన అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రీఓపెన్‌కు ఆస్కారం లేకుండా చిత్తశుద్ధితో సమస్యను పరిష్కరించాలని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కోర్టు కేసులకు సంబంధించి ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేసుకోని చివరి నిమిషం వరకు వేచి చూడకుండా దాఖలు చేసేందుకు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. త్వరలో జిల్లాలో నిర్వహించనున్న రెవెన్యూ సదస్సుల నిర్వహణకు ముందస్తు ప్రణాళికలను రూపొందించుకోవాలని అన్నారు. సదస్సులో నమోదయ్యే ప్రతి అర్జీని రిజిస్టర్ చేసి అప్‌లోడ్ చేయాలని సదస్సులపై క్షేత్రస్థాయి సిబ్బంది పూర్తి అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

● 99 అర్జీల స్వీకరణ



ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా 99 అర్జీలను స్వీకరించగా 39 అర్జీలు స్వయంగానూ, 60 అర్జీలు ఆన్‌లైన్ ద్వారానూ స్వీకరించారు. ఇందులో రెవెన్యూ 42, పోలీసు 14, మున్సిపల్ కార్పొరేషన్ 13, సీఆర్‌డీఏ 4, పంచాయతీరాజ్ 3, కోపరేటివ్ 3, వైద్య ఆరోగ్య శాఖ 2, సర్వే అండ్ సెటిల్‌మెంట్ 2, మార్కెటింగ్ 2 అర్జీలు, విద్యుత్ శాఖ, ఏపీఐఐసీ, ఏపీఎస్ఆర్టీసీ, ఎన్టీఆర్ వైద్య సేవ, పౌరసరఫరాలు, విద్య, ఉన్నత విద్య, దేవదాయ, అగ్నిమాపక, మత్స్య, మహిళా శిశు సంక్షేమం, గనులు, రోడ్లు భవనాలు, గ్రామీణ నీటి సరఫరా శాఖలకు చెందిన ఒక్కొక్క అర్జీనీ స్వీకరించారు.



కరపత్రం చూపుతున్న రైజ్ అండ్ రైజ్ సంస్థ చైర్మన్ ఉదయ్‌భాస్కర్

రైజ్ అండ్ రైజ్ నూతన వెంచర్ ప్రారంభం

అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 19 : రైజ్ అండ్ రైజ్ సంస్థ నూతన వెంచర్‌ను ఆంధ్రప్రభ కాలనీలోని సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సంస్థ చైర్మన్ ఉప్పలపాటి ఉదయ భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై నూతన వెంచర్ బ్రోచర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రైజ్ అండ్ రైజ్ సంస్థ 8 ఏళ్ల అనుభవంతో పది వెంచర్లను దిగ్విజయంగా పూర్తిచేసి శ్రీగంధం, ఖర్జూరం, ఎర్రచందనం తోటలను కస్టమర్లకు అతి తక్కువ ధరలకే అందించి అందరి మన్ననలూ పొందామన్నారు. నూతనంగా ప్రారంభించిన వెంచర్ కొత్తూరు తాడేపల్లిలోని కాపిటల్ స్పెస్ ఫేజ్-2ను నగరానికి 12 కిలోమీటర్ల దూరంలో, ఇన్నర్ రింగ్ రోడ్డుకు 200 మీటర్ల దూరంలో, గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకు కిలోమీటర్ దూరంలో, బస్టాండ్, రైల్వేస్టేషన్లకు 12 కిలోమీటర్ల దూరంలో, వెస్ట్ బైపాస్‌కు 4 కిలోమీటర్లు, జెట్‌సిటీకి 2 కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. అమరావతి రాజధానికి అతి తక్కువ దూరంలో నివాస యోగ్యమైన స్థలాలను అందిస్తున్న నమ్మకమైన సంస్థ రైజ్ అండ్ రైజ్ అని పేర్కొన్నారు. అనంతరం సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎంవి.నాగరాజు మాట్లాడుతూ వెంచర్ ప్రత్యేకతలు తెలిపారు. ఆర్‌డీవో ల్యాండ్ కన్వెన్షన్, 30 అడుగుల బీటీ రోడ్లు, వెంచర్ మొత్తం గ్రావెల్‌తో ఫిల్లింగ్, చుట్టూ సెక్యూరిటీ ఫెన్సింగ్, ప్రధాన ద్వారాలకు గేట్లు, ప్రతి ప్లాట్ కస్టమర్ పేరుతో నేమ్ బోర్డులు, రెండు ఏళ్ల వరకు వాచ్‌మెన్ సెక్యూరిటీ సదుపాయాలు కలవని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు ఎన్.సన్యాసి రావు, పెద్దిరాజు, వీసీ కుమార్, ఎంవివి.కృష్ణారావు, టి.రాజు, ప్రముఖ వ్యాపారస్తులు పాల్గొన్నారు.

అత్యాచార నిందితుడిపై పోక్సో కేసు

తిరువూరు, ఆగస్టు 19 : బాలికపై ఆత్యాచారం చేసిన నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు సీఐ గిరిబాబు సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ కేసుపై సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. విస్సన్నపేట మండలంలోని ఒక గ్రామానికి చెందిన 15 సంవత్సరాల బాలిక తిరువూరులోని ఒక వసతిగృహంలో ఉంటూ ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ఆదే గ్రామానికి చెందిన తోట చందు రెండు నెలలుగా ప్రేమించమంటూ వెంటపడుతున్నాడు. మరో ఇద్దరు మైనర్లు కూడా చందును ప్రేమించమని బాలికపై వత్తిడి తెచ్చారు. ఇటీవల అనారోగ్యానికి గురైన బాలిక ఇంటి నుంచి పట్టణంలోని కాలేజీకి డైలీ సర్వీసు చేస్తోంది. ఈనెల 10వ తేదీన బోసుబొమ్మ సెంటర్‌లో బస్సులో వస్తున్న బాలికను చందు బలవంతంగా కిందకు దింపాడు. బాలికను తన మిత్రులతో బైక్‌పై ఎక్కించుకొని, కూరగాయాల మార్కెట్ సమీపంలోని ఒక భవనంలోకి తీసుకువెళ్లాడు. ఆమెపై నిందితుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. తదుపరి బాలికను ఖమ్మంజిల్లా మర్లపాడు, వేంసూరు రోడ్డులోకి తీసుకువెళ్లాడు. అనంతరం బాలిక స్వగ్రామం సమీపంలోని కాల్వ వద్ద దింపి జరిగిన విషయం ఎవరికైనా చెపితే చంపుతానని బెదిరించాడు. బాధితురాలు తన తల్లికి విషయం చెప్పగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆధునికతతో నూతన పారిశ్రామిక విధానం

- ఏపీ ఐడీపీ రూపకల్పనకు ప్రభుత్వం కసరత్తు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన

కృష్ణలంక, ఆగస్టు 19 : ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వైపుగా పారిశ్రామికరంగం వెళ్లాల్సిన అవసరముందన్న ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానం (2024-29) రూపకల్పనకు కసరత్తు చేస్తోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త పారిశ్రామిక విధానాన్ని రూపొందించనున్న నేపథ్యంలో పరిశ్రమల శాఖ మార్గదర్శకాలను అనుగుణంగా వివిధ పారిశ్రామిక అసోసియేషన్ల నుంచి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించేందుకు కలెక్టర్ సృజన సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పారిశ్రామిక వర్గాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పారిశ్రామిక విధానం (2015-20), పారిశ్రామిక విధానం (2023-27), పరిశ్రమలకు పోత్సాహకాలు, ఎంఎస్ఎంఈలు, పారిశ్రామిక అనుమతులు, భూ కేటాయింపులు, సిక్ యూనిట్లకు మద్దతు, విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతుల కల్పన, పారిశ్రామిక వ్యర్థాల నిర్వహణ తదితరాలపై చర్చించారు. స్థానిక పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి, కళాశాలలతో పారిశ్రామిక యూనిట్ల అనుసంధానం, కొత్త సాంకేతికతలు, పరిశ్రమల కార్యకలాపాలకు అవసరమయ్యే ముడిసరుకు సక్రమ సరఫరా, పారిశ్రామిక క్లస్టర్లు-వసతులు, పారిశ్రామిక ఉత్పత్తుల మార్కెటింగ్, గవర్నమెంట్ ఈ-మార్కెట్ ప్లేస్ (జీఈఎం), ఈ-ప్రొక్యూర్‌మెంట్ తదితర అంశాలు కూడా సమావేశంలో చర్చకు వచ్చాయి. సమావేశంలో పారిశ్రామిక అసోసియేషన్ల ప్రతినిధులు వెలిబుచ్చిన అభిప్రాయాలు, సలహాలు, సూచనలతో నివేదికను ప్రభుత్వానికి పంపనున్నట్టు కలెక్టర్ సృజన తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి ఎ.సుధాకర్, ఫ్యాప్సియా ప్రెసిడెంట్ వి.మురళీకృష్ణ, మహిళా పారిశ్రామికవేత్తల అసోసియేషన్ ప్రతినిధి కనకదుర్గ పాల్గొన్నారు.

రూ.160 కోట్లతో ఉపాధి పనులు

- రూ. 220 కోట్లతో బందరులో ప్రతి ఇంటికీ తాగునీరు
- విలేకరుల సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 19 : కృష్ణాజిల్లాలో రూ.160 కోట్లతో ఎన్ఆర్ఈజీఎస్ పనులకు నిధులు మంజూరయ్యాయని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, అబ్కారీ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. సోమవారం ప్రజాదర్బార్ కార్యక్రమం అనంతరం జరిగిన మీడియా సమావేశంలో కొల్లు రవీంద్ర మాట్లాడారు. గ్రామాల్లో రోడ్లు, డ్రెయిన్లు, శ్మశాన వాటికలు అభివృద్ధి చేసేందుకు ఈ నిధులు వినియోగిస్తారన్నారు. మచిలీపట్నం నియోజకవర్గంలో రూ.33 కోట్లతో ఎన్ఆర్ఈజీఎస్ కింద వివిధ అభివృద్ధి పనులు చేపడతామన్నారు. జల జీవన్ మిషన్ కింద బందరు మండలంలో రూ.220 కోట్లతో ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. మచిలీపట్నం ఈస్ట్ పరిధిలో చిలకలపూడి రైల్వేగేటు నుంచి పెదపట్నం వరకు ఉండే గ్రామాల్లో రూ.105 కోట్లతో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటుకు ప్రత్యేక ప్రతిపాదనలు పంపామన్నారు. అమృత్ ఫేస్ 2 కింద మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలో పెద్దఎత్తున మ్యాచింగ్ ఫండ్స్ మంజూరయ్యేందుకు కృషి చేశామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ శ్రావణమాసం పూర్తయ్యేలాగా గృహ ప్రవేశాలు చేయిస్తామన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలపై ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ సమావేశంలో గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మోటమర్రి బాబాప్రసాద్, గోపు సత్యనారాయణ, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, నగర టీడీపీ అధ్యక్షుడు ఇలియాస్ పాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

● ప్రజా దర్బార్‌కు వినతుల వెల్లువ

మచిలీపట్నం టీడీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి బాధితులు తరలివచ్చారు. పింఛన్లు ఇప్పించాలని దివ్యాంగులను తల్లిదండ్రులు తీసుకొచ్చారు. మండవల్లి మండలం సింగన్నపూడి నుంచి 20 ఏళ్ల దివ్యాంగుడిని తల్లిదండ్రులు వీరాంజనేయులు, అంజలీదేవి తీసుకుని వచ్చారు. తన కుమారుడు నూరుశాతం దివ్యాంగుడని, రూ.15 వేల పింఛను ఇప్పించాలని బాధితులు కోరారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు పలువురు ఇళ్లను స్వాధీనపరచాలని కోరారు. పలువురు నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. రోడ్లు, డ్రెయిన్లు మెరుగుపరచాలని మరికొందరు కోరారు. పెద్ద సంఖ్యలో మచిలీపట్నం నియోజకవర్గ ప్రజలతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు కూడా మంత్రికి తమ గోడు వినిపించుకునేందుకు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్రతో పాటు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, పిప్పళ్ల కాంతారావు, గోపు సత్యనారాయణ, తలారి సోమశేఖర్, కుంచే నాని పాల్గొన్నారు.



పింఛను కోసం మండవల్లి మండలం సింగన్నపూడి నుంచి దివ్యాంగుడు శ్రీరామమూర్తిని తీసుకువచ్చిన తల్లి అంజలీదేవి

కలిసి.. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేద్దాం

- అనంతవరంలో పాలకేంద్ర భవనాన్ని ప్రారంభించిన ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్
- నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలని ఎంపీని కోరిన ఎమ్మెల్యే

మైలవరం రూరల్, ఆగస్టు 19 : మైలవరం నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కలిసి పనిచేద్దామని మైలవరం స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)ని కోరారు. ఎంపీ నిధుల వాటా ప్రకారం ఎలాగూ మంజూరు చేస్తారని, రాజధానికి దగ్గరగా ఉన్న మైలవరానికి ప్రాధాన్యతనిస్తూ కేంద్రం నుంచి అదనంగా నిధులు మంజూరు చేసేలా కృషి చేయాలని కోరారు. మండలంలోని అనంతవరంలో రూ.4.25 లక్షలతో నూతనంగా నిర్మించిన పాలకేంద్ర భవనాన్ని ఎంపీ చిన్ని, ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు సోమవారం ప్రారంభించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులో ఉన్నా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్లు అందజేయడం, రాజధాని అమరావతి నిర్మాణం కోసం చర్యలు మొదలుపెట్టడంతో ప్రభుత్వంపై ప్రజలకు మరింత విశ్వాసం, నమ్మకం పెరిగిందన్నారు. ఇబ్రహీంపట్నం ఫెర్రీ ఘాట్ వద్ద కృష్ణానది హారతి కార్యక్రమం ప్రారంభిస్తామని, గొల్లపూడి దగ్గర వెస్టన్ బైపాస్ పనులు ప్రారంభిస్తామని అన్నారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అమూల్ సంస్థను ఏపీలో ప్రవేశపెట్టి స్థానిక డెయిరీలను దెబ్బతీయాలని గత ప్రభుత్వం చూసిందని, ఆ అప్రజాస్వామిక విధానాలను ప్రజలు తిప్పి కొట్టారని పేర్కొన్నారు.



పాలకేంద్ర భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

● ఎంపీ చిన్నికి ఎమ్మెల్యే వినతి

జి.కొండూరు మండలంలోని సున్నంపాడు, మునగపాడు గ్రామాల మధ్య గత ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి సేకరించిన సుమారు 270 ఎకరాలు భూమి నిరుపయోగంగా పడి ఉందన్నారు. ఈ భూమిని విజయవాడ ప్రాంత వాసుల ఇళ్ల స్థలాల కోసం అప్పట్లో కేటాయించారని కానీ ఒక్క ఇంటి నిర్మాణం కూడా జరగలేదని, జరగబోదని చెప్పారు. ఈ భూమిని తాజాగా పరిశ్రమల కోసం కేటాయిస్తే స్థానిక యువతకు ఉద్యోగాలు లభిస్తాయని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతున్నారు. విజయవాడ ప్రాంతవాసుల ఇళ్ల స్థలాలకు జక్కంపూడి శివారులో 50 ఎకరాలు కొనుగోలు చేసి టిడ్కో ఇళ్లు నిర్మిస్తే ప్రయోజనం కలుగుతుందన్నారు. దీనిపై ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నానని, మంత్రి నారా లోకేశ్‌కు సమస్యపై ఇద్దరం కలిసి వినతిపత్రం ఇద్దామని కోరారు. అనంతరం ఎంపీ చిన్నిని, ఎమ్మెల్యే వసంతను, చైర్మన్ ఆంజనేయులను బొందలపాటి సుధాకర్ దంపతులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డైరెక్టర్ ఈశ్వర్‌బాబు, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, పాలకేంద్రం అధ్యక్షురాలు బొందలపాటి శైలజ, టీడీపీ నాయకులు బొందలపాటి సుధాకర్ పాల్గొన్నారు.



తెల్లతాచుతో స్నేక్ మిత్ర సుధాకర్

ఆరడగుల తెల్లతాచు

జగ్గయ్యపేట - చిల్లకల్లు రోడ్డులోని సంపతి నగర్‌లో కారుపాటి క్రిష్టాఫర్ ఇంటి ఆవరణలో భారీ తెల్లతాచును స్నేక్ మిత్ర సుధాకర్ సోమవారం చాకచక్యంగా పట్టుకున్నారు. ఆరడుగులకుపైగా ఉన్న అరుదైన తెల్లతాచును గమనించిన ఇరుగుపొరుగువారు క్రిష్టాఫర్‌కు తెలియజేయడంతో ఆయన స్నేక్‌మిత్ర సుధాకర్‌ను ఆశ్రయించారు. రెండున్నర గంటల పాటు శ్రమించి, తెల్లతాచును పట్టుకున్నారు. పదేళ్లగా ఈ తరహాలో భారీ విషసర్పాలను పట్టుకుని వాటికి ఎలాంటి హానీ చేయకుండా అడవుల్లో వదిలేస్తున్నాడు.

– జగ్గయ్యపేట

కన్నులపండువగా గిరిప్రదక్షిణ

కిక్కిరిసిన ఇంద్రకీలాద్రి

వన్‌టౌన్, ఆగస్టు 19 : దుర్గామల్లేశ్వర దేవస్థానం ఆధ్వర్యంలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా భక్తిప్రపత్తులతో గిరిప్రదక్షిణ నిర్వహించారు. ప్రతి పౌర్ణమికి దుర్గమ్మవారి గిరి ప్రదక్షిణ కార్యక్రమం జరుగుతుంది. సోమవారం ఘాట్‌రోడ్డు వద్ద అమ్మవారి వాహనానికి ఈవో రామారావు పూజలు నిర్వహించి గుమ్మడికాయను బలిహరణ గావించి, హారతులు సమర్పించి గిరిప్రదక్షిణను ప్రారంభించారు. ఆయన కూడా కొండచుట్టూ ప్రదక్షిణలో పాల్గొన్నారు. తప్పెట వాయిద్యాలు, భక్తుల కోలాహలం, కోలాట, భజన బృందాలు ముందుకు సాగుతుండగా అమ్మవారి గిరిప్రదక్షిణ కొనసాగింది. ఈ గిరిప్రదక్షిణ ఉదయం 5.55 గంటలకు ప్రారంభమై 9.30 గంటలకు ముగిసింది. గిరి ప్రదక్షిణ ఘాట్ రోడ్డు నుంచి ప్రారంభమై కుమ్మరిపాలెం, నాలుగు స్థంభాల సెంటర్, సొరంగం జంక్షన్, కబేలా సెంటర్, సివిఆర్ బ్రిడ్జి, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, మెయిన్ రోడ్డు నుంచి రథం సెంటర్ మీదుగా ఘాట్ రోడ్డు వద్ద ప్రదక్షిణ ముగిసింది.

● దుర్గగుడిలో ధ్యానయజ్ఞం

పౌర్ణమి సందర్భంగా సోమవారం ప్రత్యేకంగా 9 టు 9 (12 గంటలపాటు) అఖండ ధ్యాన యజ్ఞం నిర్వహించారు. ప్రతి పౌర్ణమి నాడు ధ్యాన యజ్ఞం నిర్వహించేందుకు ఈవో రామారావు ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకున్నారు.



గిరిప్రదక్షిణలో కళాకారుల డప్పు విన్యాసాలు

● దుర్గమ్మను దర్శించుకున్న మంత్రి సుభాష్

రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖల మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం కుటుంబసభ్యులతో కలిసి ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఏఈఓ రమేష్ బాబు ఇతర అధికారులు, అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలు అందించారు. అమ్మవారి దర్శనానంతరం అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం అందించారు. సోమవారం కనకదుర్గమ్మవారి దర్శనానికి వచ్చిన సందర్భంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ భక్తులతో పాటే మంత్రి, కుటుంబ సభ్యులు కూర్చొని భోజనం చేశారు.

గడువులోగా అర్జీలను పరిష్కరించండి

మీ కోసం వినతులపై ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ



సమస్య వింటున్న ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ

మచిలీపట్నం : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ అధికారులను ఆదేశించారు. మీకోసం కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన 46 అర్జీలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. సీఎం కార్యాలయం నుంచి వచ్చే అర్జీలను పరిష్కరించడంలో అలసత్వం ప్రదర్శించవద్దని అధికారులకు సూచించారు. మీకోసం కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారంపై పరిశీలించేందుకు జిల్లా, రాష్ట్ర స్థాయిలో నోడల్ అధికారులను నియమించారని, అర్జీల పరిష్కారంపై ప్రతిరోజూ నోడల్ అధికారులు సమీక్ష నిర్వహిస్తున్నారని, జిల్లాస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

పరిశ్రమల స్థాపనకు సలహాలు ఇవ్వండి

రాష్ట్రంలో మెరుగైన పారిశ్రామిక విధానాన్ని ప్రభుత్వం అమలు చేసేందుకు కృతనిశ్చయంతో ఉందని, పరిశ్రమల స్థాపనలో తీసుకోవాల్సిన చర్యలపై జిల్లాకు చెందిన పారిశ్రామికవేత్తలు తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ అన్నారు. జిల్లా పరిశ్రమలు, ప్రోత్సాహక కమిటీ సమావేశం సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానం-2024-29ను త్వరలో ప్రకటించనుందని అన్నారు. పారిశ్రామికవేత్తలు ఈ నూతన విధానంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలో తెలియజేయాలన్నారు. మల్లవల్లి పారిశ్రామికవాడ, మచిలీపట్నం ఇమిటేషన్ జ్యువెలరీ, ఆక్వా, ప్లాస్టిక్, ఎమ్మెస్ఎంఈ పారిశ్రామికవేత్తల నుంచి సూచనలు తీసుకున్నారు.

గుణదల ఈఎస్ఐని 300 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తాం

● మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడి ● ఆస్పత్రి నూతన ప్రాంగణం ప్రారంభం... బెడ్స్ పరిశీలన

ప్రభుత్వాసుపత్రి, ఆగస్టు 19 : గుణదల ఈఎస్ఐ ఆసుపత్రిని 300 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయడంతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రణాళిక సిద్ధం చేశామని రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. గుణదలలోని ఈఎస్ఐ ఆసుపత్రి నూతన ప్రాంగాణాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఈఎస్ఐ ఆసుపత్రులన్నింటిని దశలవారీగా అభివృద్ధి చేయనున్నామన్నారు. కార్మిక కుటుంబాలకు సత్వర వైద్య సేవలందించే విధంగా ఈఎస్ఐ ఆసుపత్రిలో అన్ని రోగాలకు వైద్యం అందే విధంగా అభివృద్ధి చేస్తామన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈఎస్ఐ ఆసుపత్రులను నిర్వీర్యం చేశారని, సరైన పరికరాలు లేకుండా ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకుండా కార్మికులను ఇబ్బందుల పాలు చేశారని మండిపడ్డారు. వైఎస్సార్ బీమా పేరుతో సొంత ఇన్సూరెన్స్ కంపెనీ ఏర్పాటు చేసి అవకతవకలకు పాల్పడ్డారని, వీటిపై విజిలెన్స్ విచారణకు ఆదేశించామని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ వ్యవసాయం తరువాత ప్రాధాన్యత గల కార్మిక రంగాన్ని ప్రభుత్వం మరింత బలోపేతం చేస్తుందన్నారు. ఈఎస్ఐ ఆసుపత్రిని కార్మిక కుటుంబానికి ఆరోగ్య భరోసా అందించే విధంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. కార్మిక శాఖ ప్రధాన కార్యదర్శి ఎంఎం.నాయక్, ఎమ్మెల్సీ అశోక్‌బాబు పాల్గొన్నారు.



బెడ్స్ పరిశీలిస్తున్న మంత్రి సుభాష్, ఎమ్మెల్యే గద్దె



ఆసుపత్రి నూతన ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	116, 125, 136
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.75

దర్గా ప్లాట్లకు వసతులు కల్పించండి

జోనల్ కమిషనర్‌కు స్థానికుల వినతి

భవానీపురం, ఆగస్టు 19 : 41వ డివిజన్ దర్గా ప్లాట్స్ ప్రాంతంలో రోడ్లు, డ్రెయిన్లను అభివృద్ధి చేయాలని కోరుతూ రికార్డులను జోనల్ కమిషనర్ బి రమ్యకీర్తనకు ఆ ప్రాంత వాసులు అట్లూరి బెనర్జీ తదితరులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో కలిసి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా రమ్యకీర్తన మాట్లాడుతూ టౌన్‌ప్లానింగ్ రికార్డులను పరిశీలించి, వాటిని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధి విషయంలో త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంలో చాలా కాలం క్రితం పోరాటం చేయగా, కార్పొరేషన్ కొన్నిచోట్ల వీధిలైట్లు మాత్రమే బిగించారని, మౌలిక వసతులకు దూరంగా ఈ ప్రాంతం ఉందని ప్రజలు ఆమెకు విన్నవించారు.

చిరువ్యాపారుల సమస్యలు పరిష్కరించాలి

సీపీఎం నేత సీహెచ్ బాబూరావు ● సీఐటీయూ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా

చిట్టినగర్, ఆగస్టు 19: చిరువ్యాపారుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. చిరువ్యాపారులకు గుర్తింపు కార్డులు, ప్రభుత్వం బ్యాంకుల ద్వారా సబ్సిడీ లోన్లు ఇవ్వాలని, అక్రమ తొలగింపులను ఆపాలని కోరుతూ విజయవాడ హాకర్స్, తోపుడుబండ్ల యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం వీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాలో బాబూరావు మాట్లాడుతూ చిరువ్యాపారులకు గుర్తింపు కార్డులు లేకపోవడం వలన ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు అందటం లేదన్నారు. ప్రభుత్వం బ్యాంకుల ద్వారా సబ్సిడీ లోన్లు ఇవ్వాలని, సుప్రీంకోర్టు జీవో ప్రకారం మంచినీరు, మరుగుదొడ్లు తదితర సదుపాయాలు కల్పించాలన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎ. వెంకటేశ్వరరావు నూతన ప్రభుత్వం ఉపాధిని దెబ్బతీయటం సరైన పద్ధతి కాదన్నారు. వీఎంసీ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్రకు యూనియన్ నాయకులు సీహెచ్ బాబూరావు తదితరులు వినతి పత్రం అందజేశారు. సీపీఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు, సీఐటీయూ సెంట్రల్ అధ్యక్షుడు కె.దుర్గారావు, నాయకులు వై.సుబ్బారావు, ఎం.బాబూరావు, బాలబొమ్మ లక్ష్మణ్, హాకర్స్ సీఐటీయూ యూనియన్ అధ్యక్షకార్యదర్శులు బి.వెంకటేశ్వరరావు, సిహెచ్ మురళి, హేమంత్, సూరమ్మ, చల్లా వెంకటరమణ, కె.మధుసూదన్, బాజి పాల్గొన్నారు.



ధర్నాలో సీపీఎం నేత బాబూరావు, చిరు వ్యాపారులు

ఆప్కాస్ కార్మికులకు బకాయి జీతాలు చెల్లించాలి

చిట్టినగర్: నగరపాలక సంస్థలో పని చేస్తున్న ఆప్కాస్ కార్మికులకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకులు సీహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. బకాయి వేతనాలు, హెల్త్ అలవెన్స్ వెంటనే ఇవ్వాలని కోరుతూ విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం వీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆప్కాస్ కార్మికులు పెండింగ్ జీతం, హెల్త్ అలవెన్స్ తదితర సమస్యలపై కమిషనర్ కలసి వినతి పత్రం అందజేయగా ఆయన సాయంత్రానికి జీతాలు అందేలా చూస్తానన్నారన్నారు. కార్పొరేటర్ బోయి సత్యబాబు, నగర అధ్యక్షుడు ఎస్.జ్యోతిబస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ టీ.ప్రవీణ్, నగర ఉపాధ్యక్షురాలు టి. తిరుపతమ్మ, సహాయ కార్యదర్శి వీ.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



వన్‌టౌన్, ఆగస్టు 19: దుర్గామల్లేశ్వర దేవస్థానం ధర్మపథం వేదికపై సోమవారం విశాఖ పట్నంకు చెందిన హేమసాయి బృందం నిర్వహించిన కూచిపూడి నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. మూషిక వాహన వినాయక స్తుతి, నర్తన గణపతి, పలుకే బంగారమాయెనా, హిమగిరి తనయె, కట్టెదురా వైకుంఠం, కదిరే నృసింహుడు, పిడికిట తలంబ్రాలు, ముద్దుగారే యశోద, వినరో భాగ్యము, భోశంభో, విష్ణురాజంభజే, అన్నపూర్ణే విశాలాక్షి, నగుమోము, ఒకపరి ఒకపరి, తరంగం వంటి పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో కళాకారులు చేసిన నృత్యానికి ప్రేక్షకులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు వినూత్న కార్యక్రమం

పాయకాపురం, ఆగస్టు 19 : రోడ్డు ప్రమాదాల నివారణకు నగర పోలీసులు సోమవారం వినూత్న అవగాహనా కార్యక్రమాలను చేపట్టారు. నగరంలో హెల్మెట్ లేకుండా వెళ్తున్న ద్విచక్రవాహనదారులను, సీటు బెల్ట్ పెట్టుకోని కారు ప్రయాణికులను, యూనిఫాం లేకుండా ఆటోలు నడుపుతున్న డ్రైవర్లకు నలంద కళాశాల ఎన్‌సీసీ విద్యార్థినులతో రాఖీలు కట్టించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ డీసీపీ చక్రవర్తి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి పౌరుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. వాహనదారులు గమ్యస్థానాలు చేరే వరకు మోటారు వాహన నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపాలని పేర్కొన్నారు. ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ డి. ప్రసాద్, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

నిర్దిష్ట లక్ష్యాలతో విజయం సాధ్యం

భారతీనగర్, ఆగస్టు 19: ఆంధ్రా లయోలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో మూడో సంవత్సం విద్యార్థులకు విజయ సాధనకు తీసుకోవాల్సిన సూత్రాలు అనే అంశంపై సోమవారం అవగాహన సదస్సు జరిగింది. ఏపీఎస్ఎస్‌డీసీ రిసోర్స్ పర్సన్ చీలి రామకృష్ణ, సీహెచ్ గోపి రాజు ముఖ్య అతిథుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విద్యార్థులు విజయాలను సాధించడానికి నిర్ధిష్ట లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని వాటి కోసం కృషి చేయాలన్నారు. కళాశాల డైరెక్టర్ ఫాదర్ డాక్టర్ బి.జోజిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఓ.మహేష్,అసిస్టెంట్ డైరెక్టర్ పాదర్ బాలస్వామి, సీఎస్ఈ, డీఎస్ అండ్ ఏఐఎం ఎల్ విభాగాధిపతులు, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహిళలకు పెద్దన్న చంద్రబాబు



చంద్రబాబుకు రాఖీ కడుతున్న గద్దె అనురాధ

భారతీనగర్, ఆగస్టు 19: టీడీపీ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తూ మహిళాభ్యున్నతి కోసం పనిచేయడం జరుగుతుందని, మహిళలకు అన్ని రకాలుగా చంద్రబాబు అండగా ఉంటారని, రాష్ట్ర మహిళలందరికి కూడా చంద్రబాబు పెద్దన్నగా ఉంటూ మహిళలకు రక్షణ కల్పిస్తున్నారని జిల్లా పరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. సోమవారం రాఖీ పండగను పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబును ఉండవల్లిలోని ఆయన నివాసంలో గద్దె అనురాధ కలిసి రాఖీకట్టి, ఆశీస్సులు తీసుకున్నారు.

ఆప్యాయతలు పంచే పండుగ రాఖీ



డైరెక్టర్ బాలకృష్ణకు రాఖీలు కడుతున్న విద్యార్థినులు

లబ్బీపేట, ఆగస్టు 19: సోదరీ సోదరీ మణులు అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ అని సాయి మేధా విద్యాసంస్థల డైరెక్టర్ మజ్జిగ బాలకృష్ణ పేర్కొన్నారు. సాయి మేధా ఇన్‌స్టిట్యూట్‌లో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు మజ్జిగ బాలకృష్ణకు రాఖీ కట్టి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటా ఆప్యాయతలు పెంపొందించే పండుగ రాఖీ అని తెలిపారు. అన్నా చెల్లెలు, అక్కా తమ్ముళ్ల మధ్య ఉన్న అనుబంధానికి ప్రతీకగా రాఖీ పండుగ నిలుస్తుందని తెలిపారు. సంస్థ చైర్మన్ డాక్టర్ జి.రమణ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ కోచింగ్ సెంటర్‌లో విద్యార్థినులను చెల్లెళ్లుగా చూసుకుంటామని, ఒత్తిడి లేని విధంగా ఉత్తమమైన కోచింగ్ అందిస్తామని తెలిపారు.

రూరల్ డీసీపీగా మహేశ్వరరాజు బాధ్యతల స్వీకరణ



కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మహేశ్వరరాజు

పాయకాపురం, ఆగస్టు 19 : ఎన్టీఆర్ జిల్లా రూరల్ డీసీపీగా కేఎం మహేశ్వరరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

అనంతరం నగర పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కేఎం మహేశ్వరరాజు ఎస్ఈబీలో కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల నేపథ్యంలో జిల్లా రూరల్ డీసీపీగా నియమితులయ్యారు.



రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఐకాన్స్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

రోటరీ ఐకాన్స్ నూతన కార్యవర్గ ఎన్నిక

గవర్నర్‌పేట, ఆగస్టు 19: నగరంలోని ప్రజలకు, దేశవిదేశాల్లో నివసిస్తున్న వారికి అంతర్జాతీయ సేవలు అందించే వేదికగా రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఐకాన్స్ నిలవాలని ఐపీడీజీ డిస్ట్రిక్ట్ 3020 రావూరి సుబ్బారావు (దత్త) అన్నారు. సోమవారం సీతారామపురంలోని ఐకాన్ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఐకాన్స్ నూతన కార్యవర్గ (2024-25) ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరిగింది. క్లబ్ అడ్వయిజర్ అండ్ డిస్ట్రిక్ట్ సెక్రటరీ యడ్ల పార్థసారధి ఆధ్వర్యంలో క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఎం. విజయ్, కార్యదర్శిగా బి. సురేస్‌బాబు, అసిస్టెంట్ కన్వీనర్‌గా డాక్టర్ గుత్తికొండా శ్రీహర్ష, ఆఫీసు బేరర్స్ టీమ్ ప్రమాణ స్వీకారం చేశారు. రొటేరియన్ కొండేటి రాజేంద్ర, విజయవాడ, కోస్తా ఆంధ్రలోని అన్ని క్లబ్‌ల ప్రతినిధులు హాజరయ్యారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



భారతీనగర్, ఆగస్టు 19: ప్రజా సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చి వాటిని త్వరలోనే పరిష్కరిస్తుందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు.నాల్గవ డివిజన్ నెల్సన్ మండేలా పార్కులో అభివృద్ధి పనులకు సోమవారం స్థానికులతో కలసి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి గత వారం డివిజన్లో పర్యటించిన సమయంలో స్థానికులు పార్కులోని ప్రధాన సమస్యలను తెలియజేశారన్నారు. ఆ సమస్యల పరిష్కారంలో భాగంగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామన్నారు. పార్కు సమీపంలో గంజాయి, బ్లేడుబ్యాచ్ సమస్యలను పరిష్కరించడంతో పాటు పార్కులో మౌలిక సదుపాయాలు కల్పించి స్థానికులకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా చేస్తామని ఎమ్మెల్యే గద్దె ప్రజలకు హామీ ఇచ్చారు. డివిజన్ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, డాక్టర్ వసుందరాదేవి, నందిపాటి దేవానంద్, రామిశెట్టి సతీష్, అరెకపూడి శ్రీనివాసరావు, డాక్టర్ రవి కిరణ్, గద్దె రమేష్, చెరుకూరి విజయకుమార్, అడపా నాగేంద్ర, విజయ, దోమకొండ రవి, అశోక్, వాణి పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో 18 అర్జీలు



అర్జీలను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

చిట్టినగర్, ఆగస్టు 19: ప్రజల నుంచి వచ్చే సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. మొత్తం 18 అర్జీలు వచ్చాయి. అదనపు కమిషనర్ (జనరల్) డాక్టర్ ఏ. మహేష్, (పాజెక్ట్) కే.సత్యవతి, చీఫ్ ఇంజనీర్ ఇన్‌చార్జి శ్రీ రామచంద్రమూర్తి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ.రత్నావళి, అధికారులు పాల్గొన్నారు.

బొడ్డుబొమ్మ సెంటర్‌లో పార్కింగ్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

వన్‌టౌన్: కెనాల్ రోడ్డులోని బొడ్డుబొమ్మ సెంటర్ వద్ద అనధికారికంగా పార్కింగ్ రుసుము వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ ప్రధాన కార్యదర్శి పరసా సురేష్ కుమార్ సోమవారం మునిసిపల్ కార్పొరేషన్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో నగర కమిషనర్ ధ్యానచంద్రకు ఫిర్యాదు చేశారు.

ఘనంగా ప్రారంభమైన జై సంతోషిమాత ఉత్సవాలు



అమ్మవారికి విశేష పూజలు చేస్తున్న ఆలయ అర్చకుడు

పాయకాపురం, ఆగస్టు 19 : పాయకాపురంలో ఉన్న జై సంతోషిమాత అమ్మవారి జయంతి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరగనున్న అమ్మవారి జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాఖీ పౌర్ణమి అమ్మవారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు చిన్ని చిట్టిబాబు మాట్లాడుతూ ఆలయంలో జరిగిన కుంకుమ పూజ, లక్ష్మీ గణపతి హోమం, తదితర పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యల్లో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో జిల్లా పరిసర ప్రాంతాల నుంచే కాకుండా గుంటూరు, ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల నుంచి పెద్ద సంఖ్యల్లో వచ్చినట్లు తెలియజేశారు. భక్తులకు అన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, మార్కండేయులు, నాని, చిన్ని లక్ష్మీ, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శనైశ్చర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవం

వన్‌టౌన్, ఆగస్టు 19: వన్‌టౌన్ సీతమ్మవారి పాదాల సమీపంలో ఉన్న శ్రీప్రత్యేక శనైశ్చర స్వామి దేవస్థానంలో శ్రావణ మాసం సందర్భంగా 19 రోజుల దీక్ష, హోమ మహోత్సవాల క్రమంలో సోమవారం స్వామికి ఉదయం శనైశ్చర హోమాన్ని నిర్వహించారు. తిరిగి సాయంకాలం ప్రదోషకాల పూజ, తైలాభిషేకం నిర్వహించారు. దుర్గాఘాట్‌లో ఉదయం స్వామివారి, అమ్మవారి విగ్రహాలకు స్నపన కార్యక్రమం నిర్వహించి, పెండ్లికుమారుడిని, పెండ్లికుమార్తెను చేశారు. రాత్రి సమయంలో వార్షిక కల్యాణమహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారం రథోత్సవం జరగనుంది. ఈవో గోవాడ వెంకట కృష్ణారావు పర్యవేక్షణలో 19 రోజుల కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈనెల 6 నుంచి విఘ్నేశ్వర పూజతో ప్రారంభమైన దీక్షా మహోత్సవాల్లో తొలుత మాలధారణ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురార్పణ, అఖండస్థాపన, ధ్వజారోహణ, మంటపారాధన, అగ్నిప్రతిష్ఠాపన, నవగ్రహాలకు చతుర్విధ హవనాలు, శనైశ్చర మూల మంత్ర హోమాలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు ఉదయం స్వామివారికి మహన్యాస పూర్వక ఏకదశ రుద్రాభిషేకం, నవగ్రహ హోమం, సాయంత్రం రుద్ర హోమం, లింగార్చన, అభిషేకాలు, అర్చన, మహానివేదన, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ జరుగుతున్నాయి. దేవస్థాన ప్రధాన అర్చకులు శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో అర్చకులు వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

పాయకాపురం, ఆగస్టు 19 : తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగిన ఘటన వాంబేకాలనీలో సోమవారం జరిగింది. వివరాల ప్రకారం వాంబేకాలనీలో నివాసం ఉంటున్న బండి రామకృష్ణ ఆదివారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి మంగళగిరిలోని బంధువుల ఇంట్లో పెళ్లికి వెళ్లాడు. తిరిగి సోమవారం ఉదయం వచ్చే సరికి ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించి లోపలికి వెళ్లాడు. ఇంట్లో బీరువా తలుపులు తెరిచి ఉండటం, సామాన్లు చిందరవందరగా పండి ఉండటాన్ని గుర్తించి చోరీ జరిగినట్లు నిర్ధారణకు వచ్చి నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బీరువాలో ఉండాల్సిన 45 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ. 12 వేలు చోరీకి గురైనట్లు పోలీసుల ఫిర్యాదులో పేర్కొన్నాడు.

కేబీఎన్ కార్యదర్శి శ్రీనివాస్‌కు సన్మానం



తూనికుంట్ల శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న కళాశాల విభాగాధిపతులు తదితరులు

వన్‌టౌన్, ఆగస్టు 19: కేబీఎన్ కళాశాల కమిటీ కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. పొట్టిశ్రీరాములు చలువాది మల్లికార్జునరావు ఇంజనీరింగ్ కాలేజిలో సోమవారం జరిగిన కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్ యాజమాన్యం, కళాశాల విభాగాధిపతులు, శ్రేయోభిలాషులు తూనికుంట్ల శ్రీనివాస్‌ను సన్మానించారు. దుశ్శాలువా కప్పి, మెమెంటోతో సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు చలువాది మల్లికార్జునరావు ఇంజనీరింగ్ కాలేజీ స్థాపించిన సంవత్సరంలో కళాశాల కార్యదర్శిగా ఉండి అభివృద్ధికి ఎంతో సహకరించారని కొనియాడారు. ప్రస్తుతం కేబీఎన్ కళాశాల కార్యదర్శిగా కొనసాగుతున్న ఆయన చేసిన సేవలను వక్తలు ప్రశంసించారు. ఈ సందర్భంగా తనకు జరిగిన సన్మానానికి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలుపుతూ పొట్టిశ్రీరాములు ఇంజనీరింగ్ కళాశాల కన్నబిడ్డ వంటిదని చెప్పారు. కళాశాలకు ఎన్నో విశిష్ట లక్షణాలు ఉన్నందునే నాక్ ఎ++ గుర్తింపును సాధించుకుందని చెప్పారు. కళాశాల కార్యదర్శి సిఏ చిట్టూరి అమర సుధీర్, ఉపకార్యదర్శి జి. పవన్ కుమార్, ట్రెజరర్ కె. రాఘవయ్య, శీరం రాధాకృష్ణమూర్తి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. పతంజలి శాస్త్రి, డాక్టర్ ఎస్. మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి బాబుల హల్‌చల్

- భయందోళన చెందుతున్న కేఎల్ రావు పార్కు రోడ్డువాసులు
- కొరవడిన పోలీసుల నిఘా

చిట్టినగర్, ఆగస్టు 19: కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కేఎల్ రావు పార్కు రోడ్డులో గంజాయి, మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా పార్కు రోడ్డులో నానా యాగా చేస్తున్నారు. అటుగా రాకపోకలు సాగించాలంటే ప్రజలు, మహిళలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. పట్టించుకోవాల్సిన పోలీసులు తమకేమీ పట్టనట్టుగా వ్యహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. రాత్రి వేళల్లో అయితే పార్కు వైపు వెళ్లాలంటే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎటు వైపు నుంచి ఏ గంజాయి బాబు, మందుబాబు వచ్చి దాడి చేస్తాడోనని బిక్కు బిక్కు మంటూ రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రి అయితే చాలు పార్కులో ప్రవేశించి అక్కడ ఉన్న సిబ్బందిపై దాడులకు తెగబడుతున్నారు.

వీరికి స్థానికంగా ఉన్న యువకులు అండగా ఉండటంతో పార్కులో పని చేసే సిబ్బందిపై గంజాయి బాబులు దాడి చేస్తే ఫిర్యాదు చేసేందుకు వెనకాడుతున్నారు. పార్కులో గతంలో పని చేసిన వాచ్‌మెన్ గంజాయి బాబులను అడ్డుకున్నాడని అతనిపై దాడి చేశారు. అతను భయపడి ఇక్కడ నుంచి వేరే ప్రాంతానికి వెళ్లి పోయాడు. పోలీసులు ఈ ప్రాంతంలో ఎటువంటి గస్తీ నిర్వహించకపోవడంతో వీరి ఆగడాలకు హద్దు లేకుండా పోయింది. దోబీఖానా, స్విమ్మింగ్ పూల్ పక్కనే ఉన్న గోడలు దూకి పార్కులో ప్రవేశించి పార్కులో పెద్ద పెద్ద కేకలు వేస్తూ చుట్టు పక్కల నివాసితులతో పాటు పార్కు సిబ్బందిని భయపెడుతున్నారు.

గంజాయి బాబులకు అడ్డు చెబితే ఏం చేస్తారోనని నిత్యం అక్కడ రాత్రి వేళలలో పని చేసే వాచ్‌మెన్ బిక్కు బిక్కుమంటూ గడుపుతున్నాడు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి రాత్రి వేళల్లో పార్కు ప్రాంతంలో గస్తీ పెంచి గంజాయి బాబుల నుంచి తమకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

దిక్సూచి DIKSUCHI



భారత వాయుసేనలో అగ్నివీర్ ఉద్యోగాలు

భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన భారత వాయుసేన అగ్నిపథ్ స్కీంలో భాగంగా క్రీడల విభాగంలో అగ్నివీర్ వాయు నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది.

- **భారత వాయుసేన- అగ్నివీర్ వాయు(స్పోర్ట్స్) ఇన్‌టేక్ 01/2025**

క్రీడాంశాలు: అథ్లెటిక్స్, బాక్సింగ్, క్రికెట్, సైక్లిం గ్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్/డైవింగ్, షూటింగ్, వాటర్ పోలో, రెజ్లింగ్, బాస్కెట్‌బాల్, సైకిల్ పోలో, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, హాకీ, స్క్వాష్, కబడ్డీ, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, ఉషు.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్మీడియట్/10+2/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత. లేదా ఇంజనీరింగ్‌లో డిప్లొమా కోర్సు(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/ఆటోమొబైల్/ కంప్యూటర్ సైన్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ). నిర్దిష్ట శారీరక దారుఢ్య/వైద్య ప్రమాణాలతో పాటు స్పోర్ట్స్ అచీవ్‌మెంట్స్ తప్పనిసరి.

ఎత్తు: 152 సెం.మీ. కనీస ఎత్తు ఉండాలి.

వయోపరిమితి: 2004 జనవరి 2 నుంచి 2007 జూలై 2 మధ్య జన్మించిన అభ్యర్థులు అర్హులు.

ఎంపిక ప్రక్రియ: సెలెక్షన్ టెస్ట్, స్పోర్ట్స్ స్కిల్ ట్రయల్స్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా.

దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 29

ట్రయల్స్ వేదిక: తేజస్ క్యాంప్, ఎయిర్ ఫోర్స్ స్టేషన్ న్యూఢిల్లీ, లోక్ కల్యాణ్ మార్గ్, న్యూఢిల్లీ.

వెబ్‌సైట్: https://agnipathvayu.cdac.in/AV/

(నిన్నటి దిక్సూచి తరువాయి)

ఎస్సీ ఉప వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పు-నేపథ్యం

పంజాబ్ రాష్ట్ర పాత్ర

2004లో ఇ.వి.చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆంధ్రప్రదేశ్ సహా పంజాబ్ రాష్ట్రాన్ని కూడా తీవ్రంగా ప్రభావితం చేసింది. 1975లో పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం ఆ రాష్ట్రంలోని ఎస్సీల్లో మరింత అట్టడుగున ఉన్న బాల్మీకి, మజ్‌హబి కులాలను వర్గీకరించి వారికి విద్య, ఉద్యోగాది విషయాల్లో తొలి ప్రాధాన్యం ఇచ్చింది. ఇందుకోసం ఒక జీవోను జారీ చేసింది. 30 ఏళ్లపాటు అమల్లో ఉన్న ఈ విధానం, 2004లో ఇ.వి.చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో న్యాయవివాదంలో చిక్కుకుంది.

2006లో డాక్టర్ కృష్ణపాల్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ కేసులో, పంజాబ్, హర్యానా హైకోర్టు 1975 నాటి పంజాబ్ రాష్ట్ర జీవో చెల్లదని, ఇ.వి.చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా తీర్పునిచ్చింది. అయితే ఈ తీర్పును అధిగమించడానికి పంజాబ్ ప్రభుత్వం 'పంజాబ్ షెడ్యూల్డ్ క్యాస్ట్ అండ్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్(రిజర్వేషన్ ఇన్ సర్వీసెస్)యాక్ట్-2006ను తీసుకువచ్చి తిరిగి బాల్మీకి, మజ్‌హబీ వర్గాలకు ఎస్సీ రిజర్వేషన్లలో తొలి ప్రాధాన్యం ఇచ్చారు. 2010లో మరోసారి హైకోర్టు ఈ చట్టాన్ని కొట్టివేసింది. అయితే దేవేందర్ సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ కేసులో వచ్చిన ఈ తీర్పును పంజాబ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. 2014లో ఈ అప్పీలును సుప్రీంకోర్టు అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి సిఫార్సు చేసి, 2004 నాటి ఇ.వి.చెన్నయ్య కేసు తీర్పును పునఃసమీక్షించాల్సిందిగా సూచించింది. జస్టిస్ అరుణ్‌మిశ్రా నేతృత్వంలోని అయిదుగురు సభ్యుల ధర్మాసనం ఇ.వి.చెన్నయ్య కేసు తీర్పును పునః పరిశీలించాలని అభిప్రాయపడింది. ఎస్సీల్లో, ఎస్టీల్లో మరింత ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబాటుకు గురవుతున్న ఉప వర్గాలున్నాయని, ప్రభుత్వాలు, కోర్టులు దీనిని విస్మరించజాలమని అభిప్రాయపడుతూ ఇ.వి.చెన్నయ్య కేసును పరిశీలించిన ధర్మాసనం కూడా తమవలే అయిదుగురు సభ్యులు కలది కావడంతో ఆ తీర్పును తిరగరాయాలంటే మరింత ఎక్కువమంది సభ్యులు గల ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఈ కేసును చేపట్టాలని సిఫార్సు చేసింది. ఈ నేపథ్యంలో 2023 డిసెంబరులో చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ ఆధ్వర్యంలో స్టేట్ ఆఫ్ పంజాబ్ వర్సెస్ దేవేందర్‌సింగ్ కేసును పరిశీలించడానికి, ఇ.వి.చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించడానికి ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏర్పడింది.

ప్రాథమికంగా ఈ రాజ్యాంగ ధర్మాసనం రెండు విషయాలను పరిశీలించింది. అవి 1) రిజర్వేషన్లలో ఉపవర్గీకరణను అమలుచేయాలా? 3) ప్రకరణ 341 ప్రకారం ఎస్సీలు ఒకే సజాతీయ సమూహంగా గుర్తించబడ్డారు కాబట్టి వారిని ఉపవర్గీకరించే అధికారం రాష్ట్రాలకు లేదని తీర్పు ఇచ్చిన ఇ.వి.చెన్నయ్య వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసు సమంజసత్వం. ఈ కేసు విషయంగా 2024 ఆగస్టు 1న 6:1 మెజారిటీతో జస్టిస్ చంద్రచూడ్ రాజ్యాం గ ధర్మాసనం తీర్పునిస్తూ ఎస్సీలను ఉపవర్గీకరించే అధికారం రాష్ట్రాలకు ఉందని, 2004 నాటి ఇ.వి.చెన్నయ్య కేసు తీర్పు చెల్లుబాటు కాదని, సమానత్వాన్ని మరింత పెంపొందించేందుకు అభివృద్ధి ఫలాలు అట్టడుగు స్థాయికి చేర్చేందుకు ఎస్సీల్లోనే కాక, ఎస్టీల్లో కూడా రిజర్వేషన్లు ఉపవర్గీకరించి అమలుచేయాల్సిన ఆవశ్యకత ఉందని, ఆ దిశగా రాష్ట్రాలు చర్యలు తీసుకోవాలని సూచించింది. అదేవిధంగా ఈ తీర్పుతో ఏకీభవిస్తూనే ప్రత్యేకంగా తన తీర్పును వినిపించిన ధర్మాసనం న్యాయమూర్తుల్లో ఒకరైన జస్టిస్ బి.ఆర్.గవాయ్ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో కూడా ప్రభుత్వాలు క్రిమిలేయర్ విధానాన్ని తీసుకువచ్చినప్పుడే అట్టడుగు వర్గాలకు మరింత న్యాయం చేకూరుతుందని సూచించారు. అదేవిధంగా ఉపవర్గీకరణ చేయడానికి సముచిత ప్రాతిపదికలను, వెనుకబాటుతనాన్ని వారి మధ్య గుర్తించడానికి సరైన కొలమానాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఎంచుకోవాలని ఏ ఉపవర్గానికీ 100 శాతం రిజర్వేషన్లను కేటాయించరాదని సూచించారు.



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

బంతి రాష్ట్రప్రభుత్వాల కోర్టులో

సుప్రీంకోర్టు తీర్పుతో రిజర్వేషన్ల ఉపవర్గీకరణకు రాష్ట్రాలకు మార్గం సుగమం అయ్యింది. అయితే ఈ ఉపవర్గీకరణను సమర్థవంతంగా పూర్తిచేయడానికి రాష్ట్రాలు కుల గణను సమర్థవంతంగా చేపట్టాల్సి ఉంది. అంతేకాక ఏయే ఉప కులాలు ఆర్థిక, సామాజిక, రాజకీయపరంగా తమ కేటగిరీలోని ఇతర కులాలతో పోల్చినా ఏ స్థాయిలో ఉన్నాయో అంచనా వేయాల్సి ఉంది. ప్రాంతీయపరంగా కూడా వివిధ ఉపకులాల్లో అభివృద్ధిలో అసమానతలు ఉన్నా యి. అంతేకాక ఈ ఉపవర్గీకరణ దళితుల్లోని ఐకమత్యాన్ని దెబ్బ తీయడం తప్ప పెద్దగా ఒన గూడే ప్రయోజనాలు లేవని మాల మహానాడు వంటి సంఘాలు ఉపవర్గీకరణను వ్యతిరేకిస్తున్నాయి.

అంతేకాక ఎస్టీల నుంచి లంబాడాలను తొలగించాలని వారు మైదాన ప్రాంతాల్లో ఉంటూ అభివృద్ధి చెంది ఆదివాసీ కొండజాతి వారి అవకాశాలకు గండికొడుతున్నారని ఆదివాసీ తెగలు ఉద్యమిస్తున్నాయి. ఇట్టి అంతర్గత సంఘర్షణలను సైతం రాష్ట్రాలు ఎదుర్కోవాల్సి ఉంది. సుప్రీంకోర్టు సూచించినవిధంగా ఈ రిజర్వేషన్ల ఉప వర్గీకరణను రాజకీయ ప్రయోజనాల కోసం కాక, సమ సమాజ స్థాపన దిశగా వినియోగించాల్సిన గురుతర బాధ్యత రాష్ట్రప్రభుత్వాలపై ఉంది.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/jse4ruCలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

ఇన్ ప్రోగ్రెస్



కుర్రోళ్ల కష్టం కనిపించింది

నిహారిక కొణిదెల సమర్పణలో రూపుదిద్దుకున్న 'కమిటీ కుర్రోళ్లు' చిత్రాన్ని చూసిన మెగాస్టార్ చిరంజీవి ఆ సినిమా టీమ్‌ను తన ఇంటికి పిలిపించి ప్రత్యేకంగా అభినందించారు. నిహారిక, దర్శకుడు యదు వంశీ తదితరులు ఆయన్ని కలిశారు. 'సినిమా చాలా చక్కగా ఉంది. కొత్త వాళ్లు నటిస్తున్నారనే విషయాన్ని సినిమా చూస్తున్నంతసేపూ మరిచిపోయా. చిత్రీకరణ చాలా సహజంగా ఉంది. ఎంటైర్ యూనిట్ పడిన కష్టం తెరపై కనిపించింది. రీజనబుల్ బడ్జెట్‌లో సినిమా తీసిన దర్శకుడు యదు వంశీకి అభినందనలు' అని ప్రశంసించారు చిరంజీవి.



బ్రహ్మా ఆనందం సందడి

హాస్య బ్రహ్మ బ్రహ్మానందం, ఆయన తనయుడు రాజా గౌతమ్ తాతా మనవళ్లుగా నటిస్తున్న 'బ్రహ్మా ఆనందం' చిత్రం గ్లింప్స్‌ను రాఖీ పండగ సందర్భంగా సోమవారం విడుదల చేశారు. బ్రహ్మానందం, రాజా గౌతమ్, వెన్నెల కిశోర్ .. ఈ మూడు పాత్రల చుట్టూ తిరిగే కథతో వినోదాల విందు వడ్డించడానికి కొత్త దర్శకుడు ఆర్వీఎస్ నిఖిల్ సిద్ధమవుతున్నారు. ప్రియా వడ్లమాని, ఐశ్వర్య హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని డిసెంబర్ 6న విడుదల చేయనున్నట్లు నిర్మాత రాహుల్ యాదవ్ నక్కా తెలిపారు.

కన్నప్ప కోసం కంపడు.. గవ్వ రాజు



విష్ణు మంచు నటిస్తూ, ఎంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న 'కన్నప్ప' చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్న నటులకు సంబంధించిన లుక్స్ ఒక్కొక్కటి విడుదల చేస్తున్నారు. ఇందులో కంపడు పాత్ర పోషిస్తున్న ముఖేశ్ రిషి, గవ్వరాజు పాత్ర చేసిన బ్రహ్మాజీ లుక్స్ సోమవారం రిలీజ్ చేశారు. పురాతన పుళింద జాతికి చెందిన అత్యంత భయంకరమైన తెగకు సంబంధించిన పాత్రలు ఇవి. డాక్టర్ మోహన్‌బాబు నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్ షూటింగ్ చివరి దశకు చేరుకుంది. డిసెంబర్‌లో విడుదల కానున్న ఈ చిత్రానికి ముఖేశ్‌కుమార్ దర్శకుడు.

అమ్మాయిలకు ఆమడ దూరం



రాజ్‌తరుణ్, మనీషా కంద్కూర్ జంటగా నటిస్తున్న 'భలే ఉన్నాడే' చిత్రం ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు. అమ్మాయిలంటే ఆమడదూరంలో ఉండే హీరో పాత్రను హిలేరియస్‌గా పరిచయం చేసింది ఈ ట్రైలర్. అలాగే టీవీ గణేశ్, హైపర్ ఆది, కృష్ణభగవాన్, శ్రీకాంత్ అయ్యంగార్ పాత్రలు కూడా వినోదభరితంగా ఉంటాయని దర్శకుడు జె.శివసాయి చెప్పారు. వినాయకచవితి సందర్భంగా సెప్టెంబర్ 7న సినిమాను విడుదల చేస్తున్నట్లు నిర్మాత ఎన్వీ కుమార్ చెప్పారు.

రిలీజ్ డేట్ ఖరారు



తమిళ చిత్రరంగ సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'వేట్టైయాన్' విడుదల తేదీ ఖరారైంది. అక్టోబర్ పదిన ఈ సినిమాను విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాణసంస్థ లైకా ప్రొడక్షన్స్ సోమవారం అధికారికంగా ప్రకటించింది. సామాజికపరమైన సమస్యలు తీసుకుని ఆకట్టుకొనేవిధంగా చిత్రాలు తీసే దర్శకుడు టీజె జ్ఞానవేల్ రూపొందించిన తాజా చిత్రం ఇది. లైకా సంస్థ రజనీకాంత్‌తో నిర్మిస్తున్న ఈ నాలుగో చిత్రంలో బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇది అమితాబ్, రజనీకాంత్ కాంబినేషన్‌లో వస్తున్న నాలుగో సినిమా కావడం మరో విశేషం. అలాగే రజనీకాంత్, సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచంద్రన్ కలసి పని చేస్తున్న చిత్రం కూడా ఇదే కావడం గమనార్హం. వేట్టైయాన్' చిత్రానికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ లైకా ప్రొడక్షన్స్ హెడ్ జీకేఎం తమిళ్ కుమరన్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. తమిళ, తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.



కూర్గ్‌లో పెళ్లి

'రాజావారు..రాణీగారు' చిత్రంలో హీరోహీరోయిన్లుగా నటించిన కిరణ్ అబ్బవరం, రహస్య గోరఖ్‌ల వివాహం ఈ నెల 22న కర్నాటక రాష్ట్రంలోని కూర్గ్‌లో జరుగుతుంది. రహస్య బంధువులంతా కూర్గ్‌లో ఉండడంతో అక్కడే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. సన్నిహితులు, స్నేహితులు, బంధువుల సమక్షంలో ఈ పెళ్లి జరుగుతుంది. దాదాపు ఐదేళ్ల నుంచి ప్రేమలో ఉన్న కిరణ్, రహస్య ఈ ఏడాదే తమ ప్రేమ విషయాన్ని బయట పెట్టారు.

వరల్డ్ ఆఫ్ వాసుదేవ్ : కిరణ్ అబ్బవరం నటిస్తున్న పీరియాడిక్ థ్రిల్లర్ 'క' నుంచి ఫస్ట్ సింగిల్ 'వరల్డ్ ఆఫ్ వాసుదేవ్'ను సోమవారం విడుదల చేశారు. సనాపతి భరద్వాజ పాత్రుడు రాసిన ఈ పాటను కపిల్ కపిలన్ పాడారు. దర్శకద్వయం సుజిత్, సందీప్ విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్న 'క' చిత్రాన్ని త్వరలో తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డి విడుదల చేయనున్నారు.

సందేశంతో 'జనక అయితే గనక'



సుహాస్, సంగీర్తన జంటగా నటిస్తున్న చిత్రం 'జనక అయితే గనక'. రాజేంద్రప్రసాద్, వెన్నెల కిశోర్, గోపరాజు రమణ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సందీప్ రెడ్డి బండ్ల దర్శకత్వం వహిస్తున్నారు. దిల్‌రాజు, శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మిస్తున్నారు. ఇటీవలే రిలీజైన ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్ అందరినీ ఆకట్టుకున్నాయి. కథానాయకుడు సుహాస్ పుట్టినరోజు సందర్భంగా.. సోమవారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'నా ఫేవరెట్ నా పెళ్ళాం'ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో దిల్‌రాజు మాట్లాడుతూ "ఇది చాలా మంచి సందేశంతో నిండిన కథ. పిల్లల్ని కనాలంటే చేతినిండా డబ్బులుండాలి.. పిల్లలకు బెస్ట్ ఇవ్వలేనప్పుడు వారిని కనకూడదు అని ఆలోచించే మనస్తత్వం ఉన్న మధ్య తరగతి వ్యక్తి క్యారెక్టర్‌లో సుహాస్ నటించారు. చాలా రోజుల తర్వాత ఓ మంచి చిత్రం చూశామనే సంతృప్తి ఈ సినిమాతో కలుగుతుంది" అని చెప్పారు. "ఇది నా జీవితంలో మరిచిపోలేని సినిమా అవుతుందనే నమ్మకం ఉంది. ఈ పాటకు విజయ్ బుల్గానిన్ వినసొంపైన సంగీతాన్ని.. కృష్ణకాంత్ ఆకట్టుకునే సాహిత్యాన్ని ఇచ్చారు" అని సుహాస్ అన్నారు. సెప్టెంబరు 7న వినాయక చవితి సందర్భంగా ఈ సినిమా విడుదలవుతోంది.



ఒకే రోజు.. రెండు చిత్రాలు!

సాధారణంగా ఒక హీరో నటించిన రెండు సినిమాలు, ఒక దర్శకుడు తెరకెక్కించిన రెండు సినిమాలూ ఒకే రోజు విడుదలైన సందర్భాలూ ఉన్నాయి. ఇప్పుడు రష్మిక మందన్న విషయంలో అలాంటి పరిస్థితే రిపీట్ అవుతోంది. ఆమె కథానాయిక పాత్రను పోషిస్తున్న 'పుష్ప 2' సినిమా డిసెంబరు 6న విడుదల అవుతోన్న సంగతి తెలిసిందే. అలాగే అదే రోజున రష్మిక నటిస్తున్న మరో చిత్రం 'ఛావా' కూడా విడుదలవుతుండటం ఆసక్తిని కలిగిస్తోంది. విక్కీ కౌశల్ కథానాయకుడిగా లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోంది చిత్రం. 'పుష్ప' చిత్రం ఉత్తరాదిలో కూడా పెద్ద హిట్ కావడంతో 'పుష్ప2' కోసం అక్కడి ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆ సినిమా విడుదలయ్యే రోజే 'ఛావా' చిత్రం కూడా విడుదలవుతుందని మేకర్స్ ప్రకటించారు. నిజంగానే ఈ పోటీ ఉంటుందా లేక 'ఛావా' వెనక్కి వెళుతుందా అనేది వేచి చూడాలి

'రాఖీ' స్పెషల్

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగ అందరికీ ప్రత్యేకమయితే.. సినిమా తారలకి మరింత ప్రత్యేకం. ఈ ఏడాది కొందరు తారలు వారి సోదరులతో తీసుకున్న ఫొటోలను.. మరి కొందరు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ త్రోబ్యాక్ పిక్స్‌ను సోషల్‌మీడియాలో అభిమానులతో పంచుకున్నారు. ఈ ఫొటోలను చూసిన అభిమానులు 'బ్రదర్ సిస్టర్ బాండింగ్' అంటే ఇదేనంటూ తెగ మురిసిపోతున్నారు.



"ఒకరినొకరు ఎల్లప్పుడూ ఇలాగే కాపాడుకుంటూ ఉండాలి" అంటూ తన సోదరుడికి రాఖీని కడుతూ నభా నటేశ్ ఓ వీడియోను అభిమానులతో పంచుకున్నారు.



అందరికీ పేరుపేరునా..

"అందరికీ పేరుపేరునా 'రాఖీ పౌర్ణమి' శుభాకాంక్షలు" అని హీరో వరుణ్ తేజ్ తన సోదరీమణులు నిహారిక, సుష్మితతో కలసి తీసుకున్న ఫొటోలను ఎక్స్‌లో పోస్ట్ చేశారు.



నా మార్గదర్శకురాలికి..

అక్కా.. 'రాఖీ పౌర్ణమి' శుభాకాంక్షలు. నా మార్గదర్శకురాలిగా.. సపోర్ట్ సిస్టమ్‌గా ఉన్నందుకు కృతజ్ఞతలు" అని హీరో సుధీర్‌బాబు తన సోదరితో ఉన్న ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు.

'హ్యాపీ రక్షా బంధన్'

"నా ప్రియ సోదరి మౌని కుట్టీకి.. నన్ను సొంత తోబుట్టువులా భావించే అభిమానులందరికీ 'హ్యాపీ రక్షా బంధన్' అని హీరో సందీప్ కిషన్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు.



ఇష్టమైన సమయం వచ్చేసింది



"ప్రతీ ఏడాది.. ఈ రోజు ఎంతో ప్రత్యేకం.. మరెంతో ఇష్టం. ఎందుకంటే ఈ రోజు నువ్వు నా కోసం నచ్చిన బహుమతులు తెస్తావు.. నన్ను కాపాడుతానని ప్రేమతో వాగ్దానాలు చేస్తావు.. నేను చెప్పే ప్రతీది వింటావు" అని రకుల్‌ప్రీత్ సింగ్ తన సోదరుడు అమన్‌ప్రీత్ సింగ్‌కు రాఖీ కడుతున్న ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు.



థ్యాంక్యూ అన్నయ్యా..

"థాంక్యూ అన్నయ్యా.. నా బిగ్ బ్రదర్‌గా ఉన్నందుకు" అని మహేశ్‌బాబు కుమార్తె సితార ఘట్టమనేని, తన సోదరుడు గౌతమ్‌తో దిగిన చిన్ననాటి ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు.

నిన్ను బాగా మిస్సవుతున్నాను

"నా బెస్ట్ బ్రదర్‌కి 'హ్యాపీ రక్షా బంధన్'. మనం చిన్నప్పుడు కలసి చేసిన అల్లరినీ.. నిన్నూ ఎంతో మిస్సవుతున్నాను. త్వరలోనే కలుద్దాం" అని హీరోయిన్ తమన్నా భాటియా ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పోస్ట్ చేశారు.



వీరితో పాటు అక్షయ్‌కుమార్, సంజయ్‌దత్, సోనూసూద్, సన్నీ డియోల్, కంగనా రనౌత్, పరిణీతీ చోప్రా, భూమి పడ్నేకర్, మనీషా కోయిరాల, రియా చక్రవర్తి, హ్యూమా ఖురేషీ, సారాఅలీ ఖాన్, జెనీలియా దేశ్‌ముఖ్, సోనమ్ కపూర్, కూడా రాఖీ పౌర్ణమిను సెలబ్రేట్ చేసుకుంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు.

అమాయకత్వం..తింగరితనం...



బాలనటిగా వెండితెరపై అడుగుపెట్టి.. పలు చిత్రాల్లో కీలక పాత్రలు పోషించారు రమ్య పసుపులేటి. ఆమె కథానాయికగా నటించిన చిత్రం 'మారుతినగర్ సుబ్రమణ్యం'. రావు రమేశ్, అంకిత్ కొయ్య, ఇంద్రజ నటించిన ఈ చిత్రాన్ని లక్ష్మణ్ కార్య తెరకెక్కించారు. ఈ నెల 23న సినిమా విడుదలవుతున్న సందర్భంగా రమ్య మీడియాతో ముచ్చటించారు.

"ఈ సినిమాలో నా పాత్ర చాలా బాగుంటుంది. అమాయకత్వం, తింగరితనం కలగలిపిన పాత్ర నాది. నా పాత్ర ద్వారా అందరూ హాయిగా నవ్వుకుంటారు. దర్శకుడు లక్ష్మణ్ సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. అంకిత్ కొయ్య కలసి నటించడం మరిచిపోలేని అనుభూతి. సెట్స్‌లో రావు రమేశ్, ఇంద్రజ నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఈ సినిమా తప్పకుండా అందర్నీ మెప్పిస్తుంది" అని చెప్పారు.

'తల్వార్' ఆకాశ్ జగన్నాథ్



దర్శకుడు పూరి జగన్నాథ్ తనయుడు ఆకాశ్ జగన్నాథ్ కొత్త చిత్రం 'తల్వార్' షూటింగ్ సోమవారం ఉదయం ప్రారంభమైంది. కొత్త దర్శకుడు కాశీ పరశురామ్‌ని పరిచయం చేస్తూ భాస్కర్ ఇ.ఎల్.వి. నిర్మిస్తున్నారు. ఆకాశ్‌పై చిత్రీకరించిన తొలి షాట్‌కు దర్శకుడు బాబీ కెమెరా స్విచాన్ చేయగా, రచయిత విజయేంద్రప్రసాద్ క్లాప్ ఇచ్చారు. మరో దర్శకుడు సానా బుచ్చిబాబు తొలి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో నటించే ఇతర నటీనటుల వివరాలు త్వరలో వెల్లడిస్తామని నిర్మాత చెప్పారు.

కశ్మీర్‌కు 'ఎనిమిది వసంతాలు'



'మ్యాడ్' చిత్రంలో నటించి గుర్తింపు పొందిన అవంతిక ప్రధాన పాత్ర పోషిస్తున్న 'ఎనిమిది వసంతాలు' చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నవీన్ యర్నేని, రవిశంకర్ నిర్మిస్తున్నారు. భారీ చిత్రాలనే కాదు కంటెంట్ ఉన్న చిన్న చిత్రాలను కూడా ప్రేక్షకులకు ఆశయంతో వారు ఈ సినిమా తీస్తున్నారు. 'ఎనిమిది వసంతాలు' చిత్రం తదుపరి షెడ్యూల్ కశ్మీర్, ఆగ్రా, వారణాసి ప్రాంతాల్లో జరుగుతుంది.

సెలబ్రిటీ నీకన్న ఎవడురా



సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'గోట్(గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్స్). దివ్యభారతి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ల నిర్మిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ స్టేజ్‌లో ఉన్న ఈ చిత్రం నుంచి హీరో ఇంట్రడక్షన్ సాంగ్‌ను విడుదల చేశారు. 'బాసే హే నీలా ఉండే లక్కు మాకే లేదురా.. సెలబ్రిటీ నీకన్న ఎవడురా' అంటూ కాసర్ల శ్యామ్ రాసిన పాట ఇది. 'పుష్ప 2'లో టైటిల్ సాంగ్ పాడిన దీపక్ బ్లూ ఈ పాట పాడడం విశేషం. 'ఇప్పటివరకూ ఎనభై శాతం చిత్రం పూర్తయింది. యాక్షన్ ఎపిసోడ్స్, రెండు పాటలు మిగిలి ఉన్నాయి. వాటిని కూడా త్వరలో చిత్రీకరిస్తాం' అని నిర్మాత చెప్పారు.

హీరో కృష్ణ అభిమాని సినిమా



కృష్ణసాయి, మీనాక్షి జైస్వాల్ జంటగా నటిస్తున్న 'జ్యూవెల్ థీఫ్' చిత్రం టీజర్ నటుడు పృథ్వీ విడుదల చేశారు. 'నేను హీరో కృష్ణగారి అభిమానిని. ఆయన స్ఫూర్తితోనే సినిమాల్లోకి వచ్చా. ఇదొక సస్పెన్స్ థ్రిల్లర్' అని చెప్పారు కృష్ణసాయి. త్వరలోనే చిత్రాన్ని విడుదల చేస్తామని నిర్మాత మల్లెల ప్రభాకర్ చెప్పారు.

చెవులంటే మనకు చెప్పలేనంత నిర్లక్ష్యం. చెవులను శుభ్రం చేయడం కోసం చేతికందిన వస్తువులను వాడేస్తూ ఉంటాం. ఎటువంటి రక్షణ చర్యలు పాటించకుండా స్విమ్మింగ్‌పూల్‌లోకి దూకేస్తూ ఉంటాం. ఫలితంగా చెవుల్లో సమస్య తలెత్తినా, దాన్ని కూడా తెలిసిన చిట్కాతో పరిష్కరించే ప్రయత్నం చేస్తాం! కానీ ఇవన్నీ అంతిమంగా వినికిడి శక్తిని దెబ్బ తీస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



చెవిలోని జోరీగ..

విమాన ప్రయాణంలో చెవిపోటుతో ఇబ్బంది పడే వారుంటారు. చెవిలో శబ్దాలతో నిద్రపట్టక రాత్రంతా మేలుకునే వాళ్లూ ఉంటారు. గులిమితో చెవులు మూసుకుపోయి, వినికిడి శక్తిని పోగొట్టుకున్న వాళ్లు కూడా ఉంటారు. ఇవన్నీ చిన్నపాటి జాగ్రత్తలతో పరిష్కరించుకోదగిన సమస్యలే! ఇలాంటి చెవి సమస్యల గురించి కొంత అవగాహనతో మెలగగలిగితే, అసౌకర్యాలతో ఇబ్బంది పడే తిప్పలు తప్పుతాయి. సర్వసాధారణమైన చెవి సమస్యల గురించి మాట్లాడుకుంటే....

విమాన ప్రయాణాల్లో చెవి నొప్పి



కొందరికి విమాన ప్రయాణాల్లో చెవి పోటు వేధిస్తుంది. చెవులు దిబ్బెడ పడతాయి. చెవిలో శబ్దం బాధిస్తుంది. కొన్ని తీవ్రమైన పరిస్థితుల్లో కళ్లు తిరగడం, మత్తు తలెత్తుతాయి. అరుదుగా కొందర్లో కర్ణభేరి పగిలిపోయి, తీవ్రమైన నొప్పి, రక్తస్రావం కూడా మొదలవుతాయి. గాలి పీడనాల్లో చోటుచేసుకునే మార్పులకు తగ్గట్టుగా చెవుల్లోని యూస్టేషియన్ ట్యూబ్‌లు స్పందించని సందర్భాల్లో ఇలాంటి సమస్యలు వేధిస్తాయి. సాధారణంగా అంతర్జాతీయ విమానాలు 30 నుంచి 40 వేల అడుగుల ఎత్తులో ప్రయాణిస్తాయి. ఆ సమయంలో అట్మాస్ఫియరిక్ ప్రెజర్ పాయింట్ 3 నుంచి పాయింట్ 2 ఉంటుంది. కాబట్టి విమానం క్యాబిన్ ప్రెజర్ ఒక అట్మాస్ఫియర్ ఉండేలా చూసుకోవాలి. కానీ విమానాల్లో పాయింట్ 7 లేదా పాయింట్ 8 అట్మాస్ఫియరిక్ ప్రెషర్‌నే మెయింటెయిన్ చేయగలిగే పరిస్థితి ఉంటుంది. దాంతో కొందర్లో చెవి పోటు మొదలవుతుంది.

చెవుల్లో గులిమి

చెవుల్లో స్వేద గ్రంథుల్లాంటి సెబేషియస్ గ్లాండ్స్ ఉంటాయి. వాటి నుంచి వెలువడే స్రావాలే గులిమిగా ఏర్పడతాయి. యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు కలిగిన గులిమి, ఇన్‌ఫెక్షన్ల నుంచి చెవులను రక్షిస్తుంది. దుమ్ము, ధూళి చెవుల్లోకి చొరబడకుండా అడ్డుకుంటుంది. అలాగే చెవిలోని చర్మానికి కూడా తేమను అందిస్తుంది. కాబట్టి కొంత పరిమాణాల్లో చెవుల్లో గులిమి ఉండడం ఆరోగ్యకరం. ఇలా చెవుల్లో తయారయ్యే గులివి ు, నమిలే క్రమంలో దవడలు కదలుతూ ఉన్నప్పుడు, దానంతట అదే బయటకు కూడా వచ్చేస్తూ ఉంటుంది. అరుదుగా కొందర్లో అవసరానికి మించి స్రావాలు స్రవించడం మూలంగా, ఇయర్ కెనాల్ ఇరుకుగా ఉండడం మూలంగా, చెవుల నిర్మాణం అసాధారణంగా ఉండడం మూలంగా గులిమి లోపలే పేరుకుపోతుంది. కొందర్లో ఇది చెవిని పూర్తిగా మూసేస్తుంది. దాంతో చెవి ఇన్‌ఫెక్షన్లు, నొప్పి రావచ్చు.

పరిష్కారాలు ఇవే

- డ్రై వ్యాక్స్‌ను కరిగించే ఇయర్ డ్రాప్స్ వాడుకోవాలి
- అనుభవజ్ఞులైన వైద్యులను కలిసి గులిమి తొలగించుకోవాలి
- స్వయంగా గులిమిని తొలగించే ప్రయత్నం చేయకూడదు.

చెవుల్లో చిక్కులు

పిల్లలు లెగోలను, బొమ్మలను, థర్మకోల్ బాల్స్‌ను చెవుల్లో పెట్టేసుకుంటూ ఉంటారు. పెద్దలు కూడా చెవులను శుభ్రం చేయడం కోసం ఇయర్ బడ్స్ వాడినప్పుడు, దూది చెవుల్లోనే ఇరుక్కుపోతూ ఉంటుంది. నేల మీద పడుకున్నప్పుడు బొద్దింకలు, గడ్డిలో పడుకున్నప్పుడు చీమలు, పురుగులు లాంటివి కూడా చెవుల్లోకి చేరిపోతూ ఉంటాయి. కొందరికి మెత్తని గులిమి చెవికి అడ్డుపడిపోయి, దాన్ని తొలగించడం కోసం చేసే ప్రయత్నాల ఫలితంగా అది మరింత లోపల ఇరుక్కుపోతూ ఉంటుంది. సాధారణంగా చెవుల్లో ఏదైనా ఇరుక్కుపోతే స్వయంగా బయటకు లాగే ప్రయత్నం చేస్తూ ఉంటారు. లేదంటే ఆన్‌లైన్‌లో దొరికే కొన్ని పరికరాలను కొనుగోలు చేసి, వాటి సహాయంతో సమస్యను పరిష్కరించుకునే ప్రయత్నం చేస్తూ ఉంటారు. ఇలాంటి ప్రయత్నాల వల్ల ఇయర్ కెనాల్, కర్ణభేరి దెబ్బతినే అవకాశం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో శాశ్వతంగా వినికిడి శక్తిని కోల్పోయే ప్రమాదం కూడా రావచ్చు.

పరిష్కారాలు ఇవే...

చెవిలో ఇరుక్కున్న వాటిని తొలగించే పనిముట్లు వాడకం మానేయాలి. మరీముఖ్యంగా ప్రత్యేకించి ఇందు కోసమే ఇంటర్నెట్‌లో దొరికే గ్యాడ్జెట్స్‌ను కొని వాడుకోవడం మానేయాలి. ప్రతి ఒక్కరి ఇయర్ కెనాల్ భిన్నంగా ఉంటుంది. మనం మన చెవుల్లోకి తొంగి చూడలేం కాబట్టి, చెవికి తగని గ్యాడ్జెట్స్‌ను ఉపయోగించడం వల్ల చెవి అంతర్భాగం దెబ్బతింటుంది.

- ఇయర్ బడ్స్‌తో ఇరుక్కుపోయిన వస్తువులను బయటకు లాగే ప్రయత్నం చేయకూడదు
- ఫోర్‌సెప్స్ ఉపయోగించకూడదు
- తలను పక్కకు వంచితే ఫారిన్ బాడీ బయటకొచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి అలా చేయవచ్చు
- చెవిలో చీమలు, పురుగులు చొరబడితే ఆలివ్ నూనె లేదా కొబ్బరినూనె వేసుకోవచ్చు. వాటితో అవి చనిపోయి, బయటకు వచ్చేస్తాయి.
- మరీ ముఖ్యంగా ఇఎన్‌టి వైద్యులను కలిస్తే, వాళ్ల దగ్గర తగిన పరికరాలుంటాయి కాబట్టి కర్ణభేరి దెబ్బ తినకుండా సమస్య నుంచి బయటపడవచ్చు.

పరిష్కారాలు ఇవే!

విమాన ప్రయాణం చేసే అందరికీ ఇలాంటి సమస్యలు తలెత్తవు. జలుబు వల్ల ముక్కులో కంజెషన్ ఉన్నవాళ్లు, అలర్జీలు, సైనసైటిస్ ఇన్‌ఫెక్షన్లు ఉన్నవాళ్లు, పాలు తాగే పసిపిల్లలు, తరచూ విమాన ప్రయాణాలు చేసేవాళ్లలో ఈ సమస్య ఎక్కువ. ఈ కోవకు చెందిన వాళ్లు చిన్నపాటి చిట్కాలతో సమస్య తీవ్రతరం కాకుండా చూసుకోవచ్చు. అవేంటంటే...

- విమానం గాల్లోకి లేచేటప్పుడు, కిందకు దిగేటప్పుడు ఆవులించడం, చూయింగ్ గమ్ నమలడం లాంటివి చేయాలి.
- ముక్కును వేళ్లతో మూసి, నోరును గట్టిగా మూసేసి, ముక్కు ద్వారా గాలిని బయటకు ఊదే ప్రయత్నం చేసి, చెవి దిబ్బెడను తొలగించుకోవాలి.
- ట్రావెలర్ ఇయర్ ప్లగ్స్ వాడుకోవాలి.
- విమాన ప్రయాణం అసాంతం నీళ్లు తాగుతూ ఉండాలి.
- జలుబు, దగ్గు ఉన్నవాళ్లు విమానం గాల్లోకి లేచే ముందు, నేల మీదకు దిగిన తర్వాత నేసల్ స్ప్రేలు వాడుకోవాలి.
- జలుబు ఉన్న పసికందులకు కూడా నేసల్ డ్రాప్స్ వేయాలి.

స్కూబా డైవింగ్‌తో చెవి అసౌకర్యం

సాధారణంగా ఆకాశంలోకి పైకి వెళ్లేటప్పుడు వాతావరణ పీడనం తగ్గుతుంది. కానీ నీటి అడుగుకు వెళ్లేటప్పుడు పీడనం పెరుగుతుంది. ఒక్కొక అడుగు నీళ్ల దిగువకు డైవ్ చేసేకొద్దీ పీడనం కూడా క్రమేపీ పెరిగిపోతూ ఉంటుంది. కాబట్టి ఆ పీడనాన్ని శరీరానికి అలవాటు చేయడం కోసం ఒక్కొక్క అడుగు దిగువకు దశలవారీగా విరామం తీసుకుంటూ డైవ్ చేయాలి. ఒక అడుగు దిగువకు చేరుకున్న తర్వాత కొంత సేపు ఆగి, తర్వాత ఇంకొక అడుగు కిందకు డైవ్ చేయాలి. అలాగే నీళ్ల పైకి చేరుకునేటప్పుడు కూడా ఒకేసారి పైకి వచ్చేయకుండా, నెమ్మదిగా రావాలి. లేదంటే శరీరంలోని వాయువులన్నీ కీళ్లలో ఉండిపోయి నడక కష్టమవుతుంది. విమాన ప్రయాణం చేసి గమ్యానికి చేరుకున్న 24 గంటల లోపు స్కూబా డైవింగ్, అండర్ వాటర్ స్పోర్ట్స్‌లో పాల్గొనకూడదు. అలాగే స్కూబా డైవింగ్, అండర్ వాటర్ స్పోర్ట్స్ ఆడిన 24 గంటల వరకూ విమాన ప్రయాణం చేయకూడదు. ఇలా చేస్తే, వాతావరణ పీడనంలో అకస్మాత్తుగా వచ్చిన మార్పులను చెవులు తట్టుకోలేక, ఇబ్బంది పెడ తాయి.

చెవుల్లో శబ్దాలు

ఈ సమస్యను వైద్య పరిభాషలో టిన్నిటస్ అంటారు. పబ్స్, పెళ్లిళ్లలో పెద్ద శబ్దాలకు బహిర్గతమైనప్పుడు తాత్కాలికమైన టిన్నిటస్‌కు గురవుతాం. ఈ సమస్య ఎనిమిది గంటలకు సర్దుకుంటుంది. కానీ చెవుల్లోని హియరింగ్ నాడి బలహీనపడినప్పుడు శాశ్వత టిన్నిటస్‌కు గురవుతాం! అలాగే టిన్నిటస్‌లో చెవిలో శబ్దాలు ఇతరులకు కూడా వినిపించే టిన్నిటస్ ఉంటుంది. కేవలం సమస్య ఉన్న వాళ్లకే చెవుల్లోపల శబ్దాలు వినిపించే పరిస్థితి ఉంటుంది. బయటి వాళ్లకు కూడా వినిపించే శబ్దాలను అందుకు కారణమైన సమస్యను చికిత్సతో సరిదిద్దడం ద్వారా ఆబ్జెక్టివ్ టిన్నిటస్‌ను నయం చేయవచ్చు. హీమోగ్లోబిన్ తగ్గినవాళ్లలో కూడా ఈ రకమైన టిన్నిటస్ ఉంటుంది. కానీ సమస్య ఉన్నవాళ్లకి మాత్రమే చెవిలో శబ్దాలు వినిపించే సబ్జెక్టివ్ టిన్నిటస్ సమస్యకు శాశ్వత చికిత్స లేదు. కాబట్టి, ఆ సమస్యకు అలవాటుపడే జీవనశైలిని అలవరుచుకోవలసి ఉంటుంది. అందుకోసం...

- ఏకాంతంగా, నిశ్శబ్దంగా ఉండే గదుల్లో నిద్రపోకుండా పరిసరాల శబ్దాలతో నిండిన ప్రదేశాల్లో నిద్రపోవడం అలవాటు చేసుకోవాలి.
- ఫ్యాన్ రెక్కలకు చిన్న కాగితాన్ని అంటించి, తిరిగేటప్పుడు శబ్దం వెలువడేలా చూసుకుని, ఆ గదిలో నిద్రపోవాలి
- ఏదైనా మ్యూజిక్ వింటూ నిద్రపోయే ప్రయత్నం చేయాలి.
- ఆందోళన వల్ల కూడా టిన్నిటస్ పెరుగుతుంది. కాబట్టి ఆందోళన తగ్గించుకోవాలి.
- వినికిడి లోపం ఉన్నా టిన్నిటస్ వస్తుంది. అలాంటి వాళ్లు హియరింగ్ ఎయిడ్స్ పెట్టుకోవాలి.
- టిన్నిటస్ మాస్కర్స్ పెట్టుకుని చెవుల్లోపలి శబ్దాలను తగ్గించుకోవచ్చు.

డాక్టర్ పి.వి.ఎల్.ఎన్ మూర్తి
పీడియాట్రిక్ ఇఎన్‌టి, స్నోరింగ్ అండ్ స్లీప్ అప్నియా సర్జన్,
స్టార్ హాస్పిటల్స్,
బంజారాహిల్స్, హైదరాబాద్



మీకు తెలుసా!



హెల్తీ పాప్ కార్న్

పాప్‌కార్న్ ఆరోగ్యకరమైన అల్పాహారం. ఇది తింటే ఎముకలు, కండరాలు, కణజాలం వృద్ధి చెందుతాయి. జీర్ణ శక్తి పెరుగుతుంది. దంతాలు బలపడతాయి.

యాంటాసిడ్స్

మంట మందులు మంచివేనా?

ఛాతీ, పొట్టలో మంటను చల్లార్చడం కోసం మందుల షాపుల్లో దొరికే యాంటాసిడ్లు కొని వాడేస్తూ ఉంటాం. నిజానికి ఈ అలవాటు వల్ల ఒరిగే ప్రయోజనం తాత్కాలికమే! యాంటాసిడ్‌లు తాత్కాలిక ఉపశమనాన్ని మాత్రమే అందించగలుగుతాయి తప్ప శాశ్వత పరిష్కారాన్ని అందించవు. ఎందుకంటే ఏ రకమైన యాంటాసిడ్ అయినా పొట్టలోని ఆమ్లాన్ని సమం చేయగలుగుతుందే తప్ప ఆమ్లం ఉత్పత్తిని తగ్గించలేదు. ఆమ్లం ఉత్పత్తి కారణంగా తలెత్తే అల్సర్ల నుంచి తక్షణ ఉపశమనం కోసం అరుదుగా యాంటాసిడ్లను వాడుకున్నా పర్వాలేదు. బ్యాక్టీరియా, కేన్సర్‌లు అల్సర్ కారకాలైతే యాంటాసిడ్‌లు వాడుతూపోతే సమస్య మరింత ముదిరి ప్రాణాలకే ప్రమాదం తలెత్తే అవకాశం ఉంటుంది. కాబట్టి తక్షణ ఉపశమనం కోసం యాంటాసిడ్లను వాడుతూ ఉండిపోకూడదు. అసిడిటీ



లక్షణాలు అడపా దడపా అందరిలో ఏదో ఓ సందర్భంలో కనిపిస్తాయి. అయితే ఒకవేళ వారంలో నాలుగైదు రోజులు అల్సర్ లక్షణాలు కనిపించినా, పదే పదే యాంటాసిడ్ వాడాల్సిన అవసరం పడుతున్నా ఆలస్యం చేయకుండా వైద్యుల్ని సంప్రదించాలి. యాంటాసిడ్‌లకు దుష్ప్రభావాలు కూడా ఉంటాయి. మెగ్నీసియం హైడ్రాక్సైడ్, అల్యూమినియం హైడ్రాక్సైడ్ అనే రెండు రకాల యాంటాసిడ్‌లతో వేర్వేరు దుష్ప్రభావాలు కనిపిస్తాయి. అల్యూమినియం హైడ్రాక్సైడ్ కలిగిన యాంటాసిడ్ వల్ల మలబద్ధకం, మెగ్నీసియం హైడ్రాక్సైడ్ కలిగిన యాంటాసిడ్ వల్ల వాంతులు, విరేచనాలు కలుగుతాయి. మనంతట మనం యాంటాసిడ్‌లను ఎంపిక చేసుకుంటే ఈ దుష్ప్రభావాలను బలవంతంగా భరించాల్సి ఉంటుంది. అలాకాకుండా వైద్యుల పర్యవేక్షణలో వాడితే ఆ దుష్ప్రభావాలను వైద్యుల దృష్టికి తీసుకువెళ్లగలుగుతాం! అప్పుడు వైద్యులు లక్షణాల ఆధారంగా ప్రత్యామ్నాయ మందులను సూచిస్తారు.

నడుము, కాళ్లు అందంగా!




నడుము కింది భాగం చక్కని ఫిట్‌నెస్ సంతరించుకోవాలంటే 'కెటిల్ స్క్వాట్స్' వ్యాయామం చేయాలి. ఈ వ్యాయామంతో తొడలు, పిక్కలు, పిరుదుల కండరాలు బలపడతాయి. ఈ వ్యాయామం ఎలా చేయాలంటే...

- రెండు కాళ్లు రెండు అడుగుల దూరంగా ఉంచి నిలబడాలి.
- తర్వాత 2 లేదా 5 కిలోల కెటిల్‌ను చేతుల్లోకి తీసుకుని నిలబడాలి.
- ఇదే భంగిమలో మోకాళ్లను వంచి, కిందకి కుంగి, పైకి లేవాలి.
- ఇలా 10 నుంచి 15 సార్లు 3 సెట్లు చేయాలి.

మంకిఫాక్స్‌తో జాగ్రత్త!

ఈ మధ్యకాలంలో మంకీఫాక్స్ వైరస్ ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో వ్యాపిస్తోంది. ప్రమాదకరమైన ఈ వైరస్ ఎలా వ్యాపిస్తుందో.. దాని నివారణ చర్యలేమిటో తెలుసుకుందాం.



ఫుడ్ ఫ్యాక్ట్

ఏ విటమిన్ ఎందుకోసం?

విటమిన్ల లోపం వ్యాధి నిరోధక శక్తిని సన్నగిల్లేలాచేసి ఇన్‌ఫెక్షన్లు సోకే ముప్పును పెంచుతుంది. ఈ లోపాన్ని సరిదిద్దుకోవడం కోసం సమతులాహారం తీసుకోవటంతోపాటు ఆ ఆహారం ద్వారా పొందే విటమిన్ల మీద అవగాహన ఏర్పరుచుకోవాలి.

విటమిన్ ఎ: ఎదుగుదల, రోగనిరోధక శక్తి, కంటిచూపుకు అవసరం. ఎ విటమిన్ లోపంవల్ల ఈ అంశాలకు సంబంధించిన బలహీనతలు తలెత్తుతాయి. మరిముఖ్యంగా కంటిచూపు మందగించటం, రేచీకటిలాంటి సమస్యలు బాధిస్తాయి.

విటమిన్ బి1: ఈ విటమిన్ డెఫిసియన్సీ వల్ల 'బెరిబెరి' రుగ్మత బాధిస్తుంది.



విటమిన్ బి5: పారాస్థీసియా అనే సమస్య తలెత్తుతుంది.

విటమిన్ బి7: పునరుత్పత్తి, వెంట్రుకలు, చర్మసంబంధ సమస్యలు వేధిస్తాయి.

విటమిన్ బి12: అనీమియా బారిన పడే ప్రమాదం ఉంది.

విటమిన్ సి: బలహీనత, బరువు తగ్గటం, ఒళ్లు నొప్పులు, స్కర్వీ సమస్యలు వేధిస్తాయి.

విటమిన్ డి: రికెట్స్, ఎముకల సమస్యలు.

విటమిన్ ఇ: నరాల సమస్యలు

విటమిన్ కె: రక్తం గడ్డ కట్టే సమస్యలు, ఎముకలు గుల్లబారటం.

గుడ్ ఫుడ్

ఇన్‌ఫ్లమేషన్‌కు అడ్డు కట్ట

ఆర్థ్రయిటిస్‌లో నొప్పి, వాపు సహజం. అయితే ఈ లక్షణాలను కొన్ని ఆహారపదార్థాలతో తగ్గించుకునే వీలుంది. అవేంటంటే...

బ్లూబెర్రీస్

వీటిలో సహజసిద్ధ రసాయనాలైన పాలిఫినాల్స్ ఉంటాయి. వీటిలో ఉండే యాంథోసయానిన్ పాలిఫినాల్స్ వల్లే బ్లూబెర్రీస్‌కు నీలి రంగు సమకూరుతుంది. ఈ పాలీఫినాల్స్ శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ను న్యూట్రలైజ్ చేసి, ఆక్సిడేటివ్ స్ట్రెస్ తగ్గించి, ఇన్‌ఫ్లమేషన్‌ను అరికడతాయి.

వాల్‌నట్స్

వీటిలోని అత్యధిక ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్లు, ఆల్ఫా లినోలిక్ యాసిడ్లు, ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తాయి. వాల్‌నట్స్‌లో ఉండే సి రియాక్టివ్ ప్రొటీన్, క్యాల్షియం, మెగ్నీషియం, జింక్, విటమిన్ ఇ పోషకాలు కీళ్ల సంబంధ ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించడానికి సహాయపడతాయి.



డార్క్ చాక్లెట్

వీటిలో సమృద్ధిగా ఉండే ఫ్లేవనాయిడ్స్ ఇన్‌ఫ్లమేషన్, వాపులను తగ్గిస్తాయి. చాక్లెట్ ఎంత డార్క్‌గా ఉంటే అంత ఎక్కువ ఫ్లేవనాయిడ్స్ ఉంటాయి. కాబట్టి 70% కోకో, అతి తక్కువ చక్కెరలను కలిగి ఉండే డార్క్ చాక్లెట్‌ను ఎంచుకోవాలి. అలాగే డార్క్ చాక్లెట్లు సెరటోనిన్ హార్మోన్ ఉత్పత్తిని పెంచి, కంటి నిండా నిద్ర పట్టడానికి సహాయపడతాయి.

అవేర్‌నెస్

పొంచి ఉన్న ప్లాస్టిక్

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో, ప్లాస్టిక్ కాలుష్య కారక జబ్బుల కారణంగా ప్రతి 30 సెకన్లకు ఒకరు ప్రాణాలు పోగొట్టుకుంటున్నట్టు సర్వేలు చెబుతున్నాయి. మన కంటికి కనిపించని అదృశ్య రూపాల్లో ప్లాస్టిక్ మన శరీరాల్లోకి చేరకుండా ఉండాలంటే, ఇదిగో ఇలా అప్రమత్తంగా వ్యవహరించాలి.

- **రేజర్ బ్లేడ్లు**

ఒక్కసారి వాడి పారేసే డిస్పోజబుల్ రేజర్లు ఇప్పుడు విరివిగా మార్కెట్లో దొరుకుతున్నాయి. పదే పదే కడిగి వాడే తీరిక లేని వారు ఇలాంటి రేజర్లను కొనేస్తున్నారు. నిజానికి ఈ వస్తువుల తయారీ, ప్యాకింగ్ కోసం ఎక్కువ ప్లాస్టిక్ వాడుతూ ఉంటారు. రేజర్ ప్యాకింగ్ కోసం ప్లాస్టిక్ రేపర్, ప్లాస్టిక్ కేస్ అదనంగా వాడతారు. రేజర్ పూర్తిగా ప్లాస్టిక్‌తోనే తయారవుతుంది. వీటికి బదులు సాధారణ రేజర్లు వాడవచ్చు. ఇవి లోహంతో తయారై ఉంటాయి. కేవలం బ్లేడ్ మాత్రమే మార్చుకోవలసి వస్తూ ఉంటుంది. ప్లాస్టిక్ డిస్పోజబుల్ రేజరు కంటే లోహపు రేజరు ఖరీదు ఎక్కువే కావచ్చు. కానీ ఒకసారి కొంటే ఆ తర్వాత కొనే బ్లేడ్ల ఖర్చు తక్కువే అనే విషయం గుర్తు పెట్టుకోవాలి.

- **రెడీ మీల్స్**

వండుకునే తీరిక లేనివాళ్లు రెడీమేడ్ ఆహారాన్ని ఆశ్రయిస్తూ ఉంటారు. ఈ ప్యాకెట్లను మైక్రోవేవ్ ఓవెన్లలో వేడి చేసుకుని తినేయవచ్చు. అయితే రెడీమేడ్ ఆహారం, ప్లాస్టిక్ డబ్బాలతో వస్తుంది. వాటి పైన రీసైకిల్ చేయడానికి వీలు లేని ప్లాస్టిక్ ఫిల్మ్ ఉంటుంది. ఇవన్నీ లామినేట్ చేసిన కార్డ్‌బోర్డ్ స్లీవ్‌లో ఉంటాయి. ఒక పూట ఆహారం కోసం ఇంతటి ప్లాస్టిక్ వాడకం అనవసరం. కాబట్టి మైక్రోవేవ్‌లో వేడి చేసుకుని తినగలిగే ఆహార పదార్థాల వాడకం తగ్గించాలి. డిమాండ్ తగ్గితే ఉత్పత్తీ తగ్గుతుంది. వీలైతే మైక్రోవేవ్‌లో వేడి చేసుకోగలిగే వీలున్న గిన్నెల్లో వండుకున్న పదార్థాలను



ఆఫీసుకు తీసుకువెళ్లి అవసరమైనప్పుడు వేడి చేసుకుని తినవచ్చు.

- **టేప్ వాడకం**

అతికించే స్టికీ టేప్ ప్లాస్టిక్‌తో తయారైనదే! దీనికి బదులుగా నారను వాడవచ్చు. కొబ్బరిపీచు కూడా వాడుకోవచ్చు. కొబ్బరిపీచుతో కట్టిన పూలగుత్తి అందంగా, ఆధునికంగా కూడా ఉంటుంది. రంగులతో కూడిన ఊలు, దారం, సిల్క్ రిబ్బన్లు, లేసులు కూడా వాడుకోవచ్చు.

- **పాప్‌కార్న్**

తేలికగా పగిలే వీలున్న గాజు వస్తువుల ప్యాకింగ్ కోసం థర్మకోల్ లేదా పాలీస్టైరీన్ (పీనట్స్) వాడుతూ ఉంటాం. కానీ ఇవి రీసైకిల్ చేయడానికి వీలు లేని ప్లాస్టిక్ ఆధారిత పదార్థాలే. కాబట్టి వీటికి బదులుగా పాప్‌కార్న్ వాడవచ్చు. లేదా కాగితాలను ఉండలుగా చేసి వాడవచ్చు.

- **కోన్ ఐస్‌క్రీమ్**

ఐస్‌క్రీమ్ తినాలనిపిస్తే ప్లాస్టిక్ కప్ బదులుగా కోన్‌ను ఎంచుకోండి. అప్పుడు ప్లాస్టిక్ కప్పులతో పర్యావరణానికి జరిగే నష్టం తగ్గుతుంది. కప్‌తో తినే ఐస్‌క్రీమ్ వల్ల కప్పు, దాంతో పాటు వచ్చే ప్లాస్టిక్ చెంచా ఒక్కసారి వాడకంతో వృథా అవడంతో పాటు పర్యావరణానికీ చేటు చేస్తున్నాయి. కాబట్టి ఐస్‌క్రీమ్ కోన్‌లోనే తినడం అలవాటు చేసుకోవాలి.

- **వెనిగర్ వాడకం**

స్నానపు గది శుభ్రం చేయడానికి టాయ్‌లెట్ క్లీనర్ల మీద ఆధారపడతాం. ఇవన్నీ ప్లాస్టిక్ డబ్బాల్లోనే వస్తాయి. పైగా కాస్త ఖరీదుగానూ ఉంటాయి. ప్లాస్టిక్ వేస్ట్‌తో పాటు ఖర్చూ తగ్గించుకోవాలి అనుకుంటే కొన్ని చెంచాల వెనిగర్‌ను నీళ్లలో కలిపి, రెండు నిమిషాలు ఆగి, ఆ నీటితో కడిగి చూడండి. టాయ్‌లెట్ క్లీనర్ కంటే మెరుగైన ఫలితం దక్కుతుంది.

- **పెద్ద మొత్తాల్లో**

వంటకు, ఇతర అవసరాలకు ఉపయోగించే వస్తువులు పెద్ద మొత్తాల్లో కొంటే ఒకే ప్లాస్టిక్ వస్తువును ఉపయోగించిన వాళ్లం అవుతాం. అయితే అంత మొత్తం ఒకరే వాడుకోవడం కష్టం కాబట్టి స్నేహితులతో కలిసి వెలను పంచుకుని, వస్తువులను కూడా పంచుకోవాలి. ఈ అలవాటు అలవరుచుకున్నా ప్లాస్టిక్ వాడకం తగ్గించినట్టే!

- **టీ బ్యాగ్స్**

టీ బ్యాగ్స్‌లో ప్లాస్టిక్ రహస్యంగా దాగి ఉంటుంది. టీ బ్యాగుల్లో పొడి నింపి, మూయడానికి పాలీప్రొపైలీన్ అనే ప్లాస్టిక్‌ను వాడతారు. టీ బ్యాగులు వాడి పారేసిన తర్వాత మట్టిలో కలిసిపోతాయి. కానీ వాటి మూతులు మూయడానికి వాడిన ప్లాస్టిక్ పర్యావరణంలో అలాగే ఉండిపోతుంది. కాబట్టి అలాంటి ప్లాస్టిక్ వాడని టీ బ్యాగులను ఎంచుకోవాలి. లేదా విడిగా టీపొడి వాడకం పెంచాలి.


- **ఫేస్ వైప్స్**

మేకప్ తొలగించడానికి, ముఖం తుడుచుకోవడానికి వైప్స్ వాడుతూ ఉంటాం. ద్రవపూరిత మేకప్ రిమూవర్లు, దూది కంటే వైప్స్ తక్కువ ప్రభావం కలిగి ఉంటాయి. పైగా ఇవి పర్యావరణంలో కలిసిపోకుండా, నల్లాలకు అడ్డుపడి, నీటి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తూ ఉంటాయి. కాబట్టి మేకప్ తొలగించడానికి అందుకోసం తయారైన వస్తువులను వాడడం మేలు. అలాగే వెంట ఒక చేతిరుమాలు ఉంచుకోవాలి.

విజయవాడ ● మంగళవారం 20 ఆగస్టు 2024

పండగ సీజన్‌లో విమానయానం భారం

25% వరకు పెరిగిన టికెట్ చార్జీలు



న్యూఢిల్లీ: ఈ ఏడాది పండగ సీజన్‌లో విమాన యానం మరింత భారం కానుంది. దీపావళి సమయంలో దేశీయంగా విమాన ప్రయాణానికి ముందస్తు బుకింగ్ చార్జీలు కీలక మార్గాల్లో సగటున 10-15 శాతం వరకు పెరిగాయి. ఓనం సమయంలో కేరళ లోని నగరాలకు టికెట్ ధరలు ఏకంగా 20-25 శాతం వరకు పెరిగాయని ట్రావెల్ పోర్టల్ ఇక్సిగో తాజా విశ్లేషణ నివేదిక వెల్లడించింది. ఈ దీపావళి సీజన్‌లో ఢిల్లీ-చెన్నై, ముంబై- బెంగళూరు, ఢిల్లీ-హైదరాబాద్ వంటి ప్రముఖ మార్గాలతో పాటు ఇతర ప్రదేశాలకూ ప్రయాణ టికెట్ చార్జీలు గత ఏడాదిలో ఇదే సీజన్‌తో పోలిస్తే సగటున 10-15 శాతం పెరిగాయని ఇక్సిగో గ్రూప్ కో-సీఈఓ రజనీశ్ కుమార్ అన్నారు. అయితే, కొన్ని మార్గాల్లో మాత్రం చార్జీలు 1-27 శాతం వరకు తగ్గాయని అన్నారు. ముంబై-అహ్మదాబాద్ రూట్ టికెట్ రేటు 27 శాతం తగ్గి రూ.2,508గా ఉందని, ముంబై-ఉదయ్‌పూర్ చార్జీ 25 శాతం తగ్గుదలతో రూ.4,890కి లభిస్తున్నదన్నారు. బెంగళూరు-హైదరాబాద్ మార్గంలో టికెట్ రేటు 23 శాతం తగ్గి రూ.3,383కి, ముంబై-జమ్ము రూట్లో చార్జీ 21 శాతం తగ్గుదలతో రూ.7,826కి జారుకుందన్నారు. కాగా, వచ్చే నెల రెండో వారంలో ఓనం పండగ సమయంలో విమాన ప్రయాణానికీ గిరాకీ అధికంగా ఉందని.. బుకింగ్‌లు, ట్రావెల్ సెర్చ్‌లు గత ఏడాది ఇదే పండగ సీజన్‌తో పోలిస్తే రెట్టింపయ్యాయని రజనీశ్ అన్నారు. కేరళలోని కోచి, కోజికోడ్, తిరువనంతపురానికి ఎయిర్ టికెట్ ధరలు 20-25 శాతం పెరిగాయన్నారు. కొన్ని మార్గాల్లో మాత్రం ధరలు 6-35 శాతం వరకు తగ్గాయన్నారు.

పండగ సీజన్‌లు, అత్యయిక పరిస్థితుల్లో ఎయిర్ చార్జీలు అనూహ్యంగా పెరగడంపై ఆందోళనలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో అనవసర టికెట్ ధరల పెంపుతో ప్రయాణికులు నష్టపోకుండా చూసేందుకు వారి ఇబ్బందుల పరిష్కారం కోసం ఆన్‌లైన్ వ్యవస్థను ప్రవేశపెట్టే ఆలోచనలో ఉన్నట్లు పౌర విమానయాన శాఖ మంత్రి కే రామ్మోహన్ నాయుడు ఈ మధ్యనే లోక్‌సభలో వెల్లడించారు. ప్రస్తుతం విమాన టికెట్ చార్జీలపై ప్రభుత్వ నియంత్రణ లేదు. ఈ విషయంలో ఎయిర్‌లైన్స్ స్వీయ నియంత్రణ పాటించాలని, టికెట్ ధరల పెంపు విషయంలో సున్నితంగా వ్యవహరించాలని ఇండస్ట్రీకి నిర్దేశించడం జరిగిందని మంత్రిత్వ శాఖ రాజ్యసభలో వెల్లడించింది.

ఈ ఏడాది దీపావళి సీజన్‌లో (అక్టోబరు 30- నవంబరు 5) ప్రయాణానికి ఎయిర్ టికెట్ ధరల అధికంగా పెరిగిన మార్గాలు

మార్గం	టికెట్ ధర(రూ.)	గత దివాలీ సీజన్‌తో పోలిస్తే పెరుగుదల(%)
ఢిల్లీ-చెన్నై	7,618	25
ముంబై-హైదరాబాద్	5,162	21
ఢిల్లీ-గోవా	5,999	19
ఢిల్లీ-అహ్మదాబాద్	4,930	19

ఈ ఏడాది ఓనం పండగ సమయంలో (సెప్టెంబరు 6-15) ప్రయాణానికి ఎయిర్ టికెట్ చార్జీలు అధికంగా పెరిగిన మార్గాలు

మార్గం	టికెట్ ధర(రూ.)	గత ఓనం సీజన్‌తో పోలిస్తే పెరుగుదల(%)
హైదరాబాద్- తిరువనంతపురం	4,102	30
ముంబై-కోజికోడ్	4,448	30

సెబీకి తప్పని మొండి బకాయిలు

క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీకీ మొండి బకాయిల బెడద తప్పడం లేదు. కంపెనీలు, వ్యక్తుల నుంచి రావాల్సిన ఫీజులు, పెనాల్టీల బకాయిలు ఏటికేటికీ పెరిగి పోతున్నాయి. ఎంత ప్రయత్నించినా ఈ బకాయిలు వసూలు కావడం లేదు. దీంతో ఈ ఏడాది మార్చి నాటికి 807 కేసులకు సంబంధించి రూ.76,293 కోట్లను వసూలు చేయడం కష్టమైన బకాయిలు (డీటీఆర్)గా తేల్చింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది నాలుగు శాతం ఎక్కువని 2023-24 వార్షిక నివేదికలో సెబీ పేర్కొంది. ఇందులో ఎక్కువ భాగం కోర్టులు నియమించిన కమిటీలతో ముడిపడి ఉన్న కేసులకు సంబంధించిన బకాయిలు. అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను ఉపయోగించినా వసూలు కాని బకాయిలను సెబీ డీటీఆర్‌లుగా వర్గీకరిస్తుంది

విష్ణు కెమికల్స్ చేతికి జయన్‌శ్రీ ఫార్మా

డీల్ విలువ రూ.52 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న స్పెషాలిటీ కెమికల్స్ తయారీ సంస్థ విష్ణు కెమికల్స్ తన వ్యాపార కార్యకలాపాలను విస్తరిస్తోంది. ఇందులో భాగంగా విశాఖపట్నానికి చెందిన జయన్‌శ్రీ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ (జేపీపీఎల్) కంపెనీని ఆస్తులు, అప్పులతో కలిపి (ఎంటర్‌ప్రైజ్ వాల్యూ) రూ.51.99 కోట్లకు కొనుగోలు చేసింది. ఈ మేరకు జేపీపీఎల్ సహా వాటాదారులతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది. కాగా సోమవారం నాడు విష్ణు కెమికల్స్ కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఈ డీల్‌కు ఆమోదం తెలిపింది. విశాఖలోని జేపీపీఎల్ ప్లాంట్.. విష్ణు కెమికల్స్ ప్లాంట్‌కు సమీపంలోనే ఉంది. జేపీపీఎల్ కొనుగోలుతో విష్ణు కెమికల్స్ తయారీ సామర్థ్యాలు మరింత పెరగనున్నాయి. అంతేకాకుండా జేపీపీఎల్ టేకోవర్‌తో విష్ణు కెమికల్స్ స్థిరాస్తుల విలువ మరో రూ.80 కోట్ల వరకు పెరగనుంది.

మైన్ డిటెక్షన్ సిస్టమ్‌కు పేటెంట్

జెన్ టెక్నాలజీస్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రక్షణ దళాలకు అవసరమైన సిమ్యులేషన్ యంత్రాలను డిజైన్ చేసి సరఫరా చేస్తున్న జెన్ టెక్నాలజీస్ మరో వినూత్న ఉత్పత్తిని అభివృద్ధి చేసింది. 'మైన్ డిటెక్షన్ సిస్టమ్' పేరుతో అభివృద్ధి చేసిన ఈ వినూత్న ఉత్పత్తికి కేంద్ర ప్రభుత్వం పేటెంట్ మంజూరు చేసింది. అత్యంత కచ్చితంగా మందుపాతరలను అమర్చడం, వాటిని కనిపెట్టి, తొలగించేందుకు ఈ వ్యవస్థ అత్యంత సురక్షితమైనదని కంపెనీ పేర్కొంది. జీపీఎస్/జీఐఎస్ టెక్నాలజీ ఆధారంగా ఈ మైన్ డిటెక్షన్ సిస్టమ్ పని చేస్తుంది. మైనస్ 25 డిగ్రీల సెల్సియస్ నుంచి 45 డిగ్రీల సెల్సియస్ వరకు ఈ సిస్టమ్ పని చేస్తుంది. సముద్ర మట్టానికి 15,000 అడుగుల ఎత్తు వరకు ఉన్న ప్రాంతాల్లోనూ ఈ టెక్నాలజీ సాయంతో మందుపాతరలు అమర్చటం, తొలగించడం చేయవచ్చని తెలిపింది.

హిండెన్‌బర్గ్ ఆరోపణలపై కమిటీ!

న్యూఢిల్లీ: సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్‌పై హిండెన్‌బర్గ్ రీసెర్చ్ తాజా ఆరోపణలు ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేశాయి. దీంతో ఈ సమస్య నుంచి బయటపడేందుకు, ఈ ఆరోపణల నిగ్గు తేల్చేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. ఈ కమిటీలో సెబీ అధికారులు కూడా ఉండే అవకాశం ఉంది. సెబీలో చేరాక కూడా బుచ్, సింగపూర్‌లో తాను నెలకొల్పిన రెండు కన్సల్టెన్సీల నుంచి ఆదాయం అందుకున్నట్టు హిండెన్‌బర్గ్ డాక్యుమెంట్లతో సహా బయటపెట్టింది. ఈ నేపథ్యంలో ఒక కమిటీ వేసి ఈ అంశాలపై విచారణ జరిపించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి సంబంధించి త్వరలోనే నిర్ణయం వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

క్యూ3లో చైనా ప్లాంట్‌లో ఉత్పత్తి షురూ

అరబిందో ఫార్మా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో (క్యూ3) చైనాలో ఏర్పాటు చేసిన ప్లాంట్‌లో వాణిజ్యపరంగా ఉత్పత్తి ప్రారంభించనున్నట్లు అరబిందో ఫార్మా చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ) సంతానం సుబ్రమణియన్ వెల్లడించారు. అయితే 2025-26 ఆర్థిక సంవత్సరంలో పూర్తి స్థాయిలో ఉత్పత్తిని చేపట్టే వీలుందని తెలిపారు. అమెరికాతో పాటుగా చైనాలో తమ ఉత్పత్తుల అనుమతి కోసం దరఖాస్తు చేయాలని చూస్తున్నట్లు సుబ్రమణియన్ పేర్కొన్నారు. అనుమతులు లభిస్తే చైనా మార్కెట్ ఆదాయాలు పెరుగుతాయని తెలిపారు. అయితే ఈ ఏడాది మాత్రం చైనా మార్కెట్ ఆదాయాలు స్వల్పంగా ఉంటాయన్నారు.

అక్టోబరు నుంచి పెన్-జీ ప్లాంట్ సామర్థ్యం పెంపు

ఆంధ్రప్రదేశ్‌లో రూ.2,400 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన పెన్సిలిన్ (పెన్-జీ) ప్లాంట్‌లో భారీ స్థాయిలో వాణిజ్యీకరణ అనుకున్న విధంగానే సాగుతోందని సుబ్రమణియన్ వివరించారు. అయితే డిమాండ్‌కు అనుగుణంగా అక్టోబరు నుంచి ఈ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాలను పెంచాలని యోచిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల పథకం (పీఎల్ఐ) అనుమతి పొందిన ఈ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 1,500 టన్నులని తెలిపారు.

డిపాజిట్ల సేకరణపై దృష్టి పెట్టండి

పీఎస్‌బీ చీఫ్‌లకు నిర్మల సూచన

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీ).. డిపాజిట్ల సేకరణకు గట్టిగా కృషి చేయాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. సోమవారం ఆమె పీఎస్‌బీల పనితీరుపై కార్యనిర్వహణాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత కొద్ది నెలల కాలంలో డిపాజిట్లలో 3 నుంచి 4 శాతం వృద్ధి మాత్రమే చోటు చేసుకుంటుండగా రుణాలు మాత్రం గణనీయంగా పెరిగిపోయి ఆస్తులు-రుణాల మధ్య తీవ్ర అంతరం ఏర్పడిందన్నారు. కస్టమర్లకు సమర్థవంతమైన సేవలందించేందుకు వారితో మెరుగైన సంబంధాలు కలిగి ఉండాలని నిర్మల సూచించారు. ప్రధానంగా గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో ఉద్యోగులు ప్రజలతో అనుసంధానమై ఉండేలా చూడాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,780 ▲	66,710 ▲	90,000 ▼
ముంబై	71,108 ▲	65,135 ▲	83,291 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

20వ తేదీ			
హైదరాబాద్	450	విజయవాడ	475
వరంగల్	452	గోదావరి	475
చిత్తూరు	508	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	107	విజయవాడ	113
వరంగల్	107	గుంటూరు	113
కరీంనగర్	107	ఒంగోలు	113
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	114
కర్నూలు	107	నెల్లూరు	114
విశాఖపట్నం	109	అనంతపురం	113
గోదావరి	113		

ధరలపై అప్రమత్తత తప్పదు

ఆర్‌బీఐ తాజా నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలో కాయధాన్యాలు, పప్పులు, వంటనూనెల ధరలు అదుపులోకి వస్తున్నాయి. ఆగస్టు నెలలో వీటన్నింటి ధరలు ఓ మోస్తరుగా తగ్గినట్టు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) "ఆర్థిక వ్యవస్థ తాజా స్థితి"పై విడుదల చేసిన నివేదికలో తెలిపింది. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో వస్తూత్పత్తులకు డిమాండ్ పుంజుకుంటోందని, దీని ప్రభావం వల్ల ప్రైవేట్ పెట్టుబడులు కూడా జోరందుకోవచ్చునని పేర్కొంది. జూన్ నెలలో 5.1 శాతం ఉన్న ద్రవ్యోల్బణం జూలై నెలలో 3.5 శాతానికి అంటే 1.54 శాతం మేరకు తగ్గింది. ప్రజలు అధికంగా వినియోగించే కూరగాయల్లో ఉల్లి, టమాటా ధరలు తగ్గినప్పటికీ బంగాళా దుంప ధర ఇంకా పైపైకే ఎగబాకుతోందని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ మైకేల్ దేవవ్రత పాత్రా నాయకత్వంలోని రచించిన ఆ వ్యాసంలో తెలిపింది. భవిష్యత్తులో కూడా ఆహార ధరల ఒత్తిడులున్నట్టయితే మాత్రం విధానపరమైన అప్రమత్తతను ఆర్‌బీఐ కొనసాగించక తప్పదని తేల్చిచెప్పారు. కాగా ఈ ఏడాది ప్రైవేట్ రంగ మూలధన పెట్టుబడులు 54 శాతం పెరిగి రూ.2.45 లక్షల కోట్లకు చేరే అవకాశం ఉందని ఆర్‌బీఐ పేర్కొంది.

డిపాజిట్ బీమాను సమీక్షించాలి: దేశంలో చిన్న డిపాజిటర్ల రక్షణ కోసం అమల్లోకి తెచ్చిన డిపాజిట్ బీమా గరిష్ఠ పరిమితిని ఎప్పటికప్పుడు పెంచుతూ ఉండాలని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ ఎం.రాజేశ్వరరావు మరో కార్యక్రమంలో మాట్లాడుతూ అన్నారు. డిపాజిట్ల విలువలో వృద్ధి, ద్రవ్యోల్బణం, పెరుగుతున్న ప్రజల ఆదాయ స్థాయిలు అన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ఈ పరిమితిని పెంచుతూ ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఈ పరిమితి రూ.5 లక్షలుంది. ఈ ఏడాది మార్చి 31 నాటికి దేశంలో సంపూర్ణ రక్షణ కల్పించిన డిపాజిట్ల సంఖ్య 97.8 శాతం ఉన్నదని ఆయన చెప్పారు. అంతర్జాతీయ బెంచ్‌మార్క్ 80 శాతంతో పోల్చితే ఇది చాలా ఎక్కువగానే ఉంది.

మిశ్రమంగా ముగిసిన సూచీలు

ముంబై: స్టాక్ మార్కెట్‌ను మరింత ముందుకు నడిపించే అంశాలేమీ లేకపోవడంతో సోమవారం ట్రేడింగ్ నిస్తేజంగా సాగింది. మదుపరులు వేచి చూసే ధోరణిని ప్రదర్శించడంతో రోజంతా స్వల్ప శ్రేణిలో కదలాడిన ప్రామాణిక సూచీలు చివరికి మిశ్రమంగా ముగిశాయి. సెన్సెక్స్ 12.16 పాయింట్ల నష్టంతో 80,424.65 వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 31.50 పాయింట్ల పెరుగుదలతో 24,572.65 వద్ద క్లోజైంది.

ఓలా ఎలక్ట్రిక్ షేరు దాదాపు రెండింతలు: ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ లిమిటెడ్ షేరు దూసుకెళ్తోంది. కంపెనీ షేరు సోమవారం మరో 10 శాతం వృద్ధితో అప్పర్ సర్క్యూట్ స్థాయి రూ.146.03కు చేరుకుంది. ఐపీఓ ధర రూ.76తో పోలిస్తే, ఇప్పటివరకు కంపెనీ షేరు 92.14 శాతం ఎగబాకింది.

1:5 గా ఆంధ్రా పేపర్ షేర్ల విభజన: ఆంధ్రా పేపర్ లిమిటెడ్.. ఒక్కోటి రూ.10 ముఖ విలువతో కూడిన షేరును రూ.2 ముఖ విలువ ఉండే 5 షేర్లుగా విభజిస్తున్నట్లు ప్రకటించింది. వచ్చే నెల 11వ తేదీని ఇందుకు రికార్డు డేట్‌గా నిర్ణయించింది. ఆ తేదీ నాటికి కంపెనీ రికార్డుల్లో వాటాదారులుగా ఉన్న అందరి షేర్లు.. రూ.2 ముఖ విలువతో కూడిన ఐదు షేర్లుగా మారతాయి.



'బరువు' బాధ్యత రెజ్లర్‌దే

వినేశ్ అప్పీల్ తిరస్కరణపై కాస్ వివరణ

న్యూఢిల్లీ: రెజ్లర్ వినేశ్ ఫొగట్ అప్పీల్‌ను ఎందుకు తిరస్కరించామనే విషయమై కోర్టు ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (కాస్) పూర్తి వివరణ ఇచ్చింది. అథ్లెట్లు తమ బరువు పరిమితిని దాటకుండా చూసుకోవాల్సిందేనని, ఎట్టి పరిస్థితిలోనూ మినహాయింపు ఇవ్వడం కుదరదని తేల్చి చెప్పింది. అయితే రెండో రోజు అదనపు బరువు కారణంగా అనర్హతకు గురికావడం కాస్త కఠినంగానే అనిపిస్తుంటుందని పేర్కొంది. ఇటీవల ముగిసిన పారిస్ ఒలింపిక్స్‌లో మహిళల 50 కిలోల విభాగంలో అదనంగా 100 గ్రాముల బరువు ఎక్కువగా ఉండడంతో వినేశ్ ఫైనల్‌కు దూరమైన సంగతి తెలిసిందే. అయితే తనకు కనీసం సంయుక్తంగా రజత పతకమైనా ఇవ్వాలని వినేశ్ చేసుకున్న అప్పీల్‌ను ఈనెల 14నే కాస్ తోసిపుచ్చిన సంగతి తెలిసిందే. అప్పీల్‌ను తిరస్కరిస్తున్నామంటూ ఒక్క వాక్యంతో తీర్పు కాపీలో కాస్ పేర్కొంది. దానిపై పూర్తి వివరణ ఇచ్చింది. 'నిబంధనలన్నీ స్పష్టంగా ఉన్నాయి. ప్రతీ అథ్లెట్ తమ గరిష్ఠ బరువుకు లోబడే ఉండాలి. ఇందులో ఎవరికీ మినహాయింపు ఉండదు. కనీసం గ్రాము బరువు ఎక్కువగా ఉన్నా అనుమతించడం కుదరదు. ఇందుకు పూర్తి బాధ్యత రెజ్లర్‌దే. వినేశ్ తనకు తానుగానే 50 కిలోల విభాగాన్ని ఎంచుకుంది. కాబట్టి ఆమెకు తన బరువు ఎంత ఉండాలో తెలుసు' అని కాస్ వివరించింది.

బిగ్‌బాష్ లీగ్ జాబితాలో హర్మన్, జెమీమా

మెల్‌బోర్న్: మహిళల బిగ్‌బాష్ లీగ్ డ్రాఫ్టింగ్ కోసం తమ ప్రారంభ జాబితాను నిర్వాహకులు విడుదల చేశారు. ఇందులో భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌తో పాటు జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ ఉన్నారు. అలాగే అంతర్జాతీయ స్టార్లు సోఫీ ఎకెల్‌స్టోన్, సుజీ బేట్స్, హీథర్ నైట్స్ లారా వోల్వార్ట్ నామినీ జాబితాలో చోటు దక్కించుకున్నారు. అక్టోబరు 27 నుంచి జరిగే ఈ లీగ్ కోసం వచ్చే నెల 1న ప్లేయర్ల ఎంపిక జరుగుతుంది. గతంలో మెల్‌బోర్న్ రెనెగేడ్స్ తరపున ఆడిన హర్మన్‌ను అదే జట్టు రిటైన్ చేసుకునే చాన్సుంది.

షమి ఆసీస్ టూర్‌కు వస్తాడు

జై షా

న్యూఢిల్లీ: గతేడాది వన్డే వరల్డ్‌కప్ తర్వాత గాయం కారణంగా భారత వెటరన్ పేసర్ మహ్మద్ షమి జట్టుకు దూరమయ్యాడు. ప్రస్తుతం అతను జాతీయ క్రికెట్ అకాడమీలో కోలుకుంటున్నాడు. అయితే ఈ ఏడాది చివర్లో జరిగే ఆస్ట్రేలియా టూర్‌కు అతను అందుబాటులో ఉంటాడని బీసీసీఐ కార్యదర్శి జై షా ఆశాభావం వ్యక్తం చేశాడు. 'టీమిండియా ఆసీస్ పర్యటనకు పూర్తి సన్నద్ధంగా ఉంది. రోహిత్, విరాట్ కూడా ఫిట్‌గానే ఉన్నారు. అయితే పేసర్ బుమ్రాకు మాత్రం కొంతకాలం విశ్రాంతినివ్వాలనుకున్నాం. ఇక మరో పేసర్ షమి కచ్చితంగా ఆసీస్ టూర్‌కు వెళతాడు. అనుభవజ్ఞుడైన అతడి సేవలు జట్టుకు ఎంతో అవసరం. అప్పటి వరకు అతను ఫిట్‌నెస్ నిరూపించుకుంటాడనే భావిస్తున్నాం' అని జైషా పేర్కొన్నాడు. అయితే షమి ఆసీస్ టూర్‌కు వెళ్లాలనుకుంటే ముందుగా రంజీల్లో ఆడి తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవాల్సి ఉంటుందని బెంగాల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు స్నేహాశిష్ గంగూలీ తెలిపాడు.

విరాట్, రోహిత్ ఎందుకు ఆడరు?

దులీప్ ట్రోఫీకి దూరమవడంపై గవాస్కర్ ప్రశ్న



న్యూఢిల్లీ: వచ్చే నెల 5 నుంచి జరిగే దులీప్ ట్రోఫీలో కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి ఆడకపోవడాన్ని మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ ప్రశ్నించాడు. ఇందులో పాల్గొనే నాలుగు జట్లలో చాలామంది అంతర్జాతీయ ఆటగాళ్లు ఆడబోతున్నారు. అయితే రోహిత్, విరాట్, పేసర్ బుమ్రాలకు మాత్రం బీసీసీఐ మినహాయింపు నిచ్చింది. జూన్ 28న టీ20 వరల్డ్‌కప్ ముగిశాక రోహిత్, విరాట్ ఈనెల 7 వరకు జరిగిన శ్రీలంకతో మూడు వన్డేల సిరీస్ మాత్రమే ఆడారు. ఇక సెప్టెంబరులో బంగ్లాదేశ్‌తో సిరీస్ వరకు వారికి ఎలాంటి మ్యాచ్ ప్రాక్టీస్ ఉండదు. 'దులీప్ ట్రోఫీకి సెలెక్టర్లు రోహిత్, విరాట్‌లను ఎంపిక చేయకుండా విశ్రాంతినిచ్చారు. దీంతో ఎలాంటి ప్రాక్టీస్ లేకుండానే వారు బంగ్లాతో సిరీస్ ఆడబోతున్నారు. బుమ్రాపై పని ఒత్తిడిని అర్థం చేసుకోవచ్చు. కానీ బ్యాటర్లు కాస్త సమయం క్రీజులో గడపాల్సి ఉంటుంది. 30+ వయస్సు వచ్చిన ప్లేయర్లు నిరంతరం ఆడితేనే అత్యున్నత ప్రమాణాలను కాపాడుకున్నట్టవుతుంది. కానీ విరామం ఎక్కువైతే కండరాల శక్తి తగ్గి తిరిగి లయ అందుకునేందుకు సమయం పడుతుంది' అని గవాస్కర్ సూచించాడు.

దీప్తి.. సూపర్ షో

లండన్‌దే 'హండ్రెడ్' ట్రోఫీ



లండన్: టీమిండియా ఆల్‌రౌండర్ దీప్తి శర్మ మరోసారి సూపర్ షోతో అదరగొట్టింది. మహిళల హండ్రెడ్ లీగ్ టోర్నమెంట్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో సత్తాచాటి తన జట్టు లండన్ స్పిరిట్‌కు ట్రోఫీ అందించింది. లార్డ్స్ వేదికగా ఆదివారం రాత్రి జరిగిన ఫైనల్లో లండన్ స్పిరిట్ 4 వికెట్ల తేడాతో వెల్ష్ ఫైర్ జట్టును ఓడించి తొలిసారి విజేతగా నిలిచింది. ఈ మ్యాచ్‌లో స్పిరిట్ గెలవాలంటే చివరి మూడు బంతుల్లో నాలుగు పరుగులు అవసరమవగా.. దీప్తి సిక్సర్ బాది తన జట్టును గెలిపించింది. ఈ మ్యాచ్‌లో ఓ వికెట్ కూడా తీసింది. ఈ సీజన్ టోర్నీలో బ్యాటింగ్‌లో ఆరు ఇన్నింగ్స్‌లు ఆడిన దీప్తి.. 132.50 స్ట్రయిక్ రేట్‌తో 212 పరుగులు చేసింది. ఇందులో అత్యధిక స్కోరు 46 నాటౌట్. ఇక, ఎనిమిది మ్యాచుల్లో బౌలింగ్ చేసిన దీప్తి.. 6.85 ఎకానమీతో 8 వికెట్లు పడగొట్టింది. ఇలా, టోర్నీ ఆద్యంతం అద్భుత ప్రదర్శన చేసి లండన్ జట్టు చాంపియన్‌గా నిలవడంలో కీలకపాత్ర పోషించింది.



ఈసారి పతకాల సంఖ్య పెంచాలి

పారా అథ్లెట్లతో ప్రధాని మోదీ సంభాషణ

న్యూఢిల్లీ: ఈనెల 28 నుంచి ఆరంభమయ్యే పారాలింపిక్స్‌లో పాల్గొనే భారత అథ్లెట్లతో ప్రధాని మోదీ ముచ్చటించారు. వీడియో కాల్ ద్వారా జరిగిన ఈ సంభాషణలో క్రీడా మంత్రి మన్సుఖ్ మాండవీయ కూడా పాల్గొన్నారు. 12 క్రీడాంశాల్లో గతంలో ఎన్నడూలేని విధంగా ఈసారి 84 మంది అథ్లెట్లు భారత్ తరఫున పాల్గొనబోతున్నారు. 'క్రీడల్లో ప్రతిభ చూపడమే కాకుండా పారా అథ్లెట్లు తమ అంకిత భావం, మానసిక శక్తి, కఠోర శ్రమతో ఎలాంటి కష్టమొచ్చినా అధిగమించగలమని నిరూపించారు. 140 కోట్ల మంది భారతీయులు ఆశీస్సులు మీకున్నాయి. గతంలో టోక్యో క్రీడల్లో సాధించిన విజయాలకు మించి పారిస్‌లో పతకాలు కొల్లగొడుతారని ఆశిస్తున్నా' అని ఈ సందర్భంగా ప్రధాని మోదీ పారా అథ్లెట్లకు శుభాకాంక్షలు తెలిపారు.

పసిడిపైనే గురి

పారాలింపిక్స్‌లో శీతల్‌పై భారీ అంచనాలు





రెండు చేతులు లేకపోయినా.. కాళ్లతోనే బాణాలు సంధిస్తూ కాంపౌండ్ ఆర్చరీలో అద్భుతంగా రాణిస్తున్న 17 ఏళ్ల శీతల్ దేవి భారత పారాలింపిక్స్ బృందంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. పారాలింపిక్స్‌లో పోటీ పడుతున్న భారత జట్టులో పిన్న వయసు అథ్లెట్ శీతలే కావడం విశేషం. పారిస్ క్రీడల్లో ఈసారి ఆర్చరీలో ఓవరాల్‌గా 140 మంది ప్లేయర్లు 9 స్వర్ణాల కోసం తలపడనున్నారు. టోక్యో పారాలింపిక్స్, ఆసియాడ్‌లో చైనా టేబుల్ టాపర్‌గా నిలిచింది. కానీ, ఇటీవలి కాలంలో భారత్ కూడా కాంపౌండ్ ఆర్చరీలో మేటి జట్లకు గట్టిపోటీ ఇస్తుంది. ఈ నేపథ్యంలో తొలిసారి పారాలింపిక్స్ బరిలోకి దిగుతున్న జమ్మూకశ్మీర్ ఆర్చర్ శీతల్‌పై భారత్‌కు భారీ అంచనాలున్నాయి. 2023 వరల్డ్ పారా ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో రజతం సాధించిన శీతల్.. పారిస్‌కు అర్హత సాధించింది. అనంతరం ఆసియా పారా క్రీడల్లో వ్యక్తిగత, మిక్స్‌డ్ ఈవెంట్లలో స్వర్ణాలతో అదరగొట్టింది. పారిస్ క్రీడల్లో ఈనెల 31వ తేదీనే వ్యక్తిగత విభాగం పతక రౌండ్ ఉండడంతో శీతల్ గ్రాండ్‌గా బోణీ కొడుతుందని భావిస్తున్నారు. పారాలింపిక్స్‌లో పతకం కొల్లగొట్టేందుకని శీతల్ తీవ్రంగా శ్రమిస్తోంది. పూర్తిగా సాధనలోనే మునిగితేలుతూ ఇంటినే మరిచిపోయింది. ఆమె ఇంటికి వెళ్లక దాదాపు ఏడాదిన్నర దాటిపోయిందట. పారిస్‌లో స్వర్ణ పతకం అందుకుని సగర్వంగా ఇంటికి వెళతానని శీతల్ ధీమాగా చెబుతోంది. పారాలింపిక్స్‌లో పతకం నెగ్గడం అంత సులువేం కాకపోయినా.. కొరియా, ఇరాన్ ఆర్చర్లకు దీటుగా పోరాడితే ఫలితం రాబట్టవచ్చని శీతల్ వెల్లడించింది. పారిస్ క్రీడల్లో భారత్ నుంచి శీతల్‌తో పాటు సరిత, రాకేష్ కుమార్ కూడా ఆర్చరీలో పతకాలు సాధించే అవకాశాలున్నాయి.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

స్పోర్ట్స్

సెమీస్‌కు రోనక్

అండర్-17 వరల్డ్ రెజ్లింగ్

అమ్మాన్ (జోర్డాన్): భారత కుర్రాడు రోనక్ దహియా అండర్-17 ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో పతకం దిశగా దూసుకెళుతున్నాడు. రోనక్ 110 కిలోల విభాగంలో సెమీఫైనల్లో ప్రవేశించాడు. ప్రీక్వార్టర్స్‌లో 8-1తో ఆర్థర్ మన్వెలియన్ (ఆర్మేనియా)ను చిత్తుచేసిన రోనక్.. తర్వాతి బౌట్‌లో ఆర్మేనియాకే చెందిన డానిల్ మస్లాకావుపై టెక్నికల్ సుపీరియారిటీ పద్ధతిలో ఓడించాడు. ఫైనల్ బెర్త్ కోసం హంగేరీ రెజ్లర్ జోల్టాన్ జాకోతో రోనక్ అమీతుమీ తేల్చుకోనున్నాడు.

ఫైనల్ సహా అన్ని మ్యాచ్‌లు పాక్‌లోనే!

● చాంపియన్స్ ట్రోఫీపై పీసీబీ చీఫ్ నఖ్వీ

న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు పాల్గొనే విషయమై ఇంకా అనిశ్చితి కొనసాగుతోంది. కానీ, 1996 తర్వాత తొలిసారి ఐసీసీ ట్రోఫీ ఆతిథ్య హక్కులను దక్కించుకొన్న పాకిస్థాన్ మాత్రం టోర్నీని భారీ ఎత్తున నిర్వహించడానికి చకచకా ఏర్పాట్లు చేస్తోంది. ఈ క్రమంలో చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ సహా అన్ని మ్యాచ్‌లు పాక్‌లోనే జరుగుతాయని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) చీఫ్ మొహసిన్ నఖ్వీ చెప్పాడు. టైటిల్‌ఫైట్‌కు లాహోర్ వేదిక కానుందన్నాడు. వచ్చేఏడాది ఫిబ్రవరి-మార్చిలో చాంపియన్స్ ట్రోఫీ జరగనుంది. కరాచీ, లాహోర్, రావల్పిండిలో మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆయా స్టేడియాల్లో పెద్దఎత్తున మరమ్మతులు చేపడుతున్నారు. కాగా, పాక్‌లో పర్యటించేందుకు టీమిండియా ఇప్పటి వరకు సమ్మతి తెలియజేయలేదు. మరోవైపు హైబ్రిడ్ విధానంలో టోర్నీని నిర్వహించేందుకు ఐసీసీ యోచన చేస్తుందనే వార్తలు కూడా వచ్చాయి. కానీ, వీటిపై ఇప్పటి వరకు స్పష్టత రాలేదు.

గొంతులో ఆహారం ఇరుక్కొని..

ఒలింపిక్ సైక్లిస్ట్ మృతి



న్యూఢిల్లీ: తాను తిన్న ఆహారమే ఆమెకు శాపమైంది. మృత్యురూపంలో కబళించింది. ఊహించని రీతిలో కన్నుమూసిన ఒలింపిక్ స్టార్ సైక్లిస్ట్ విషాదాంతమిది. వెనిజులాకు చెందిన మాజీ సైక్లిస్ట్ డానియెలా లారియల్ చిరినోస్ గొంతులో ఆహారం ఇరుక్కుపోవడంతో చనిపోయిందన్న వార్త క్రీడావర్గాల్లో విషాదం నింపింది. ఐదుసార్లు ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహించిన 50 ఏళ్ల డానియెలా.. శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతూ ఈనెల 11న మృతిచెందింది. అయితే, పోస్ట్‌మార్టమ్ రిపోర్టుల్లో ఆమె ఆహారవాహికలో ఘనాహారం కనిపించిందని వైద్యులు తేల్చారు. ఘనాహారం తిన్న తర్వాత తీవ్ర అస్వస్థతకు గురైన ఆమె.. శ్వాస తీసుకోవడానికి చాలా ఇబ్బందిపడి ప్రాణాలు విడిచిందని వెల్లడించారు.



రూ.కోటి చెక్కును లోకేశ్‌కు అందజేస్తున్న శిష్టా లోహిత్

అన్న క్యాంటీన్లకు శిష్టా లోహిత్ కోటి విరాళం

అమరావతి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తల సంక్షేమనిధి సమన్వయకర్త, పారిశ్రామికవేత్త శిష్టా లోహిత్ అన్న క్యాంటీన్ల నిర్వహణకు రూ.కోటి విరాళం ఇచ్చారు. టీడీపీ యువ నేత, మానవ వనరుల శాఖ మంత్రి లోకేశ్‌ను ఉండవల్లి నివాసంలో సోమవారం సాయంత్రం కలిసిన ఆయన ఈమేరకు చెక్కు అందజేశారు. లోహిత్‌ను ఈ సందర్భంగా లోకేశ్ అభినందించారు. చంద్రబాబు, లోకేశ్ స్ఫూర్తితో ఇక ముందు కూడా సంక్షేమ కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని శిష్టా లోహిత్ తెలిపారు.

ఉద్యోగులు బాధ్యతతో పనిచేయాలి: మంత్రి డోలా

అమరావతి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): 'ఎస్సీ వర్గాలకు విద్య, వైద్యం, ఆరోగ్యం అందించడంలో సాంఘిక సంక్షేమ శాఖ పనితీరు కీలకం. ఉద్యోగులు బాధ్యతతో పనిచేసి మెరుగైన ఫలితాలు సాధించాలి' అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వర్క్‌షాప్, సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 'గురుకుల పాఠశాలలు, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి. నాయుడుపేట గురుకుల పాఠశాలలో పరిశుభ్రత లేమి కారణంగా ఫుడ్ పాయిజన్ అయ్యి విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కావడానికి వీల్లేదు. వచ్చే నెల మొదటి వారం నుంచి అన్ని జిల్లాల్లో పర్యటిస్తా' అని ప్రకటించారు. కాగా, వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను మంత్రికి అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. 'రాష్ట్రంలోని 1,051 హాస్టళ్లలో 86 వేల సీట్లకు గాను... 32 వేల సీట్లు ఖాళీగా ఉన్నాయి. వాటిని సెప్టెంబరులోగా భర్తీ చేస్తాం' అని తెలిపారు.

వ్యాపార, ఉత్పత్తి కేంద్రాలుగా డ్వాక్రాలు: కొండపల్లి

అమరావతి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాలను స్వయం ఉత్పత్తి, వ్యాపార కేంద్రాలు మార్చే దిశగా సర్కార్ యోచిస్తోంది. గ్రామీణ పేదరిక నిర్మూలన, చిన్నతరహా పరిశ్రమల శాఖల సమన్వయంతో ముందుకు సాగేలా చర్యలు చేపట్టాం' అని సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ అంశాలపై సోమవారం సెర్ప్ సీఈఓ వీరపాండ్యన్, ఎంఎస్ఎంఈ శాఖల అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'రాష్ట్రంలో వివిధ రకాలుగా వచ్చే చెత్తను ఒకచోట చేర్చి స్వయం సహాయక సంఘాల ద్వారా బయోగ్యాస్ ఉత్పత్తి చేయాలనే ఆలోచనను ప్రభుత్వం చేస్తుంది. ఇందులో భాగంగా ఒక మండలంలో పైలట్ ప్రాజెక్టుగా బయోగ్యాస్ ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభిస్తారు. ఆపనై అన్ని మండల కేంద్రాల్లోనూ బయోగ్యాస్ ఉత్పత్తి చేపట్టనున్నారు' అని మంత్రి వివరించారు.

పోలవరం ఫైళ్ల దహనంపై కొనసాగుతున్న దర్యాప్తు

ధవళేశ్వరం, ఆగస్టు 19: తూర్పుగోదావరి జిల్లా పోలవరం ఎడమ ప్రధాన కాలువ కార్యాలయంలో ఫైల్స్ దహనంపై రాజుకున్న నిప్పు ఇప్పట్లో ఆరేలా కనిపించడం లేదు. ఈ ఘటనలో ఇప్పటికే నలుగురు సెక్షన్ అధికారులపై సస్పెన్షన్ వేటు పడగా ఇద్దరు డిప్యూటీ తహశీల్దార్లకు షోకాజ్ జారీ చేశారు. ఫైళ్ల దహనం నేపథ్యంలో సెలవులో ఉన్న పోలవరం భూ సేకరణ కార్యాలయ స్పెషల్ కలెక్టర్ ఎస్.సరళావందనం సోమవారం విధులకు హాజరయ్యారు. ఆమె పర్యవేక్షణలో దహనమైన ఫైల్స్ పత్రాలను పరిశీలించారు. మరోవైపు నలుగురు సెక్షన్ సిబ్బందిపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఈ ఘటనలో పోలవరం ఎడమ ప్రధాన కాలువ సెక్షన్‌కు చెందిన దిగువస్థాయి ఉద్యోగులను సస్పెండ్ చేయడం, సెక్షన్ అధికారులకు మాత్రం షోకాజ్‌తో సరిపెట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దిగువ స్థాయి ఉద్యోగులను బలిచేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పబ్లిక్ హెల్త్ ఈఎన్‌సీ రివర్స్

▸▸ ఆనందరావు స్థానంలో సీఈ గోపాలకృష్ణారెడ్డి

అమరావతి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సర్కారు హయాంలో అడ్డగోలుగా పదోన్నతి పొంది పబ్లిక్ హెల్త్ విభాగానికి ఇంజనీర్-ఇన్-చీఫ్ (ఈఎన్‌సీ) అయిన ఆనందరావును ప్రభుత్వం రివర్స్ చేసింది. జూనియర్‌గా ఉన్న ఆనందరావును అర్హత లేకపోయినా జగన్ సర్కారు అందలమెక్కించింది. అప్పట్లో ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న వైశ్రీలక్ష్మి చలువతో జూనియర్‌గా ఉన్న ఆనందరావును ఈఎన్‌సీగా నియమించారు. అప్పట్లో సీనియర్‌గా ఉన్న గోపాలకృష్ణారెడ్డిని ఈఎన్‌సీగా నియమించాల్సి ఉన్నప్పటికీ వైసీపీ ప్రభుత్వం ఆయనను సీఈగా నియమించింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అప్పట్లో జరిగిన తప్పులను సరిదిద్దుతూ.. సీఈగా ఉన్న గోపాలకృష్ణారెడ్డిని ఈఎన్‌సీగా నియమిస్తూ నిర్ణయం తీసుకుంది.

వర్షాల వల్ల దోమలు పెరగడంతోనే జ్వరాలు

▸▸ ఆస్పత్రుల్లో వైద్య సదుపాయాలు ఏర్పాటు చేశాం: ఆరోగ్యశాఖ

అమరావతి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గత నెలలో రాష్ట్రం మొత్తం విస్తారంగా కురిసిన వర్షాలు, వరదల కారణంగా.. నీటి నిల్వలు పెరిగి దోమల వృద్ధి చెందాయని.. దీనివల్లనే రాష్ట్రంలో జ్వరం కేసులు నమోదవుతున్నాయని ఆరోగ్యశాఖ వివరణ ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సదుపాయాలు ఏర్పాటు చేశామని తెలిపింది. 'ఆంధ్రజ్యోతి' పత్రికలో "రాష్ట్రానికి జ్వరం" అనే శీర్షికతో ఆదివారం ప్రత్యేక కథనం ప్రచురితమైంది. రాష్ట్రంలో జ్వరాలు తీవ్రస్థాయిలో ఉన్నాయి. ప్రతి ఇంటిలోనూ జ్వర పీడితులున్నారు. కాబట్టి ఆరోగ్యశాఖను అలెర్ట్ చేసేందుకు, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 'ఆంధ్రజ్యోతి' ఈ కథనాన్ని ప్రచురించింది. దీనిపై ఆరోగ్యశాఖ అధికారులు వివరణ ఇచ్చారు. కానీ, ఈ స్థాయిలో జ్వరాలు ప్రబలడానికి సరైన కారణాలు మాత్రం కారణాలు చెప్పలేదు. వింత వైరస్ ఏమిటన్న విషయాన్ని వెల్లడించలేదు. గతేడాది మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా కేసుల వివరాలు, ఈ ఏడాది కేసుల వివరాలు మాత్రం వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలో సదుపాయాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇటీవల కాలంలో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యాలతో పాటు ఇతర వైరల్ ఫీవర్లకు కూడా ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స అందించామని వివరించారు. ఆర్ఎంపీల ద్వారా అసంపూర్తి చికిత్స వలన వ్యాధి ముదిరి ప్రాణాంతకం కాకుండా ప్రభుత్వం రంగంలో అందుతున్న సేవలను వినియోగించుకుని నిర్ధారణ పరీక్ష ద్వారా పూర్తి చికిత్స తీసుకోవాలని ఆరోగ్యశాఖ సూచించింది.



డీఎస్‌జీగా బాధ్యతలు స్వీకరించిన పొన్నారావును అభినందిస్తున్న లాయర్లు

డిప్యూటీ సొలిసిటర్ జనరల్‌గా పొన్నారావు

▸▸ ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర న్యాయశాఖ

అమరావతి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టులో డిప్యూటీ సొలిసిటర్ జనరల్(డీఎస్‌జీ)గా న్యాయవాది పసల పొన్నారావు నియమితులయ్యారు. డీఎస్‌జీ హోదాలో ఆయన కేంద్ర ప్రభుత్వం తరఫున హైకోర్టులో వాదనలు వినిపించనున్నారు. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ సంయుక్త కార్యదర్శి షేర్‌సింగ్ డాగర్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. మూడేళ్లపాటు ఆయన ఈ పోస్టులో కొనసాగనున్నారు. గతంలో డీఎస్‌జీగా వ్యవహరించిన ఎన్.హరినాథ్ హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టడంతో పోస్టు ఖాళీ అయ్యింది. కాగా, సోమవారం సాయంత్రమే హైకోర్టులోని చాంబర్‌లో పొన్నారావు డీఎస్‌జీగా బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు సతీసమేతంగా పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు. పొన్నారావుది తిరుపతి జిల్లా, శ్రీకాళహస్తి మండలం, వీఎం పల్లి గ్రామం. తల్లిదండ్రులు పసల మహాలక్ష్మమ్మ, మోహనరావు. 2005లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకొని హైకోర్టులో ప్రాక్టీస్ చేస్తున్నారు. పలు సంస్థలకు స్టాండింగ్ కౌన్సిల్‌గా సేవలు అందించారు. కాగా, దళిత సామాజిక వర్గానికిచెదిన వ్యక్తి డిప్యూటీ సొలిసిటర్ జనరల్‌గా నియమితులు కావడం హైకోర్టు చరిత్రలో ఇదే మొదటిసారి కావడం విశేషం!.

13,326 పంచాయతీల్లో ఒకేరోజు గ్రామసభలు

▸▸ ఉపాధి పనులకు ఆమోదం తీసుకోవాలి

▸▸ వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి పవన్



జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్

అమరావతి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 13,326 గ్రామ పంచాయతీల్లో మునుపెన్నడూ లేని విధంగా ఈ నెల 23న ఒకేరోజు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడించారు. గ్రామసభపై సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా పరిషత్ సీఈఓలు, డీపీఓలు, డ్వామా పీడీలు, ఎంపీడీఓలు తదితరులతో పవన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ 'పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల్లో పనిచేయడమంటే గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, నిరుపేద కూలీలకు సేవ చేయడమేనని నేను నమ్ముతున్నా. ఈ నెల 23వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు 13,326 పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించడం ద్వారా ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించనున్నాం. ముఖ్యంగా ఉపాధి హామీ పథకంలో ప్రతి కుటుంబానికీ సంవత్సరంలో 100రోజుల పని దినాలను కల్పిస్తున్న అంశంపై అవగాహన కల్పించడంతో పాటు, అధికారులు కూలీలకు గల హక్కుల గురించి తెలియజేసి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రజలందరూ అధిక సంఖ్యలో గ్రామ సభలో పాల్గొనేలా చూడాలి. గ్రామసభలు అర్థవంతంగా జరగాలంటే గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామ సభల్లో మన స్ఫూర్తిగా పాల్గొనాలి. గ్రామ సచివాలయాల్లో పనిచేసే అందరూ ఉద్యోగులు గ్రామ సభల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనేలా చేసి సభలు విజయవంతానికి కృషి చేయాలి' అని పవన్ కోరారు.

ఫిర్యాదులొస్తే ఉపేక్షించేది లేదు..

2024-25లో చేపట్టనున్న ఉపాధి హామీ పనులకు సంబంధించి గ్రామసభలో చర్చించి గ్రామ సభ ఆమోదం తీసుకోవాలని పవన్ స్పష్టం చేశారు. 'ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులు పేద కూలీలకు, రైతులకు, గ్రామానికి ఉపయోగపడే ఉత్పాదకతను పెంపొందించే పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలి. పనుల నాణ్యత విషయంతో రాజీపడవద్దు. పథకం అమలుకు సంబంధించి కొంత మంది డ్వామా పీడీలు గ్రామాలను సందర్శించడం లేదు. పని ప్రదేశాలను తనిఖీ చేయడం లేదు. సోషల్ ఆడిట్ సభలకు హాజరు కావడంలేదు. ఏపీఓలు, ఈసీలు, టీఏలు తమ బాధ్యతలను సరిగా నిర్వర్తించడం లేదని ఫిర్యాదులొస్తున్నాయి. గ్రామ స్థాయిలో పనిచేసే అధికారులు బోగస్ అటెండెన్స్ సహా పనికిరాకుండా హాజరు వేయడం, పని చేయకుండా చేసినట్లు చూపడం, తక్కువ పనిచేసి ఎక్కువ పనిని నమోదు చేయడం వంటి అవకతవకలు చేస్తున్నట్లు గమనించాం. సోషల్ ఆడిట్ విభాగంలో కూడా అవినీతి జరుగుతోందని ఫిర్యాదులు వస్తున్నాయి. అవినీతి ఏ స్థాయిలో జరిగినా క్షమించేది లేదు. అదే సమయంలో సమర్థంగా పనిచేసే అధికారులు, సిబ్బందిని ప్రోత్సహిస్తాం. ఇక మీదట ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు అందరం సమష్టిగా కలిసి పనిచేసి మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాధిద్దాం' అని ఆకాంక్షించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్ మాట్లాడుతూ సోషల్ ఆడిట్ పబ్లిక్ హియరింగ్‌కు డ్వామా పీడీలు విధిగా హాజరు కావాలన్నారు.

కరువు రహిత రాష్ట్రమే లక్ష్యం

▸▸ రెండేళ్లు వర్షాల్లేకున్నా ఇబ్బంది రాకూడదు

▸▸ నదుల అనుసంధానంతోనే సమస్యకు చెక్

▸▸ సోమశిల సందర్శనలో సీఎం చంద్రబాబు



సోమశిల జలాశయాన్ని పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

నెల్లూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): 'కరువు రహిత రాష్ట్ర నిర్మాణమే నా లక్ష్యం. ఇందుకోసం శక్తివంచన లేకుండా పనిచేస్తా. రెండేళ్లు వర్షాలు లేకపోయినా ఇబ్బందులు లేకుండా భూమినే జలాశయంగా మార్చాలి. అందుకు నదుల అనుసంధానం ఒక్కటే మార్గం. వంశధార నుంచి పెన్నా వరకు నదుల అనుసంధానం జరగాలి. ఇది జరిగితే రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు నీరు అందించవచ్చు. పరిశ్రమలకు నీటి కొరత లేకుండా చూడవచ్చు. పోలవరం పూర్తయితేనే ఇది సాధ్యపడుతుంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. నెల్లూరు జిల్లాలోని సోమశిల జలాశయాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. దెబ్బతిన్న ఏప్రాన్ పనులను పరిశీలించి, మరమ్మతులకు గురైన గేట్లను చూసి ఆవేదన వ్యక్తం చేశారు. సోమశిలకు అత్యవసరంగా చేయాల్సిన మరమ్మతుల పనులను ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సోమశిల గ్రామంలో ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించి, ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేసిందన్నారు.

ఐదు చోట్ల ఫైళ్లు తగలబెట్టారు..

కరుడుగట్టిన నేరస్థులు రాజకీయాల్లోకి వచ్చారని, ప్రతిరోజూ గుడ్డ కాల్చి మీద వేసి తుడుచుకోండి అన్న ధోరణిలో ప్రవర్తిస్తున్నారని చంద్రబాబు మండిపడ్డారు. అసైన్డ్ భూములను దోచేసి అధికారం మారగానే మదనపల్లిలో ఫైళ్లు కాల్చేశారని దుయ్యబట్టారు. ఇప్పటివరకూ ఐదు చోట్ల ఫైళ్లు తగలబెట్టారని అన్నారు. తప్పు చేసిన వారిని వదిలేది లేదని, ఎక్కడ దాక్కున్నా శిక్షిస్తామని హెచ్చరించారు.

ఉచిత ఇసుక అమలుకు బాధ్యత

ఉచిత ఇసుక విధానం పారదర్శకంగా అమలు జరగాలని, అందుకు ఎన్డీయే కూటమి నేతలు బాధ్యత తీసుకోవాలని చంద్రబాబు సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం త్వరలోనే రైతులకు రూ.20వేలు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుడతామన్నారు. 2021లో వరదలకు సోమశిల ఏప్రాన్ దెబ్బతిని ప్రాజెక్టు మనుగడ ప్రమాదంలో పడితే కనీసం మరమ్మతులు కూడా చేయలేదు. రాష్ట్రంలోని ప్రాజెక్టులకు అత్యవసర మరమ్మతులకు రూ.300 కోట్లు అవసరమని ఇంజనీర్లు నివేదిక ఇచ్చారు. ఇందులో ఒక్క సోమశిలకే రూ.140 కోట్లు అవసరం. వర్షాకాలంలోపు సోమశిల ఏప్రాన్ పనులు పూర్తి చేసి ప్రాజెక్టుకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. సీఎం వెంట రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పీ నారాయణ, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, కావ్య కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆ యాడ్స్ సొమ్ములో సగమిచ్చినా..!

పులిచింతల గేటు కొట్టుకుపోయినప్పుడే నాటి సీఎం జగన్ బయటకు వచ్చి ఉంటే ఆ తర్వాత గుండ్లకమ్మ గేటు, అన్నమయ్య డ్యాం కొట్టుకుపోయేవి కావు. జగన్ పత్రికకు రూ.403 కోట్లు ప్రకటనల రూపంలో కట్టబెట్టారు. అందులో రూ.200 కోట్లు ఖర్చు చేస్తే ప్రాజెక్టులు ఈ దుస్థితిలో ఉండేవి కావు. తుంగభద్ర గేటు కొట్టుకుపోయిన వెంటనే స్పందించి మంత్రులతోపాటు ఇంజనీర్ కన్నమనాయుడును పంపాం. కర్ణాటక ప్రభుత్వంతో సమన్వయం చేసుకొని మూడు రోజుల్లోనే తుంగభద్ర స్టాప్‌లాగ్ ఏర్పాటు చేశాం. ఇదీ మా ప్రభుత్వ పనితీరు.

- చంద్రబాబు

అడ్మినిస్ట్రేషన్ నిద్రపోతోంది: సీఎం

సమాచార పౌర సంబంధాల శాఖ నెల్లూరు డీడీ సదారావుపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజావేదిక కార్యక్రమం ప్రారంభంలో మైక్ పనిచేయకపోవడంతో సీరియస్ అయ్యారు. 'ఏం చేస్తున్నారు? బీ క్లియర్.. అడ్మినిస్ట్రేషన్ ఇంకా నిద్రపోతోంది. నేను 95 సీఎం అని చెప్పినా ఇంకా మీకు అర్థం కాలేదు. అందుకే ఇప్పుడు యాక్షన్‌లోకి వస్తున్నా. టేకేర్ ఫుల్. నువ్వేమి ప్రేక్షకుడివి కాదు ఇక్కడ. ఇవన్నీ సూపర్‌వైజ్ చేసుకోవాలి. అడ్మినిస్ట్రేషన్ మొత్తం భ్రష్టుపట్టింది. మీరంతా ఇష్టారాజ్యం అనుకుంటున్నారు. మంచిది కాదిది. బాధ్యతాయుతంగా పనిచేయాలి. ఆ బాధ్యత అధికారులందరిపై ఉంది. గుర్తు పెట్టుకోండి' అని తీవ్రస్థాయిలో హెచ్చరించారు.



త్వరలోనే రైల్వే జోన్

భూమి కేటాయింపుపై పూర్తి సహకారాన్నిస్తున్న టీడీపీ ప్రభుత్వం

▸▸ తొలగిన అడ్డంకులు: రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్ కేంద్ర కార్యాలయ నిర్మాణానికి అవసరమైన సన్నాహాలు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నామని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. విశాఖపట్నం కేంద్రంగా త్వరలోనే రైల్వే జోన్ ఏర్పాటు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి సమన్వయంతో పని చేస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం, తెలుగు మీడియా విలేకరులు రైల్వేజోన్ ఏర్పాటు అంశంపై అడిగిన ప్రశ్నకు మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పందించారు. రైల్వేజోన్ కోసం భూమి కేటాయింపు, ఇతర అంశాలకు సంబంధించి ఏపీలోని టీడీపీ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కేటాయించిన భూమి విషయంలో వచ్చిన అభ్యంతరాల నేపథ్యంలో.. ఇరు ప్రభుత్వాల అధికారుల మధ్య చర్చలు సానుకూలంగా జరిగాయని తెలిపారు. రైల్వే జోన్ ఏర్పాటుకు ఉన్న దాదాపు అన్ని అడ్డంకులు తొలిగిపోయాయని చెప్పారు. జోన్ ఏర్పాటు ప్రక్రియ చాలా ముందుకు వచ్చిందని, ఆంధ్రుల ఆశలు త్వరలోనే నెరవేరబోతున్నాయని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

పాపం పసివాళ్లు!





కైలాసపట్నంలోని వసతిగృహం, నిర్వాహకుడు పాస్టర్ కిరణ్‌కుమార్

(మొదటి పేజీ తరువాయి)

జరిగింది. ఆశ్రమ నిర్వాహకుడు ఓ ఫంక్షన్‌లో మిగిలిన ఆహారం తీసుకొచ్చి రాత్రి పిల్లలకు పెట్టారు. ఆహారం కలుషితం కావడంతో ముగ్గురు పిల్లలు మృత్యువాతపడ్డారు. మొత్తం 80 మంది వరకు అస్వస్థతకు గురవగా, వీరిలో 42 మందిని తల్లిదండ్రులే వివిధ ఆస్పత్రులకు తరలించారు. వీరిలో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. పూర్తి వివరాలివీ.. కైలాసపట్నంలో ముకుడిపల్లి అర్జునరావు అనే వ్యక్తి 2010లో క్రిస్టియన్ ప్రార్థనా మందిరం ప్రారంభించారు. అర్జునరావు 2013లో మరణించడంతో ఆయన కుమారుడు పాస్టర్ కిరణ్‌కుమార్ దాని నిర్వహణ చూస్తున్నారు. ఒకవైపు ప్రార్థనా మందిరాన్ని నిర్వహిస్తూనే.. మరోవైపు ట్రస్ట్‌ను నెలకొల్పి దాని ఆధ్వర్యంలో అనాథాశ్రమం నడుపుతున్నారు. పేరుకు అనాథాశ్రమమే అయినా.. ఇక్కడ ఉన్న పిల్లందరికీ తల్లిదండ్రులు ఉన్నారు. భోజనం పెట్టడంతోపాటు మంచి చదువు చెప్పిస్తానని పాస్టర్ కిరణ్‌కుమార్ చెప్పడంతో తల్లిదండ్రులు పిల్లలను పంపించారు. ప్రస్తుతం ఆ ఆశ్రమంలో 91 మంది ఉన్నారు. ఈ నెల 17న కోటవురట్ల మండలం పందూరులో ఒక ఫంక్షన్‌కు పాస్టర్ కిరణ్‌కుమార్ హాజరయ్యారు. ఆ ఫంక్షన్‌లో మిగిలిపోయిన బిర్యానీ, కూరలు తెచ్చి రాత్రి ఆశ్రమంలో విద్యార్థులకు పెట్టారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి విద్యార్థులకు వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. అయితే బాధిత విద్యార్థులను ఆస్పత్రికి తీసుకువెళ్లకుండా వారి తల్లిదండ్రులకు కిరణ్ సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రులు వచ్చి తమ పిల్లలను ఇళ్లకు తీసుకువెళ్లారు. అలా వెళ్లిన వారిలో చింతపల్లి మండలం నిమ్మలపాలెంకు చెందిన తాంబేల్లి జాషువా (7), జామ్మి చెట్టుకు చెందిన కొర్రా సాధ(7), కొయ్యూరు మండలం రేవళ్లపాలెంకు చెందిన గెమ్మెల భవానీ అలియాస్ నిత్య (8) మృతిచెందారు. మరో 42 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

అనుమతుల్లేకుండానే...

కలుషితాహారం పిల్లలను కాటేసిన విషయం తెలియగానే... అధికారులు, పోలీసులు హుటాహుటిన అనాథాశ్రమానికి వచ్చారు. ఆ ట్రస్ట్‌కు ఎటువంటి అనుమతులూ లేవని గుర్తించారు. సాయంత్రం 4గంటలకు అనాథాశ్రమానికి జేసీ జాహ్నవి, నర్సీపట్నం ఆర్డీవో జయరామ్ వచ్చారు. విద్యార్థులకు సరైన మౌలిక సదుపాయాలు లేవని గుర్తించారు. పదేళ్ల నుంచి ట్రస్ట్ నడుపుతున్నా విద్యాశాఖాధికారులు గుర్తించకపోవడంపై జాయింట్ కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయని అడిగిన అధికారులకు కిరణ్‌కుమార్ సమాధానం ఇవ్వలేదు.

సకాలంలో ఆస్పత్రికి తరలించి ఉంటే..

అస్వస్థతకు గురై వివిధ ఆస్పత్రులో చేరిన విద్యార్థుల పరిస్థితి కొంత నిలకడగానే ఉన్నా.. విశాఖ కేజీహెచ్‌లో చేరిన 14 మంది చిన్నారుల్లో ఏడుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. సకాలంలో వైద్యం అందకపోవడమే ఇందుకు కారణంగా వైద్యులు చెబుతున్నారు. 'ఆహారం తీసుకున్న తరువాత చిన్నారులకు అనేకసార్లు వాంతులు, విరేచనాలయ్యాయి. శరీరం నుంచి ఖనిజ లవణాలైనా క్లోరైడ్, పొటాషియం, సోడియం, బైకార్బొనేట్ బయటకు వెళ్లిపోయాయి. దీంతో పూర్తిగా డీహైడ్రేట్ అయి షాక్‌లోకి వెళ్లారు. కిడ్నీ పనితీరు మందగించడంతోపాటు సీరం క్రియాటినిన్ లెవెల్స్ నాలుగు నుంచి ఐదు వరకు పెరిగాయి. గుండె వేగం కూడా తగ్గింది' అని వైద్యులు చెబుతున్నారు. అస్వస్థతకు గురైన వారిలో జస్సిక (9) పరిస్థితి ఆందోళనకరంగా ఉందంటున్నారు.

విచారణకు కలెక్టర్ ఆదేశాలు

ఆశ్రమంలో చిన్నారులు మృతిచెందిన ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ చెప్పారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను సోమవారం ఆమె పరామర్శించారు. హాస్టల్ నుంచి ఇళ్లకు వెళ్లిన పిల్లలను ఆస్పత్రికి తరలించాలని చింతపల్లి తహసీల్దార్‌ను ఆదేశించారు.

పాస్టర్ కిరణ్ అరెస్టు: ఎస్పీ

ఎస్పీ దీపిక మాట్లాడుతూ సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. ఆ ఆహార పదార్థాల శాంపిల్స్ సేకరిస్తామని తెలిపారు. ముగ్గురు పిల్లల మృతికి కారణమైన పాస్టర్ కిరణ్‌కుమార్‌ను అరెస్టు చేశామన్నారు. ఆయనపై సెక్షన్ 304 పార్టు2 కింద కేసు నమోదు చేశామని చెప్పారు.

ఈ తరహా హాస్టళ్ల మూసివేత: హోంమంత్రి

విశాఖపట్నం: అనారోగ్యానికి గురైన చిన్నారులకు కేజీహెచ్‌లో మెరుగైన వైద్యం అందిస్తున్నామని హోంమంత్రి వంగలపూడి అనిత చెప్పారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న 14 మంది చిన్నారులను ఆమె సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆహారాన్ని ఎవరు పంపించారు? సమోసాలు ఎవరు తెచ్చారనే దానిపై విచారణ చేస్తున్నట్టు చెప్పారు. ఈ తరహా హాస్టళ్లను మూసివేస్తామని చెప్పారు.

రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా

▸▸ చిన్నారుల మృతి కలచివేసింది: చంద్రబాబు

▸▸ పిల్లల బాధ్యత ప్రభుత్వమే తీసుకుంటుందని ప్రకటన

విశాఖపట్నంలో విషతుల్యమైన ఆహారం తిని ముగ్గురు పేద పిల్లలు చనిపోవడం తీవ్ర వేదన కలిగించిందని చంద్రబాబు అన్నారు. మరణించిన చిన్నారుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని ఆయన ప్రకటించారు. నెల్లూరు జిల్లా సోమశిలలో నిర్వహించిన ప్రజావేదిక సభలో ఉండగా చంద్రబాబుకు ఈ విషయం తెలిసి దిగ్భ్రాంతి చెందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అస్వస్థతకు గురైన పిల్లలకు నాణ్యమైన వైద్యం అందించి, వారిని సురక్షితంగా ఇంటికి చేర్చే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు. అవసరమైతే వీరికి కూడా ఆర్థిక సాయం చేస్తామన్నారు. వెంటనే ఆర్ఫాన్‌ను మూసివేయాలని ఆదేశించామని, అందులోని పిల్లలందరినీ ప్రభుత్వమే చదివిస్తుందని ప్రకటించారు. ఈ ఘటనలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఆదేశించినట్లు చెప్పారు.

కోనా.. ఇది తగునా!

▸▸ వైసీపీ మాజీ ఎమ్మెల్యే ప్రోద్బలంతో భూదందా

▸▸ పేద ముస్లిం మహిళ భూమిని కాజేసిన వైసీపీ గూండాలు

▸▸ గతంలో నిందితులకే పోలీసుల వత్తాసు

▸▸ కూటమి ప్రభుత్వం రాకతో బాధితులకు ధైర్యం

▸▸ న్యాయం చేయాలంటూ కలెక్టర్‌కు వినతి



బాపట్ల, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఆమె ఒక పేద ముస్లిం మహిళ. ఆమె పేరు మీద ఉన్న అరెకరం పొలమే కుటుంబానికి జీవనాధారం. ఆ భూమి దశాబ్దాల నుంచి వారి స్వాధీనంలోనే ఉంది. వైసీపీ గూండాల కన్ను ఆ భూమిపై పడటం, వారికి మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి సహకారం అందించడంతో రాత్రికి రాత్రే నకిలీ దస్తావేజులు పుట్టించి భూమిని కాజేశారు. బాపట్ల కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో బాధితురాలు ఫిర్యాదు చేశారు. బాపట్ల మండలం మరుప్రోలువారిపాలెంలో సర్వే నంబరు 213/6, 99/19లో 0.50 సెంట్ల భూమిని ఏళ్ల కిందటే రహ్మతున్నీసా పేరు మీద రిజిస్ట్రేషన్ చేశారు. ఆమె కుటుంబం నగరం మండలం పెద్దమట్లపూడిలో నివసిస్తుండటంతో మరుప్రోలువారిపాలంలోని ఆ స్థలంపై వైసీపీ నేతల కన్ను పడింది. నకిలీ దస్తావేజులు పుట్టించి దాదాపు రూ.4 కోట్ల విలువ చేసే 19 సెంట్ల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆధారాలతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

అడుగడుగునా నిబంధనల ఉల్లంఘనే....

గతేడాది వైసీపీ నేతలు నక్కల నాగార్జున, మరుప్రోలు చెన్నకేశవరెడ్డి, కోకి రామిరెడ్డి పేర్లమీద ఆ భూవిని రిజిస్ట్రేషన్ చేశారు. తొలుత ఓ వ్యక్తి పేరుతో తప్పుడు ధ్రువీకరణ పత్రం సృష్టించారు. ఎనీవేర్ రిజిస్ట్రేషన్‌ను ఉపయోగించుకుని బాపట్ల మండలంలోని ఆ స్థలానికి నరసరావుపేట పరిధిలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ఫోన్ చేసి వైసీపీ నేతల పేర్ల మీద ఆ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయాల్సిందిగా సిఫారసు చేశారని బాధితురాలు ఆరోపిస్తున్నారు. కాగా, ఆ స్థలం స్వాధీన ధ్రువీకరణ పత్రాన్ని 2011లో జారీ చేసినట్లు రికార్డుల్లో చూపించగా, అది జారీ చేసిన వీఆర్వో 2010లోనే రిటైరవ్వడం గమనార్హం.



రిటైర్డ్ అయిన వీఆర్‌వో పేరు మీద 2011లో జారీ చేసిన స్వాధీన ధ్రువీకరణ పత్రం

గతంలోనూ..

పేద ముస్లిం మహిళ స్థలాన్ని కాజేసిన వైసీపీ నేతలపై గతంలోనూ పలు భూ దందా ఆరోపణలు ఉన్నట్లు తెలుస్తోంది. అధికారాన్ని అడ్డుపెట్టుకుని వారు చేసిన భూదందాలకు కీలక నేతల అండదండలు లభించడంతో ఎంతోమంది బాధితులుగా మిగిలినట్లు సమాచారం. అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని గతంలోనే నరసరావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, వైసీపీ గూండాలకే వత్తాసు పలికారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో న్యాయం జరుగుతుందనే నమ్మకంతో ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేస్తున్నానని తెలిపారు.



ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అందించిన ఫిర్యాదును చూపిస్తున్న బాధితురాలు రహంతున్నీసా, భర్త మస్తాన్




సీఎం చంద్రబాబుకు రాఖీ కడుతున్న గద్దె అనురాధ, మాజీ మంత్రి పీతల సుజాత తదితరులు, సీఎం చంద్రబాబుకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు




తనకు రాఖీలు కట్టేందుకు వచ్చిన మహిళలతో మంత్రి లోకేశ్

మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడతాం

- ఆడపడుచులకు చంద్రబాబు రాఖీ శుభాకాంక్షలు

అమరావతి-ఆంధ్రజ్యోతి/తాడేపల్లి టౌన్, ఆగస్టు 19: మహిళల ఆత్మగౌరవం, భద్రత, అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. సోమవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా తెలుగింటి ఆడపడుచులకు శుభాకాంక్షలు తెలిపారు. 'టీడీపీ ఆది నుంచీ మహిళల పక్షపాతి. వారికి ఆస్తిలో సమాన హక్కులు కల్పించడమే కాకుండా ప్రభుత్వపరంగా ఇచ్చే పథకాలను, ఆస్తులను వారి పేరుపైనే ఇచ్చే సంస్కరణ తెచ్చింది కూడా టీడీపీనే. మహిళా సాధికారత కోసం డ్వాక్రా సంఘాలు, బాలికా విద్యకు ప్రోత్సాహం, స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు వంటి విప్లవాత్మక నిర్ణయాలతో మహిళా సంక్షేమం కోసం కృషి చేశాం' అని ప్రకటించారు. రాఖీ పండుగ సందర్భంగా సోమవారం ఉండవల్లిలోని సీఎం నివాసంలో మాజీ మంత్రి పీతల సుజాత, కృష్ణా జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ, టీడీపీ డ్వాక్రా, అంగన్వాడీ విభాగం అధ్యక్షురాలు ఆచంట సునీత, కంభంపాటి శిరీష, పలువురు బ్రహ్మకుమారీలు.. బాబుకు రాఖీలు కట్టారు.

అక్కచెల్లెమ్మల సంక్షేమానికి కృషి: లోకేశ్

మహిళా సంక్షేమం, భద్రతకు కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తుందని మంత్రి లోకేశ్ తెలిపారు. ఉండవల్లిలోని నివాసంలో మంగళగిరి నియోజకవర్గానికి చెందిన తెలుగు మహిళలు ఆయనకు హారతి ఇచ్చి రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి మహిళా సాధికారతకు అన్ని విధాలా అండగా నిలిచామన్నారు. 'నా అక్కచెల్లెళ్లందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు. సొంత అన్నలా ఆదరించారు. తమ్ముడిలా అభిమానించారు. మీ అనురాగమే నా చేతికి రక్షాబంధనం. మీ సంక్షేమం కోసం, మీకు భద్రత, గౌరవం కల్పించడం కోసం కృషి చేసి, రాఖీ పండుగ కానకగా అందించడమే మీ సోదరుడిగా నా బాధ్యత' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

బంధాలను వదులుకోలేని మధుర బంధమే రక్షా బంధన్: షర్మిల



అమరావతి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వెలకట్టలేని బంధాలను, వదులుకోలేని అనుబంధాలను గుర్తు చేసే మధుర బంధమే రక్షాబంధనమని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల పేర్కొన్నారు. సోమవారం రక్షా బంధన్‌ను పురస్కరించుకుని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు. "నా జీవితంలో, రాజకీయ ప్రస్థానంలో అడుగడుగునా అండగా ఉంటూ.. రక్త సంబంధం లేకపోయినా వైఎస్ఆర్ అనే బంధంతో నాకు తోబుట్టువుల్లాగా నిలబడి, అనుక్షణం కంటికి రెప్పలా కాపాడుకుంటూ.. రక్షణగా నిలబడిన ప్రతి అన్నకు, ప్రతి తమ్ముడికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు. వెలకట్టలేని అనుబంధాలను గుర్తు చేసే మధురబంధమే రక్షాబంధనం. దేవుడు మిమ్మల్ని చల్లగా చూడాలని ప్రార్థన" అని షర్మిల పేర్కొన్నారు.

ఏచూరికి అస్వస్థత.. ఎయిమ్స్‌లో చేరిక



న్యూఢిల్లీ, ఆగస్టు 19: మాజీ రాజ్యసభ సభ్యుడు, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సోమవారం సాయంత్రం అస్వస్థతకు గురయ్యారు. న్యూమోనియాతో బాధపడుతున్న ఆయన్ను కుటుంబసభ్యులు హుటాహుటిన ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేర్పించారు. అత్యవసర విభాగంలో ఆయనకు వైద్యులు చికిత్స అందించారు. ప్రస్తుతం సీతారాం ఏచూరి ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నట్లు సమాచారం.

వేగం పెంచేద్దాం!

(మొదటి పేజీ తరువాయి)

భూమి పూజ చేశారు. అలాగే ఐదు పరిశ్రమల స్థాపనకు సంబంధించి ఆయా సంస్థల ప్రతినిధులతో ఒప్పందాలపై సంతకాలు చేశారు. అనంతరం వివిధ కంపెనీల సీఈవోలతో నిర్వహించిన సమావేశంలో చంద్రబాబు ప్రసంగించారు. విజన్-2047 లక్ష్యంతో ముందుకెళ్తున్నామని.. రానున్న పాతికేళ్లలో 15 శాతం వృద్ధిరేటు సాధించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని వెల్లడించారు.పీ-4 మోడల్ (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్ట్‌నర్‌షిప్) అమలుతో పేదరికం నిర్మూలన దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. టాప్ టెన్‌లో ఉన్న వారు.. దిగువన 20 శాతం ఉన్న పేదలకు చేయూతనందించాలని పిలుపిచ్చారు. జనాభా నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని, అదే సమయంలో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తున్నామన్నారు. నైపుణ్య గణనకు శ్రీకారం చుట్టామని చెప్పారు. దేశంలో 1991లో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టగా.. 1995లో తాను ఉమ్మడి రాష్ట్రంలో వాటిని ప్రారంభించానని తెలిపారు. ఐటీ రంగం భారత్‌ను ప్రపంచపటంలో మేటిగా నిలబెడుతుందని ఆనాడే తాను చెప్పానని గుర్తు చేశారు. ఈరోజు వాటి ఫలితాలను అందరం చూస్తున్నామన్నారు. 2029 నాటికి భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదుగుతుందన్న నమ్మకం తనకుందన్నారు. శ్రీసిటీ ప్రత్యేక ఆర్థిక మండలి 4.5 బిలియన్ డాలర్ల పెట్టుబడులు సాధించడం గొప్ప విషయమని ప్రశంసించారు. 8 వేల ఎకరాల్లో ఏర్పాటైన శ్రీసిటీలో ఆటోమేటివ్, ఎలక్ట్రానిక్స్, ఫాస్ట్-మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ (ఎఫ్ఎంసీజీ), ఫుడ్ ప్రాసెసింగ్ తదితర 220 పరిశ్రమలు నడుస్తున్నాయన్నారు. వాటి ద్వారా 4 బిలియన్ డాలర్ల ఎగుమతులు జరుగుతున్నాయని తెలిపారు. పరిశ్రమల స్థాపనకు అత్యంత అనుకూలమైన ప్రదేశమని చెప్పారు.

వేల ఉద్యోగావకాశాలు..

శ్రీసిటీలో చంద్రబాబు సోమవారం రూ.1,570 కోట్ల పెట్టుబడులతో 8,480 మందికి ఉద్యోగావకాశాలు కల్పించే 15 పరిశ్రమలను ప్రారంభించారు. రూ.900 కోట్ల పెట్టుబడులతో 2,740 మందికి ఉపాధినిచ్చే ఏడు పరిశ్రమల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.1,213 కోట్ల పెట్టుబడులతో 4,060 మందికి ఉపాధి కల్పించే ఐదు పరిశ్రమల స్థాపనకు సంబంధిత సంస్థల ప్రతినిధులతో ఎంవోయూలపై సంతకాలు చేశారు. శ్రీసిటీలో నూతనంగా నిర్మించిన ఫైర్ స్టేషన్‌నూ ప్రారంభించారు. హైటెక్ పోలీసు స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

సీబీఎన్ అంటేనే బ్రాండ్: మంత్రి భరత్

గత సీఎం జగన్ ఒక్కసారి కూడా శ్రీసిటీని సందర్శించలేదని పరిశ్రమల మంత్రి టీజీ భరత్ అన్నారు. దానికి భిన్నంగా చంద్రబాబు అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే శ్రీసిటీకి వచ్చారని తెలిపారు. సీబీఎన్ అంటేనే ఒక బ్రాండ్ అని అన్నారు. కార్యక్రమంలో హోం మంత్రి అనిత, డీజీపీ ద్వారకా తిరుమలరావు, శ్రీసిటీ ఎండీ రవి సన్నారెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మీరే ముఖ్య అతిథిగా రావాలి!

ఇసుజు కంపెనీ దేశంలోనే అతిపెద్ద వాణిజ్య వాహనాల ఉత్పత్తిదారుగా మారింది. మా పరిశ్రమలో 20 శాతం ఉద్యోగాలు మహిళలకు కేటాయించాం. ప్రస్తుతం లక్ష వాహనాలను మార్కెట్లో విడుదల చేయడానికి సన్నద్ధమయ్యాం. ఆ కార్యక్రమానికి మీరే (చంద్రబాబు) ముఖ్య అతిథిగా రావాలని కోరుకుంటున్నాం.

- మిట్టల్, ఇసుజు ప్రతినిధి

చంద్రబాబు స్వయంగా రావడం సంతోషకరం!

ఈ ఏడాది ఎన్నికల్లో ఘన విజయం సాధించి ముఖ్యమంత్రి అయిన చంద్రబాబుకు అభినందనలు. శ్రీసిటీలో పరిశ్రమల స్థాపనకు మంచి మౌలిక సదుపాయాలు కల్పించారు. ఇప్పటికే మా దేశానికి చెందిన పలు కంపెనీలు ఇక్కడ పరిశ్రమలు నెలకొల్పాయి. ఇప్పుడు మరింతగా మద్దతిచ్చి ప్రోత్సహించేందుకు ఆయన స్వయంగా రావడం సంతోషంగా ఉంది.

- సాడోసన్, జపనీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్

బాబు పిలుపుతో భాగస్వాములయ్యాం!

గతంలో చంద్రబాబు పిలుపుతో సన్‌రైజ్ ఏపీలో భాగస్వాములయ్యాం. 2016లో శ్రీసిటీలో ఏకంగా నాలుగు ప్లాంట్లు ఏర్పాటు చేశాం. ఇప్పుడు మళ్లీ ఆయన సీఎం కావడం సంతోషంగా ఉంది.

- అజయ్, టోరే ప్రతినిధి

బాబు చొరవతో ప్రపంచ దేశాలకు డైకిన్ ఉత్పత్తులు

రాష్ట్రానికి జపాన్ కంపెనీలు రావాలని గతంలో చంద్రబాబు ఆకాంక్షించారు. ఆయన చొరవతో 2017లో డైకిన్ కంపెనీ శ్రీసిటీలో పరిశ్రమ ఏర్పాటు చేసింది. తొలుత 75 ఎకరాల్లో.. తర్వాత మరో 35 ఎకరాల్లో.. ఆపై ఇంకో 200 ఎకరాలకు విస్తరించాం. ఇపుడు శ్రీసిటీ నుంచీ డైకిన్ కంపెనీ ప్రపంచంలోని అన్ని ప్రాంతాలకూ ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది.

- నిమ్మగడ్డ కుటుంబరావు, డైకిన్ ప్రతినిధి

వైద్య విద్యార్థినులకు రక్షా బంధన్

- మహిళా పీజీలతో రాఖీలు కట్టించుకున్న జూనియర్ డాక్టర్లు
- జీజీహెచ్‌లో పటిష్ఠ రక్షణకు చర్యలు: ఎస్పీ, జేసీ



గుంటూరులో జూనియర్ డాక్టర్లకు రాఖీలు కడుతున్న వైద్య విద్యార్థినులు

గుంటూరు (మెడికల్), ఆగస్టు 19: రక్షా బంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో సోమవారం జూనియర్ డాక్టర్లు.. మహిళా పీజీ విద్యార్థినులతో రాఖీలు కట్టించుకొని సోదర భావాన్ని ఘనంగా చాటారు. వారికి రక్షణగా ఉంటామని ప్రమాణం చేశారు. కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కళాశాల ఆస్పత్రిలో ట్రైనీ పీజీ వైద్యురాలి హత్యాచార ఘటనను తీవ్రంగా నిరసిస్తూ గుంటూరు జీజీహెచ్‌లో జూనియర్ డాక్టర్లు చేపట్టిన ఆందోళన కార్యక్రమాలు సోమవారం ఎనిమిదో రోజుకు చేరాయి. ఓపీ సేవలు, ఎలెక్టివ్ సేవలు బహిష్కరించిన సూపర్ స్పెషాలిటీ విద్యార్థులు, మెడికల్ పీజీ విద్యార్థులు, హౌస్ సర్జన్లు నల్లబ్యాడ్జీలు ధరించి తమ నిరసన కొనసాగించారు. వైద్యులకు రక్షణ కల్పించే సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమలు చేసే వరకు తాము చేపట్టిన ఆందోళనను కొనసాగిస్తామని జూనియర్ డాక్టర్లు స్పష్టం చేశారు. కోల్‌కతా ఘటనలో హంతకులకు కఠిన శిక్షలు విధించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని నినాదాలు చేశారు.

ప్రధాన విభాగాల దగ్గర పోలీసు రక్షణ: ఎస్పీ

గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో ప్రధాన వైద్య విభాగాల వద్ద పోలీసు రక్షణ ఏర్పాటు చేస్తామని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం గుంటూరు జిల్లా అధికార యంత్రాంగం ప్రభుత్వాస్పత్రి శుశృత హాల్‌లో జేసీ భార్గవ్‌తేజ్ అధ్యక్షతన అత్యవసర సమీక్ష సమావేశం జరిగింది. కోల్‌కతాలో ట్రైనీ పీజీ విద్యార్థిని హత్యాచార ఘటన నేపథ్యంలో ప్రభుత్వాస్పత్రిలో వైద్యులకు రక్షణ కల్పించాలని కోరుతూ జూనియర్ డాక్టర్లు ఆందోళన చేస్తుండగా, జిల్లా యంత్రాంగం ఈ సమావేశం నిర్వహించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ.. త్వరలోనే వైద్య కళాశాలతో సమన్వయం చేసుకొని పటిష్ఠమైన రక్షణ చర్యలు చేపడతాని వెల్లడించారు. జేసీ భార్గవ్ తేజ్ మాట్లాడుతూ.. పోలీసులు, నగర పాలక సంస్థ అధికారులతో చర్చించి జీజీహెచ్‌లో చేపట్టాల్సిన భద్రత చర్యలను చర్చించి, పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వై కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రాత్రిళ్ల అసాంఘిక శక్తులు ఆస్పత్రిలో చొరబడుతున్నాయని తెలిపారు. ఇలాంటి వారిపై పోలీసులు నిఘా ఉంచాలన్నారు.

రవాణా శాఖలో అక్రమ వసూళ్లపై విచారణ

- దీనిలో ఒక అధికారిది కీలక పాత్ర
- దర్యాప్తులో అందరి పాత్ర బయటపడుతుంది
- అక్రమాలు బయటపడతాయనే ఫైళ్ల దగ్ధం ఘటనలు: అచ్చెన్న



అమరావతి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో రవాణా శాఖలో భారీగా అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని, వాటిపై పూర్తిస్థాయి విచారణ జరిపి నిగ్గు తేలుస్తామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. సోమవారం ఆయన ఇక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'రాష్ట్రాన్ని ఐదు జోన్లుగా విడగొట్టి ఒక్కో జోన్‌కు ఒక్కో అధికారిని పెట్టి మరీ అక్రమ వసూళ్లు చేశారు. ఇసుక, మైనింగ్, రేషన్ బియ్యం, అక్రమ మద్యం.. ఇలా దేనినీ వదలకుండా ప్రతి అక్రమ రవాణాకు సహకరించి దానికి బదులుగా భారీగా వసూళ్లు చేశారు. ఈ దందాకు ఒక ఉన్నతాధికారి పూర్తి అండదండలు ఇచ్చాడు. కీలక పాత్ర పోషించాడు. ఆయన పేరు చెప్పడం కూడా నాకు ఇష్టం లేదు. ఈ దుర్మార్గాలపై విచారణ వేస్తున్నాం. అందులో అందరి పాత్రలు బయటకు వస్తాయి. ఎవరినీ వదిలిపెట్టేది లేదు' అని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో అనేక దుర్మార్గాలకు పాల్పడిన అధికారులు, వారి కింద తాబేదారులు తమ తప్పులు బయటకు రాకుండా చూడటానికి కార్యాలయాల్లో ఫైళ్లు తగలబెట్టడాన్ని ఒక మార్గంగా ఎంచుకొన్నారని ఆయన ఆరోపించారు. అందుకే గత కొద్ది రోజుల్లో ఇటువంటి ఘటనలు అనేకం జరిగాయని తెలిపారు. 'గత ఐదేళ్ల అక్రమాలను వెలికితీస్తామని మేం చెప్పిన తర్వాత భయంతో రికార్డులు తగలబెడుతున్నారు. పోలవరం ప్రాజెక్టు కింద అసలు నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా వైసీపీ నేతలకు, వారి అనుచరులకు అడ్డగోలుగా దోచిపెట్టారు. దీని కోసం తప్పుడు రికార్డులు సృష్టించారు. ఇవి బయటకు వచ్చే పరిస్థితి కనిపించడంతో ఆ ఫైళ్లను తగలబెట్టారు. తిరుపతిలో కూడా స్వామి వారి ధనాన్ని అందినకాడికి దోచుకొన్నారు. కోట్లు స్వాహా చేశారు. అవన్నీ బయటకు వస్తాయన్న భయంతో అక్కడ కూడా రికార్డులు తగలబెట్టారు. ఫైళ్లను తగలబెడుతున్న వ్యవహారాలను ముఖ్యమంత్రి చంద్రబాబు సీరియస్‌గా తీసుకొన్నారు. దీనికి బాధ్యులైన వారిని ఎవరినీ వదిలిపెట్టేది లేదు. కఠినంగా ఉండబోతున్నాం' అని అచ్చెన్న చెప్పారు. జగనన్న భూ సర్వే బోగస్ సర్వేగా మారిందని, అడ్డగోలుగా రికార్డులు మార్చడానికి దానిని వాడుకొన్నారని మంత్రి విమర్శించారు. 'సర్వే పేరుతో ప్రజల మధ్య తగాదాలు పెట్టారు. కొత్త సమస్యలు సృష్టించారు. వారసత్వంగా వచ్చిన భూములు వారి ఆధీనంలోనే ఉన్నా రికార్డుల్లో పేర్లు మార్చివేశారు. దీనితో గ్రామాల్లో ఒకరిపై తగాదాలు మొదలయ్యాయి. వైసీపీ ప్రభుత్వం వ్యవస్థలను చిన్నాభిన్నం చేసింది. వినతుల స్వీకరణ కార్యక్రమం ఎక్కడ పెట్టినా కుప్పలు తెప్పలుగా ఫిర్యాదులు వస్తున్నాయి' అని ఆయన చెప్పారు. బేవరేజెస్ కార్పొరేషన్‌కు గతంలో ఎండీగా చేసిన వాసుదేవరెడ్డి అవినీతి వ్యవహారాలపై అనేక ఫిర్యాదులు అందాయని, వాటిపై విచారణ జరుగుతోందని తెలిపారు.

మధుసూదనరెడ్డి అక్రమాలకు అంతే లేదు!

- ఫైబర్‌నెట్ మాజీ ఎండీపై సస్పెన్షన్ వేటు
- ఆయనపై సీఐడీ దర్యాప్తు
- సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు
- మధుసూదనరెడ్డి అమరావతిని వీడొద్దని ఆదేశం
- ఆయనకు సహకరించిన గత, ప్రస్తుత ఉద్యోగులపైనా విచారణ

అమరావతి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఫైబర్‌నెట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్ఎఫ్ఎల్)లో మాజీ ఎండీ ఎం.మధుసూదనరెడ్డి అంతులేని అక్రమాలకు పాల్పడ్డారని రాష్ట్రప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రైవేటు వ్యక్తులు, కొంతమంది సిబ్బందితో కలసి ఆర్థిక అక్రమాలకు పాల్పడినందుకు ఆయనపై సస్పెన్షన్ వేటు వేసింది. ఆయనపై సీఐడీ దర్యాప్తునకు ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మధుసూదనరెడ్డిపై ప్రభుత్వం వేటు వేస్తున్నట్లు 'ఆంధ్రజ్యోతి' ఈ నెల 17వ తేదీనే (శనివారం) కథనం ప్రచురించింది. మధుసూదనరెడ్డి అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేపడతామని.. ఆయనకు సహకరించిన గత, ప్రస్తుత ఉద్యోగులూ విచారణ ఎదుర్కొంటారని సీఎస్ స్పష్టం చేశారు. 2008 ఐఆర్‌ఎస్ బ్యాచ్‌కు చెందిన మధుసూదనరెడ్డి 2019లో ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి పగ్గాలు చేపట్టాక రాష్ట్రానికి డిప్యుటేషన్‌పై వచ్చారు. కొంతకాలం రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఎండీగా పని చేశారు. ఆ సమయంలోనూ ఆయనపై నిధుల దుర్వినియోగానికి సంబంధించిన ఆరోపణలు వచ్చాయి. ఆ తర్వాత ఏపీ ఫైబర్‌నెట్ లిమిటెడ్ ఎండీగా నియమితులయ్యారు. ఇక అక్కడ పలు అక్రమాలకు.. ఆర్థికంగా నీతిబాహ్యమైన యాజమాన్య విధానాలకూ పాల్పడ్డారని.. ఇవి కార్పొరేషన్‌ను తీవ్రంగా ప్రభావితం చేశాయంటూ వివిధ సంఘాలు, సమూహాల నుంచి ఫిర్యాదులు వచ్చాయని సీఎస్ తన ఉత్తర్వులో తెలిపారు. వాటిపై చేపట్టిన ప్రాథమిక విచారణలో.. ఆయన ఆర్థిక అక్రమాలకు సాక్ష్యాధారాలు లభించాయని వెల్లడించారు. 'ప్రైవేటు వ్యక్తులు, పలువురు ఎస్ఎఫ్ఎల్ పూర్వ, ప్రస్తుత ఉద్యోగులతో కలసి మధుసూదనరెడ్డి సమాచారాన్ని తారుమారు చేసి ప్రభుత్వానికి అందజేస్తూ.. అక్రమాలు బయటకు రాకుండా సాక్ష్యాలను తుడిచేసే ప్రయత్నం చేశారు. ఫైబర్‌నెట్ అక్రమాల్లో ఆయన ప్రమేయం ప్రత్యక్షంగా ఉందని కూడా తేలింది. ఈ వ్యవహారంపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలన్న నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది. అందువల్ల మధుసూదనరెడ్డిని తక్షణమే సస్పెండ్ చేస్తున్నాం' అని ప్రకటించారు. ఆయన కొందరు ఫైబర్‌నెట్ ఉద్యోగులతో కలసి అక్రమాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేశారని.. ఎండీగా పలువురు ప్రైవేటు వ్యక్తులను ఉద్యోగాల్లోకి తీసుకున్నారని.. వీరు అక్రమాలు బయటకు రాకుండా సాక్ష్యాలు చెరిపేశారని.. ఫైళ్లు మాయం చేశారని సీఎస్ పేర్కొన్నారు. ఫైళ్లు, సాక్ష్యాల ధ్వంస రచన మధుసూదనరెడ్డి ప్రమేయంతోనే జరిగినట్లు గుర్తించామని.. మాజీ, ప్రస్తుత ఉద్యోగులపైనా సమగ్ర విచారణ చేపడతామని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై కేంద్ర సర్వీసు నిబంధనలు సబ్ రూల్(1)లోని 20ని అనుసరించి.. సబ్‌రూల్ 10 మేరకు మధుసూదనరెడ్డిని వెంటనే సస్పెండ్ చేస్తున్నట్లు వెల్లడించారు. సస్పెన్షన్ సమయంలో ముందస్తు అనుమతి లేకుండా రాజధాని అమరావతిని విడిచి వెళ్లేందుకు వీల్లేదన్నారు.

మధుసూదనరెడ్డి డిప్యుటేషన్ పొడిగించండి..

ఫైబర్‌నెట్ ఎండీగా మధుసూదనరెడ్డి పాల్పడిన అక్రమాలపై సీఐడీతో దర్యాప్తు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఇందుకోసం ఆయన రాష్ట్రంలోనే ఉండాలి. ఈ నెల 22వ తేదీతో ఆయన డిప్యుటేషన్ కాలపరిమితి ముగియనుంది. ఈ నేపథ్యంలో డిప్యుటేషన్ కాలపరిమితిని మరో ఆరు నెలలు పొడిగించాలంటూ కేంద్ర సిబ్బంది-శిక్షణ శాఖ (డీవోపీటీ)కి రాష్ట్రప్రభుత్వం లేఖ రాసింది. సహేతుక కారణాలతో డిప్యుటేషన్ పొడిగించాలంటూ రాష్ట్రం కోరితే.. కేంద్రం సహజంగానే ఆమోదిస్తుంది. కేంద్రం ఆమోదం లభించేలోగా.. సీఐడీ దర్యాప్తునకు ఆదేశించాలని ప్రభుత్వం నిశ్చయించింది.

మధుసూదన రెడ్డిపై

సస్పెన్షన్ వేటు

ఇప్పటికే ఫైబర్‌నెట్ ఎండీగా తొలగింపు

జగన్ అండతో నాడు ఫైబర్‌నెట్‌లో ఇష్టారాజ్యం

వైసీపీ కార్యకర్తలకు భారీగా కొలువులు



10

మాజీ ఎండీ మధుసూదనరెడ్డిపై సస్పెన్షన్ వేటు వేసినట్లు ఈ నెల 17వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

నాలుగేళ్లు చెలరేగిపోయారు!

మధుసూదనరెడ్డి ఫైబర్‌నెట్ సంస్థను సొంతజాగీరుగా చేసుకుని నాలుగేళ్లపాటు చెలరేగిపోయారు. గత సీఎం జగన్ 2020 మే 19న ఆయన్ను ఏరికోరి ఫైబర్‌నెట్ ఎండీగా నియమించారు. ఆయన ఫైబర్‌నెట్ కార్యాలయాన్ని బంధువులు, సన్నిహితులతో నింపేశారు. కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి సిఫారసు చేసిన వారందరికీ అర్హత లేకున్నా ఉద్యోగాలిచ్చారు. మధుసూదనరెడ్డి రాక ముందు నెలనెలా రూ.17 కోట్ల రాబడి వచ్చేది. అప్పట్లో కనెక్షన్‌కు నెలవారీ రూ.199 వసూలు చేశారు. మధుసూదనరెడ్డి అడుగుపెట్టాక.. రూ.599కు పెంచారు. అయినా నెలసరి ఆదాయం 12 కోట్లు మాత్రమే వచ్చేది. ఆయనకు ముందు 9,70,000 కనెక్షన్లు ఉండేవి. గత నాలుగేళ్లలో ఏడున్నర లక్షలకు పడిపోయాయి. అందులోనూ.. నాలుగు లక్షలకే లెక్కలు చూపించారు. మిగిలిన కనెక్షన్లను అధికారిక లెక్కల్లో చూపకుండా.. వసూలు చేసుకున్న డబ్బు జేబులో వేసుకున్నారు. మధుసూదనరెడ్డి బాధ్యతలు చేపట్టక ముందు ఫైబర్‌నెట్‌లో కోర్ స్టాఫ్ 120 మంది మాత్రమే ఉండేవారు. వారి జీతభత్యాల కోసం నెలకు రూ.40 లక్షల దాకా ఖర్చయ్యేది. కానీ ప్రస్తుతం 1,350 మంది ఉద్యోగులు ఉన్నారు. వారికి జీతభత్యాల కింద రూ.4.20 కోట్ల మేర చెల్లిస్తున్నారు. వీరిలో ఎక్కువమంది వైసీపీ కార్యకర్తలేననే విమర్శలు ఉన్నాయి.

ఇంధన రంగం.. ఆర్థిక భంగం

(మొదటి పేజీ తరువాయి)

వ్యత్యాసంలేకుండా.. లాభనష్టాలతో సంబంధం లేకుండా విద్యుత్తు సంస్థలు నడవాలన్న రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) నిబంధనల మేరకు.. నష్టాలన్నీ 'ట్రూఅప్' పేరిట వినియోగదారులపైనే పడనుంది. అంటే.. జగన్ నిర్వాకంతో వారిపై ఏకంగా రూ.1,77,244 కోట్ల భారం పడుతోంది. విద్యుత్ రంగంపై సంపూర్ణ అవగాహన ఉందంటూ చెబుతూ వచ్చిన జగన్ ఏకంగా రూ.1,77,244 కోట్ల నష్టాన్ని మోపడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నష్టాలకు జగన్ అసమర్థ పాలనా విధానాలే కారణమని ఇంధన శాఖ స్పష్టం చేసింది. అధికారాన్ని కోల్పోయిన జగన్.. అన్ని రంగాల్లోనూ భారీ ఆర్థిక భారాన్ని మోపి వెళ్లిపోయారు. ఇంధన రంగం ఏకంగా రూ.1,77,244 కోట్ల ఆర్థిక భారాన్ని మోయాల్సిన పరిస్థితి ఏర్పడింది. జగన్ వేసిన ఈ భారాన్ని వినియోగదారుల నుంచి వసూలు చేస్తే రాజకీయంగా నష్టం కలుగుతుందని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల్లో కూటమి హామీ ఇచ్చింది. సహజంగా.. ఈ హామీ 2024 ఆర్థిక సంవత్సరం నుంచి వర్తిస్తుంది. కానీ.. 2024కు ముందే జగన్ ఇంధన సంస్థలను నష్టాల ఊబిలోకి నెట్టేశారు.

9 సార్లు చార్జీలు పెంచి కూడా

జగన్ హయాంలో 9 సార్లు విద్యుత్ చార్జీలను పెంచడం ద్వారా రూ.64,000 కోట్ల మేర భారం మోపారు. అప్పటి విపక్షాలు, ఇంధన రంగ నిపుణులు, వామపక్షాలు, ప్రజాసంఘాలు గగ్గోలు పెట్టినా స్పందించలేదు. వాస్తవానికి 2019 ఎన్నికలకు ముందు విద్యుత్తు చార్జీలను తగ్గిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చాక ఆ హామీని బుట్టదాఖలు చేసి.. ప్రజలపై తొమ్మిదిసార్లు విద్యుత్తు చార్జీల కొరడా ఝుళిపించారు. దీనిలోనూ తాను అధికారంలోలేని 2014-19కు సంబంధించి రూ.3,669 కోట్లను ట్రూఅప్ చార్జీల కింద వసూలు చేశారు. కాగా, రాష్ట్ర ఇంధన శాఖ తాజాగా అప్పుల వివరాలను విడుదల చేసింది. దీని ప్రకారం రూ.1,29,503 కోట్లు అప్పు ఉన్నట్టు చూపిస్తున్నా.. జాబితాలో పేర్కొన్న వివరాల ప్రకారం రూ.1,77,244 కోట్ల మేరకు నష్టం వాటిల్లినట్టు స్పష్టమైంది. ఇదిలావుంటే, కరోనా సమయంలో రాష్ట్ర థర్మల్ కేంద్రాల్లో ఉత్పత్తిని పూర్తిగా నిలిపివేసిన జగన్.. తన అస్మదీయ విద్యుత్ కేంద్రాల నుంచి స్వల్పకాలిక విద్యుత్ కొనుగోళ్లు చేపట్టారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

నష్టాలు ఇవీ

వివరాలు	మొత్తం (రూ.కోట్లలో)
వినియోగదారులపై టారిఫ్ భారం	32,166
ఇంధన సంస్థ అప్పుల భారం పెరుగుదల	49,596
అసమర్థ విధాన నిర్ణయాలతో నష్టాలు	47,741
వీటీపీఎస్, కృష్ణపట్నం ప్లాంట్ల ఆలస్యంతో ఆర్థిక భారం	12,818
సల్పకాలిక కొనుగోళ్ల నష్టం	2,691
పోలవరం జలవిద్యుత్ కేంద్రం జాప్యంతో నష్టం	4,737
3వేల మెగావాట్ల సౌర విద్యుత్తు కొనుగోలు ఒప్పందంతో ఏటా భారం	3,850
అప్పులపై వడ్డీల భారం	10,892
ఏపీ డిస్కమ్‌లు, ఏపీపీడీసీఎల్ అసమర్థ యాజమాన్యం వల్ల భారం	9,618
విద్యుదుత్పత్తి సంస్థలను బ్యాకింగ్ డౌన్ చేయడంతో నష్టాలు	3,135

వయసు 30.. కేసులు 34

- ఒంటరిగా ఉన్న వృద్ధులే టార్గెట్
- తొలుత పనిమనిషిగా దగ్గరై.. అదను చూసి మొత్తం దోచేసే కి'లేడీ'

రాజమహేంద్రవరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఆమె వయసు 30.. చోరీ కేసులు 34.. ఇప్పటికే 10 సార్లు జైలుకెళ్లి వచ్చింది.. అయినా మార్పు రాలేదు.. చోరీలు కొనసాగిస్తోంది. ఒంటరిగా ఉంటున్న వృద్ధులే టార్గెట్..! వారిని మచ్చిక చేసుకుని దగ్గరవుతుంది. ఆ తర్వాత ఉన్నదంతా ఊడ్చుకుపోతుంది. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి పోలీసులు ఆ కిలాడి లేడీ ఆట కట్టించారు. సౌత్ జోన్ డీఎస్పీ భవ్య కిశోర్ సోమవారం ఆ వివరాలను వెల్లడించారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం అంగరకు చెందిన సూర్య చంద్ర చక్ర జగదాంబ (30)కు భర్త చనిపోయాడు. ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా బొమ్మూరులోని పెట్రోల్ బంకు దగ్గర చెరువుగట్టు సమీపంలో నివాసం ఉంటోంది. వృద్ధులు ఉండే ఇల్లు కంటబడితే అనుపానులు గమనిస్తుంది. ఒంటరిగా ఉండే వృద్ధులైతే.. తనకు ఎవరూ లేరని, తిండికి కూడా డబ్బుల్లేవని నమ్మించి వారి ఇంట్లో పనిమనిషిగా చేరుతుంది. బంగారు వస్తువులు ఉన్నాయని నిర్ధారించుకున్నాక వారికి మరింత దగ్గరవుతుంది. ఆ తర్వాత మాయ మాటలు చెప్పి అన్నం, ప్రసాదం, జ్యూస్, కూల్ డ్రింక్ ఇలా ఆ సమయానికి ఏది కుదిరితే దానిలో నిద్రమాత్రలు కలిపి ఇస్తుంది. అవి తీసుకున్న వృద్ధులు స్పృహ కోల్పోయాక ఒంటిపై ఉన్న నగలతోపాటు ఇంట్లోని బంగారు వస్తువులు దోచుకుని ఉడాయిస్తుంది. ఈ క్రమంలో అనపర్తి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో ఈ నెల 18న ఆమెను అరెస్టు చేశామని డీఎస్పీ వివరించారు. గతంలో ఆమె 16 కేసుల్లో నిందితురాలని, 10 కేసుల్లో జైలు శిక్ష కూడా అనుభవించిందని చెప్పారు. విడుదలైన తర్వాత కూడా 18 దొంగతనాలు చేసిందన్నారు. అనపర్తి, బిక్కవోలు, రాజానగరం, నిడదవోలు, కొవ్వూరు, ఉండ్రాజవరం, కాకినాడ జిల్లా కాకినాడ, పెదపూడి, గండేపల్లి, కరప, తణుకు, తాడేపల్లిగూడెం పోలీస్ స్టేషన్లలో జగదాంబపై కేసులు నమోదయ్యాయని చెప్పారు. నిందితురాలి నుంచి 6 కేసుల్లో 273.8 గ్రాముల బంగారు వస్తువులు రికవరీ చేశామని, ఇంకా సుమారు 12 కేసుల్లో దోచుకున్న బంగారు వస్తువులను ఆమె వివిధ ఫైనాన్సు సంస్థలు, బ్యాంకుల వద్ద తనఖా పెట్టిందని.. వాటిని రికవరీ చేయాల్సి ఉందని డీఎస్పీ తెలిపారు.



కిలాడీ లేడీ వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ భవ్య కిశోర్

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



నగరంలో నరకం

నగరవాసులకు సోమవారం ట్రాఫిక్ నరకం చూపింది. బెంజ్ సర్కిల్ నుంచి రమేష్ ఆస్పత్రి జంక్షన్ సిగ్నల్ వరకు, అక్కడి నుంచి ప్రభుత్వాస్పత్రి సిగ్నల్ వరకు వాహనాలు భారీగా బారులు తీరడంతో ప్రయాణికులు అల్లాడిపోయారు. నోవాటెల్, సెంటినీ ఆస్పత్రి ఎదురుగా ఉన్న ఫ్లైఓవర్లపైనా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. - విజయవాడ







ట్రాక్స్ ఆఫ్ టైమ్ ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్ ముగింపు కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్లతో డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

ముగిసిన ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్

రైల్వేస్టేషన్, ఆగస్టు 19: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయ వాడ రైల్వేస్టేషన్‌లో ఈనెల 15వ తేదీన ప్రారంభించిన ట్రాక్స్ ఆఫ్ టైమ్ ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్ సోమవారంతో ముగిసింది. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్స వాన్ని పురస్కరించుకుని రైల్వేల్లో గత జ్ఞాపకాలను ప్రోదిచేస్తూ ఫొటో ప్రదర్శనను నిర్వహించారు. ఫొటోగ్రఫీ పోటీల్లో గెలుపొందిన వారికి సోమ వారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో బహుమతులను అందజే శారు. డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ గౌరవ అతిథిగా, ఫొటో జర్నలిస్టు వి. ఎస్.విజయభాస్కరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 40 ఏళ్ల ఫొటోగ్రఫీ వృత్తికి గుర్తింపుగా విజయ్‌భాస్కర్‌కు సర్టిఫికెట్‌ను అందజేశారు. యునెస్కో, జాతీయ, అంతర్జాతీయ అవార్డులను గెలుచుకున్న విజయభాస్కర్‌ను డీఆర్ ఎం తన ప్రసంగంలో ప్రత్యేకంగా అభినందించారు. ఫొటోగ్రఫీ పోటీల్లో 91 ఫొటోలు వచ్చాయని, వాటిలో మూడింటిని ఎంపిక చేసి సర్టిఫికెట్లు, బహు మతులు అందజేశామని తెలిపారు. మొదటి బహుమతిని వై.సాయికృష్ణ, రెండో బహుమతిని సాయికృష్ణ, మూడో బహుమతిని అన్సార్ ఎస్ గెలు చుకున్నారు. 136 మంది ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ సభ్యులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

రాజీవ్‌గాంధీ పార్కును సుందరంగా తీర్చిదిద్దండి

● అధికారులకు నగర కమిషనర్ ధ్యానచంద్ర సూచన

వన్‌టౌన్, ఆగస్టు 19: రాజీవ్ గాంధీ పార్కులో ప్రజలకు ఆహ్లాదక రమైన వాతావరణాన్ని కల్పించాలని, పార్కు నిర్వహణ సక్రమంగా ఉండా లని, మరింత సుందరంగా తీర్చిదిద్దా లని అధికారులు, సిబ్బందికి నగరపా లక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు. సోమవారం రాజీవ్‌గాంధీ పార్కును ఆయన పరిశీలించారు. పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ ద్వారా నిర్వహిస్తున్న ఈ పార్కులో సుందరీకరణ మెరుగ్గా ఉండాలని సూచించారు. ఫౌంటెయిన్ పనిచేయకపోవటాన్ని గమ నించి వెంటనే దాన్ని మరమ్మతులు చేయాలని ఆదేశించారు. మరుగుదొడ్ల నిర్మాణాన్ని సత్వరమే పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. శని, ఆదివారాల్లో ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఎంట్రన్స్ గేట్ వద్ద ఈపాస్ మిషన్‌ను పెట్టాలని సూచించారు. ఎస్టేట్ ఆఫీసర్ టి.శ్రీనివాస్, అర్బికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ రామ్మోహన్ పాల్గొన్నారు.



రాజీవ్ గాంధీ పార్కును పరిశీలిస్తున్న ధ్యానచంద్ర



కోల్‌కతా హత్యాచార ఘటనకు వ్యతిరేకంగా క్యాండిల్ ర్యాలీ చేస్తున్న న్యాయవాదులు

నిందితులను కఠినంగా శిక్షించాలి

విజయవాడ లీగల్, ఆగస్టు 19: కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై హత్యాచారానికి నిరసనగా బెజవాడ బార్ న్యాయవాదులు సోమవారం ఐదో నెంబరు రోడ్డుపై కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. నిందితులకు కఠిన శిక్షలు వి ధించాలని డిమాండ్ చేశారు. కఠినమైన చట్టాలు వచ్చినా మహిళలపై దురాగతాలు ఆగలేదని బార్ ప్రధాన కార్యదర్శి అరిగల శివరాంప్రసాద్ (రాజా) ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై కిరాతకాలకు పాల్పడకుండా నిందితులను కఠినంగా శిక్షించేలా చట్టాలు, ప్రభుత్వాలు ఉన్నప్పుడే ఇటువంటి ఘటనలు పునరావృతం కావన్నారు. బార్ ప్రెసిడెంట్ కొత్త చంద్రమౌళి, న్యాయవాదులు దుర్గాభవాని జయలక్ష్మి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఏటీఏ అధ్యక్ష పదవికి గంధం కొండ నామినేషన్

ఆటోనగర్, ఆగస్టు 19: జవహర్ ఆటోనగర్ ఏటీఏ అధ్యక్ష పదవికి ఈనెల 28న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గంధం వెంకటేశ్వరరావు (కొండ) సోమ వారం నామినేషన్ దాఖలు చేశారు. ఆయనకు మద్దతుగా అసోసియేషన్ కార్యదర్శి దస్తగిరి, ఉమామహేశ్వరరావు, అంబటి శివశంకర్, బాహుబలేంద్ర కోటేశ్వరరావు, డాక్టర్ అబ్దుల్ కలాం వచ్చారు.

ప్రత్యేక విద్యుత్ అదాలత్ నేడు

గవర్నర్‌పేట, ఆగస్టు 19: విజయవాడ డివిజన్‌లోని 16 సెక్షన్ల పరి ధిలో వి నియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20వ తేదీన ఉదయం 10.30 గంటలకు ఏపీసీపీడీసీఎల్ విజయవాడ సర్కిల్ ఆఫీసు కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16 సెక్షన్లకు సంబంధించిన విద్యుత్ వినియోగదారులు అదాల త్‌కు హాజరై తమ విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

మళ్లీ వెలిశాయి

● బీఆర్టీఎస్ రోడ్డు పక్కన కాల్వ ఒడ్డుపై తొలగించిన చోటే మళ్లీ బడ్డీల ఏర్పాటు

మధురానగర్, ఆగస్టు 19: వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో మధురానగర్ బీఆర్టీఎస్ రోడ్డు పక్కన కాల్వ ఒడ్డును అమ్ముకుని పెట్టిం చిన బడ్డీలను టీడీపీ అధికారంలోకి రాగానే తొలగించారు. తొలగించిన చోట వాకింగ్ ట్రాక్ వస్తుందని మధురానగర్ వాసులు ఆశించారు. కానీ అది నిరాశగానే మిగిలేలా ఉంది. రెండు వారాల క్రితం ఈ ప్రాంతంలో పదుల సంఖ్యలో ఉన్న నీలి బడ్డీలను మున్సిపల్ కమిషనర్ ఆదేశాలతో తొలగించారు. ఆదే ప్రాంతంలో సోమవారం మళ్లీ బడ్డీలు వెలుస్తున్నాయి. బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ అరుణ దృష్టికి తీసుకెళ్లగా తన దృష్టికి రాలేదని పరి శీలించి తొలగిస్తామని చెప్పారు.

వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలి

మధురానగర్ వాసులు రోజూ ఉదయం నడకకోసం బీఆర్టీఎస్ రోడ్డుకు వెళుతుంటారు. అక్కడ వారికోసం మధురానగర్ కార్పొరేటర్‌గా ఆత్కూరి రవికుమార్ ఉన్నపుడు దేవీనగర్ ఫ్లైఓవర్ పక్క నుంచి పప్పుల మిల్లు వరకు కాల్వ ఒడ్డున వాకింగ్ ట్రాక్ కోసం శంకుస్థాపన చేశారు. తరువాత ఆ ప్రాంతంలో కృష్ణుడి గుడి కట్టారు. కాల్వ ఒడ్డును పాత తుక్కు వ్యాపా రులు ఆక్రమించేశారు. అధికారంలో ఉన్న వైసీపీ నాయకులు ఈ ఆక్రమ ణలను పట్టించుకోలేదు. కనీసం బీఆర్టీఎస్ రోడ్డు పక్కన బడ్డీలు తొలగిం చిన చోట అయినా వాకింగ్‌ట్రాక్ నిర్మిస్తే 29వ డివిజన్, 1వ డివిజన్ వాసులకు ఉపయోగపడుతుందని స్థానికులు అంటున్నారు. కొద్ది రోజుల క్రితం బీఆర్టీఎస్ రోడ్డుపైన జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఆ రోడ్డుపై వాకింగ్ చేసే వాళ్లు భయపడు తున్నారు.



తొలగించిన చోటే మళ్లీ ఏర్పాటు చేసిన బడ్డీలు

యువకుడి హత్య కేసులో ముగ్గురి అరెస్టు

వన్‌టౌన్, ఆగస్టు 19: గద్దబొమ్మ సెంటర్ వద్ద జరిగిన కొత్త పేటకు చెందిన కల్యాణసాయి(24) హత్యకేసులో సోమవారం వన్ టౌన్ పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు. సోమవారం రాత్రి వన్ టౌన్ పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వెస్ట్‌జోన్ డీసీపీ టి.హరికృష్ణ వివరాలను వెల్లడించారు. సాయికల్యాణ్ కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. ఏ పనీ చేసేవాడు కాదు. మద్యానికి బానిస య్యాడు. మద్యం తాగడానికి డబ్బుల కోసం కుటుంబ సభ్యులను వేధించేవాడు. ఇంట్లో డబ్బులు తీసుకుని ఈనెల 18వ తేదీ సాయం త్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి గద్దబొమ్మ సెంటర్ సమీపంలో ఉన్న బార్‌లో మద్యం తాగాడు. మళ్లీ మద్యం తాగడానికి వెళ్లగా ఆ బార్‌లో ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన నారా నారాయణ(34), శ్రీకాకుళం జిల్లా నిమ్మాడ మండలం గంపెడ గ్రామానికి చెందిన పిట్టా కామయ్య(48), పల్నాడు జిల్లా గురజాలకు చెందిన కొండేటి నాగేశ్వ రరావు(53) ఉన్నారు. సాయికల్యాణ్ వారిని డబ్బులు ఇవ్వమని అడిగాడు. అందుకు వారు నిరాకరించారు. అయినా వారివెంట పడుతూ డబ్బులు కోసం వేధిస్తూ పూల మార్కెట్ వరకు వెళ్లాడు. వేధింపులు భరించలేక సాయిని నాగేశ్వరరావు పట్టుకోగా, కామయ్య తనవద్ద ఉన్న కూరగాయలు తరిగే కత్తిని నారాయణకు ఇచ్చి చంపే యమని చెప్పాడు. దీంతో నారాయణ మెడపై కత్తితో పొడిచాడు. అనం తరం అక్కడ నుంచి వారు ముగ్గురు పరారయ్యారు. సాయి గాయం తోనే అక్కడి నుంచి నడుచుకుంటూ గద్దబొమ్మ సెంటర్ వద్దకు వచ్చి కిందపడి చనిపోయాడు. వన్‌టౌన్ పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. సమాచారం తెలుసుకున్న డీసీపీ హరికృష్ణ, వెస్ట్ ఇన్‌చార్జి ఏసీపీ రాజారావు, సీఐ గురుప్రకాష్ ఘటనా ప్రాంతానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితులు ఇతర ప్రాంతాలకు పారిపోదామని రైల్వేస్టేషన్‌కు వెళ్లే క్రమంలో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. నిందితులు వన్‌టౌన్ కాళేశ్వరరావు మార్కెట్ సమీపంలోని ఫుట్‌పాత్‌పై ఉంటూ రోజూ కేటరింగ్ పనులకు వెళతారని పోలీసులు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

చోరీలు చేస్తున్న వ్యక్తి అరెస్టు

● నిందితుడిపై 25 కేసులు.. 96 గ్రాముల బంగారం, 1070 గ్రాముల వెండి స్వాధీనం

గన్నవరం, ఆగస్టు 19: ఎవరూ లేనప్పుడు ఇళ్లల్లోకి చొరబడి చోరీలు చేస్తున్న గుడివాడ జగనన్న కాలనీకి చెందిన ముద్దాని జగదీష్‌ను అరెస్టు చేసినట్టు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం విలేకరు లకు ఆయన వివరాలు వెల్లడించారు. జూలై 22న తన ఇంట్లో చోరీ జరి గిందని బంగారం, వెండి, నగదు కలిపి రూ.లక్షన్నర సొత్తు పోయిందని దావాజీగూడెం శివాలయం వెనుక ఉంటున్న చావలి మురళీకృష్ణ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించినట్లు డీఎస్పీ తెలిపారు. జగదీష్ కదలికలపై నిఘా ఉంచి ఈనెల 15న ఉప్పులూరు నుంచి గన్నవరం స్కూటీపై వస్తుండగా ఏలూరు వంతెన సమీపంలో ఎస్సై శివప్రసాద్ అదుపులోకి తీసుకున్నారు. అతనిని విచారించగా తాను చేసిన దొంగతనాలు వివరాలు చెప్పాడు. గన్నవరంలో ఒకటి, ఉంగుటూరు రెండు, పామర్రు ఒకటి, కంకిపాడు ఒకటి చేయగా, 96 గ్రాముల బంగారం, 1070 గ్రాముల వెండి స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. జగదీష్ చిన్నతనం నుంచే దొంగతనాలు చేస్తున్నాడని, 25కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు తెలిపారు. గన్నవరం కోర్టు లో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు తెలిపారు.

సందడిగా స్పేస్ డే

చంద్రయాన్-3 మిషన్ విజయాన్ని స్మరించుకుంటూ ఆగస్టు 23ను నేషనల్ స్పేస్ డేగా కేంద్ర ప్రభుత్వం నిర్ణ యించింది. అందులో భాగంగా 'టచింగ్ లైవ్స్ వైల్ టచింగ్ మూన్' పేరుతో తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో స్పేస్ డేను సోమవారం సందడిగా నిర్వహించారు. స్పేస్ టెక్నాల జీపై విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలకు అవగాహన కల్పిం చేలా పలు రకాల వైజ్ఞానిక కార్యక్రమాలను నిర్వహించారు. స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించిన పలు ప్రాజెక్టులను విద్యా ర్థులు ప్రదర్శనలో ఉంచారు. వాటి పనితీరును వివరించారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ







నేడు పీఎం విశ్వకర్మ యోజనపై అవగాహన

వన్‌టౌన్, ఆగస్టు 19: తుమ్మలపల్లివారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకంపై అవగా హన సదస్సు నిర్వహిస్తున్నట్లు రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి కన్వీనర్ సి.వి.ఎన్. భాస్కర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని అన్ని బ్యాంకు శాఖల అధికారులు పాల్గొంటున్నారని, వివిధ బ్యాంకుల ప్రతినిధులు అవగాహన కల్పిస్తారని ఆయన పేర్కొన్నారు. బ్యాంకులు స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నాయని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

యూత్ హాస్టల్‌ను స్పోర్ట్స్ హాస్టల్‌గా మార్చాలి

● మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డికి కేపీ రావు వినతి

విజయవాడ స్పోర్ట్సు, ఆగస్టు 19: నగరంలోని వెటర్నరీ కాలనీలో ఆరేళ్లుగా నిరుపయోగంగా ఉన్న యూత్ హాస్టల్‌ను స్పోర్ట్సు హాస్టల్‌గా మార్పు చేసి ఉపయో గంలోకి తేవాలని క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డికి మెయిల్ ద్వారా వినతిపత్రం పంపినట్టు ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కేపీ రావు తెలి పారు. హాస్టల్‌ను శాప్ స్వాధీనం చేసుకోవాలని, కోచింగ్ క్యాంపులు, టోర్నీలు, హాస్టల్‌మెట్లకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని కోరారు. అలా కాని పక్షంలో ఏపీ ఒలింపిక్ అసోసియేషన్‌కు అప్పగిస్తే దానిని పునరుద్ధరిస్తుందని, సొంత నిధులు లేదా ఫండ్స్ సేకరించి వినియోగంలోకి తెస్తుందని కేపీ రావు పేర్కొన్నారు.

పోటు భవన నిర్మాణం త్వరగా పూర్తిచేయాలి

వన్‌టౌన్, ఆగస్టు 19: దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగ ణంలో నిర్మిస్తున్న లడ్డూ పోటు భవన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారు లను దేవస్థానం ఈవో కేఎస్ రామారావు ఆదేశించారు. దుర్గగుడి దిగువన మహామండపం ఎదురుగా రూ.10 కోట్లతో లడ్డూపోటు భవన నిర్మాణాన్ని దేవస్థానం చేపట్టింది. ఈవో రామారావు సోమవారం రాత్రి పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులకు ఈవో పలు సూచనలు చేశారు. వచ్చే దసరా సందర్భంగా కొంతమేరకైనా భక్తులకు ఉపయోగపడేవిధంగా పనులు వేగవంతంగా చేయాలని ఈవో ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.



లడ్డూ పోటు భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఈవో రామారావు



ఎంపికైన తైక్వాండో ప్లేయర్స్‌తో అసోసియేషన్ సెక్రటరీ అంకమ్మరావు

తైక్వాండో జాతీయ పోటీలకు ఉమ్మడి కృష్ణా క్రీడాకారులు

విజయవాడ స్పోర్ట్సు, ఆగస్టు 19: విజయనగరంలోని రాజీవ్ ఇండోర్ స్టేడి యంలో ఈనెల 17, 18వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్ షిప్‌లో ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన పలువురు క్రీడాకారులు స్వర్ణాలను సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలు హైదరాబా ద్‌లో త్వరలో జరుగుతాయని ఉమ్మడి జిల్లా అసోసియేషన్ సెక్రటరీ ఎం.అంకమ్మ రావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఎంపికైంది వీరే..

సీనియర్ ఫైటింగ్‌లో ఎం.యోన, ఎం.అభిలాష్, పి.దుర్గాప్రసాద్, డి.మహేష్, బాలికల ఫైటింగ్‌లో కె.పూజిత, ఎస్.సంజన, పి.బ్లెసినేహ. సీనియర్ పూమ్‌సేలో ఎస్.సంజన, ఎం.అంకమ్మరావు(30 ప్లస్), ఫెయిర్ పూమ్‌సేలో ఎస్ చాన్‌బాషా, ఎస్.సంజన, గ్రూప్‌మెన్ పూమ్‌సేలో ఎస్కే చాన్‌బాషా, ఎస్.రోహిత్, సీహెచ్ సంతోష్, గ్రూప్ మహిళా విభాగంలో ఎస్.సంజన, వి.ప్రియ, కె.పూజిత, గ్రూప్ మెన్ విభాగంలో ఎం.అంకమ్మరావు, బి.కాశీనాథ్‌రెడ్డి, పి.గౌరీశంకర్, గ్రూప్ పూమ్‌సేలో ఎస్.పావనిసాయి, ఎం.రిత్విక, సౌమి తరఫ్‌దార్‌లు ఎంపికయ్యారు.

టేబుల్ టెన్నిస్ విజేతలు వీరే

విజయవాడ స్పోర్ట్సు, ఆగస్టు 19: కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ప్రాంగణంలో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. పురుషుల ఫైనల్స్‌లో సూర్యతేజ తెల్లిదేవర (గీతం) విజేతగా నిలవగా, కుశాల్ దాస్(గీతం)రన్నర్‌గా నిలిచారు. మహిళా విభా గంలో కాజోలో సునార్(ఎస్‌జీటీటీఏ) విజేత, వి.గుణ సంయుక్త (ఏఆర్ఎస్‌పీటీ టీఏ)రన్నర్, అండర్-19 బాలుర విభాగంలో వెంకట మణికుమార్(పీటీటీఏ) విజేత, పూసపాటి మహీధర్(ఎఆర్‌పీఎస్‌టీటీఏ) రన్నర్, బాలికల విభాగంలో వి.గుణ సం యుక్త(ఎఆర్ఎస్‌పీటీటీఏ) విజేత, పి.చార్వి(ఆర్‌జీటీటీఏ) రన్నర్, అండర్ -17 బాలుర విభాగంలో తేలప్రోలు సామ్‌వేద్(ఫన్‌టైమ్స్) విజేత, పమ్మిరెడ్డి జతిన్‌రెడ్డి (ఆర్‌టీటీఏ) రన్నర్, బాలికల్లో రేణుకసత్య(ఎఆర్‌పీఎస్‌టీటీఏ) విజేత, హసిని పాప సాని(ఎన్టీఆర్ ఎస్‌జీ) రన్నర్, అండర్ -15 బాలుర విభాగంలో పి.జతిన్‌రెడ్డి (డీటీటీఏ) విజేత, పి.సాయిచరణ్(ఆర్‌ఐఎస్‌ఈ) రన్నర్, బాలికల విభాగంలో రేణుక సత్య(ఎంఆర్‌పీఎస్‌టీటీఏ) విజేత, ఎం.శాంతి జ్యోతి(ఎస్‌వైఎన్)రన్నర్, అండర్-13 బాలుర విభాగంలో వి.హార్దిక్‌రామ్(ఎఆర్ఎస్‌పీటీటీఏ)విజేత, ఎం.వేదాన్ష్(ఫన్‌టైమ్స్) రన్నర్, బాలికల విభాగంలో ఆరిఫా సుల్తానా(ఆర్‌ఐఎస్‌ఈ)విజేత, స్ఫూర్తి నైనా (పల్నాడు) రన్నర్, అండర్ -11 బాలుర విభాగంలో జె.వైభవ్(ఫన్‌టైమ్స్)విజేత, జి.తరుణ్‌తేజ(ఫన్‌టైమ్స్) రన్నర్, బాలికల్లో ఎస్.మనస్వి(ఎస్‌జీటీటీఏ) విజేత, హృత్విక కొల్లి(ఫన్‌టైమ్స్)రన్నర్‌గా నిలిచారు. బహుమతుల ప్రదానోత్సవ కార్యక్ర మంలో కేఎల్ డీమ్డ్ స్పోర్ట్సు అసోసియేట్ డీన్ డాక్టర్ కాకరాల హరికిషోర్, ఏపీటీ టీఏ ప్రెసిడెంట్ కేవీఎస్ ప్రకాష్, ఏపీటీటీఏ సెక్రటరీ పి.విశ్వనాథ్‌రావు, ఎన్టీఆర్ టీటీ సెక్రటరీ కరణం బలరామ్, టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రటరీ వై.దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ద్వారంపూడి అవినీతిపై విజిలెన్స్ విచారణ జరిపించాలని పిఠాపురంలో ఆందోళన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ తదితరులు

ద్వారంపూడి అవినీతిపై విజిలెన్స్ విచారణ జరపాలి

›› మాజీ ఎమ్మెల్యే వర్మ ఆధ్వర్యంలో ఆందోళన

పిఠాపురం, ఆగస్టు 19: ఇళ్ల స్థలాల భూసేకరణ, లేఅవుట్ అభివృద్ధి పేరుతో కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చేసిన అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ కాకినాడ జిల్లా పిఠాపురంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. కొత్తపల్లి మండలం కొమరగిరిలో కాకినాడ నగర ప్రజల ఇళ్ల పట్టాల కోసమంటూ 350 ఎకరాల భూమిని సేకరించారని, దీనిని చదును చేయడం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చూపి భారీ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. 13వేల మందికి ఇళ్లపట్టాలు ఇవ్వాలని చెప్పి తన బినామీలకు ఇళ్ల స్థలాలు కట్టబెట్టి విక్రయాలు జరిపారని, ఇందులో భారీ గోల్‌మాల్ జరిగిందన్నారు. కొత్తపల్లి మండల మత్స్యకారులకు, పేదలకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ జిల్లా కలెక్టరు షాన్‌మోహన్‌కు వినతిపత్రం అందజేశారు.

23న ఉక్రెయిన్‌కు మోదీ

›› ఆ దేశాన్ని సందర్శించనున్న తొలి భారత ప్రధాని ఆయనే

›› అంతకుముందు రెండు రోజుల పాటు పోలాండ్‌లో

›› అక్కడి నుంచి రైలులో కీవ్‌కు ప్రయాణం

న్యూఢిల్లీ, ఆగస్టు 19: యుద్ధభూమిగా మారిన ఉక్రెయిన్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 23న పర్యటించనున్నారు. ఉక్రెయిన్-రష్యాల మధ్య యుద్ధం మొదలయిన తరువాత భారత ప్రధాని ఆ దేశ పర్యటనకు వెళ్లనుండడం ఇదే తొలిసారి. భారత్-ఉక్రెయిన్‌ల మధ్య 30 ఏళ్ల క్రితం ద్వైపాక్షిక సంబంధాలు ప్రారంభం కాగా, ఆ దేశ సందర్శనకు వెళ్తున్న తొలి భారత ప్రధాని కూడా మోదీయే కావడం విశేషం. అంతకుముందు ఈ నెల 21, 22 తేదీల్లో పోలాండ్‌లో పర్యటించనున్నారు. 45 ఏళ్ల అనంతరం భారత ప్రధాని పోలాండ్ సందర్శనకు వెళ్తున్నట్టయింది. పోలాండ్ నుంచి ఉక్రెయిన్ రాజధాని కీవ్‌కు ప్రధాని మోదీ రైలులో వెళ్లనున్నారు. విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి (పశ్చిమ) తన్మయ లాల్ మాట్లాడుతూ ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లోదిమిర్ జెలెన్‌స్కీ ఆహ్వానం మేరకు ప్రధాని ఆ దేశ పర్యటనకు వెళ్తున్నారని తెలిపారు. చర్చల ద్వారానే రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకాలన్నది భారత విధానమని తెలిపారు.

ఇద్దరికి నేషనల్ జియో సైన్స్ అవార్డు

›› ఐఐటీహెచ్ ప్రొఫెసర్ నరసింహ, ఎన్‌జీఆర్ఐ చీఫ్ సైంటిస్ట్ ప్రసన్నకుమార్‌లకు..

న్యూఢిల్లీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ప్రతిష్ఠాత్మక నేషనల్ జియో సైన్స్ అవార్డుకు ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ నరసింహ మంగదొడ్డి(కెమికల్ ఇంజనీరింగ్ విభాగం), ఎన్‌జీఆర్ఐ హైదరాబాద్ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ బంటు ప్రసన్న కుమార్ ఎంపికయ్యారు. వీరికి రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం అవార్డులను ప్రదానం చేయనున్నారు. కేంద్ర గనుల శాఖ 2023 ఏడాదిగానూ మొత్తం మూడు విభాగాల్లో 12 మందికి నేషనల్ జియో సైన్స్ అవార్డులను సోమవారం ప్రకటించింది. మినరల్ బెనిఫిషియేషన్, సుస్థిర ఖనిజ అభివృద్ధి రంగంలో ప్రొఫెసర్ నరసింహ విశేష కృషి చేశారని, జియోఫిజికల్ ఎక్స్‌ప్లొరేషన్, జియోఫిజికల్ మెథడ్‌ల అప్లికేషన్, జియో-మ్యాగ్నెటిజం, జియోఫిజికల్ సర్వే టెక్నిక్‌లు, ఇన్‌స్ట్రుమెంటేషన్‌లో కొత్త సాంకేతికతను తేవడానికి ప్రసన్నకుమార్ కృషి చేశారని కేంద్రం తెలిపింది.

ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు తప్పనిసరి

›› లేటరల్ ఎంట్రీ విధానానికి కేంద్ర మంత్రి చిరాగ్ వ్యతిరేకత

న్యూఢిల్లీ, ఆగస్టు 19: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేరుగా నియామకాల (లేటరల్ ఎంట్రీ) విధానాన్ని మిత్ర పక్షమైన లోక్ జనశక్తిపార్టీ (రాం విలాస్) నాయకుడు, కేంద్ర మంత్రి చిరాగ్ పాసవాన్ వ్యతిరేకించారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు తప్పనిసరి అని, ఇందులో ఎలాంటి మినహాయింపులు ఉండవని స్పష్టం చేశారు. కేంద్ర మంత్రిగా దీనిని తగిన వేదికపై ప్రస్తావిస్తానని తెలిపారు. ఈ విధానాన్ని తమ పార్టీ వ్యతిరేకిస్తోందని చెప్పారు. లేటరల్ ఎంట్రీ విధానంపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను కేంద్ర సమాచార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తిప్పికొట్టారు.

శిశువుల విక్రయ ముఠా గుట్టు రట్టు

›› రెండు కేసుల్లో మొత్తం 17 మంది అరెస్టు

›› ఆరుగురు చిన్నారులను రక్షించిన విశాఖ పోలీసులు

విశాఖపట్నం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణ, ఒడిశా, ఢిల్లీ రాష్ట్రాల్లో చిన్నారులను విక్రయిస్తున్న అంతర్‌రాష్ట్ర ముఠా గుట్టును విశాఖ పోలీసులు రట్టు చేశారు. రెండు వేర్వేరు కేసుల్లో 17 మంది నిందితులను అరెస్టు చేసి వారి నుంచి ఆరుగురు చిన్నారులను రక్షించారు. విశాఖపట్నం పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి సోమవారం విలేకరుల సమావేశంలో ఆ వివరాలను వెల్లడించారు. పాండురంగాపురంలోని హార్బర్ పార్క్ వద్ద ఐదు నెలల ఆడ శిశువును విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న తొమ్మిది మందిని పోలీసులు ఈనెల 11న అరెస్టు చేశారు. ఆ కేసు దర్యాప్తులో భాగంగా నిందితులను పోలీసులు విచారించగా మరికొంత సమాచారం లభించింది. దాని ఆధారంగా టాస్క్‌ఫోర్స్ పోలీసులతో సీపీ డెకాయ్ ఆపరేషన్ నిర్వహించారు. శిశువును విక్రయించే ముఠాతో సంబంధాలున్న గాజువాకలోని శ్రీనగర్‌కు చెందిన బొడ్డేడ మల్లికార్జున్‌ను పిల్లలను కొనేందుకు అంటూ పోలీసులు సంప్రదించారు. 15 నెలల వయసున్న ఆడశిశువును తీసుకుని రావడంతో పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. తర్వాత అతడిని విచారించగా కడపకు చెందిన ఇద్దరు, ఢిల్లీకి చెందిన ఒక వ్యక్తి, మరికొందరు కలిసి ఏపీ, తెలంగాణ, ఒడిశా, ఢిల్లీల్లో పిల్లలను విక్రయిస్తున్నట్టు తేలింది. దీంతో పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి అనకాపల్లి జిల్లా మార్టూరులో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన పది నెలల బాబును, చీమలాపల్లిలో మూడేళ్ల వయసు బాలికను, పెదనరవలో 20 రోజుల పాపతోపాటు ఒడిశాలోని జైపూర్‌లో తొమ్మిది నెలల బాబును, మరో ఇద్దరినీ పోలీసులు రక్షించారు. విక్రయాల ముఠాతో సంబంధం కలిగిన ఎనిమిది మందిని గాజువాక పోలీసులు అరెస్టు చేశారు. ఒక్కో శిశువును రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు విక్రయిస్తున్నట్టు పోలీసుల విచారణలో గుర్తించారు. ఈ ముఠా మూలాలు మరికొన్ని రాష్ట్రాలకు విస్తరించినందున అక్కడకు ప్రత్యేక బృందాలను పంపించి దర్యాప్తు కొనసాగిస్తున్నట్టు సీపీ తెలిపారు. త్వరలోనే మరికొందరు శిశువులను ముఠా నుంచి రక్షించడంతోపాటు మరికొందరు నిందితులను అరెస్టు చేసే అవకాశం ఉందన్నారు.

సర్వేలో దోపిడీపై చర్యలేవీ?!



›› జగన్ ప్రభుత్వంలో వందల కోట్లు మాయం

›› కేంద్ర నిధులూ దారి మళ్లించి వాడుకున్నారు

›› మీసేవ, డీఐఎల్ఆర్ఎంపీ సొమ్ములు స్వాహా

›› రీసర్వే డ్రోన్ల కొనుగోలు టెండర్లలో గోల్‌మాల్

›› ఏసీబీ విచారణ చేయిస్తామని జగన్ గొప్పలు

›› సొంత మనుషుల పాత్ర ఉండటంతో మౌనం

›› తాడేపల్లి మెప్పు కోసం ఓ సర్వే అధికారి ఆరాటం

›› దుబాయ్, సింగపూర్, మలేసియా నుంచి ఖరీదైన ఆభరణాలు, హ్యాండ్‌బ్యాగ్‌లు కొనుగోలు

›› ప్యాలెస్‌లో పెద్దమనిషికి అవే బహుమతులు

›› దీనికోసం నిధులను కొల్లగొట్టేందుకు మాస్టర్‌ప్లాన్

›› ఈ అవినీతి, అక్రమాలపై విచారణ ఉంటుందా?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ పాలనలో సర్వే, సెటిల్‌మెంట్ శాఖ నిధుల దుర్వినియోగానికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. నాటి ప్రభుత్వ పెద్దలతో కుమ్మక్కైన కొందరు కీలక అధికారులు... సర్వే శాఖకు వివిధ మార్గాల నుంచి సమకూరిన సొమ్మును అందినకాడికి స్వాహా చేశారు. భూముల సర్వే కోసం రూ.700 కోట్లతో సర్వే రాళ్ల కొనుగోలు చేయడం మాత్రమే బయటకి కనిపించే అతిపెద్ద అక్రమం. కానీ కంటికి కనిపించని అవినీతి, నిధుల దుర్వినియోగం ఈ శాఖలో చాలానే ఉన్నాయి. కేంద్రం నుంచి వచ్చిన డీఐఎల్ఆర్ఎంపీ నిధులు, మీసేవ నుంచి నెలనెలా వచ్చే కోట్లాది రూపాయల సొమ్ము, ఇవి చాలవన్నట్లుగా భూముల సర్వే కోసం నిరంతరాయంగా జరిపిన డ్రోన్ల కొనుగోలు టెండర్లలో జగన్ ప్రభుత్వంలో కీలక సలహాదారు, మరో ఉన్నతాధికారి భారీగా కమీషన్లు తీసుకున్నట్లుగా ఫిర్యాదులున్నాయి. భూముల సర్వేలో జరిగిన అక్రమాలపై ఇప్పుడు కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టింది. సర్వేరాళ్ల కొనుగోలులో అవకతవకలపై విచారణ చేయించాలని టీడీపీ వర్గాలే కోరుతున్నాయి. దీంతోపాటు సర్వేశాఖలో గత ఐదేళ్లలో జరిగిన ఇతర ఆర్థిక నేరాలు, నిధుల దోపిడీపై ఏసీబీ లేదా విజిలెన్స్‌తో విచారణ చేయించాలన్న డిమాండ్లు పెరుగుతున్నాయి.

సర్వేశాఖ ఉన్నతాధికారి నిర్వాకం

మీ-సేవ పద్దు నుంచి సర్వేశాఖకు ప్రతీ నెలా నిధులు జమ అవుతుంటాయి. ఈ నిధులను ఎప్పటికప్పుడు తిరిగి ఆర్థిక శాఖకు అందించాలి. అయితే, జగన్ పాలనలో మీసేవ నిధులను సర్వే శాఖలోని అధికారులు సొంతానికి వాడుకున్నారు. ఈ విధంగా దాదాపు రూ.250 కోట్ల మేర అడ్డగోలుగా దారి మళ్లించినట్లు 2022లోనే 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చింది. భూముల సర్వే, ఆధునీకరణ, ఇతర అవసరాల పేరిట కేంద్రం డి జిటల్ ఇండియా ల్యాండ్స్ రికార్డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్(డీఐఎల్ఆర్ఎంపీ) కింద ఇచ్చిన నిధుల్లో రూ.75 కోట్లపైనే దుర్వినియోగం అయినట్లు ఫిర్యాదులు వచ్చాయి. అప్పట్లో సర్వేశాఖలో పనిచేసిన ఓ ఉన్నతాధికారి తాడేపల్లి ప్యాలెస్ మెప్పు కోసం అక్కడి పెద్దలకు అత్యంత ఖరీదైన కానుకలు, బహుమతులు తీసుకెళ్లేవారు. వాటిలో అంతర్జాతీయంగా పేరుగాంచిన బ్రాండ్‌లకు చెందిన నగలు, హ్యాండ్‌బ్యాగ్‌లు, అత్యంత ఖరీదైన వస్తువులు ఉండేవి. ప్రతీ మూడు నెలలకోసారి దుబాయి, అబుదాబీ, మలేసియా, సింగపూర్ నుంచి ఖరీదైన లగ్జరీ హ్యాండ్‌బ్యాగ్‌లు, ఆభరణాలు తెప్పించి ప్యాలెస్‌లోని ఓ పెద్దమనిషికి బహుమతిగా పంపించేవారని తెలిసింది. ఇటీవల రాజీనామా చేసిన ఓ ఐఏఎస్ అధికారి సహకారంతో ప్యాలెస్‌కు వెళ్లి వాటిని సమర్పించుకునేవారని సమాచారం. ఈ ఖరీదైన వస్తువుల కొనుగోళ్లకు ఆయనకొచ్చే జీతం ఏ మూలకూ సరిపోదు. అందుకే మీసేవ, డీఐఎల్ఆర్ఎంపీ నిధులను అప్పనంగా వాడేశారని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ నిధులను కొల్లగొట్టేందుకు ఎవరికీ అర్థంకాని మాస్టర్‌ప్లాన్ అమలు చేశారు. తొలుత చిరుద్యోగుల పేరిట లక్షలాది రూపాయలకు చెక్‌లు జారీ చేశారు. ఆ తర్వాత ఆ డబ్బును వారు బ్యాంక్ ఖాతాల నుంచి డ్రాచేసి తీసుకొచ్చి ఓ ఉన్నతాధికారికి ఇచ్చేవారు. ఇలా ఒకేనెలలో సగటున ఐదారుగురు ఉద్యోగుల పేరిట కోట్లాది రూపాయల నిధులు డ్రా చేయడం వాటితో జల్సా చేయడం, తనమీదకు రాకుండా ప్యాలెస్ పెద్దలు, పలువురు సీనియర్ అధికారులకు ఖరీదైన కానుకలు సమర్పించుకోవడం గత ఐదేళ్లలో ఆనవాయితీగా సాగింది.

అస్మదీయ కంపెనీలకే టెండర్లు

ఒక ఉద్యోగి ఇంట్లో పెళ్లికి రెండు బస్సుల్లో ఉద్యోగులను తీసుకెళ్లారు. అక్కడే భోజనాలు చేసి తిరిగి వచ్చారు. కానీ అదేరోజు ఓ శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లుగా బిల్లులు పెట్టి డబ్బులు డ్రా చేసుకున్నారు. నిధులు దోచుకునేందుకు పెళ్లి భోజనాలు కూడా వదల్లేదనడానికి ఇదో చిన్న ఉదంతం మాత్రమే. ఇటు రీసర్వే పేరిట పేరిట డ్రోన్ల కొనుగోళ్లలో జగన్ సలహాదారు పెత్తనం సాగింది. ఆయన సూచించిన కంపెనీలకే బిడ్‌లు కట్టబెట్టారు. ఆ కంపెనీల నుంచి ఎందుకూ పనికిరాని డ్రోన్లను కొనుగోలు చేసినట్లుగా ఆచరణలో తేలిపోయింది. అయితే, అవి అద్భుతంగా పని చేసినట్లుగా తప్పుడు రిపోర్టులు రాయించి, భజన చేయించినట్లు తెలిసింది. ఈ పరిణామాలపైనా 'ఆంధ్రజ్యోతి' వరుసగా కథనాలు ప్రచురించింది. దీంతో ఏసీబీతో విచారణ చేయిస్తామని జగన్ ఓ సమావేశంలో చెప్పారు. జగన్ ఆదేశాల మేరకు గత ఏడాది నిఘా విభాగం నివేదిక ఇచ్చింది. అందులో అస్మదీయ సలహాదారుతో పాటు ఇద్దరు సొంత అధికారుల పేర్లు ఉండటంతో... విచారణ పక్కన పెట్టేయాలని ఆదేశించారు. ఆ తర్వాత అధికారులు మరింతగా రెచ్చిపోయారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగానే జగన్ సలహాదారు ఒకరు బిల్లులు ఇప్పించేందుకు చేయని ప్రయత్నం లేదు. అది వర్కవుట్ కాకపోవడంతో అందుబాటులో ఉన్న డీఐఎల్ఆర్ఎంపీ నిధులు దారిమళ్లించి వాటికి బిల్లులు రూపంలో కొంతమేర చెల్లించినట్లుగా ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. ఈ పరిణామాలపై ఏసీబీ లేదా విజిలెన్స్‌తో విచారణకు టీడీపీ వర్గాలు డిమాండ్ చేశాయి. అక్రమాలపై విచారణకు కూటమి ప్రభుత్వం పూనుకుంటుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

రాష్ట్ర ఇంధన సమాచారం గోప్యం

›› వైసీపీ ప్రభుత్వం నాటి ఆదేశాలనే ఇప్పటికీ పాటిస్తున్న ఏపీఎస్ఎల్‌డీసీ

›› వాస్తవాలు తెలీడం లేదన్న ఉద్యోగులు

అమరావతి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఇంధన సమాచారాన్ని.. ఇంధన లోడ్ డిస్పాచ్ సెంటర్ గోప్యంగా ఉంచుతోంది. ఈ సమాచారమంతా.. సదరన్ రీజియన్ లోడ్ డిస్పాచ్ సెంటర్(ఎస్ఎల్‌డీసీ), కేంద్ర ఇంధన రెగ్యులేటరీ సంస్థ(సీఈఆర్‌సీ)లు రోజువారీ బులెటెన్‌లో జాతీయస్థాయిలో అందుబాటులో ఉంచుతున్నాయి. కానీ, రాష్ట్రానికి చెందిన లోడ్ డిస్పాచ్ సెంటర్ మాత్రం దీనిని గోప్యంగానే ఉంచుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో.. విద్యుత్తు ఉత్పత్తికి చర్యలు తీసుకోకపోగా కరెంటు అందుబాటులో లేకుండా బ్యాకింగ్ డౌన్ విధానాలను అమలు చేసింది. దీనిలో భాగంగా థర్మల్ పవర్ స్టేషన్లలో తగినంత బొగ్గు నిల్వలు లేకుండా చేసింది. విద్యుత్తు కొరత ఉందన్న విషయం తెలియకుండా ఉండేందుకు అస్మదీయ కంపెనీల నుంచి అధిక ధరలకు కరెంటును కొనుగోలు చేస్తూ వచ్చింది. ఈ భారాన్ని ట్రూఅప్ చార్జీల పేరిట విద్యుత్తు వినియోగదారుల నుంచి నెలవారీగా వసూలు చేస్తూ వచ్చింది. బయట నుంచి ఎంతకు కరెంటు కొంటున్నారో.. బొగ్గు నిల్వలు ఎంతున్నాయో, కరెంటు కోతలు ఎంతసేపు ఉన్నాయో కూడా ఎస్ఎల్‌డీసీ వెబ్‌సైట్‌లో పెట్టేవారు. ఇవన్నీ బహిర్గతమైతే, అస్మదీయుల నుంచి కొంటున్న బొగ్గు ధరలు, కరెంటు ధరలు బాహ్య ప్రపంచానికి తెలిసిపోతుందని భావించిన జగన్ సర్కారు.. సమాచార గోప్యతను ప్రదర్శించాలంటూ ఏపీ ఎస్ఎల్‌డీసీకి మెమో పంపింది. అప్పటి నుంచి ఈ సమాచారాన్ని గోప్యంగా ఉంచుతూ.. వెబ్‌సైట్‌లోని కీలక సమాచారం అంతటినీ లాక్ చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో జగన్ సర్కారు గద్దె దిగిపోయింది. కూటమి సర్కారు వచ్చింది. సీఎం చంద్రబాబు పారదర్శకతకు పెద్దపీట వేస్తారు. సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియాలని కోరుకుంటారు. కానీ.. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన మెమోను ఆధారంగా చేసుకుని ఏపీఎస్ఎల్‌డీసీ ఇప్పటికీ.. ఇంధన రంగ సమాచారాన్ని గోప్యంగా ఉంచడం గమనార్హం. ఇదే విషయంపై ఏపీ పీసీసీ, ట్రాన్స్‌కో, జెన్కో ఇంజనీరింగ్ సిబ్బంది నుంచి అసహనం వ్యక్తమవుతోంది. ఏపీఎస్ఎల్‌డీసీ వెబ్‌సైట్ ఆధారంగా విద్యుత్తు ఉత్పత్తి, అంతరాయ నివారణ చర్యలు చేపట్టేందుకు వీలుంటుందని ఇంజనీరింగ్ సిబ్బంది చెబుతున్నారు. గత ప్రభుత్వ కాలంలో ఇచ్చిన ఆదేశాలనే ఇప్పటికీ ఏపీఎస్ఎల్‌డీసీ ఎందుకు అమలు చేస్తోందో అర్థంకావడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు.



'ట్రిపుల్ తలాక్' వివాహ వ్యవస్థకే ముప్పు

›› దీంతో ముస్లిం మహిళల పరిస్థితి దయనీయం

›› సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ, ఆగస్టు 19: ట్రిపుల్ తలాక్ విధానం వివాహ వ్యవస్థకే పెనుముప్పు అని, దీనివల్ల ముస్లిం మహిళల పరిస్థితి అత్యంత దయనీయంగా మారుతుందని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. భర్త ముమ్మారు తలాక్ చెప్పడం ద్వారా విడాకులు ఇచ్చే ఆచారంతో ఎంతో మంది ముస్లిం మహిళలు నష్టపోయారని పేర్కొంది. 2017లో సుప్రీంకోర్టు ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేసినప్పటికీ.. ఆ విధానానికి తగినంతగా అడ్డుకట్ట పడలేదని కేంద్రం తన అఫిడవిట్‌లో తెలిపింది. బాధితులు పోలీసులను ఆశ్రయించినా పెద్దగా ప్రయోజనం ఉండేది కాదని, చట్టంలో శిక్షించదగిన నిబంధనలు లేనందున వారి భర్తలపై పోలీసులు ఎలాంటి చర్యలూ తీసుకోలేని నిస్సహాయ స్థితిలో ఉండేవారని తెలిపింది. ఈ పరిస్థితిని నివారించేందుకే, దాన్ని నేరంగా పరిగణించి జైలు శిక్ష విధించేలా నిబంధనలు రూపొందించామని తెలిపింది. ట్రిపుల్ తలాక్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసిన నేపథ్యంలో దాన్ని ఇంకా నేరంగా పరిగణించాల్సిన అవసరం లేదని, ముస్లిం మహిళల వివాహ హక్కుల రక్షణ చట్టం 2019 రాజ్యాంగ విరుద్ధమంటూ ప్రముఖ సున్నీ పండితుల సంఘంగా అభివర్ణించుకున్న 'సమస్త కేరళ జమైతుల్ ఉలేమా' పిటిషన్ దాఖలు చేసింది.

దీనిపై విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఈ అఫిడవిట్‌ను దాఖలు చేసింది. ఈ చట్టం ప్రాథమిక హక్కుల ఉల్లంఘనకు కిందకు వస్తుందని పిటిషనర్లు వాదించగా.. దాన్ని కేంద్రం వ్యతిరేకించింది.



షేక్‌పేట నాలా వద్ద ప్రధాన రహదారిలో వరదనీటిలో సగానికిపై మునిగిన కార్లు

హైదరాబాద్‌లో కుండపోత

2గంటలపాటు జోరు వాన.. కొట్టుకుపోయిన కార్లు, బైక్‌లు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 19: హైదరాబాద్‌లో సోమవారం మధ్యాహ్నం రెండు గంటల పాటు కుండపోత వర్షం పడింది. వరద ఉధృతికి టోలిచౌకీ, సికింద్రాబాద్, షేక్‌పేట నాలా, యూసుఫ్‌గూడ, శ్రీకృష్ణానగర్, ఫిలింనగర్ దీన్‌దయాళ్ నగర్ ప్రాంతాల్లో రోడ్లపై పార్క్ చేసిన వాహనాలు వరద నీటిలో కొట్టుకుపోయాయి. టోలిచౌకీ గెలాక్సీ వద్దనైతే వరద నీరు ముంచేయడంతో కార్లు, ద్విచక్ర వాహనాలు సగం దాకా నీటమునిగి.. కదల్లేకపోయాయి. కొన్ని ద్విచక్రవాహనాలు కొట్టుకుపోయాయి. కార్లు సగం దాకా మునిగితే అతికష్టమ్మీద లోపలున్న వారు బయట పడ్డారు. రోడ్లపై వరద నీరు చేరడంతో పలుచోట్ల కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. కుత్బుల్లాపూర్ వెంకన్నహిల్స్‌లో ఇళ్లలోకి వరదనీరు చేరింది. నాలాలు, మ్యాన్ హోళ్లు పొంగి.. మురుగునీరు రోడ్లపైకి రావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. షేక్‌పేటలో 5.3 సెం.మీ, యూసుఫ్‌గూడలో 5.2, గచ్చిబౌలిలో 5.1 సెం.మీ వర్షపాతం నమోదైంది. లంగర్‌హౌస్, మెహిదీపట్నం, షేక్‌పేట, ఎల్లారెడ్డి గూడ నవోదయకాలనీ, మారుతీనగర్ ప్రాంతాల్లో గంటల తరబడి విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది.

ఉక్కు సీఎండీ... అభినవ నీరో..!

›› పీకల్లోతు కష్టాల్లో స్టీల్ ప్లాంటు

›› ఉత్పత్తికి ముడిపదార్థాలు లేవు...

›› 3 బ్లాస్ట్‌ఫర్నేస్‌ల్లో రెండు షట్ డౌన్

›› 19వ తేదీ వచ్చినా జీతాల్లేవు

›› అడ్డగోలు దారిలో పదవిలోకి వచ్చిన ఉన్నతాధికారికి అదేమీ పట్టని వైనం

›› స్వాతంత్ర్య వేడుకల వేదికపై 'పుష్ప' సినిమా పాటకు డ్యాన్సు

›› ఆయన్ను తక్షణమే మార్చాలని డిమాండ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్ ప్లాంటు సీఎండీ అతుల్ భట్ అభినవ నీరో చక్రవర్తిలా ప్రవర్తిస్తున్నారు. రోమ్ నగరం తగలబడిపోతుంటే... నీరో చక్రవర్తి ఫిడేల్ వాయించినట్టు... ఇక్కడ ఈయన కూడా అదే తరహాలో వ్యవహరిస్తున్నారు. ఆగస్టు 19వ తేదీ వచ్చినా ఉద్యోగులకు ఇప్పటివరకూ జూలై నెల జీతాలు ఇవ్వలేదు. జూలై 31న పదవీవిరమణ చేసిన వారికి ఇంకా సెటిల్‌మెంట్ చేయలేదు. మరోవైపు ముడి పదార్థాలు అందుబాటులో లేక మూడు బ్లాస్ట్ ఫర్నేసుల్లో రెండు మూతపడ్డాయి. మూడో బ్లాస్ట్ ఫర్నేస్ అరకొరగానే నడుస్తోంది. ఎక్కడా అప్పు పుట్టడం లేదు. విదేశాల నుంచి తెప్పించుకున్న బొగ్గు పోర్టుల్లో మూలుగుతోంది. రవాణా చార్జీలు చెల్లించకపోవడంతో షిప్పింగ్ ఏజెంట్లు కోర్టు అటాచ్‌మెంట్లు తెచ్చుకొని ఆపేశారు. ఈ కష్టాల నుంచి ఎలా గట్టెక్కాలా? అని ఆలోచించాల్సిన సీఎండీ... తనకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. వీలైనప్పుడల్లా వేదికలు ఎక్కి హుషారుగా డ్యాన్సులు చేస్తున్నారు. జీతాలు అందక కడుపు మంటతో రగిలిపోతున్న ఉద్యోగుల ముందే ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉక్కు క్లబ్‌లో సీఐఎస్ఎఫ్ సిబ్బంది ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటుచేసి ఆహ్వానించింది. ఆ వేదిక ఎక్కిన ఆయన స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాల గురించి మాట్లాడకుండా 'పుష్ప' సినిమాలో పాటకు హుషారుగా డ్యాన్సు చేశారు. ఇప్పటివరకూ జీతాలు ఇవ్వలేదనే చింత ఆయనలో ఏమాత్రం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. ఇలాంటి వ్యక్తిని తక్షణం ఇక్కడి నుంచి పంపించేసి, చిత్తశుద్ధితో ప్లాంటు కోసం పనిచేసే అధికారిని నియమించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆయన వచ్చిందే అడ్డదారి...

విశాఖపట్నం స్టీల్‌ప్లాంటులో సీఎండీ పోస్టు భర్తీకి ఓ విధానం ఉంది. డైరెక్టర్ లేదా సీఎండీ పోస్టు ఆరు నెలల్లో ఖాళీ అవుతుందని తెలియగానే నోటిఫికేషన్ ఇస్తారు. దరఖాస్తుదారుల్లో కనీసం ఐదుగురితో జాబితా తయారుచేస్తారు. రెండు, మూడు నెలల ముందు వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి అదేరోజు ఒకరిని ఎంపిక చేస్తారు. ఒక నెల ముందుగానే ఆర్డర్ జారీ చేస్తారు. సదరు పోస్టులో ఉన్న అధికారి పదవీ విరమణ చేయగానే రెండు, మూడు రోజుల్లో ఎంపిక చేసిన వ్యక్తి బాధ్యతలు చేపడతారు. కానీ అతుల్ భట్ నియామకం అందుకు విరుద్ధంగా జరిగింది. 2021 మే నెలలో నాటి సీఎండీ పీకే రథ్ పదవీ విరమణ చేశారు. సీఎండీగా ఎవరినీ నియమించకుండా 2021 అక్టోబరు వరకు పోస్టు ఖాళీగా ఉంచారు. అప్పటి కమర్షియల్ డైరెక్టర్ మహంతికి ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు. అదే ఏడాది సెప్టెంబరులో సెర్చ్ కమిటీ పేరుతో ఒకే ఒక అభ్యర్థిని ఎంపిక చేసి, ఆయన్నే ఇంటర్వ్యూ చేసి సీఎండీగా పోస్టింగ్ ఇచ్చారు. ఆయనే అతుల్ భట్. ఆయనకు ఉక్కు ఉత్పత్తి రంగంలో ఎటువంటి అనుభవం లేదు. అతుల్ స్టీల్‌ప్లాంటులో ఎక్కువ కాలం నాన్ కోర్‌లో పనిచేశారు.

తప్పుడు నిర్ణయంతో లాభాల నుంచి నష్టాల్లోకి...

సీఎండీగా 2021 నవంబరులో బాధ్యతలు చేపట్టిన సమయానికి విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు ఆరు మిలియన్ టన్నుల ఉత్పత్తితో నడుస్తోంది. 2021-22 ఆర్థిక సంవత్సరం తొలి అర్ధ భాగంలో రూ.1,000 కోట్ల లాభాలతో ఉంది. ఉత్పత్తిని ఏడు మిలియన్ టన్నులకు పెంచుతానని, అధికారులకు కొత్త ప్రమోషన్ పాలసీ అమలు చేస్తానని, కార్మికులకు వేతన ఒప్పందం చేస్తానని హామీలు ఇచ్చి ఆకర్షించారు. ఆ ఆర్థిక సంవత్సరంలో వచ్చిన లాభాలను వర్కింగ్ కేపిటల్‌కు ఉపయోగించకుండా బ్యాంకుల అప్పులు తీర్చడానికి వాడేశారు. ఆ తప్పుడు నిర్ణయంతో ముడి పదార్థాల కొనుగోళ్లకు నిధుల కొరత ఏర్పడింది. ఫలితంగా ఉక్కు ఉత్పత్తి తగ్గిపోయింది. ఆ సాకుతో మూడో నంబరు బ్లాస్ట్ ఫర్నేస్(బీఎఫ్)ను 2022 జనవరిలో మూసేశారు. ఈ నిర్ణయాన్ని అంతా వ్యతిరేకించడంతో దానిని మళ్లీ వినియోగంలోకి తెస్తామని హామీలు గుప్పించి జిందాల్ నుంచి రూ.1,500 కోట్లు, టాటా నుంచి రూ.800 కోట్లు తెచ్చారు. వాటిని సద్వినియోగం చేయలేకపోయారు.



ఆగస్టు 15న పుష్ప పాటకు డ్యాన్స్ చేస్తున్న సీఎండీ అతుల్ భట్

తక్కువ ధరకు అదానీలకే ఇవ్వాలనే...

రాయబరేలిలో ఫోర్జ్‌డ్ వీల్ ప్లాంటును విజయవంతంగా రైల్వేకు అమ్మేశారు. అప్పులు పోను రావల్సిన రూ.900 కోట్లు బ్యాంకర్ల చేతిలో పెట్టారు. ఆ ప్లాంటు వల్ల స్టీల్‌ప్లాంటుకు చిల్లిగవ్వ కూడా రాలేదు. ఉద్యోగులు, కార్మికులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఈయన హయాంలోనే వచ్చింది. ఈయన మూడేళ్ల పదవీ కాలం నవంబరుతో పూర్తి కావస్తోంది. కొత్త సీఎండీ ఎంపిక ప్రక్రియ ఇంకా ప్రారంభించలేదు. ఇంకో ఆరు నెలలు ఇక్కడే అతుల్ భట్‌ను కొనసాగించాలని కేంద్రంలోని పెద్దలు భావిస్తున్నట్టు సమాచారం. విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు పేరు చెబితే కొనడానికి ఎవరూ ముందుకు రాని విధంగా చేశారు. తక్కువ రేటుకు అదానీలకు అప్పగించాలని కుట్ర చేస్తున్నారు.

వైసీపీ వేధింపులు.. భూకబ్జాలపై ఫిర్యాదులు

›› వినతులపై తక్షణమే స్పందించిన మంత్రి అచ్చెన్న

›› పరిష్కరించాలంటూ డీజీపీ, కలెక్టర్లకు ఫోన్లు

అమరావతి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతల వేధింపులు, భూకబ్జాలపై సోమవారం టీడీపీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్సుకు వినతులు వెల్లువెత్తాయి. వీటిని స్వీకరించిన వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు పరిష్కరించాలంటూ అప్పటికప్పుడు డీజీపీ, జిల్లాల కలెక్టర్లు, ఎమ్మెల్యేలకు ఫోన్లు చేసి చెప్పారు. పార్టీ నేతలు కంభంపాటి రామ్మోహనరావు, వైద్యుల విభాగం నేత డాక్టర్ శివప్రసాద్‌తో కలిసి ఆయన ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు. తమను గత వైసీపీ ప్రభుత్వంలో తీవ్రంగా కొట్టి హింసించిన పోలీస్ అధికారులు ఇప్పుడు టీడీపీ ముసుగు వేసుకొని మంచి పోస్టింగులు పొందారని కడప జిల్లా మైదుకూరు నుంచి వచ్చిన టీడీపీ కౌన్సిలర్లు, ఇతర నేతలు ఫిర్యాదు చేశారు. తమను అప్పట్లో పోలీసులు కొట్టిన దెబ్బల ఫొటోలు కూడా చూపించారు. దీనితో మంత్రి అప్పటికప్పుడు డీజీపీకి ఫోన్ చేసి ఈ ఫిర్యాదుపై విచారణ జరిపి, వాస్తవమైతే తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పల్నాడు జిల్లా రెంటచింతలకు చెందిన రవికిరణ్ రెడ్డి, అప్పిరెడ్డి, సుమంత్‌రెడ్డి మంత్రికి ఇచ్చిన ఫిర్యాదులో హైదరాబాద్‌లో ఉంటున్న ఒక వ్యక్తిపై అక్రమ కేసు పెట్టి గత ప్రభుత్వంలో వైసీపీకి కొమ్ముకాసిన ఒక పోలీస్ అధికారి రూ.60 లక్షలు వసూలు చేశాడని, అతనిపై చర్య తీసుకోవాలని కోరారు. నర్సరీల కోసం రైతుల దగ్గర భూమి తీసుకోవడానికి గత ప్రభుత్వం తెచ్చిన రిజిస్ట్రేషన్ విధానాన్ని రద్దు చేసి గత టీడీపీ హయాంలో ఉన్న అగ్రిమెంట్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. జగనన్న భూ సర్వేలో తన సొంత భూమిని ప్రభుత్వ భూమిగా చూపిస్తూ రికార్డు మార్చేశారని, అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ఉపయోగం లేకుండా పోయిందని నంద్యాల జిల్లా కొండాపురానికి చెందిన సంజీవ వరప్రసాద్ ఫిర్యాదు చేశారు. బాపట్ల జిల్లా మార్టూరులో నేతాజీనగర్ కాలనీలోని అంబేడ్కర్ భవన నిర్మాణ స్థలాన్ని వైసీపీ నేతల అండతో కొందరు ఆక్రమించుకొని కట్టడాలు నిర్మించారని, వాటిని తొలగించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని అక్కడి నుంచి వచ్చినవారు కోరారు. వైసీపీ నాయకులను తనకు రావాల్సిన డబ్బులు అడిగినందుకు గ్రామం నుంచి వెలివేస్తే ఆరు నెలల నుంచి తెలంగాణలో తలదాచుకొంటున్నామని, దళితులం కావడంతో వైసీపీ నేతలపై పోరాడడానికి శక్తి సరిపోవడం లేదని నందిగామ నియోజకవర్గం వీరులపాడు మండలం పెద్దాపురానికి చెందిన నిప్పులపల్లి కోటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. తమకు ప్రభుత్వం ఇచ్చిన భూమిని వైసీపీ నేతలు ఆన్‌లైన్‌లో తమ పేరుపై మార్పించుకొని పట్టా కూడా తీసుకొన్నారని, ఆ భూమిని తమకు తిరిగి ఇప్పించాలని ప్రకాశం జిల్లా కురిచేడు మండలం పడమర వీరాయపాలెంకు చెందిన జెల్లి మస్తాన్ కోరారు. వైసీపీ నేతల దగ్గర అప్పు తీసుకొంటే తీసుకొన్న మొత్తానికి ఐదు నుంచి పది రెట్ల డబ్బు కట్టాలని వేధిస్తున్నారని మంత్రాలయానికి చెందిన జమ్మన్న, మరికొందరు ఫిర్యాదు చేశారు. టీడీపీలో చురుగ్గా పనిచేస్తున్న తనపై అక్రమ కేసులు పెట్టి వేధించారని, వాటిని తొలగించాలని అనకాపల్లి జిల్లా మునగపాక మండలం తోటాడ పంచాయతీ గవర్ల అనకాపల్లికి చెందిన పొలమరశెట్టి మురళీకృష్ణ కోరారు. వైద్య ఆరోగ్య శాఖలో ఎంతోకాలంగా పనిచేస్తున్న రెగ్యులర్ ఏఎన్ఎంలను ఎక్కడో దూరంగా విసిరివేసి కొత్తగా నియమితులైన వారిని పట్టణ సచివాలయాల్లో నియమించారని, దీనిని సరిదిద్దాలని కొందరు విజ్ఞప్తి చేశారు.



టీడీపీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న అచ్చెన్న

ఆంధ్రజ్యోతి

దిక్సూచి

విజయవాడ ● మంగళవారం 20 ఆగస్టు 2024

diksuchi@andhrajyothy.com



ఎస్సీ ఉప వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పు-నేపథ్యం

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

భారతీయ సమాజంలో అసమానతలకు బీజం వేసింది నాలుగంచెల చాతుర్వర్ణ వ్యవస్థ. ఎగువ అంచెల వారికి పాలనాధికారాన్ని, ప్రతిష్ఠను కట్టబెట్టి దిగువ అంచెల వారిని వారికి సేవకులను చేసింది. అన్నింటి కన్నా దిగువ అంచె అయిన శూద్రుల్లో సేవక కులాలనన్నింటినీ జమచేయడం జరిగింది. వారి వృత్తులను బట్టి కాలక్రమంలో శూద్రుల్లో కూడా స్థాయీ భేదాలు వచ్చాయి. కొన్ని పనులు చేసేవారు అంటరాని వారయ్యారు. ఊరిలోని మాలిన్యాన్ని తొలగిస్తూ, అందరి ఆరోగ్యాన్ని పరిరక్షిస్తూ తాము మాత్రం ఊరవతలకే పరిమితమయ్యారు. కనీస అవసరాలకు నోచుకోలేదు. కాలక్రమంలో వీరే దళితులుగా పిలువబడ్డారు.

స్వాతంత్ర్యానంతరం భారత రాజ్యాంగం దళితులు, ఆదివాసీలు, ఇతర వెనుకబడిన శూద్ర కులాల వారి అభ్యున్నతికి విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించడం ద్వారా వారి పురోభివృద్ధికి బాటలు వేసింది. అయితే దళితులను(మాల, మాదిక, వారి ఆశ్రిత కులాలను) షెడ్యూల్డ్ క్యాస్ట్, వివిధ ఆదివాసీ జాతులను షెడ్యూల్డ్ ట్రైబ్స్‌గా పేర్కొంటూ మూకుమ్మడి రిజర్వేషన్లను రెండు వర్గాల్లో అమలు చేశారు. అయితే తదనంతర కాలంలో అనగా 90ల్లో ఇతర వెనుకబడిన కులాలకు కల్పించిన రిజర్వేషన్లలో అన్ని వర్గాలకూ రిజర్వేషన్లు మూకుమ్మడిగా కాక, ఆయా ఉపవర్గాల్లో వెనుకబాటుతనం ఆధారంగా, ఇతర వెనుకబడిన తరగతులను(ఓబీసీ) హేతుబద్ధీకరించి ఏ, బీ, సీ, డీ, ఇ లుగా వర్గీకరించి రిజర్వేషన్లను అమలుచేశారు. ఈ వర్గీకరణ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో అనుసరించలేదు. దీని కారణంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల్లోని కొన్ని ఆధిపత్య కులాలు, జనాభాపరంగా తక్కువ సంఖ్య ఉన్న కులాలు రిజర్వేషన్ ఫలాలను ఎక్కువగా పొందాయి. క్రమంగా వారి తరవాతి తరాలూ ఈ లబ్ధిని కొల్లగొట్టాయి. ఏబీసీల మాదిరి క్రిమిలేయర్ విధానం కూడా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో లేకపోవడంతో అభివృద్ధి చెందిన ఉప కులాలే మరింత రిజర్వేషన్లు ఉపయోగించుకుని అభివృద్ధి చెందారు. ఇతర ఉపకులాలు అణగారిపోయారు. ఎస్సీ, ఎస్టీల్లోని అనేక కులాలు, ఆశ్రిత కులాల్లో దీనిపై అసంతృప్తి ఉన్నప్పటికీ తొలిసారి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీల్లోని మాదిగ కులం వారిలో చైతన్యం వచ్చింది.

> 90ల్లో ఇతర వెనుకబడిన కులాలకు కల్పించిన రిజర్వేషన్లలో అన్ని వర్గాలకూ రిజర్వేషన్లు మూకుమ్మడిగా కాక, ఆయా ఉపవర్గాల్లో వెనుకబాటుతనం ఆధారంగా, ఇతర వెనుకబడిన తరగతులను(ఓబీసీ) హేతుబద్ధీకరించి ఏ, బీ, సీ, డీ, ఇ లుగా వర్గీకరించి రిజర్వేషన్లను అమలు చేశారు.

ఎస్టీ ఉపవర్గీకరణ పోరాట పుట్టినిల్లు తెలుగుగడ్డ

అనాదిగా చర్మకారులుగా అట్టడుగు స్థాయిలో ఉన్న మదిగవారు, తమ తోటి ఉపవర్గం వారితో కూడా అంటరానివారిగా చూడబడ్డారు. తమకన్నా సామాజికంగా ముందున్న మాల వారితో కలిసి ఉమ్మడిగా అవకాశాలు పంచుకోవాల్సి రావడం అన్యాయంగా గుర్తెరిగారు.

జనాభాపరంగా తమకంటే తక్కువ సంఖ్యలో ఉన్న మాలవారు ఉమ్మడి రిజర్వేషన్లు కారణంగా ఎక్కువ లబ్ధి పొందుతున్నారని గ్రహించారు. తమకు ప్రత్యేకంగా రిజర్వేషన్లు అమలుచేయాలని ఏడో దశకం నుంచి ప్రభుత్వాలకు వినతులు సమర్పిస్తున్నారు. అయితే 1994లో 'మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి' ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా ఈదుమూడిలో మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఏర్పాటైన నాటినుంచి ఎస్సీ ఉపవర్గీకరణ పోరాటం ఉద్యమస్థాయిని అందుకుంది. తమ పోరాటానికి 'మాదిగ దండోరా' ఉద్యమంగా నామకరణం చేశారు. వరుసగా భారీ ఎత్తున దండోరా సభలు, ర్యాలీలు నిర్వహించారు. ఎస్సీల్లో ఉపకులాలను వారి సామాజిక స్థాయి, జనాభా ఆధారంగా వర్గీకరించి ఎస్సీ రిజర్వేషన్లను ఏ, బీ, సీ, డి అనే కేటగిరీలుగా అమలు చేయాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీలు, సమాజం నుంచి మద్దతు కూడగట్టారు.

ఈ ఉద్యమఫలంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1996లో జస్టిస్ రామచంద్రరాజు కమిషన్‌ను ఏర్పాటుచేసి సమస్య పరిష్కారానికి సూచనలు కోరింది. 1997లో ఈ కమిషన్ ఎస్సీలను ఏ, బీ, సీ, డీ కేటగిరీలుగా వర్గీకరించి రిజర్వేషన్ ఫలాలు అట్టడుగు వర్గాలకు చేరేవిధంగా చర్యలు తీసుకోమని సూచించింది. తత్ఫలితంగా 1997 జూన్ 6న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్సీలకు ఉన్న 15% కోటాను ఏ, బీ, సీ, డీ వర్గాలుగా విభజిస్తూ ఒక జీవోను విడుదల చేసింది. ఏ గ్రూపులో రెల్లి, దాని అనుబంధ కులాలను చేర్చి 1 శాతం కోటాను, బీ గ్రూపులో మాదిగ, దాని ఉపకులాలను చేర్చి 7శాతం కోటా, సీ గ్రూపులో మాల, దాని ఉపకులాలను చేర్చి 6శాతం కోటా, డీ గ్రూపులో ఆది ఆంధ్రులతో పాటు ఇతర కులాలను చేర్చి 1 శాతం కోటాను ఇచ్చారు. ఈవిధంగా ఏ గ్రూపును ఎస్సీల్లో అట్టడుగు కులాల గ్రూపుగా తదుపరి బీ, సీ, డీలను క్రమానుగతంగా దాని పైస్థాయి గ్రూపులుగా వర్గీకరించి ఎస్సీ రిజర్వేషన్లలో కోటాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయితే మాలలు ఈ విధానానికి వ్యతిరేకంగా ఉద్యమించారు. మాల మహానాడు సంఘం ఈ రిజర్వేషన్ వర్గీకరణను న్యాయస్థానంలో సవాలు చేసింది.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ జీవో రాజ్యాంగ విరుద్ధమని, రాష్ట్రప్రభుత్వ అధికార పరిధిలో లేని విషయమని తీర్పు ఇవ్వడంతో మళ్లీ సమస్య మొదటికి వచ్చింది. తదుపరి మరలా ఎంఆర్‌పీఎస్ పోరుబాట పట్టింది. దీంతో 2000 సంవత్సరంలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'ఎస్సీ రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ చట్టం' ద్వారా తిరిగి ఎస్సీ ఉప వర్గీకరణను ప్రవేశపెట్టింది. 2004 నవంబరు వరకూ ఈవిధంగా ఎస్సీ ఉప వర్గీకరణ చట్టం అమలులో ఉంది. 2004లో ఇ.వి.చెన్నయ్య వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసులో అయిదుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం ఎస్సీ ఉప వర్గీకరణ చెల్లదని, ప్రకరణ 341(1) ప్రకారం రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు సజాతీయ కులాలను ఎస్సీలుగా వర్గీకరించారని, దానిని తిరిగి ఉప వర్గీకరించే అధికారం రాష్ట్రప్రభుత్వాలకు లేదని తీర్పునిచ్చింది. దీంతో మరలా కథ మొదటికి వచ్చింది. తిరిగి ఎంఆర్‌పీఎస్ ఉద్యమించడంతో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్సీ ఉప వర్గీకరణకు పార్లమెంటు రాజ్యాంగ సవరణ చట్టం తీసుకురావాల్సిందిగా కోరుతూ అసెంబ్లీలో ఒక తీర్మానం చేసింది. దీంతో కేంద్రప్రభుత్వం 2007లో ఉషా మెహ్రా కమిషన్‌ను ఏర్పాటుచేసి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ ఉపవర్గీకరణ అంశానికి సంబంధించి ఎదురయ్యే రాజ్యాంగ, చట్టపరమైన అవరోధాలను పరిశీలించి తగిన సూచనలు చేయాల్సిందిగా కోరింది. 2008లో నివేదిక సమర్పించిన ఈ కమిషన్ రాజ్యాంగ ప్రకరణ 341కి క్లాజ్ 3ని చేర్చి, రాజ్యాంగాన్ని సవరించడం ద్వారా రాష్ట్ర అసెంబ్లీలు ఏకగ్రీవ తీర్మానం చేసినప్పుడు పార్లమెంటు ఆమోదించే అవకాశాన్ని ఏర్పాటు చేయవచ్చని సూచించింది. ఈ సూచనలు అమలుకు నోచుకోలేదు.

> సుప్రీంకోర్టు తీర్పుతో రిజర్వేషన్ల ఉపవర్గీకరణకు రాష్ట్రాలకు మార్గం సుగమం అయ్యింది. అయితే ఈ ఉపవర్గీకరణను సమర్థవంతంగా పూర్తిచేయడానికి రాష్ట్రాలు కుల గణను సమర్థవంతంగా చేపట్టాల్సి ఉంది.

బంతి రాష్ట్రప్రభుత్వాల కోర్టులో

సుప్రీంకోర్టు తీర్పుతో రిజర్వేషన్ల ఉపవర్గీకరణకు రాష్ట్రాలకు మార్గం సుగమం అయ్యింది. అయితే ఈ ఉపవర్గీకరణను సమర్థవంతంగా పూర్తిచేయడానికి రాష్ట్రాలు కుల గణను సమర్థవంతంగా చేపట్టాల్సి ఉంది. అంతేకాక ఏయే ఉప కులాలు ఆర్థిక, సామాజిక, రాజకీయపరంగా తమ కేటగిరీలోని ఇతర కులాలతో పోల్చినా ఏ స్థాయిలో ఉన్నాయో అంచనా వేయాల్సి ఉంది. ప్రాంతీయపరంగా కూడా వివిధ ఉపకులాల్లో అభివృద్ధిలో అసమానతలు ఉన్నాయి. అంతేకాక ఈ ఉపవర్గీకరణ దళితుల్లోని ఐకమత్యాన్ని దెబ్బతీయడం తప్ప పెద్దగా ఒన గూడే ప్రయోజనాలు లేవని మాల మహానాడు వంటి సంఘాలు ఉపవర్గీకరణను వ్యతిరేకిస్తున్నాయి.

అంతేకాక ఎస్టీల నుంచి లంబాడాలను తొలగించాలని వారు మైదాన ప్రాంతాల్లో ఉంటూ అభివృద్ధి చెంది ఆదివాసీ కొండజాతి వారి అవకాశాలకు గండికొడుతున్నారని ఆదివాసీ తెగలు ఉద్యమిస్తున్నాయి. ఇట్టి అంతర్గత సంఘర్షణలను సైతం రాష్ట్రాలు ఎదుర్కోవాల్సి ఉంది. సుప్రీంకోర్టు సూచించినవిధంగా ఈ రిజర్వేషన్ల ఉప వర్గీకరణను రాజకీయ ప్రయోజనాల కోసం కాక, సమ సమాజ స్థాపన దిశగా వినియోగించాల్సిన గురుతర బాధ్యత రాష్ట్రప్రభుత్వాలపై ఉంది.

పంజాబ్ రాష్ట్ర పాత్ర

2004లో ఇ.వి.చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆంధ్రప్రదేశ్ సహా పంజాబ్ రాష్ట్రాన్ని కూడా తీవ్రంగా ప్రభావితం చేసింది. 1975లో పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం ఆ రాష్ట్రంలోని ఎస్సీల్లో మరింత అట్టడుగున ఉన్న బాల్మీకి, మజ్‌హబీ కులాలను వర్గీకరించి వారికి విద్య, ఉద్యోగాది విషయాల్లో తొలి ప్రాధాన్యం ఇచ్చింది. ఇందుకోసం ఒక జీవోను జారీ చేసింది. 30 ఏళ్లపాటు అమల్లో ఉన్న ఈ విధానం, 2004లో ఇ.వి.చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో న్యాయవివాదంలో చిక్కుకుంది.

2006లో డాక్టర్ కృష్ణపాల్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ కేసులో, పంజాబ్, హర్యానా హైకోర్టు 1975 నాటి పంజాబ్ రాష్ట్ర జీవో చెల్లదని, ఇ.వి.చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా తీర్పునిచ్చింది. అయితే ఈ తీర్పును అధిగమించడానికి పంజాబ్ ప్రభుత్వం 'పంజాబ్ షెడ్యూల్డ్ క్యాస్ట్ అండ్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్(రిజర్వేషన్ ఇన్ సర్వీసెస్)యాక్ట్-2006ను తీసుకువచ్చి తిరిగి బాల్మీకి, మజ్‌హబీ వర్గాలకు ఎస్సీ రిజర్వేషన్లలో తొలి ప్రాధాన్యం ఇచ్చారు. 2010లో మరోసారి హైకోర్టు ఈ చట్టాన్ని కొట్టివేసింది. అయితే దేవేందర్ సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ కేసులో వచ్చిన ఈ తీర్పును పంజాబ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. 2014లో ఈ అప్పీలును సుప్రీంకోర్టు అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి సిఫార్సు చేసి, 2004 నాటి ఇ.వి.చెన్నయ్య కేసు తీర్పును పునఃసమీక్షించాల్సిందిగా సూచించింది. జస్టిస్ అరుణ్‌మిశ్రా నేతృత్వంలోని అయిదుగురు సభ్యుల ధర్మాసనం ఇ.వి.చెన్నయ్య కేసు తీర్పును పునః పరిశీలించాలని అభిప్రాయపడింది. ఎస్సీల్లో, ఎస్టీల్లో మరింత ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబాటుకు గురవుతున్న ఉప వర్గాలున్నాయని, ప్రభుత్వాలు, కోర్టులు దీనిని విస్మరించజాలమని అభిప్రాయపడుతూ ఇ.వి.చెన్నయ్య కేసును పరిశీలించిన ధర్మాసనం కూడా తమవలే అయిదుగురు సభ్యులు కలది కావడంతో ఆ తీర్పును తిరగరాయాలంటే మరింత ఎక్కువ మంది సభ్యులు గల ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఈ కేసును చేపట్టాలని సిఫార్సు చేసింది.

ఈ నేపథ్యంలో 2023 డిసెంబరులో చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ ఆధ్వర్యంలో స్టేట్ ఆఫ్ పంజాబ్ వర్సెస్ దేవేందర్‌సింగ్ కేసును పరిశీలించడానికి, ఇ.వి.చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించడానికి ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏర్పడింది.

ప్రాథమికంగా ఈ రాజ్యాంగ ధర్మాసనం రెండు విషయాలను పరిశీలించింది. అవి 1) రిజర్వేషన్లలో ఉపవర్గీకరణను అమలుచేయాలా? 3) ప్రకరణ 341 ప్రకారం ఎస్సీలు ఒకే సజాతీయ సమూహంగా గుర్తించబడ్డారు కాబట్టి వారిని ఉపవర్గీకరించే అధికారం రాష్ట్రాలకు లేదని తీర్పు ఇచ్చిన ఇ.వి.చెన్నయ్య వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసు సమంజసత్వం. ఈ కేసు విషయంగా 2024 ఆగస్టు 1న 6:1 మెజారిటీతో జస్టిస్ చంద్రచూడ్ రాజ్యాంగ ధర్మాసనం తీర్పునిస్తూ ఎస్సీలను ఉపవర్గీకరించే అధికారం రాష్ట్రాలకు ఉందని, 2004 నాటి ఇ.వి.చెన్నయ్య కేసు తీర్పు చెల్లుబాటు కాదని, సమానత్వాన్ని మరింత పెంపొందించేందుకు అభివృద్ధి ఫలాలు అట్టడుగు స్థాయికి చేర్చేందుకు ఎస్సీల్లోనే కాక, ఎస్టీల్లో కూడా రిజర్వేషన్లు ఉపవర్గీకరించి అమలుచేయాల్సిన ఆవశ్యకత ఉందని, ఆ దిశగా రాష్ట్రాలు చర్యలు తీసుకోవాలని సూచించింది. అదేవిధంగా ఈ తీర్పుతో ఏకీభవిస్తూనే ప్రత్యేకంగా తన తీర్పును వినిపించిన ధర్మాసనం న్యాయమూర్తుల్లో ఒకరైన జస్టిస్ బి.ఆర్.గవాయ్ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో కూడా ప్రభుత్వాలు క్రిమిలేయర్ విధానాన్ని తీసుకువచ్చినప్పుడే అట్టడుగు వర్గాలకు మరింత న్యాయం చేకూరుతుందని సూచించారు. అదేవిధంగా ఉపవర్గీకరణ చేయడానికి సముచిత ప్రాతిపదికలను, వెనుకబాటుతనాన్ని వారి మధ్య గుర్తించడానికి సరైన కొలమానాన్ని రాష్ట్రప్రభుత్వాలు ఎంచుకోవాలని ఏ ఉపవర్గానికీ 100 శాతం రిజర్వేషన్లను కేటాయించరాదని సూచించారు.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

జాబ్ కార్నర్

సుప్రీంకోర్టులో జూనియర్ అటెండెంట్స్

ఢిల్లీలోని సుప్రీం కోర్టు ఆఫ్ ఇండియా(ఎస్‌సీఐ)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టు: జూనియర్ కోర్టు అటెండెంట్
ఖాళీలు: 80
అర్హత: పదో తరగతి, పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
జీతం: నెలకు రూ.46, 210
దరఖాస్తు ఫీజు: రూ.400; ఎస్సీ/ఎస్టీ/ఎక్స్ సర్వీస్‌మన్/మహిళా/దివ్యాంగ అభ్యర్థులకు రూ.200.
ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ప్రాక్టికల్ ట్రేడ్ స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా
పరీక్ష కేంద్రాలు: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, హరియాణా, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఒడిశా, తమిళనాడు, ఢిల్లీ, కేరళ, అస్సాం, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 12
వెబ్‌సైట్:
https://cdnbbsr.s3waas.gov.in/s3ec0490f1f4972d133619a60c30f3559e/uploads/2024/08/2024081783.pdf

బెల్‌లో ప్రాజెక్ట్ ఇంజనీర్లు

ప్రభుత్వ రంగ సంస్థ...భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్)... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టు: ప్రాజెక్ట్ ఇంజనీర్-1
ఖాళీలు: 11
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 55 శాతం మార్కులతో బీఈ/బీటెక్(కంప్యూటర్ సైన్స్/ఐటీ/సైబర్ సెక్యూరిటీ/కంప్యూటర్ నెట్‌వర్కింగ్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
జీతం: నెలకు రూ.40,000- రూ.55,000.
వయోపరిమితి: 32 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
పని ప్రదేశం: ఘజియాబాద్
దరఖాస్తు ఫీజు: జనరల్ రూ.472, ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.
ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాలు
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 23
వెబ్‌సైట్: https://bel-india.in/

ఎన్‌ఎఫ్‌డీబీలో ఉద్యోగాలు

హైదరాబాద్‌లోని నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు(ఎన్‌ఎఫ్‌డీబీ)... ఒప్పంద ప్రాతిపదికన టెక్నికల్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
ఖాళీలు: 12
పోస్టుల వివరాలు
1. మానిటరింగ్ అండ్ ఇవాల్యూవేషన్ ఎక్స్‌పర్ట్
2. మానిటరింగ్ అసిస్టెంట్
3. కన్సల్టెంట్ గ్రేడ్-1, 2(టెక్నికల్/అడ్మినిస్ట్రేషన్ అండ్ ఫైనాన్స్)
4. సీనియర్ టెక్నికల్ ఆఫీసర్
5. జూనియర్ టెక్నికల్ ఆఫీసర్



అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, బీఈ/బీటెక్(సివిల్/ఐటీ/సీఎస్‌ఈ/ఈఈఈ/ఈసీఈ), పీహెచ్‌డీ/ఎంఎఫ్‌ఎస్‌సీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
ఇంటర్వ్యూ తేదీ: ఆగస్టు 29
వేదిక: నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు, పీవీఎన్‌ఆర్ ఎక్స్‌ప్రెస్ వే, హైదరాబాద్; డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిషరీస్, మినిస్ట్రీ ఆఫ్ ఫిషరీస్, యానిమల్ హస్బెండరీ అండ్ డెయిరీంగ్, మొదటి అంతస్తు, చందర్ లోక్ బిల్డింగ్, ఢిల్లీ.
వెబ్‌సైట్: https://nfdb.gov.in/



భారత వాయుసేనలో అగ్నివీర్ ఉద్యోగాలు

భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన భారత వాయుసేన అగ్నిపథ్ స్కీంలో భాగంగా క్రీడల విభాగంలో అగ్నివీర్ వాయు నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది.

- **భారత వాయుసేన- అగ్నివీర్ వాయు(స్పోర్ట్స్) ఇన్‌టేక్ 01/2025**

క్రీడాంశాలు: అథ్లెటిక్స్, బాక్సింగ్, క్రికెట్, సైక్లింగ్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్/డైవింగ్, షూటింగ్, వాటర్ పోలో, రెజ్లింగ్, బాస్కెట్‌బాల్, సైకిల్ పోలో, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, హాకీ, స్క్వాష్, కబడ్డీ, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, ఉషు.
అర్హత: కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్మీడియట్/10+2/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత. లేదా ఇంజనీరింగ్‌లో డిప్లొమా కోర్సు(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/ఆటోమొబైల్/కంప్యూటర్ సైన్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ). నిర్దిష్ట శారీరక దారుఢ్య/వైద్య ప్రమాణాలతో పాటు స్పోర్ట్స్ అచీవ్‌మెంట్స్ తప్పనిసరి.
ఎత్తు: 152 సెం.మీ. కనీస ఎత్తు ఉండాలి.
వయోపరిమితి: 2004 జనవరి 2 నుంచి 2007 జూలై 2 మధ్య జన్మించిన అభ్యర్థులు అర్హులు.
ఎంపిక ప్రక్రియ: సెలెక్షన్ టెస్ట్, స్పోర్ట్స్ స్కిల్ ట్రయల్స్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా.
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 29
ట్రయల్స్ వేదిక: తేజస్ క్యాంప్, ఎయిర్ ఫోర్స్ స్టేషన్ న్యూఢిల్లీ, లోక్ కల్యాణ్ మార్గ్, న్యూఢిల్లీ.
వెబ్‌సైట్: https://agnipathvayu.cdac.in/AV/

లిటిల్స్



చెడు సావాసం

అనగనగా అడవిలో ఒక తోడేలు ఉండేది. దానికి అడవిలో వేటాడాలంటే బద్ధకం. రాత్రులు అడవికి దగ్గర్లోఉన్న గ్రామానికి చాటుగా వెళ్లి,అక్కడి కాపరులకు తెలియకుండా మేకలను, గొర్రెలను ఎత్తుకొచ్చి, తింటూ ఉండేది. పక్కనేఉన్న చెట్టు మీద నివసించే కోతి ఒకటి తోడేలు చేసే పనులన్నీ ఆసక్తిగా గమనిస్తూఉండేది. ఇది తెలుసుకున్న తోడేలు ఇంకా తనెంత తెలివైనదో, ఎలా గొర్రెల కాపరుల కన్నుగప్పి, గొర్రెలను ఎత్తుకొస్తున్నదో కథలు కథలుగా వర్ణించి చెప్పేది. ఇలా కొన్నాళ్లు విన్నాక, కోతి తోడేలును ఇలా అడిగింది. 'మిత్రమా..నీ సాహసం వింటూ ఉంటే నాకు కూడా ఒక రోజు రాత్రి నీతో పాటు వచ్చి నీ సాహసాన్ని చూడాలనున్నది.నన్ను కూడా ఒక రోజు నీతో పాటు తీసుకుపోవూ?' అని అడిగింది.



ఆ మాటలు విన్న తోడేలు తన గొప్పతనానికి మురిసిపోతూ,'అయ్యో దానికేం భాగ్యం?అలాగే. రేపే నిన్ను నాతో తీసుకువెళతానుఅన్నది. అన్నట్టుగానే ఆ రోజు రాత్రి తోడేలు కోతిని తీసుకుని ఎప్పటిలాగే మేకలను దొంగతనం చేయడానికి వెళ్లింది. అంతకుముందు కొన్ని రోజులుగా తమ మందలలో గొర్రెలు, మేకలు ఉన్నట్టుండి మాయం అవుతుండటం గమనించుకున్న గ్రామస్తులు రాత్రివేళల్లో కాపలాగా తిరిగేటందుకుకొందరు యువకులను నియమించారు.

ఈ విషయంతెలియని తోడేలు అలవాటుగా గొర్రెల మంద దగ్గరికి వెళ్లగానే అక్కడే సిద్ధంగాఉన్న కాపలా యువకులు కర్రలతో తోడేలును కొట్టి చెట్టుకు కట్టేసారు ఆ సందడిలో కోతికి కూడా కర్రతో దెబ్బలు బాగానే పడ్డాయి.ఆ దెబ్బలు తట్టుకోలేక కోతి 'మీ గొర్రెలను ఎత్తుకెళుతోంది నేను కాదు కదా ఈ తోడేలు రోజూ మీ మందలలో మేకలు, గొర్రెలను మాయం చేస్తోంది.నన్ను ఎందుకు కొడుతున్నారు?'అని గట్టిగా కేకలు పెట్టింది.

దానికి ఆ గ్రామస్తులు 'నువ్వు దొంగతనం చేయకున్నా, చేసే తోడేలుకు సాయంగా వచ్చావు కాబట్టి, నీకు కూడా శిక్ష పడాల్సిందే'అన్నారు కాసేపటికి తోడేలును అక్కడే వదిలి, కోతి నెమ్మదిగా చెట్ల కొమ్మలలో దాగి అక్కడి నుండి తను ఉండేచోటికి వెళ్లిపోయింది. తాను తప్పు చేయకున్నా చెడు సావాసం చేయడంవలన తనకు దెబ్బలు తగిలిన విషయం గుర్తు పెట్టుకున్న కోతి ఇకపై అలాంటి పనులు చేసే వారితో స్నేహం చేయకూడదు అనుకుంది.

7 తేడాలు గుర్తించండి





సరైన నీడ కనుక్కోండి



జంతువులు ఎన్ని



డైలీ సుడోకు - 388

	2				4
			3		
5	4				1
2				4	3
		5			
1				3	

సుడోకు - 387 సమాధానం

3	2	1	6	5	4
6	5	4	3	1	2
5	4	3	2	6	1
2	1	6	5	4	3
4	3	5	1	2	6
1	6	2	4	3	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.